# మానవహక్కులు-2009

బులెటిన్-10

**మానవహక్కుల వేదిక ప్రచురణ**

**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 19
ప్రచురణ కాలం: జూన్ 2009
కాపీలు: 2000, వెల: 20 రూపాయలు
కవర్: మోహన్
డిటిపి: కె.వి.ఆర్.
ముద్రణ: నవ్య ప్రింటర్స్

ప్రతులకు:
**ఎన్. జీవన్ కుమార్**
3-12-117/ఏ-2/1, పి.ఎస్. కాలనీ
గణేష్‌నగర్, రామంతాపూర్
హైదరాబాద్-13, ఫోన్: 27039519

**నవోదయ, దిశ, సహచర బుక్‌హౌస్‌లు**

## సంపాదకీయం

# వృద్ధి చెందబోయేది విధ్వంసమే

**మా**నవ హక్కుల వేదిక పది సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విధ్వంసక అభివృద్ధిపై పదవ బులెటిన్‌ను పత్యేక బులెటిన్‌గా తీసుకురావాలని భావించాము. 8 నెలలు ఆలస్యమయినప్పటికీ అనుకున్నది చేయగలిగినందుకు సంతోషిస్తున్నాం.

అభివృద్ధి అనేది సమకాలీన భారత రాజకీయాలలో అందరూ జపించే మంత్రం. అధికారానికొస్తే ఏం చేస్తావని ఏ పార్టీని అడిగినా అభివృద్ధి చేస్తానంటుంది. అధికారంలో ఉన్నవారు దేనిమీద దృష్టిపెట్టాలని విశ్లేషకులనడిగితే అభివృద్ధిమీద అంటారు. విచిత్రమేమిటంటే అభివృద్ధి అంటే ఏమిటన్న ప్రశ్న మాత్రం ఎవరూ వేసుకోరు, జవాబు వెతుక్కోరు. ఆ ప్రశ్న వేసుకోకుండ అభివృద్ధిని ఆచరించడానికి పూనుకొంటే జరిగేదేమిటంటే బలవత్తరమైన రాజకీయార్థిక శక్తులు నిర్వచించిందే దాని భావం అవుతుంది. దానినే తెలిసో తెలియకో అందరూ ఆచరిస్తారు.

ఈ శక్తులు కార్పొరేట్ కంపెనీలు, వాటి వెనక ఉన్న ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్యసంస్థ తదితర అంతర్జాతీయ విధానకర్తలు. వీరి ప్రధాన అజెండా, పెట్టుబడికి మదుపులోనూ వర్తకంలోనూ పూర్తి స్వేచ్ఛ కల్పించడం. సకల మానవ, ప్రాకృతిక వనరులనూ పెట్టుబడికి అప్పగించడం. దాని వ్యాప్తికీ వికాసానికీ సాంఘిక సంక్షేమం, బాధ్యతలు అనే ఆటంకాలను తొలగించడం. దీనికి వత్తాసుగా వారు చెప్పే తత్వం ఏమిటంటే ఈ పద్ధతిలోనే సంపద అతివేగంగా పెరుగుతుంది. దానితోబాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పెరుగుతుంది. పెరిగిన ఆదాయాలు ఏదో ఒక రోజు సమాజంలో కిందిస్థాయికి కూడ చేరి అందరి జీవితాలూ మెరుగుపడతాయి.

వాస్తవానికి జరిగేదేమిటంటే ప్రాకృతిక వనరులపైన ఆధారపడి బతికే ప్రజలు తమ జీవనాధారాన్ని భారీగా కోల్పోతారు. ఈ అభివృద్ధి కల్పించే ఉపాధికంటే దీనివల్ల కోల్పోయే ఉపాధే ఎక్కువ ఉంటుంది. సమాజంలో అంతరాలు విపరీతంగా పెరిగి అవి వికారంగా, అమానుషంగా తయారవుతుంది. పెరిగిన

సంపద 'ఒకరోజు' కిందిస్థాయికి చేరడం సంగతేమోగానీ ఈలోపల అట్టడుగు వర్గాల ప్రజలు మరింతగా దానినుండి వెలివేయబడతారు. ప్రకృతిపైననే ఆధారపడి బతికే వర్గాలపైన (ఆదివాసులు, మత్స్యకారులు), సామాజికంగా బలహీనులయిన వర్గాలపైన (దళితులు, స్త్రీలు) ఈ వేటు ప్రధానంగా పడి చారిత్రక అంతరాలు మరింత పెరిగి సమాజం హింసాత్మకంగా తయారవుతుంది.

సామాజిక విధ్వంసమేకాదు, దీనిలో ప్రాకృతిక విధ్వంసమూ ఉంది. మనిషి ప్రకృతిని తన అవసరాలకోసం నిరంతరాయంగా మార్చుకుంటూ, తనకు అనుకూలంగా మలచుకుంటూ రావడం నాగరికత ఎదుగుదలలో కీలకమైన అంశం. నాగరికత పెరిగినకొద్దీ మనిషి అవసరాలు పెరిగాయి కాబట్టి ప్రకృతిలో మనిషి జోక్యమూ పెరిగింది. అయినప్పటికీ మనుషుల అవసరాల స్థానంలో పెట్టుబడి అవసరాలు వచ్చేదాకా మనిషికీ ప్రకృతికీ మధ్య సమతుల్యం ఉండింది, ఒడిదుడుకుల మధ్య కొనసాగింది. మనిషి అవసరాలు పెట్టుబడి అవసరాలుగా రూపాంతరం చెంది, ఆ పెట్టుబడి కోటానుకోట్ల మూలధనం ఉన్న కార్పొరేట్ పెట్టుబడిగా మారడం ఈ సమతుల్యాన్ని నాశనం చేసింది. ఒక కాలువ, ఒక నది కలుషితం కావడం కాదు, మానవ మనుగడకు ప్రాకృతిక పునాది అయిన జీవావరణమే ధ్వంసమయ్యే స్థితి దాపురించింది.

అందుకే ఈ అభివృద్ధిని విధ్వంసం అంటున్నాము. ఇది ఆధునిక కాలంలో ఎప్పుడూ ఉన్నదేగానీ దీనిని వ్యతిరేకించే విమర్శనుండి, ప్రతిఘటననుండి ఉద్యమాలనుండి పుట్టిన విలువలు, ప్రమాణాలు, వ్యవస్థలు దీనిని కొంత నిలువరించగలిగాయి. కానీ రెండు దశాబ్దాలుగా అవన్నీ ఒక్కొక్కటీ పక్కకు నెట్టబడి కార్పొరేట్ అభివృద్ధి దాహమే ఏకైక నిర్ణాయక శక్తి అయింది. అదే పాలకతత్వం అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ తిరోగమనాన్ని వ్యవస్థీకరించే పని మొదలుపెట్టినవాడు చంద్రబాబు నాయుడు కాగా అతని తరువాత అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి ఇతోధిక ఉత్సాహంతో దానిని కొనసాగించాడు. ఇంకా కొనసాగించబోతాడు. ఈ విధ్వంసం రూపురేఖలను కళ్లకు కట్టే వ్యాసాలు, రిపోర్టులు, కరపత్రాలతో 10 వ బులెటిన్‌ను ప్రత్యేక బులెటిన్‌గా తీసుకొస్తున్నాం. దాని గురించి సిద్ధాంత చర్చ కూడ చేయవచ్చు, చేయవలసిన అవసరమూ ఉంది. అయితే ఈ బులెటిన్‌లో దాని స్వభావ స్వరూపాల గురించి సమాచారం మాత్రమే ఇస్తున్నాం.

గోవా రాష్ట్రంలో, మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో, పశ్చిమబెంగాల్‌లోని నందిగ్రాం, సింగూరులలో ఈ విధ్వంసాన్ని అసలే జరగనివ్వం అన్న పోరాటాలు నడిచాయి, నడుస్తున్నాయి. ఇతర ప్రాంతాలలో ఎక్కువ భాగం నష్టపరిహారం, పునరావాసాల గురించే ఆందోళనలు జరుగుతున్నాయి. వీటికి జవాబుగా కేంద్ర ప్రభుత్వం మెరుగయిన నష్టపరిహారాన్నీ సమగ్రమైన పునరావాసాన్నీ ఇచ్చే కొత్త చట్టాలు తీసుకొస్తున్నట్టు కొంతకాలంగా చెప్తూ వుంది. భూసేకరణ చట్టానికి సవరణ రూపంలో ఒక చట్టం, పునరావాసాన్ని హక్కుగా కల్పించే మరొక చట్టం బిల్లుల రూపంలో 2006 నుండి పార్లమెంటు ముందు ఉన్నాయి. పార్లమెంటుకు టైంలేక కాబోలు అవి ఇంకా చట్టాలు కాలేదు. మొదటిది బలవంతపు భూసేకరణ విషయంలో ప్రభుత్వానికి ఉండే విస్తృత అధికారాలను తగ్గించకుండ, స్వంత భూములు కోల్పోయిన వారికి మెరుగయిన నష్టపరిహారం కల్పిస్తుంది. చట్టపరమైన హక్కు లేకుండ ప్రకృతి సంపదను ఒక సంప్రదాయ హక్కుగా అనుభవిస్తున్నవారికి ఏమీ ఇయ్యదు. రెండవది ఇళ్లు కోల్పోయి నిర్వాసితులయిన వారినేకాక ఇళ్లు కోల్పోకుండ జీవనం తీవ్రంగా దెబ్బతిన్న వారిని కూడ బాధితులుగా



గుర్తిస్తుంది. బాధితులందరికీ కొంత నష్టపరిహారం, పరిమితమైన పునరావాసం హక్కులుగా ఇస్తుంది. విస్థాపన తప్పనిసరయితే విస్థాపితులయిన వారందరికీ ఒక సమూహంగా ఒకేచోట పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలనీ, వారు గతంకంటే మెరుగయిన జీవనం పొందేటట్లు ఉపాధి లేక భూమి ఇవ్వాలనీ ఉద్యమాలు చేస్తున్న డిమాండును ఈ బిల్లు చాలా పాక్షికంగా గుర్తిస్తుంది. అనేకరకాలుగా అసంతృప్తికరమైన ఈ రెండు బిల్లులను సమీక్షించే వ్యాసం ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాం.

పునరావాసం ఒక చట్టపరమైన హక్కుగా ఉండవలసిన ఆవశ్యకతను అర్థం చేసుకోవాలంటే అది లేనప్పుడు విస్థాపన ఎంత క్రూరంగా ఉంటుందో చూడడం అవసరం. దేశంలోని తొలిపెద్ద ప్రాజెక్టులలో ఒకటయిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు చేపట్టినప్పుడు అధికారులు నిర్వాసితులతో ఏవిధంగా వ్యవహరించారో తెలిపే వ్యాసం ఒకటి ప్రచురిస్తున్నాం. దానితోబాటు నిరసనోద్యమాలనుండి పుట్టిన కొన్ని ప్రతిపాదనలను వివరించే వ్యాసం కూడ ప్రచురిస్తున్నాం. ఈ వ్యాసకర్త గొర్రెపాటి నరేంద్రనాథ్ శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితులు తమ దుర్గతిని మౌనంగా భరించిన దశనుండి నర్మదా ప్రాజెక్టు బాధితులు దేశమంతటి దృష్టినీ ఆకర్షించిన పోరాటం సలిపిన దశదాకా నిర్వాసితుల హక్కుల గురించి ఆందోళన చేసిన వ్యక్తి. ప్రాజెక్టు నిర్వాసితులకు అదే ప్రాజెక్టు కింద అప్పటికంటే మెరుగయిన జీవనం కల్పించాలన్న ఆలోచనను పునరావాస విధానానికి ప్రాతిపదిక చేయాలన్న బాధితుల డిమాండ్‌ను ఆయన వివరిస్తూ, ఏ కారణంగానయినా అది సాధ్యం కానప్పుడు వారందరికీ ప్రాజెక్టు ఖర్చులో భాగంగా పెన్షన్ ఎందుకివ్వకూడదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగికి తన ఇష్టానికి వ్యతిరేకంగా నిర్బంధ రిటైర్‌మెంట్ ఇచ్చినప్పుడు పెన్షన్ ఇస్తారుకదా, వ్యవసాయాన్ని నిర్బంధంగా బంద్ పెట్టినప్పుడు రైతులకూ కూలీలకూ పెన్షన్ ఎందుకివ్వకూడదు అని ఆయన ప్రశ్న.

పార్లమెంటులో పెండింగ్‌లో వున్న పునరావాస బిల్లుతో చాలా పోలికలు గల పునరావాస విధానాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం జి.వో.నెం. 68 పేరుతో 2005లో జారీ చేసింది. అంత చక్కటి పునరావాస విధానం వేరే ఏ రాష్ట్రంలోనూ లేదని ముఖ్యమంత్రి ఆత్మస్తోత్రం చేసుకోవడం పత్రికలలో అందరూ చూసే ఉంటారు. దాని గొప్పదనం సంగతి అటుంచి, గట్టిగా ఆందోళన చేయనిదే అసలు అమలే చేయడం లేదు కాబట్టి జివో 68 పూర్తి పాఠాన్ని అనువాదం చేసి ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాం. నిర్వాసితులవుతున్న ప్రజలు, వారికి సహకరిస్తున్న ఉద్యమకారులు అందులోని విషయాలు తెలుసుకొని అమలు చేయించుకోవడానికిది ఉపయోగపడుతుందని ఆశిస్తాం. భూసేకరణ చట్టమూ అంతే. అది అసలే నిర్బంధ చట్టమంటే దాని అమలు మరీ అడ్డగోలుగా ఉంది. ముందు బలవంతంగా భూమి స్వాధీనం చేసేసుకో, ఆ తరువాత చట్టాన్ని అమలుచేయి అన్న వైఖరి ప్రభుత్వం తన అధికారులకు అలవాటు చేసింది. న్యాయస్థానాలూ అందుకు తగినట్టే వ్యవహరిస్తున్నాయి. చట్టాన్ని పాటించకుండ నా భూమిని ప్రభుత్వం బలవంతంగా తీసేసుకుంది అని హైకోర్టులో కేసు వేస్తే నీకు రావలసింది నష్టపరిహారమే కదా, ఇప్పిస్తాము లెమ్మంటుంది హైకోర్టు. ఈ పరిస్థితిలో, భూసేకరణ చట్టంలో ఏముందో తెలుసుకోవడం అందులో ఉన్న కొద్దిపాటి హక్కులను అనుభవించడానికి అవసరం. ఈ దృష్టితో, 'ప్రభుత్వం మీ భూమికోసం వస్తే...' అన్న శీర్షికతో ఒక వివరమైన కరపత్రం గతంలో అచ్చువేసాము. దానిని కొంత సవరించి ఈ బులెటిన్‌లో అచ్చువేస్తున్నాము.

విధ్వంసక అభివృద్ధి ముఖచిత్రాన్ని చూపించే కరపత్రాలు ఆయా సందర్భాలలో అచ్చువేస్తూ

వచ్చాము. అవన్నీ ఈ బులెటిన్‌లో పునర్ముద్రితమయ్యాయి. అవి కాక అయిదు రిపోర్టులున్నాయి. ఒకటి విశాఖపట్నం జిల్లాలోని బాక్సైట్ గనులు, వాటికి అనుబంధమైన రిఫైనరీల గురించి పాట్రిక్ అనే పరిశోధకుడు రాసిన రిపోర్టుకు అనువాదం. మరి రెండు భారీ భూసేకరణ ప్రతిపాదనలున్న కోస్టల్ కారిడార్, ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల ప్రాజెక్టులపైన రిపోర్టులు. కోస్టల్ కారిడార్ కోసం 1575 చ.కి.మీ.ల (అంటే దగ్గర దగ్గర 4 లక్షల ఎకరాల) భూమిని సేకరించడం జరుగుతుంది. సింగరేణివారి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు మొత్తం ముగిసేసరికి 2 లేక 2.5 లక్షల ఎకరాలను అది మింగేసి ఉంటుంది. ఇవి రెండూ 'మాక్రో' నివేదికలు కాగా రెండు 'మైక్రో' నివేదికలూ ఉన్నాయి. ఒకటి అనంతపురం జిల్లాలో ఫీల్డ్‌ఫైరింగ్ రేంజ్‌కోసం జరుగుతున్న భారీ భూసేకరణ గురించిన నివేదిక, రెండవది నెల్లూరు జిల్లాలో ఇప్పటికే ఉత్పత్తి జరుగుతున్న అపాచీ పరిశ్రమతో స్థానికుల అనుభవాలపైన నివేదిక.

ఇవి ప్రజలు ఎదుర్కొంటున్న, ఎదుర్కొనబోయే అనుభవాల చిత్రాలు కాగా, ప్రజల ప్రతిఘటనను తెలిపే రిపోర్టు కూడా ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాము. మన రాష్ట్రంలో ఇప్పటికి 57 సెజ్‌లు (SEZ) ఆమోదం పొందగా, రెండింటికి వ్యతిరేకంగా మాత్రమే చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రతిఘటన ఉంది. ఒకటి తూర్పుగోదావరి జిల్లా సమీపంలోని యు.కొత్తపల్లి, తొండంగి మండలాలలో నెలకొంటున్న పదివేల ఎకరాల బహుళ ఉత్పత్తుల సెజ్, రెండవది మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి, బాలానగర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామాలలో వెయ్యి ఎకరాలలో నెలకొంటున్న మందుల కంపెనీల సెజ్ (ఫార్మాసెజ్). ఈ ఆందోళనల తీరుతెన్నులను వివరించే రిపోర్టు ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాం.

2008 మార్చి 9వ తేదీన సెజ్‌ల గురించి హైదరాబాద్‌లో సెమినార్ నిర్వహించిన సందర్భంగా ప్రచురించిన కరపత్రాన్ని ఈ బులెటిన్‌లో అచ్చువేస్తున్నాము కాబట్టి సెజ్‌లమీద, సెజ్ చట్టం మీద, వ్యాసమేదీ ప్రచురించ లేదు. అయితే అప్పటికి స్పష్టంగా లేని ఒకటిరెండు విషయాలు చెప్పుకోవాలి. వ్యవసాయ భూములు పోతే పోయాయి, ఫ్యాక్టరీలలో ఉద్యోగాలు లభిస్తాయని సెజ్‌లకు మద్దతుగా వాదించడం జరుగుతుంటుంది. కానీ మన రాష్ట్రంలో ఆమోదం పొందిన 57 సెజ్‌లలో 39 ఐ.టి. రంగానికి చెందినవి. ఇవి కల్పించే ఉద్యోగాలు తక్కువ కాగా, ఉపాధి కోల్పోయిన గ్రామీణ యువకులకు ఆ కొన్నికూడ ఎంతమాత్రం అందుబాట్లో ఉండవు. పట్టణాలకు చెందిన విద్యావంతులైన అగ్రకుల మధ్యతరగతికే అవి దక్కుతాయి. ఐ.టి. తరువాత అధికం ఫార్మాసూటికల్స్. ఇవి కూడ అత్యాధునిక సాంకేతిక ప్రక్రియలతో నడిచే పరిశ్రమలు కాబట్టి వీటిలోనూ దొరికే పనులు తక్కువ, అందులో గ్రామీణ యువకులకు అందుబాట్లో ఉండేవి మరీ తక్కువ. ఇప్పటికి మన రాష్ట్రంలో నెలకొంటున్న సెజ్‌లలో చెప్పుకోదగ్గ మోతాదులో పని కల్పించేవి రెండే కనిపిస్తున్నాయి. ఒకటి నెల్లూరు జిల్లాలోని అపాచీవారి చెప్పుల ఫ్యాక్టరీ, రెండవది విశాఖపట్నం జిల్లాలో బ్రాండెక్స్ అపారెల్స్ (దుస్తుల) ఫ్యాక్టరీ. మొత్తంగా తీసుకుంటే సెజ్‌ల వల్ల దక్కగల ఉపాధికంటే పోయేది చాలా ఎక్కువ. ఉపాధి అంటే నేరుగా ఫ్యాక్టరీలో ఉద్యోగమే కానక్కరలేదనీ దాని చుట్టుపక్కల పెరిగే ఆవాసాల అవసరాల కోసం కిరాణాషాపు, లాండ్రీ, కూరగాయల దుకాణం వగైరా చిల్లర వ్యాపారులకు అవకాశం పెరుగుతుందనీ వాదించేవారుంటారు. మామూలు పరిశ్రమలకిది వర్తిస్తుందిగానీ సెజ్‌లకు వర్తించదు. సెజ్‌లో ఉత్పత్తి కేంద్రాలేకాక దానికి అనుబంధమైన టౌన్‌షిప్ కూడ ఉంటుంది. ఆ టౌన్‌షిప్‌కు 'వరల్డ్‌క్లాస్' సదుపాయాలు ఉంటాయి. అంటే సూపర్‌బజార్లు, మాల్స్ వగైరా అందులో భాగంగానే ఉంటాయి. పక్కఊరి ఎల్లయ్య అక్కడికిపోయి హెయిర్‌కటింగ్ సెలూన్ పెట్టుకోలేడు. పొరుగూరి మల్లమ్మ ఇస్త్రీషాపు పెట్టుకోలేదు.



అయితే సెజ్‌లయినా పారిశ్రామిక కారిడార్‌లయినా మొదట్లో కట్టడపు పనిలో కొంత ఉపాధి కల్పిస్తాయి. రోడ్లు, బ్రిడ్జిలు, బిల్డింగ్‌లు నిర్మించే పని ఒక ఆరు నెలలు లేక తొమ్మిది నెలలపాటు ఉంటుంది. భూములు కోల్పోయిన వాళ్ళకందులో కాంట్రాక్టర్ల కింద దినకూలీలుగా పని దొరికే అవకాశం ఉంది. భూములు పోయినా పని దొరికిందనే ఊరట కలుగుతుంది. కానీ ఇది వారి నిరసనను చల్లార్చడానికి పనికొస్తుందేతప్ప శాశ్వతం కాదు. కట్టడపు పని అయిపోయి ఉత్పత్తి మొదలయిన తరువాత స్థానికులకు ఇంక పనులేమీ దొరకవు. కానీ అప్పుడు ఆందోళనకు దిగి చేసేదీ ఏముండదు. ఈ మోసాన్ని ఒక్కొక్క చోట స్థానిక ప్రజలు గ్రహిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్ళరేవు మండలం గాడిమొగ వద్ద నెలకొన్న రిలయన్స్ వారి సహజవాయువు పరిశ్రమను దీనికి ఉదాహరణగా తీసుకోవచ్చు. వారు ఆన్‌షోర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన క్రమంలో అయిదు కాలవలు పూడ్చేసారు. ఆ కాలవలలో వేటచేసుకొని బతుకుతున్న వందలాది మత్స్యకారుల కుటుంబాలకు దానివల్ల జీవనాధారం పోయింది. అయితే అందరికీ పని కల్పిస్తామని రిలయన్స్‌వారు హామీ ఇవ్వడం, రెవెన్యూ అధికారులు మౌనం పాటించడం ప్రజల నోళ్లు కుట్టేసింది. చివరికి ఇచ్చిందేమిటంటే కట్టడపు పని ఉన్నంత కాలం 800 మందికి కాంట్రాక్ట్ కూలీలుగా పని ఇచ్చారు. అది అయిపోయిన తర్వాత హార్టికల్చర్‌లో కొద్దిమందికి పని కల్పిస్తామన్నారు కానీ అందరికీ పని ఇస్తానని చెప్పి కొందరికే ఇవ్వడం మాలో మాకు ఘర్షణ పెడుతుంది కాబట్టి ఇస్తే అందరికీ ఇమ్మని గాడిమొగవాసులు అడిగేసరికి అందరినీ తొలగించేసారు. ఆ పనికూడ అయిపోయి ఉత్పత్తి మొదలయ్యే నాటికి కేవలం 300 లేక 400 మంది ఉద్యోగులంటారనీ అందులో స్థానికులు చేయగల ఉద్యోగాలు పిడికెడు కంటే ఎక్కువ ఉండకపోవచ్చుననీ రిలయన్స్ అధికారులే అంటున్నారు. గాడిమొగ మత్స్యకారులకు ఇప్పుడు సత్యం తెలిసింది, ఆందోళనకూ సిద్ధపడుతున్నారు. అయితే పుణ్యకాలం గడిచిపోయిందేమో.

ఒకవేళ సెజ్‌లలో పని దొరికినా అక్కడి పని పరిస్థితులు ఎటువంటివో చూస్తే ఈ రకమైన ఉపాధి లేకపోతేనేం అనిపిస్తుంది. సెజ్‌లలో నెలకొల్పే పరిశ్రమలకు వివిధ చట్టాలనుండి మినహాయింపులిచ్చే అధికారం ప్రభుత్వాలకుంది. దీనిని కార్మిక చట్టాలను నీరుగార్చడానికి వాడుకోబోతారన్న సందేహం మొదటినుండి ఉంది. దానిని ఇప్పటికే నిజం చేసిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. మన కంటే ఎక్కువ సెజ్‌లకు ఆమోదం పొందిన మహారాష్ట్ర ప్రభుత్వంగాని, ఈ రెండింటితో తీవ్రంగా పోటీపడుతున్న తమిళనాడు ప్రభుత్వంగాని ఆ సాహసం ఇప్పటిదాకా చేయలేదు. మన రాష్ట్ర ప్రభుత్వం తెలుగుదేశం హయాంలోనే (దేశంలో ఒక సెజ్ చట్టమంటూ లేకముందే) జి.ఓ.ఎం.ఎస్. నెం. 151, తేదీ 9 ఏప్రిల్ 2002 నాడు ప్రకటించిన సెజ్ పాలసీలో అనేక కార్మిక చట్టాలకు మినహాయింపులను చేర్చింది. యాజమాన్యాలు వేతనం రిజిస్టర్లు, రికార్డులు పెట్టుకోనక్కరలేదు. ఏ పనికి ఎంత వేతనం ఇస్తున్నదీ ఒక్కొక్క షిఫ్టులో ఎన్ని గంటలు పని చేయిస్తున్నదీ ప్రకటించనక్కరలేదు. ఎటువంటి అత్యవసర పరిస్థితీ లేకున్నా కూడా సెజ్‌లోని సంస్థలకు కాంట్రాక్ట్ లేబర్ చట్టంలోని అన్ని అంశాలనుండి మినహాయింపు ఇయ్యవచ్చు. కార్మికుల ఆరోగ్యాన్నీ పనిస్థలంలో భద్రతనూ సంరక్షించడానికి ఉద్దేశించిన ఫ్యాక్టరీ చట్టం నుండి కూడ మినహాయింపు ఇయ్యవచ్చు. సెజ్‌లోని హొటళ్లు, మాల్స్, సూపర్‌బజార్లు వగైరా 365 రోజులూ, 24 గంటలూ పనిచేయవచ్చు. ఓవర్‌టైంకు అదనపు వేతనం చెల్లించేటట్టయితే నిర్బంధంగా ఓవర్‌టైం పని చేయించుకోవచ్చు. సెజ్‌లోని కార్మిక సంఘాలకు బయటి వాళ్లెవరూ

నాయకులుగా ఉండడానికి వీలులేదు. 100 మందికి పైగా కార్మికులు పనిచేసే పరిశ్రమలో లే ఆఫ్‌కూ రిట్రెంచ్‌మెంటుకూ మూసివేతకూ ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనీ, ప్రభుత్వమైనా కార్మికుల అభిప్రాయం సహితం తీసుకున్న తరువాతే నిర్ణయం చేయాలనీ చెప్పే పారిశ్రామిక వివాదాల చట్టంలోని చాప్టర్ 5–బి సెజ్‌లకు వర్తించదు.

ఇవన్నీ దశాబ్దాల తరబడి కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులు. ఒక జీవోతో వీటిని సెజ్‌లలో పనిచేసే కార్మికులకు లేకుండ చేసారు. అటువంటి వ్యవస్థలో ఉద్యోగాలు ఇస్తేమాత్రం ఏమి ఒరుగుతుంది?

భారీగా పెట్టుబడులను ఆకర్షించడంకోసం భారీగా ప్రజలను విస్థాపనకు గురిచేసే 'అభివృద్ధి' ఇంకా చాలాకాలం దేశంలో అమలవుతుందనేది స్పష్టంగానే ఉంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ఎన్నికలు సమీపించినప్పుడు కొంత అల్లరిచేస్తే చేయవచ్చునుగానీ ఒక విధంగా వారికి దీనిపట్ల అభ్యంతరం లేదు. దేశంలో రెండు మూడు రాష్ట్రాలలో ప్రభుత్వాలు నడపగల స్థితిలో ఉన్న వామపక్ష పార్టీలు సహితం మెరుగయిన నష్టపరిహారం 'ప్యాకేజి' ఇస్తున్నాయేతప్ప ఈ వికృత అభివృద్ధి విధానానికి ప్రత్యామ్నాయ నమూనాను వారూ రచించలేదు. అంటే అర్థం ఈ విధ్వంసాన్ని వ్యతిరేకించే రాజకీయ ఆచరణ 'ప్రధాన స్రవంతి' వారికి రాలేదు. బహుశా రాదు. బాధిత ప్రజలు తమంతటతాము చేపట్టే ఆందోళనలు, 'ప్రధాన స్రవంతి'కి వెలుపల ఉన్న ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ ఉద్యమాలు చేపట్టే ఆందోళనలే దీనిని నిలువరించాలి. ఆ కృషి ప్రస్తుతం పరిమితంగానే ఉంది. అది మరింత పెరిగి వినాశకరమైన పాలనా విధానాలకు సవాలు కావాలని కోరుకుంటూ దానికి కొంతయినా తోడ్పడగలదన్న ఆశతో ఈ ప్రచురణను పాఠకులకు అందిస్తున్నాం.

**– మానవహక్కుల వేదిక**

10-06-2009



# ఇందులో...

## సంపాదకీయం


వృద్ధి చెందబోయేది విధ్వంసమే ...... 3


## వ్యాసాలు


భూసేకరణ, పునరావాస బిల్లులు
**అసలే అరకొర... ఆపై ఆలస్యం** – కె. బాలగోపాల్ ...... 11

నాగార్జునసాగర్ నిర్మాణం
**తొలి విస్థాపన గాథ...** – ఎస్. జీవన్ కుమార్ ...... 22

'అభివృద్ధి'లో నిర్వాసితులకు
**భాగమైనా ఇవ్వండి పెన్షనైనా ఇవ్వండి** – గొర్రెపాటి నరేంద్రనాథ్ ...... 27

తూర్పు కనుమల్లో బాక్సైట్ ప్రాజెక్టు
**ఆదివాసులకే కాదు అందరికీ హాని** – పాట్రిక్ ఆస్కర్‌సన్ ...... 34

**జీవో నెం. 68** ...... 52


## రిపోర్టులు


**ప్రజల జీవితాలపై ఎక్కుపెట్టిన తుపాకీ** – ఎస్.ఎం. బాషా ...... 69

**భవిష్యత్ చిత్రపటం: అపాచీ** – ఎ. సుబ్రమణ్యం ...... 73

**కోస్తాను కబళిస్తున్న 'కారిడార్'** ...... 81

**ఓపెనయ్యేకొద్దీ విధ్వంసం** ...... 93

**రెండు సెజ్ వ్యతిరేక పోరాటాలు** ...... 106


## కరపత్రాలు


...... 118 – 183

### భూసేకరణ, పునరావాస బిల్లులు

# అసలే అరకొర... ఆపై ఆలస్యం

కె. బాలగోపాల్ ✡

అప్పుడెప్పుడో బ్రిటిష్ పాలకులు రోడ్లు, రైల్వేలైన్లు వేయడం కోసం, ప్రభుత్వ కార్యాలయాలు నెలకొల్పడం కోసం జారీ చేసిన భూసేకరణ చట్టం (1894)ను స్వాతంత్ర్యానంతర అభివృద్ధిలో భాగంగా పరిశ్రమల కోసం, నీటిపారుదల ప్రాజెక్టుల కోసం అవసరమైన భారీ భూసేకరణ ప్రక్రియ కొరకు వాడుకోవటం ఈ మధ్యకాలంలో తీవ్ర విమర్శకు గురయింది. గ్రామంలో కొన్ని ఎకరాల భూమిని సేకరించడం కాదు, గ్రామాలకు గ్రామాలే ఈ భారీ భూసేకరణలో ఖాళీ అయిపోతాయి. వాటిలో నివసించే ప్రజలకు ఏ రకమైన ప్రత్యామ్నాయం గానీ పునరావాసం గానీ 1894 నాటి భూసేకరణ చట్టంలో లేదు, స్వతంత్ర భారత ప్రభుత్వం దానికోసం నియమాలు రచించనూ లేదు. 1984లో ఆ చట్టాన్ని సవరించి ప్రజావసరాల కోసమే కాక కంపెనీల కోసం కూడా ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేయవచ్చునన్నారే తప్ప ప్రజలకు ఉపయోగకరమైన మార్పులేవీ చేయలేదు. ఖాళీ చేసిన గ్రామాలలో స్థిరాస్తులున్న వారికి 1894 నాటి చట్టం ప్రకారం నష్ట పరిహారం దక్కింది గానీ స్థిరాస్తి లేకుండా లేదా స్థిరాస్తి ఉండీ దానిని రుజువు చేసే ఆధారాలేవీ లేకుండ, ఆ గ్రామాలలో బతికిన వారికి ఏ నష్టపరిహారమూ దక్కలేదు.

పోనీ నిర్వాసితుల సంఖ్య స్వల్పమా అంటే కాదు. 2007 నాటికి మన 60 సంవత్సరాల అభివృద్ధి 6 కోట్ల మందిని నిర్వాసితులను చేసిందని అంచనా. వీరిలో అతికొద్ది మంది గురించి తప్ప తక్కినవారు ఏమయ్యారు, ఎక్కడున్నారు, ఎట్లా ఉన్నారు అన్న సమాచారం ఎవరి దగ్గరా లేదు. పునరావాస చట్టమేదీ

✡ మానవహక్కుల కార్యకర్త, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాది



దేశంలోగానీ ఏ రాష్ట్రంలోగానీ లేదు కాబట్టి ఇన్నేళ్లలో కొద్దిమంది మాత్రమే ఏదో ఒక మేరకు తాత్కాలిక విధాన నిర్ణయాల దయవల్ల పునరావాసం పొందారు. అది వాళ్ల జీవన ప్రమాణాలను పెంచే పునరావాసం కాకపోయినా కనీసం వారు ఏదో ఒక పని చేసుకొని బతుకుతున్నారన్న సమాచారమైనా ఉంది. తక్కినవారి గురించి ఏ సమాచారమూ లేదు.

మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే నిర్వాసితులయిన వారిలో 40 శాతం ఆదివాసులు. ఆదివాసీ జనాభా దేశ జనాభాలో 7.5 శాతం కాగా ప్రాజెక్టు నిర్వాసితులలో వారి సంఖ్యన 40 శాతం. దీని పర్యవసానం ఏమిటంటే దేశంలోని ఆదివాసులలో నూటికి 30 శాతం ఏదో ఒక రోజు ఏదో ఒక ప్రాజెక్టు కింద నిర్వాసితులయిన వారే.

గడచిన 10-15 సంవత్సరాల కాలంలో ఈ పరిస్థితి తీవ్ర విమర్శకు గురయింది. న్యాయమైన నష్టపరిహారం, సమగ్రమైన పునరావాసం కల్పించకుండ అభివృద్ధి పేరిట లక్షలాది ప్రజలను వారి భూములనుండి, ఆవాసాలనుండి గెంటివేయడం అన్యాయం అని నిర్వాసితుల తరఫున ముందుకొచ్చిన ఉద్యమాలు అన్నాయి. వీటిలో అందరికీ బాగా తెలిసింది నర్మదా బచావో ఆందోళన్ (ఎన్‌బిఏ). నర్మదానదిపైన కడుతున్న సర్దార్ సరోవర్ ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులవుతున్న రెండు లక్షలమంది ప్రజలకు ప్రతినిధి ఈ సంస్థ. మళ్లీ విస్థాపనలో సర్దార్ సరోవర్‌తో పోల్చదగ్గ ప్రాజెక్టు మన పోలవరమే. అయితే నర్మదా ఆందోళనలో పదవ వంతు ఉద్యమం కూడా మన దగ్గర జరగలేదు. అందుకు అందరమూ సిగ్గుపడాలి.

## ఏడేళ్లుగా పెండింగ్‌లో...

ఈ విమర్శ ఫలితంగా 2003 లో మొట్టమొదటిసారి కేంద్ర ప్రభుత్వం ఒక సహాయ పునరావాస విధానాన్ని ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదన మీద జరిగిన చర్చ ఫలితంగా 2006లో దానికంటే బలమైన ముసాయిదాను నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ తయారు చేసింది. అయితే దానికి చట్టం రూపం ఇచ్చేసరికి మళ్లీ కొంత నీరుగార్చారు. చివరికి 2007లో పునరావాస చట్టాన్ని బిల్లు రూపంలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు (రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ చట్టం, 2007). రెండేళ్లు గడిచినా దానిని చర్చించి చట్టం జారీ చేయడానికి పార్లమెంటుకు తీరిక దొరకలేదు. అయినా ఈ రెండేళ్లలో లక్షల ఎకరాల భూసేకరణ మాత్రం జరిగిపోయింది.

దానితోబాటు 1894 నాటి భూసేకరణ చట్టాన్ని సవరించే ‘భూసేకరణ (సవరణ) చట్టం, 2007,ను కూడ బిల్లు రూపంలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. దానిని చర్చించడానికీ పార్లమెంటుకు తీరిక లేకుండా పోయింది కాబట్టి అది కూడ ఇంకా చట్టం రూపం తీసుకోలేదు. బలవంతపు భూసేకరణ వల్ల జరుగుతున్న అన్యాయాన్ని సవరించడానికని చెప్పి ప్రవేశపెట్టిన బిల్లులను పార్లమెంటులో కనీసం



చర్చించకుండా, వాటికి చట్టరూపం ఇవ్వకుండ, మరొకపక్క రెండంకెల వృద్ధిరేటు దిశగా సెజ్‌లకూ, పెద్దపెద్ద విమానాశ్రయాలకూ, ఓడరేవులకూ, గనులకూ అనుమతులు ఇస్తూ భూములు అప్పగిస్తూ పోతున్న పాలకుల చిత్తశుద్ధి గురించి, నిజాయితీ గురించి విడమరచి విమర్శించాల్సిన అవసరం లేదు కాని ఆ బిల్లులలో ఏముందో చూద్దాం.

## భూసేకరణ (సవరణ) చట్టం, 2007

భూసేకరణ చట్టం ప్రభుత్వానికి పౌరుల భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకునే అధికారం ఇస్తుంది. బలవంతంగా అంటే ఉద్దరకు అని కాదు. నష్ట పరిహారం ఇస్తుంది, కానీ రైతుకు తన భూమి ఇవ్వడానికి ఇష్టం లేకున్నా తీసుకోగలదు. బెంగాల్‌లో నందిగ్రాం, సింగూరు ఆందోళనలు తలెత్తిన నేపథ్యంలో ఈ చట్టాన్నే రద్దు చేయాలనీ, ఇష్టపూర్వకంగా ఇచ్చిన భూమిని ప్రభుత్వం తీసుకోవాలే తప్ప బలవంతంగా సేకరించడానికి వీలు లేదనీ ఒక వాదన ముందుకొచ్చింది. అయితే ప్రజావసరాలకోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేయక తప్పని సందర్భాలు నిజంగానే ఉండగలవు. ఉదాహరణకు ఒక గ్రామంలో బడి కట్టాలనుకోండి దానికి భూమి కావాలి. ఆ గ్రామంలో ప్రభుత్వ భూమిలేని పక్షంలో ఎవరిదైనా ప్రైవేట్ భూమి తీసుకోకతప్పదు. ఆ గ్రామంలో భూమిగల రైతులంతా తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారనుకోండి. ప్రభుత్వ స్కూలు కేవలం భూమిలేని పేదల అవసరమేననుకోండి (ఇది నిజానికి ఇవాళ దాదాపు అన్ని గ్రామాలలో ఉన్న పరిస్థితే. ఆ కారణంగా రైతులెవ్వరూ ప్రభుత్వ బడికోసం స్వచ్ఛందంగా భూమి ఇవ్వడానికి ఇష్టపడరనుకోండి. అప్పుడు బలవంతంగా సేకరించక తప్పదు. ఇటువంటి సందర్భాలు అనేకం ఉంటాయి. ఒక రహదారి, ఒక రైలుమార్గం అవసరం అని అందరూ ఒప్పుకోవచ్చును గానీ ‘నా భూమి ఇవ్వను పక్కవాళ్లది తీసుకొమ్మ’నే వైఖరి అందరూ అనుసరించవచ్చు. అప్పుడు ఎవరో ఒకరి భూమిని ప్రభుత్వం తీసుకోకతప్పదు.

## ఏది ప్రజోపయోగం?

అయినప్పటికీ రెండు విషయాలలో బలవంతపు భూసేకరణను విమర్శించే అవకాశం ఉంది. ఒకటి, ప్రజావసరం లేక ప్రజోపయోగం అంటే అర్థం ఏమిటి? అనేది. 1894 నాటి భూసేకరణ చట్టం దానికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదు. ఒక స్కూలు, ఒక రైల్వే లైను, ఒక ఆస్పత్రి మాత్రమే కాక టాటావారి చిన్నకారు కూడ ఆ చట్టం కింద ప్రజావసరమే అయింది. ప్రత్యేక ఆర్థిక మండలి కూడ ప్రజావసరమే అయింది. దీనిని మార్చి, ప్రజావసరాన్ని స్పష్టంగా, అర్థవంతంగా నిర్వచించాలనేది ఒక చర్చ. రెండవది, భూసేకరణవల్ల కేవలం ఆస్తులేకాదు, జీవనం కూడ పోతుంది. స్వంత ఆస్తులు కోల్పోయిన వారికి

***ఏ ప్రాజెక్టువల్లనయినా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం పొందేది కొందరే అయినా దానిని దేశానికి అభివృద్ధికరంగా భావించడం జరుగుతుంది. అటువంటప్పుడు ఆ ప్రాజెక్టువల్ల కలిగే నష్టాన్ని కూడ దేశానికి నష్టంగా భావించి ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టపోయే వారిని దేశం ఆదుకోవడం న్యాయం. ఆస్తులున్న వారినీ లేనివారినీ కూడ దేశం ఆదుకోవాలి. వారు కోల్పోయే జీవనాన్ని పూర్తిస్థాయిలో వారికి తిరిగి ఇవ్వాలి.***

మాత్రం నష్టపరిహారం ఇచ్చి జీవనం కోల్పోయిన వారికి మొండి చేయి చూపించడం అన్యాయం. ఏ ప్రాజెక్టువల్లనయినా ప్రత్యక్షంగా, పరోక్షంగా, ప్రయోజనం పొందేది కొందరే అయినా దానిని దేశానికి అభివృద్ధికరంగా భావించడం జరుగుతుంది. అటువంటప్పుడు ప్రాజెక్టువల్ల కలిగే నష్టాన్ని కూడ దేశానికి నష్టంగా భావించి ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టపోయే వారిని దేశం ఆదుకోవడం న్యాయం. ఆస్తులున్న వారినీ లేనివారినీ కూడ దేశం ఆదుకోవాలి. వారు కోల్పోయే జీవనాన్ని పూర్తిస్థాయిలో వారికి తిరిగి ఇవ్వాలి. ఇప్పుడు జరుగుతున్నదేమిటంటే స్వంత ఆస్తులున్నవారికిచ్చే నష్టపరిహారం సహితం తిరిగి అంత ఆస్తి కొనుక్కోవడానికి ఎక్కడా సరిపోదు. ఇక ఆస్తిహక్కు రుజువు చేసుకోలేని వారికి, పట్టా లేకుండా ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న వారికి, కూలి చేసుకొనీ వివిధ వృత్తులు చేసుకొనీ జీవనం పొందుతున్న వారికి అసలు నష్టపరిహారమే రావడంలేదు. పశువులబీళ్లు కుంటలు మొదలయిన ఉమ్మడి వనరులు కోల్పోవడం వల్ల కలిగే నష్టం లెక్కలోకే రావడంలేదు.

2007 సవరణ, కొత్త పునరావాస చట్టం రెండూ ఈ చర్చకు పూర్తి న్యాయం చేయవు. ప్రజావసరం నిర్వచనం ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. నష్టపరిహారం, పునరావాసాల స్థితి మెరుగవుతాయి గానీ పూర్తిస్థాయిలో బాధితుల జీవనాన్ని, జీవన ప్రమాణాన్ని అవి కాపాడలేవు.

పైన చెప్పినట్లు భూసేకరణ చట్టం 'ప్రజావసరం' అనే మాటనే నిర్వచించలేదు. చట్టంలో నిర్వచించని మాటలకు సాధారణ అర్థమే ఉంటుందని న్యాయ సిద్ధాంతం అంటుంది కానీ ఆచరణలో వాటి అర్థాన్ని కోర్టులు నిర్ణయిస్తాయి. 1894 నాటి భూసేకరణచట్టం కొన్ని రకాల అవసరాల్ని పేర్కొని ఇవన్నీ ప్రజావసరాల కిందికే వస్తాయనింది. అంతే తప్ప అవి మాత్రమే ప్రజావసరాలు అనలేదు. న్యాయస్థానాలు రంగంలోకి దిగి 'ప్రజావసరం' అనే దానికి విస్తృత అర్థం కల్పించాయి. ప్రత్యేకించి పారిశ్రామిక అభివృద్ధి పేరిట జరిగే ఏ భూసేకరణయినా ప్రజావసరం కోసమేనన్నాయి. అన్ని రాష్ట్రాలూ పారిశ్రామిక అభివృద్ధికి అవసరమయిన మౌలిక వసతులు నెలకొల్పి పరిశ్రమలను ఆహ్వానించే బాధ్యతగల సంస్థలను ఏర్పాటు చేసాయి. మన రాష్ట్రంలో ఎ.పి.ఐ.ఐ.సి అటువంటిదే. భూమి సేకరించి ఎ.పి.ఐ.ఐ.సి చేతిలో పెట్టడం ప్రజావసరాల పేరిట సమర్థనీయం అయింది. ఆపైన ఆ భూములను అది ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకోవచ్చు. అయితే 1984లో భూసేకరణ చట్టాన్ని సవరించి ప్రజావసరాల కోసమే కాక 'కంపెనీల' కోసం కూడా బలవంతంగా భూసేకరణ చేయవచ్చునని అన్నారు. అప్పటినుండి ఈ ముసుగు అవసరం కూడా లేకుండ పోయింది.

## 'ప్రజావసరం' అవగాహనలో మార్పు

2007 సవరణ కూడ ప్రజావసరం అనేదానిని నిర్వచించలేదు. పాత చట్టంలాగే కొన్ని అవసరాలను పేర్కొని ఇవన్నీ ప్రజావసరాలు అని వదిలేసింది తప్ప సమగ్ర నిర్వచనం ఇవ్వలేదు. అయితే పాత చట్టం ఇచ్చిన జాబితాకూ దీనికీ స్పష్టమైన తేడా ఉంది. పాతచట్టం విద్య, ఆరోగ్యం, ఆవాసం, మురికివాడల పునరావాసం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వరంగ సంస్థల అవసరాలను ప్రజావసరాలుగా పేర్కొనింది. 2007 సవరణ అవన్నీ తొలగించి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, రహదార్లు, వంతెనలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వేలు, గనులు, నీటిసరఫరా ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశుధ్య ప్రాజెక్టులు మొదలయిన 'మౌలిక సదుపాయాల'ను, సైనిక అవసరాలను ప్రజావసరాలుగా పేర్కొనింది. దీని అర్థం విద్య, ఆరోగ్యం, ఆవాసం మొదలయినవి ఇకమీదట ప్రజాప్రయోజనాల కిందికి



రావని కాదు. ఆ ప్రయోగానికి ఉండే సాధారణ భావం కారణంగా అవి ఇప్పటికీ ప్రజాప్రయోజనాల కిందే లెక్కకు రావచ్చు. ఎటొచ్చీ ఆ సంగతి ఇకమీదట కోర్టులు తేల్చవలసి ఉంటుంది. కానీ రహదార్లు, విమానాశ్రయాలు వగైరాల విషయంలో సందేహానికి ఆస్కారం లేకుండ ఇవి ప్రజాప్రయోజనాలే అని సవరణ చట్టం చెప్తుంది. 'అభివృద్ధి' అనే భావనకు గడచిన 10-15 సంవత్సరాలుగా పాలనా విధానాలలో స్థిరపడిన వ్యాఖ్యానం ప్రభావం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. ఈ అభివృద్ధి ప్రజావసరమేనని భూసేకరణ చట్టం చేతనే ఇప్పుడు చెప్పిస్తున్నారు.

ప్రజావసరం కోసమే కాక కంపెనీల కోసం కూడా భూసేకరణ చేయవచ్చునని 1894 చట్టానికి 1984లో చేసిన సవరణలో చేర్చారని చెప్పాము. 2007 సవరణ దానిని తొలగించింది. అయితే 'ప్రజావసరం' నిర్వచనంలోనే ప్రజా సామాన్య అవసరాలను తీర్చే ప్రైవేట్ కంపెనీల అవసరాలను చేర్చారు. ప్రజా సామాన్య అవసరాలను తీర్చాలి అనేది పెద్ద షరతేం కాదు. ఎందుకంటే ఉపాధి కల్పన ఒక ప్రజావసరమేనని ఇప్పటికే న్యాయస్థానాలు తీర్మానించి ఉన్నాయి. ఏ కంపెనీ అయినా ఎంతోకొంత ఉపాధి కల్పిస్తుంది కాబట్టి ప్రజా సామాన్య అవసరాలను తీరుస్తుందని వాదించవచ్చు. అయితే ఇంకొక్క తేడా 2007 సవరణలో పెట్టారు. ప్రైవేట్ కంపెనీ తన అవసరంలో 70 శాతం భూమి రైతులనుండి కొనుక్కున్నట్టయితే మిగిలిన 30 శాతాన్ని ప్రభుత్వం సేకరించి అప్పగించవచ్చునని ఈ సవరణ అంటుంది. అంటే ప్రైవేట్ కంపెనీల మొత్తం అవసరాన్ని ప్రభుత్వం తీర్చకూడదు. 70 శాతం వాళ్లు భూమి యజమానుల దగ్గర కొనుక్కుంటే తక్కిన భూమిని ప్రభుత్వం సేకరించి ఇవ్వొచ్చు.

**పాతచట్టం విద్య, ఆరోగ్యం, ఆవాసం, మురికివాడల పునరావాసం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వరంగ సంస్థల అవసరాలను ప్రజావసరాలుగా పేర్కొనింది. 2007 సవరణ అవన్నీ తొలగించి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, రహదార్లు, వంతెనలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వేలు, గనులు, నీటిసరఫరా ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశుధ్య ప్రాజెక్టులు మొదలయిన 'మౌలిక సదుపాయాల'ను, సైనిక అవసరాలను ప్రజావసరాలుగా పేర్కొనింది.**

ఇది ఇప్పుడున్న దానికంటే మెరుగేకానీ, కాకినాడ సెజ్‌కోసం డెవలపర్ కొంత కొనుగోలు, ప్రభుత్వం కొంత సేకరణ చేసిన వైనాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఇది ఏ రకంగా దుర్వినియోగానికి గురవుతుందో ఊహించవచ్చు. మొదట కొంతమంది స్వచ్ఛందంగానే అమ్ముతారు, తక్కువ ధరకూ అమ్ముతారు. వ్యవసాయం మీద ఆసక్తి లేనివారు, ఎంతో కొంతకు అమ్మేసి బయటపడదామని చూసేవారు ఉంటారు. ఆ తరువాత ఇరుగు పొరుగు రైతులపైన ఒత్తిడి పెరుగుతుంది. మీరు కూడ స్వచ్ఛందంగా అమ్మేయకపోతే చివరికి ప్రభుత్వం సేకరించే 30 శాతం కోటాలో పడతారు అని కొనుగోలుదారుడే కాదు, రెవెన్యూ అధికారులు సహితం బెదిరిస్తారు. ప్రభుత్వ సేకరణలో ఉన్న తలనొప్పిని తప్పించుకోవడానికి ఒక్కొక్కరుగా అమ్మడం మొదలుపెడతారు. చివరకు 30 శాతం భూసేకరణ చేయవలసిన అవసరం సహితం ఉండకపోవచ్చు. ఇంకొక రకంగా చెప్పాలంటే ప్రభుత్వం భూసేకరణ బెదిరింపు కంపెనీ కొనుగోలుకు సాధనంగా పనిచేస్తుంది.

## నష్టపరిహారాన్ని ఎలా లెక్కగడతారు?

భూసేకరణలో ప్రభుత్వం చెల్లించే నష్ట పరిహారం విషయంలో 'ఇప్పుడున్న జీవన ప్రమాణాన్ని తిరిగి పొందగలిగేంత ఇవ్వాలి' అన్న ప్రమాణాన్ని అందుకోకపోయినా, 2007 సవరణ ప్రస్తుత పరిస్థితి కంటే మెరుగే. ప్రస్తుతం ఆ భూమి 'మార్కెట్‌ధర'ను దానిపైన 30 శాతం (బలవంతపు సేకరణకుగాను, పరిహారాన్ని చట్టపరిభాషలో సొలేషియం అంటారు) మరొక 12 శాతం అదనపు మార్కెట్ విలువను చెల్లిస్తున్నారు. 'మార్కెట్ ధర' అనేదానికి భూసేకరణ చట్టంలో నిర్వచనం లేదు. ఆయా ప్రాంతాలలో గడచిన మూడు సంవత్సరాలలో రిజిష్టర్ అయిన అమ్మకాల సగటును అనుసరించి ప్రభుత్వం మార్కెట్ విలువను ప్రకటిస్తుంది. రిజిస్ట్రేషన్ ఖర్చులు తగ్గించుకొనడానికి అమ్మకాలలో ధర తరచుగా తక్కువ చూపిస్తారు కాబట్టి ఇది అసలు ధరకంటే తక్కువగా ఉంటుంది. దానిపైన రైతు కోర్టులో కేసులు వేసుకోవడం, ప్రతీ భూ సేకరణా జిల్లా కోర్టునుంచి హైకోర్టుకు, అప్పుడప్పుడు సుప్రీంకోర్టుకు పోవడం పరిపాటి అయింది. వకీళ్లకూ బ్రోకర్లకూ ఇదొక పెద్ద ఆదాయ మార్గం అయింది.

2007 సవరణ చట్టంలోనే మార్కెట్ ధర లెక్కించే పద్ధతిని రాసేసింది. గడచిన మూడు సంవత్సరాలలో ఆయా ప్రాంతాలలో జరిగిన మొత్తం అమ్మకాలలో అధిక ధర పలికిన 50 శాతాన్ని లెక్కలోకి తీసుకొని వాటి సగటును మార్కెట్ ధరగా తీసుకోవాలని అంటుంది. అంటే అమ్మకాల సగటు ధరను కాక అధిక ధరకు జరిగిన అమ్మకాల సగటు తీసుకోవాలంటుంది. దానిపైన పరిహారం (సొలేషియం) 30 శాతం కాక 60 శాతం చెల్లించాలంటుంది. అంతవరకు బాగానే ఉంది గానీ, భూమి కోల్పోయిన వారెవరయినా వేసుకునే మొదటి ప్రశ్న, మరీ దూరం పోకుండ మళ్లీ అంత భూమి, అదే కోవకు చెందిన భూమి, కొనుక్కోగలనా అనేది. దానికి మాత్రం భరోసా లేదు. నిజానికి పారిశ్రామిక మౌలిక సదుపాయాలకోసం భారీగా భూసేకరణ చేసిన సందర్భాలలో చుట్టూ భూముల ధరలు రెండు కారణాలుగా వేగంగా పెరుగుతాయి. పరిశ్రమలు రాబోతాయన్న ఆశతో పెరుగుతాయి. భూమి కోల్పోయిన వారందరూ చేతిలో పైసలు పట్టుకొని ఆ పరిసరాలలో భూమి కొనుగోలు చేయాలని చూడడంవల్ల కూడా భూముల ధరలు పెరుగుతాయి. కాబట్టి ఎట్టి పరిస్థితిలోనూ భూములు కోల్పోయినవారు ఆ పరిసరాలలో అంత భూమి కాదుకదా, అందులో సగం కూడా కొనుగోలు చేయలేరు.

**భూమి కోల్పోయిన వారెవరయినా వేసుకునే మొదటి ప్రశ్న, మరీ దూరం పోకుండ మళ్లీ అంత భూమి, అదే కోవకు చెందిన భూమి, కొనుక్కోగలనా అనేది. దానికి మాత్రం భరోసా లేదు.**

ప్రజలనుండి భూమిని చవకగా సేకరించి ఆ తరువాత ఎక్కువధరకు ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకుంటున్నారన్న ఫిర్యాదు ప్రభుత్వాలపైన తరచుగా వింటున్నాం. పోలేపల్లి సెజ్ వ్యతిరేక ఆందోళనకు ఈ మోసం ఒక ప్రధాన హేతువు అయింది. 2007 సవరణ ఈ విషయంలో ఒక మంచి షరతును చేర్చింది. సేకరించిన భూమిని ఎవరికైనా అమ్మడం జరిగితే సేకరించిన ధరకూ, అమ్మిన ధరకూ మధ్యనున్న తేడాలో 80 శాతం ఆ భూమి యజమానికి దక్కుతుంది.



ప్రైవేట్ కంపెనీ కోసం భూమి సేకరించేటట్టయితే వారు 70 శాతం కొనుగోలు చేస్తే 30 శాతం మాత్రమే ప్రభుత్వం సేకరించాలన్న నియమం చూసాము. అప్పుడు ఆ 30 శాతం భూమికి ఇచ్చే నష్టపరిహారం కంపెనీ చేసిన కొనుగోలు ధరకంటే తక్కువ ఉండడానికి వీలు లేదని కూడ నియమం పెట్టారు.

## పునరావాస చట్టం, 2007

నష్టపరిహారాన్నీ పునరావాసాన్నీ నిజానికి వేరు చేయలేము. భూములు, ఊర్లు ఖాళీ చేసి జీవనాధారాన్ని కోల్పోతున్నందుకు నష్టపరిహారం ఇవ్వాలి, ఆ తరువాత మళ్లీ బతుకు కొనసాగించడానికి పునరావాసం కల్పించాలి. వారంతా ఊరు ఊరుగా దగ్గరిలో ఒక చోట బతకగలగాలి, తిరిగి ఒకనాటి జీవన ప్రమాణం అనుభవించగలగాలి అనేది కనీస నియమం. దేశ అభివృద్ధికోసం వారు త్యాగం చేస్తున్నారు కాబట్టి వారు ఇంకా మెరుగయిన జీవనం పొందాలన్న ఆలోచన కూడా న్యాయమైనదే. ఎటొచ్చీ మొదటిదానికే భరోసా లేనప్పుడు అంతకంటే ఎక్కువ కోరి ప్రయోజనమేముంది అని నిస్పృహ చెందడం సహజం.

**దేశ అభివృద్ధికోసం వారు త్యాగం చేస్తున్నారు కాబట్టి వారు ఇంకా మెరుగయిన జీవనం పొందాలన్న ఆలోచన కూడా న్యాయమైనదే. ఎటొచ్చీ మొదటిదానికే భరోసా లేనప్పుడు అంతకంటే ఎక్కువ కోరి ప్రయోజనమేముంది అని నిస్పృహ చెందడం సహజం.**

భూ సేకరణ చట్టాన్ని సవరించి, కొత్తగా పునరావాస చట్టాన్ని తయారు చేసినా కూడ ఆ భరోసా మాత్రం లేదు. స్వంత ఆస్తికిచ్చే నష్ట పరిహారాన్ని మొదటి దానిలో ఉంచి, వివిధ వృత్తులు చేసుకొని, కూలి చేసుకొని బతికే వారికిచ్చే నష్టపరిహారాన్ని, అందరికీ ఇచ్చే పునరావాసాన్ని రెండవదానిలో (పునరావాస చట్టంలో) రాసారు. ఈ పునరావాస చట్టంలో కొట్టొచ్చినట్టు కనిపించే విషయం 400 కుటుంబాలకు పైగా (కొండ ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలలోనయితే 200కు పైగా) భౌతికంగా నిర్వాసితులయ్యే ప్రాజెక్టుల పునరావాస ప్రక్రియకు ఒక పద్ధతి, అంతకంటే తక్కువ సంఖ్య నిర్వాసితులయ్యే ప్రాజెక్టుల పునరావాస ప్రక్రియకు వేరొక పద్ధతి నిర్దేశించడం. మొదటి దానికి (క్లుప్తంగా 'పెద్ద ప్రాజెక్టులు' అందాం) కొంత పారదర్శకత, బాధిత ప్రజలకు నిర్ణయాలలో పాత్ర ఉండే పద్ధతి, రెండవ దానికి (క్లుప్తంగా 'చిన్న ప్రాజెక్టులు' అందాం) పూర్తిగా ఏకపక్షమైన పద్ధతి పెట్టారు. దీనికి ఏ కారణమూ కనిపించదు. ఈ చట్టం పునరావాసం ఇచ్చేది కేవలం భౌతికంగా విస్థాపనకు గురయ్యేవారికే కాదు. అంటే ఇళ్లు ఖాళీచేసి వీధిన పడిన వారికి మాత్రమే కాదు. ప్రాజెక్టు బాధితులందరికీ ఇస్తుంది. అంటే ఇల్లు ఖాళీ చేయకపోయినా జీవనం కోల్పోయే వారందరికీ ఇస్తుంది. నిర్వాసిత కుటుంబాల సంఖ్య 400 కంటే ఎక్కువ ఉన్నా తక్కువ ఉన్నా బాధితుల సంఖ్య ఎంతయినా ఉండగలదు. అటువంటప్పుడు నిర్వాసితుల సంఖ్యను బట్టి వర్గీకరించటంలో అర్థం ఏమిటి? నిజానికి ఈ మధ్యకాలంలో ఊరిని ముట్టుకోకుండ ఊరి శివారులోని పంటభూములు, బీడు భూములు సేకరించే నేర్పు ప్రభుత్వం ప్రదర్శిస్తున్నది. మన రాష్ట్రంలో గడచిన అయిదేళ్లలో జరిగిన భూసేకరణలో అధికభాగం ఈ రకంగా జరిగింది. లేదా ప్రాజెక్టును దశలవారీగా విడగొట్టి కొద్దికొద్దిగా విస్థాపన కలిగించే పద్ధతిలో భూసేకరణ

చేయొచ్చు. అటువంటి ఎత్తుగడలు అనుసరించేటట్టయితే చట్టంలోని అందమయిన పారదర్శక విధానాలు కాగితం మీదే ఉండిపోయి ఏకపక్షమైన పునరావాస ప్రక్రియ మాత్రమే ప్రాజెక్టు బాధితులందరికీ దక్కే ప్రమాదం ఉంది.

## ఎవరు బాధితులు

పోతే ప్రాజెక్టు బాధితులకు ఈ చట్టం విస్తృతమైన నిర్వచనమే ఇచ్చింది గానీ అందులోనూ సమస్యలున్నాయి. భూసేకరణవల్ల నివాసం, ఆస్తి, జీవనం దెబ్బతినే వారందరూ ప్రాజెక్టు బాధితులేనంటుంది. ఇందులోకి భూమి కోల్పోయేవారే కాక, అప్పటికి 5 సంవత్సరాలుగా నిరంతరాయంగా సంబంధిత ప్రాంతంలో ఏదయినా వృత్తి లేక చిన్న వ్యాపారం ద్వారా జీవనం పొందుతూ ఉండి ఇప్పుడు భూసేకరణవల్ల ఆ జీవనాధారాన్ని కోల్పోయినవారు, తమ వృత్తినుండి లేక వ్యాపారం నుండి పూర్తిగాగానీ చెప్పుకోదగ్గ మోతాదులో గానీ దూరం అయినవారు వస్తారు. 'అప్పటికి 5 సంవత్సరాలుగా నిరంతరాయంగా ఆ ప్రాంతంలో ఏదయినా వృత్తి చేసుకుంటూ ఉండాలి' అన్న నియమం కఠినమైనదే. కేవలం చుట్టపుచూపుగా వచ్చి తాత్కాలికంగా సంబంధిత ప్రాంతంలో ఉంటున్నవారిని మినహాయించడమే ఉద్దేశ్యమయితే 5 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా అక్కడే జీవనం పొందుతూ ఉండాలి అన్న నియమం పెట్టడం భావ్యమా? వివిధ వృత్తుల వారిని బాధితులుగా గుర్తించడానికి పెట్టిన నియమం ఇది కాగా, వ్యవసాయ కూలీల విషయంలో అప్పటికి 5 సంవత్సరాలుగా వారు ప్రాధమికంగా సంబంధిత ప్రాంత నివాసులయి ఉండాలి, భూసేకరణ నాటికి వ్యవసాయ కూలీలుగా జీవనం పొందుతూ ఉండాలి, భూసేకరణవల్ల జీవనాధారాన్ని కోల్పోయి ఉండాలి అని నియమం పెట్టారు. అటువంటి వారంతా ప్రాజెక్టు బాధితుల నిర్వచనంలోకి వస్తారు. కూలి దొరకక తాత్కాలికంగా వలసపోయేవారిని కూడా లెక్కలోకి తీసుకునే ఉద్దేశ్యంతో 5 సంవత్సరాలు నిరంతరాయంగా సంబంధిత ప్రాంతంలో కూలి చేసుకుంటూ ఉండాలి అనే బదులు 5 సంవత్సరాలు ప్రాధమికంగా ఆ ప్రాంత నివాసి అయిఉండి చివరి ఘడియ దాకా వ్యవసాయకూలి నుండి జీవనం పొందుతూ ఉండాలి అన్నారు. భూసేకరణ ప్రకటన వెలువడే నాటికి తమ ఊరిలో పని దొరకక నాట్లకోసమో, కోతల కోసమో వేరే ప్రాంతానికి తాత్కాలికంగా వలసపోయిన వారు కూడా ఈ నిర్వచనంలోకి వస్తారు. మరి ఇతర చిన్న వృత్తుల వారికి కూడా ఈ వెసులుబాటు ఎందుకియ్యలేదో! వలసలు తప్పనిసరయిన ప్రాంతాలలో కేవలం వ్యవసాయ కూలీలేకాదు, చాకలి వంటి కుల వృత్తుల మీద ఆధారపడి బతికేవారు, చిన్న దుకాణాలు పెట్టుకొని బతికేవారు కూడ తాత్కాలికంగా వలసపోయి మళ్లీ వర్షాలు పడినాక వెనక్కి వస్తుంటారు. అటువంటి వారికి 5 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా సంబంధిత

> **ఈ చట్టం పునరావాసం ఇచ్చేది కేవలం భౌతికంగా విస్థాపనకు గురయ్యేవారికే కాదు. అంటే ఇళ్లు ఖాళీచేసి వీధిన పడిన వారికి మాత్రమే కాదు. ప్రాజెక్టు బాధితులందరికీ ఇస్తుంది. అంటే ఇల్లు ఖాళీ చేయకపోయినా జీవనం కోల్పోయే వారందరికీ ఇస్తుంది. నిర్వాసిత కుటుంబాల సంఖ్య 400 కంటే ఎక్కువ ఉన్నా తక్కువ ఉన్నా బాధితుల సంఖ్య ఎంతయినా ఉండగలదు. అటువంటప్పుడు నిర్వాసితుల సంఖ్యను బట్టి వర్గీకరించటంలో అర్థం ఏమిటి?**



ప్రాంతంలోనే వృత్తి చేసుకుంటూ ఉండాలి అన్న నియమం ప్రతిబంధకం కావచ్చు. 2006 నాటి జాతీయ పునరావాస విధానంలో ఈ వివక్ష లేదు. ఎవరైనా సరే, 3 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో సాధారణంగా జీవిస్తున్నవారయితే చాలు.

ఈ బాధితులకు లభించే పునరావాసమెటువంటిది? భూసేకరణ ప్రకటనతో బాటే ప్రభుత్వం పునరావాస ప్రక్రియ నిమిత్తం ఒక అడ్మినిస్ట్రేటర్‌ను నియమిస్తుంది. ఆ అధికారి మొదటి కర్తవ్యం వీలయినంత తక్కువమందిని నిర్వాసితులను చేసే ప్రత్యామ్నాయం కోసం అన్వేషించడం. ఆ అధికారి సూచించే ప్రత్యామ్నాయాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా ఆమోదించాలా అన్న ప్రశ్నకు చట్టంలో జవాబు లేదు. బహుశా అది కేవలం ఒక సలహా లేక సూచనే కావచ్చు. తరువాతి ప్రక్రియ 400 కంటే ఎక్కువ కుటుంబాలు (కొండ ప్రాంతాలలో, ఏజెన్సీ ప్రాంతాలలో 200 కంటే ఎక్కువ కుటుంబాలు) నిర్వాసితులయ్యే ప్రాజెక్టులకు మాత్రమే వర్తిస్తుంది.

## సామాజిక ప్రభావంపై అంచనా

మొదటిగా ప్రాజెక్టుకు ఉండగల సామాజిక ప్రభావాన్ని అంచనా వేసే నిపుణుల బృందం రంగంలోకి దిగుతుంది. ఈ బృందంలో ఇద్దరు సామాజిక శాస్త్రవేత్తలుంటారు, ఏ సంస్థ అవసరాల కోసమైతే భూసేకరణ జరుగుతున్నదో ఆ సంస్థ ప్రతినిధి ఒకరుంటారు, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఉంటారు. వీరు ఆ ప్రాజెక్టు ప్రాకృతిక వనరులపైన, సామాజిక వసతులపైన ఉండగల ప్రభావాన్ని అంచనా వేస్తారు. వారి నివేదిక పర్యావరణ ప్రభావ నివేదికను పోలినదని చట్టం సూచనప్రాయంగా అంటుంది. ప్రాజెక్టు రాబోయే ప్రాంతంలోని రోడ్లు, స్కూళ్లు, ఆస్పత్రులు, వివిధ పాలనా సంస్థలు, వసతులపైన ఆ ప్రాజెక్టు ప్రభావాన్ని తెలియజేసే ఈ నివేదిక పర్యావరణ నివేదికతోబాటు ప్రజలకు అందుబాట్లో ఉంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతారు. ఆ తరువాత పర్యావరణ అనుమతిలాగే సామాజిక అనుమతి కూడా ప్రాజెక్టు పొందాలి. ప్రభుత్వం షరతులతో కూడిన అనుమతి ఇయ్యవచ్చు.

## పునరావాస ప్రక్రియ

తరువాత పునరావాస ప్రక్రియ మొదలవుతుంది. పైన పేర్కొన్న అడ్మినిస్ట్రేటర్‌ను అధ్యక్షునిగా గల పునరావాస కమిటీ ఒకటి ఏర్పడుతుంది. అందులో ప్రభుత్వ అధికారులు, బాధితుల ప్రతినిధి ఒకరు, స్థానిక ఎంఎల్ఎ, ఎంపి, ఊరి సర్పంచ్, ఏ సంస్థ కోసమయితే భూసేకరణ జరుగుతున్నదో ఆ సంస్థ ప్రతినిధి ఒకరు ఉంటారు. (ఈ చట్టంలో కమిటీలు చాలా ప్రతిపాదించబడ్డాయి. ఇప్పటికి చెప్పినవికాక, రాష్ట్ర ప్రభుత్వం స్థాయిలో ఒక పర్యవేక్షక కమిటీ, కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలోని సకల పునరావాస ప్రక్రియల పర్యవేక్షణ కోసం ఒక జాతీయ పునరావాస కమిటీ ఉంటాయి).

మొదట ప్రభుత్వం ఆ ప్రాజెక్టువల్ల దుష్ప్రభావానికి గురయ్యే 'బాధిత ప్రాంతాన్ని' ప్రకటిస్తుంది. ఆపైన అడ్మినిస్ట్రేటర్ ఆ ప్రాంతంలో వివరమైన సామాజిక ఆర్థిక సర్వే జరుపుతాడు. వివిధ వృత్తులలో ఉన్నవారి వివరాలు సేకరించి ప్రకటిస్తాడు. రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తులవారు, చిన్న వ్యాపారులు, సేవారంగానికి చెందినవారు మొదలయిన సకల వర్గాల బాధితుల వివరాలు ఈ ప్రకటనలో ఉంటాయి. ఈ ప్రకటనపైన బాధిత ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు. ఫలాన లెక్క తప్పని, ఫలాన సమాచారం విస్మరించారని అడ్మినిస్ట్రేటర్‌కు చెప్పవచ్చు. ఆ అధికారి ఈ అభ్యంతరాలు లెక్కలోకి తీసుకొని

సర్వేని పూర్తి చేయాలి. అడ్మినిస్ట్రేటర్ ఆపైన బాధితులను సంప్రదించి ఒక పునరావాస పథకాన్ని రూపొందిస్తాడు. దానిని కూడ ప్రకటిస్తాడు. దానిని బాధిత ప్రాంత గ్రామ సభలలో చర్చిస్తారు. తరువాత దానిని ప్రభుత్వానికి సమర్పిచడం జరుగుతుంది. ఆ పునరావాస పథకంలో తప్పనిసరిగా ఉండవలసిన అంశాలను చట్టమే చెప్తుంది. ఈ పద్ధతి యావత్తు 'పెద్ద ప్రాజెక్టులకు' మాత్రమే వర్తిస్తుందని చెప్పాము. 'చిన్న ప్రాజెక్టులకు' కూడ పునరావాసం ఉంటుంది గానీ ఈ పద్ధతేమీ ఉండదు. అడ్మినిస్ట్రేటర్ తనపాటికి తాను చట్టంలోని నియమాలను అనుసరించి పునరావాస పథకాన్ని నిర్ణయిస్తాడు.

## పూర్తిస్థాయిలో గ్రామం నెలకొల్పాలి

బాధితులందరికీ ఒకేచోట లేదా గుంపులు గుంపులుగా రెండు మూడు చోట్ల పునరావాసం కల్పిస్తారు. చిన్న ప్రాజెక్టయితే అందరికీ ఒకేచోట కల్పిస్తారు. అదొక పూర్తిస్థాయి గ్రామం రూపంలో ఉండాలి. 'పెద్దప్రాజెక్టు అయితే వసతులన్నీ 'సమగ్రంగా' కల్పించబడతాయి. చిన్నదయితే 'మౌలిక' వసతులు మాత్రమే కల్పించబడతాయి. అయితే ఇళ్లు ప్రభుత్వం కట్టియ్యదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే (అందులోనూ అయిదు సంవత్సరాలు నిరంతరాయంగా సంబంధిత ప్రాంతంలో ఉండిన వారికే) ప్రభుత్వం ఇల్లు కట్టిస్తుంది. తక్కిన వారికి ప్లాటు మాత్రమే దక్కుతుంది. ఇది నిజానికి అన్యాయం, ఎందుకంటే ఒకవేళ వాళ్లు ఇళ్లు కోల్పోయి వలస వచ్చిన వారయినా ఆ యింటికి వచ్చే నష్టపరిహారం కొత్తచోట ఇల్లు కట్టుకోవడానికి ఏమాత్రం సరిపోదు. ఇల్లు కోల్పోకపోయినా అక్కడే ఉండి బతకడం సాధ్యంకాక (నిర్వాసితులుగా కాక బాధితులుగా) పునరావాస గ్రామానికి వచ్చిన వారు ఏం పెట్టి కొత్తచోట ఇల్లు కట్టుకోవాలి? పాత యింటి పెంకులూ, వాసాలూ, ఇటుకలూ ఒక్కొక్కటిగా తొలగించి తీసుకొచ్చి ఇక్కడ కట్టుకోవాలా?

ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి పునరావాస గ్రామం దగ్గర భూమి అందుబాట్లో ఉంటే ఎంత కోల్పోతే అంత భూమి (తరిపొలం $2^1/_2$ ఎకరాలు, మెట్ట అయితే 5 ఎకరాలు మించకుండ) ఇస్తారు. ఇది నష్టపరిహారానికి అదనంగానా లేక నష్టపరిహారానికి బదులా అనేది చట్టంలో స్పష్టంగా లేదు. భూమి సేకరించింది సాగునీటి ప్రాజెక్టు కోసమైతే, బాధితులందరికీ కొత్త ప్రాజెక్టు కమాండ్ ఏరియాలో ప్రభుత్వ భూమి కేటాయింపులో మొదటి హక్కు ఉంటుంది. అంటే అప్పటిదాకా నిరుపయోగంగా ఉండి కొత్త ప్రాజెక్టువల్ల సాగుయోగ్యం అయిన భూమిని కేటాయించినప్పుడు వీరికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. ఈ కేటాయింపు పునరావాస ప్రదేశానికి దగ్గరగా ఉండదు కాబట్టి దీనిని స్వీకరించేవారు పునరావాసాన్ని వదులుకోవలసి రావచ్చు. ఈ విధంగా భూమి పొందిన వారికి దానిని బాగు చేసుకోవడానికి 10 వేల రూపాయలు (ఆ భూమి కమాండ్ ఏరియాలోనిదయితే) లేక 15 వేల రూపాయలు (అది పునరావాస కేంద్రానికి సమీపంలో ఉన్న బంజరు భూమయితే) ఇస్తారు. పశువుల కొట్టం ఉన్న రైతుకు పునరావాస కేంద్రంలో పశువుల కొట్టం వేసుకోవడానికి 15 వేల రూపాయలు, చిన్న వ్యాపారం లేక చేతివృత్తి చేసుకొనేవారికి పునరావాసంలో భాగంగా 25 వేల రూపాయలు ఇస్తారు. ఏ సంస్థ కోసమయితే భూసేకరణ జరుగుతున్నదో ఆ సంస్థలోని ఉద్యోగాలలో (అర్హతలను బట్టి అని వేరే చెప్పనవసరం లేదు) భూసేకరణ బాధితులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. భూమిగానీ ఉద్యోగం గానీ దక్కని బాధితులకు 750 రోజుల వ్యవసాయకూలీ కనీస వేతనం లభిస్తుంది. నిజానికి భరోసా ఉండేది ఇదొక్కటే. మిగిలినవన్నీ లభ్యతనుబట్టి, యోగ్యతనుబట్టి, అర్హతనుబట్టి దక్కుతాయి



ఈ నష్టపరిహారం పైకం రూపంలోనూ ఇయ్యవచ్చు లేదా భూసేకరణ ఏ సంస్థ కోసం చేస్తున్నారో ఆ సంస్థ పెట్టుబడులలో వాటా రూపంలోనూ ఇయ్యవచ్చు. అయితే షేర్ల రూపంలో ఇచ్చేది నష్టపరిహారంలో నాలుగవ వంతుకు తక్కువ ఉండడానికి వీలులేదు. సగం కంటే ఎక్కువ ఉండడానికీ వీలులేదు. కానీ నగదు రూపంలో తీసుకునేదీ, షేర్ల రూపంలో తీసుకునేదీ బాధితుల ఇష్టం. వారికి బలవంతంగా షేర్లు అంటగట్టడానికి వీలులేదు.

**ప్రాజెక్టులవల్ల నిర్వాసితులవుతున్న వారు తమ కోరిక మేరకు వెళ్లిపోవడం లేదు. దేశ అభ్యుదయం కోసం వాళ్లను వెళ్లగొడుతున్నామని పాలకులు అంటున్నారు. అటువంటప్పుడు వారిని ఆదుకోవడం దేశం బాధ్యత కాదా? వారి ఊళ్లనుండి, వారి జీవనం నుండి వారిని వెళ్లగొట్టక ముందు వారు ఏ విధంగా బతికారో మళ్లీ కనీసం అదే బతుకు పొందే హక్కు వారికి లేదా?**

## మళ్లీ అదే స్థాయిలో బతకగలగాలి

పార్లమెంటులో పెండింగ్‌లో వున్న పునరావాస బిల్లులోని విషయాలు ఇవి. ఏమీ లేకుండటం కంటే ఎంతో కొంత ఉండడం మేలనుకుంటే వేరే సంగతిగానీ సూత్రబద్ధంగా ఆలోచించేటట్టయితే ఎంతోకొంత ఇస్తున్నారులెమ్మని సంతృప్తి చెందనవసరం లేదు. ప్రాజెక్టులవల్ల నిర్వాసితులవుతున్న వారు తమ కోరిక మేరకు వెళ్లిపోవడం లేదు. దేశ అభ్యుదయం కోసం వాళ్లను వెళ్లగొడుతున్నామని పాలకులు అంటున్నారు. అటువంటప్పుడు వారిని ఆదుకోవడం దేశం బాధ్యత కాదా? వారి ఊళ్లనుండి, వారి జీవనం నుండి వారిని వెళ్లగొట్టక ముందు వారు ఏ విధంగా బతికారో మళ్లీ కనీసం అదే బతుకు పొందే హక్కు వారికి లేదా? అది ఏ విధంగా వారికిస్తారన్నది ఆయా పరిస్థితులను బట్టి ఉంటుంది. కానీ సంకల్పం ఉంటే అది సాధ్యమే. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న చట్టంలో ఆ స్పృహ లేదు. ఒక ఇంటి ప్లాటు, 750 దినాల కనీస వేతనం మాత్రమే వారందరికీ ఈ చట్టం భరోసా ఇచ్చే హక్కులు. మిగిలినవి హామీలు మాత్రమే. నగదు రూపంలో ఉన్న నష్టపరిహారం నాలుగు రోజుల తర్వాత వారి చేతులలో మిగలదన్నది అందరూ ఎరిగిన జీవిత సత్యం. ఆ తరువాత పని దొరికిన రోజు కూలిచేసుకొని దొరకని రోజు పస్తు ఉండడమేనా వారి గతి?

ముగించే ముందు ఈ బిల్లులోని ఒక సంతోషదాయకమైన విషయాన్ని ప్రస్తావించాలి. ఇది కేవలం ప్రాజెక్టుల భూసేకరణ వల్ల నిర్వాసితులయిన వారికే కాదు. 'ఏ యితర కారణాలవల్లనయినా నిర్వాసితులయిన వారికి' కూడ వర్తిస్తుంది. సామాజిక ఘర్షణలవల్ల ఊరూ వాడా విడిచిపెట్టిపోయేవారు చాలామందే దేశంలో ఉన్నారు. వారికిప్పుడు ఏ రక్షణా లేదు. దీనికి ప్రముఖ ఉదాహరణ ఛత్తీస్‌గఢ్ నుండి సల్వాజుడుం కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయి వచ్చిన గుత్తికోయలు. వారికి కూడ ఈ బిల్లు చట్టమయితే వర్తిస్తుంది.

◆◆◆

నాగార్జునసాగర్ నిర్మాణం

# తొలి విస్థాపన గాథ...

యస్. జీవన్ కుమార్ ✡

స్వాతంత్రానికి పూర్వం 300గా ఉన్న నీటి ప్రాజెక్టులు ఇప్పుడు దాదాపు 4,300కు పెరిగాయి. ఇందులో 500 పైగా పెద్ద డ్యాములే. పెద్ద డ్యాముల లాభ నష్టాల గురించి ప్రపంచవ్యాప్తంగా పెద్ద చర్చే జరుగుతోంది. వీటివల్ల ప్రయోజనాలకంటే నష్టాలే ఎక్కువని, డ్యాముపై వెచ్చించిన డబ్బుకూ, ఆ తర్వాత జరిగిన ధాన్య ఉత్పత్తికీ, సాగు అయిన భూమి విలువకీ, ఇతరత్రా ఏ లాభాలకు కూడా పొంతన లేదనే వాదన బలంగా విన్పిస్తున్నది. ఖర్చు, రాబడి, సాగు అయ్యే భూమి విస్తీర్ణతకు సంబంధించిన అంశాలు ఎట్లా ఉన్నా ప్రాజెక్టులవల్ల నిర్వాసితులయ్యే ప్రజలకు జరిగే నష్టం అంచనా వేయడం సాధ్యం కాని విషయం. నిర్వాసితులౌతున్న ప్రజలు ఎక్కువశాతం దళితులు, ఆదివాసులు మరియు బలహీన వర్గాలకు చెందిన వారనేది నిర్వివాదాంశం. ఎనిమిది పంచవర్ష ప్రణాళికల కాలంలో నిర్మించిన ప్రాజెక్టులు ఎంతమందిని నిర్వాసితుల్ని చేశాయనే విషయం ప్రభుత్వం ఏర్పరిచిన ఒక వర్కింగ్ గ్రూపు అధ్యయనం చేసింది. ఈ అధ్యయనం కోసం వారు 110 ప్రాజెక్టులను ఎంచుకున్నారు. వాటి నిర్మాణంవల్ల మొత్తం 16 లక్షల 94 వేల మంది నిర్వాసితులు కాగా అందులో 8 లక్షల 14 వేల మంది ఆదివాసులేనని ఆ అధ్యయనం పేర్కొంది. తక్కిన వాళ్ళలో ఎక్కువమంది దళితులు, బలహీన వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులే అని తేల్చి చెప్పింది.

పెద్దఎత్తున విస్థాపన జరిగినపుడు మనుషులు భౌతికంగా తాము ఉండే ప్రదేశాలనుంచి దూరంగా వెళ్లిపోవాల్సి రావడమే కాకుండా, మానసికంగా, ఆరోగ్యపరంగా, సామాజిక పరంగా ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజలకు వాళ్ళుండే గ్రామంలో, ప్రదేశంలో బలమైన సాంస్కృతిక, మతపరమైన బాంధవ్యాలు ఉంటాయి. ఇవి చెదరిపోవడం ఒక భయంకరమైన అనుభవంగా మిగిలిపోతుంది. తమ పూర్వీకులు నివసించిన ఇల్లు, వాతావరణం, తమ పూర్వీకులను, కుటుంబీకులను ఖననం చేసిన ప్రదేశాలు, వాళ్ళ కోసం నిర్మించుకున్న జ్ఞాపికలు, నిర్మాణాలు చెదిరిపోతాయి. ఇవన్నీ కలిసి మనుషుల జ్ఞాపకాల దొంతరల్లో కల్లోలం సృష్టిస్తాయి. ఈ అంశాల లోటు ఎంతగొప్ప నష్టపరిహారమైనా పూడ్చలేదు. భూమిలేని వాళ్ళు గ్రామంలో రకరకాల జీవనం గడుపుతుంటారు. వాళ్ళు ఏమీ లేని వాళ్ళైనా సరే విస్థాపన వల్ల సర్వస్వం కోల్పోయినట్టుగా భావిస్తారు.

✡ మానవహక్కుల కార్యకర్త, హైదరాబాద్‌లో ఇంగ్లీష్ లెక్చరర్





విస్థాపనను కూలంకషంగా అర్థం చేసుకోవడానికి నల్గొండ జిల్లాలో కృష్ణానదిపైన నిర్మించిన నాగార్జునసాగర్ డ్యాం వల్ల అక్కడి ప్రజల జీవితాలలో జరిగిన పెను మార్పులేమిటో తెలుసుకుందాం.

నాగార్జున సాగర్ డ్యాంకు 1955వ సంవత్సరంలో శంకుస్థాపన చేసి, 1957లో నిర్మాణం మొదలుపెట్టి, 1969 వ సంవత్సరంలో పూర్తిచేశారు. అంతకు రెండు సంవత్సరాల క్రితమే అంటే 1967లో మొదటిసారిగా కెనాల్స్ లోకి నీరు వదలడం జరిగింది. 594 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ డ్యాం 4756 అడుగుల పొడవు రాతికట్టడంతోను, 8400 అడుగుల పొడవు మట్టి నిర్మాణంతోను ఉంది. దీనికి 295 కిలోమీటర్ల పొడవైన జవహర్‌లాల్ ఎడమ కాలువ, 202 కిలోమీటర్ల పొడవైన లాల్‌బహదూర్ కుడికాలువ నిర్మాణం జరిగింది. ఈ రిజర్వాయర్ నిర్మాణంవల్ల నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండ తాలుకాలలో, మహబూబ్‌నగర్‌లోని అచ్చంపేట తాలూకాలో, గుంటూరు జిల్లాలోని పల్నాడు తాలూకాలో మొత్తం 110 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ముంపుకు గురైంది. 29,506 ఎకరాల వ్యవసాయ భూమి, 1078 ఎకరాల ప్రభుత్వ భూమి ఈ ముంపులో ఉంది. కొంత అటవీ భూమి కూడా ముంపుకు గురైంది.

ప్రభుత్వం 1960లో విడుదల చేసిన ఒక మెమోలో విస్థాపనకు గురయ్యే దాదాపు 1500 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉంటుందని పేర్కొంది. తర్వాత 1989లో మళ్ళీ ప్రభుత్వమే ప్రచురించిన స్టేటస్ నివేదికలో 4,380 కుటుంబాలు విస్థాపనకు గురైనాయని

తెలిపింది. ఒక అనధికార అధ్యయనం ప్రకారం 5,098 కుటుంబాలు అంటే దాదాపు 28,000 మంది నిర్వాసితులయినట్టు వెల్లడైంది. 1955వ సంవత్సరంలో శంకుస్థాపన జరిగి పని మొదలైనా, తర్వాత అయిదు సంవత్సరాల వరకు ఎన్ని కుటుంబాలు విస్థాపనకు గురైనాయన్న అంశం ప్రభుత్వ శాఖలు ఖచ్చితంగా చెప్పలేకపోయాయి. అంటే నిర్వాసితులయ్యే ప్రజల గురించి ఆలోచించడం ప్రభుత్వ దృష్టిలో ముఖ్యమైన విషయంగా భావింపబడలేదు. ఈ దశ నుండే ఆ ప్రజల అభద్రత స్థితి మొదలవుతుంది.

ప్రభుత్వ రికార్డుల ప్రకారం 42,797 ఎకరాల భూమి పునరావాసం కోసం కేటాయించబడింది. ఇందులో 41 వేల ఎకరాలను అటవీశాఖే ఇచ్చింది. పునరావాసం కోసం 24 ముఖ్యమైన ప్రదేశాలను, వాటికి అనుబంధంగా మరో 11 స్థలాలను ప్రభుత్వం నిర్ణయించింది. 24 పునరావాస కేంద్రాలలో 6 గుంటూరులోని మాచర్ల తాలూకాలో, 6 నల్లగొండ జిల్లాలోని దేవరకొండలో, 11 మిర్యాలగూడలో, ఒకటి భువనగిరిలో ఏర్పాటు చేశారు. తక్కిన 11 చిన్న కేంద్రాలు ఎక్కడ ఏర్పరచారన్న విషయం రెవెన్యూ అధికార్లు సరిగా ప్రకటించకపోవడంతో నిర్వాసితులు చాలా ఇబ్బందిపడ్డారు. అయితే ఆచరణలో ప్రభుత్వం నిర్ణయించిన ప్రధాన కేంద్రాలలో పునరావాసం కల్పించడం ఇబ్బందిగా మారి వాటికి దగ్గరలోఉన్న చిన్న గ్రామాలలో, హ్యామ్లెట్లలో వారికి ఆశ్రయం కల్పించాల్సివచ్చింది. ఎటు పోతున్నదీ, ఏ ఊరికి దగ్గరలో ఉండబోయేదీ, కుటుంబాలు బంధువులు అందరూ ఒకే చోటకు వెళ్లేదీ లేనిదీ స్పష్టత లేక ప్రజలు చాలా ఆందోళన చెందారు.

డ్యాం నిర్మాణం గురించి కూడా ఎవరూ వారికి సరైన సమాచారం ఇవ్వలేదు. ప్రధానమంత్రి నెహ్రూ శంకుస్థాపన చేస్తూ 370 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని, దాదాపు 20 గ్రామాలు ముంపుకు గురవుతాయని, భవిష్యత్తులో ప్రజలకు చాలా లాభాలు ఒనగూడుతాయని అన్నప్పుడు వాళ్ళకేమీ విషయం అర్థం కాలేదు. ఊర్లే లేకుంటే లాభం ఎట్లా జరుగుతుందో వాళ్ళకు అర్థం కాలేదు. సామాజిక, ఆర్థిక సర్వే జరిపారు కాని, భూసేకరణ చట్టం ప్రకారం నోటీసులు ఇచ్చారో లేదో ఎవరికీ తెలియదు. వాళ్ళెవరూ పత్రికలు చదివే ప్రజలు కాదు. పంచాయితీ ఆఫీసుల్లో అంటించడం కాని, టాంటాం వేసి ప్రజలకు చెప్పడంగాని జరగలేదు. తహసిల్దార్ వచ్చి భూమి, ఇండ్లు ఉన్న వాళ్లకు నోటీసులు ఇచ్చి, వేలిముద్ర వేయించుకొని, వాళ్ళు ఊరు ఖాళీ చేసి ఎటుపోవాలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వచ్చి చెపుతాడని చెప్పి వెళ్ళిపోయేవాడు. ప్రభుత్వాధికార్ల కంటే స్థానిక ఎమ్.ఎల్.ఎ, అతని అనుచరులే క్రమంగా ఏమి జరుగుతుందో, ఎక్కడకు వెళ్ళాలో తదితర సమాచారం అందించేవారు. ప్రజలకు ప్రభుత్వమే ప్రత్యామ్నాయ భూముల్ని చూపెడుతుందా లేక ప్రజలే వెళ్ళి వెతుక్కోవాలా అన్న విషయంలో స్పష్టత లేకపోవడంతో, నీళ్ళు వచ్చినప్పుడు చూద్దాంలే అని ప్రజలు ఊరకుండిపోయారు. గ్రామాలలో కొందరు పెద్దలు మాత్రం భూములు వెదుక్కొనే ప్రయత్నం చేశారు.

1964లో రేకురామతండ లోకి నీళ్ళు రావడం ప్రారంభం కాగానే ఆ గ్రామస్తులంతా దగ్గరలో ఉన్న మొట్టెగుట్టకు వెళ్ళి స్థిరపడ్డారు. రెండేళ్ళ తర్వాత స్థానిక ఎమ్మెల్యే ఆ గ్రామంనుండి వాళ్లను



కొత్తపుల్లారెడ్డిపురంకు తీసుకువచ్చాడు. అప్పుడు కలెక్టర్ వచ్చి భూములు కోల్పోయిన వాళ్ళందరికీ భూములు చూపెడ్తామని, ఇళ్ళు ఉన్నా లేకున్నా ఇండ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చాడు. అలాగే రాజగట్టు గ్రామంలోకి నీరు రావడం ప్రారంభం కాగానే ప్రత్యేక కలెక్టర్ వచ్చి గ్రామం నుండి ఇద్దరు పెద్దలను తీసుకొనివెళ్ళి రెండు మూడు ప్రదేశాలు చూపించాడు. తమకు సరిపోయేంత భూమి లేకున్నా ఒక ప్రదేశాన్ని ఎంచుకొని అది వాళ్ళ ఊరికి దగ్గరలో ఉంది కాబట్టి ఆ ప్రదేశంలో నివాసం ఏర్పరచుకోవడానికి వాళ్ళు ఒప్పుకున్నారు. కాని నీళ్ళు రావడం ప్రారంభం అయినా ప్రజలు రామగట్టు గ్రామాన్ని వదలిపెట్టడానికి ఒప్పుకోకపోవడంతో కలెక్టర్ సి.ఆర్.పి.ఎఫ్‌ను గ్రామానికి పంపాడు. ఆ తర్వాతే ప్రజలు గ్రామం ఖాళీ చేసారు. కంబాలపల్లి గ్రామస్తులు కూడా ఖాళీ చేయడానికి నిరాకరించారు. ప్రభుత్వం తక్కువ నష్టపరిహారం ఇస్తానంటుందని, వెళ్లే ప్రాంతంలో సౌకర్యాలు ఉంటాయో లేదో అని సందేహపడ్డారు. సైన్యాన్ని పంపి బలవంతంగా కంబాలపల్లి గ్రామాన్ని ఖాళీ చేయించి ములకచెర్లకు తీసుకువచ్చారు. ఉలసపాలెం, నర్సాపూర్, జలపాడు, భద్రాచలం, వట్టనరకపల్లి, ములకచెర్ల పునరావాస కేంద్రాలలో స్థిరపడిన వారంతా వాళ్ళు అనుకున్న ప్రదేశాలకు కాకుండా బలవంతంగా అక్కడికి తీసుకురాబడ్డవారు.

భూములు కోల్పోయిన వాళ్ళకు డబ్బు రూపంలో నష్టపరిహారం అందజేస్తామని, ఇంటిస్థలం ఉచితంగా ఇస్తామని ప్రకటన చేసారు కాని నష్టపరిహారం న్యాయమైన పద్ధతిలో ఇవ్వలేదు. ప్రాజెక్టు శంకుస్థాపన జరిగిన 1955 సంవత్సరం రిజిస్ట్రేషను రేటు ప్రకారం విలువ కట్టారు. భూసేకరణ 1957లో మొదలై 1964 వరకు కొనసాగింది. ప్రభుత్వం ప్రచురించిన స్టేటస్ నివేదిక విస్థాపనకు గురైన కుటుంబాలలో 268 కుటుంబాలకే భూమి ఉందని, తక్కిన 4,562 కుటుంబాలకు ఎటువంటి భూమిగాని, ఏ భూమిపైన హక్కులు గాని లేవని పేర్కొంది. నిజానికి ఆ 268 కుటుంబాలు సుమారు వంద ఎకరాలు ఉన్న పెద్దరైతులు, భూస్వాములు. 20 ఎకరాలకు లోబడి ఉన్న రైతులు చాలామందే ఉన్నా ప్రభుత్వం దగ్గర వాళ్ళకు సంబంధించిన పూర్తి రికార్డులు లేవు. 1959లో ప్రభుత్వం నిర్వాసితులకు ఇవ్వబోయే భూమి గురించి ఒక ఆదేశం జారీచేసింది. దాని ప్రకారం 20 ఎకరాలు భూమి కోల్పోయిన రైతుకు 5 ఎకరాల మెట్టభూమి ఇస్తామని, 20 ఎకరాలపైన కోల్పోయిన వారికి తాము ఉచితంగా ఇచ్చే 5 ఎకరాల భూమి కాకుండా ఇంకో 5 ఎకరాల వరకు వారు కొనుక్కోదలిస్తే అందుకు 1955 మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లిస్తానని ప్రభుత్వం పేర్కొంది. తర్వాత ఆ ఆదేశాలలో మార్పులు చేసి 5 నుండి 10 ఎకరాలు భూమి కోల్పోయిన రైతులు కూడా $2^1/_2$ ఎకరాల మెట్టభూమి కొనుక్కోవచ్చని తెలిపింది. కాని చాలామంది రైతులు భూమి కొనుక్కోలేకపోయారు. వాళ్ళు స్థిరపడ్డ ప్రాంతంలో కొనుక్కోవడానికి భూమి లేకపోవడం ఒక కారణం కాగా, 1955 రేటు ప్రకారం భూమి అమ్మడానికి ఎవరూ ముందుకు రాలేదు.

లభించిన రికార్డుల ప్రకారం రైతులకు ఎకరాకు 100 రూపాయలనుండి 150 రూపాయలవరకు మాత్రమే నష్టపరిహారం దక్కింది. కోల్పోయిన భూమిలో ఉన్న చెట్లు, బావులు, తోటలకు సంబంధించిన నష్టం లెక్కింపబడలేదు. ఆ రోజుల్లో ప్రజా సంఘాలు గాని ప్రభుత్వేతర

సంస్థలు గాని వాళ్ల కోసం పనిచేసిన ఆధారాలు లేవు. ఇల్లు నిర్మించుకోవడం కోసం పది సెంట్ల భూమిని ఇవ్వడం జరిగింది. కోల్పోయిన కచ్చా ఇల్లుకు 300 రూపాయలు, పక్కా ఇల్లుకు 1000 రూపాయల చొప్పున నష్టపరిహారం ఇచ్చారు. దీనికి తోడుగా ఇల్లు నిర్మించుకోవడానికి ప్రతి కుటుంబానికి 350 రూపాయలు ఇవ్వడం జరిగింది.

కొత్తగా బస ఏర్పరచుకున్న గ్రామాలలో మౌలిక సదుపాయాలు అరకొరగా మాత్రమే ఏర్పాటు చేసారు. త్రాగునీటికోసం బావులు, పంపులు ఏర్పరచారు. కొత్తగా వేసిన రోడ్లు ఒక సంవత్సరంలోనే శిధిలం కావడంతో ఇతర గ్రామాలకు వెళ్ళిరావడం చాలా ఇబ్బందిగా తయారైంది. గాంధీనగర్, రాజగుట్ట, శాంతినగర్, కొత్తనందికొండ గ్రామాలకు రవాణా సౌకర్యం పూర్తిగా లేకుండె. దగ్గరలోని పెద్ద గ్రామాలకు వెళ్ళడానికి దాదాపు 6 కిలోమీటర్లు నడవవలసి వచ్చింది. కంబాలపల్లి, ఉస్మాన్‌కుంట తండ, తెలిదేవరపల్లి గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించారు కాని వర్షాకాలం బస్సులు నడిచేవి కావు. అన్నిచోట్ల ప్రాథమిక పాఠశాలలు స్థాపించారు కాని రవాణా సౌకర్యం లేక, పైగా కొత్త గ్రామాలలో సౌకర్యాలు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఉద్యోగాల్లో చేరలేదు. చేరినవారు కూడా సరిగా పాఠశాలకు వచ్చేవారు కారు. ఈ కొత్త గ్రామాల ప్రజలకు బ్యాంకులు ఋణాలు ఇవ్వడానికి ముందుకు రాలేదు. రవాణా సౌకర్యాలు సరిగ్గా లేనందువల్ల ప్రభుత్వ అధికార్లు గ్రామాలకు వెళ్లక, ప్రభుత్వ సామాజిక పథకాలు కూడా వీళ్ళకు చేరడానికి చాలా సంవత్సరాలు పట్టింది.

మొత్తంగా చూస్తే ప్రజలజీవితాలన్నీ అతలాకుతలం అయిపోయాయి. వాళ్ళు అభివృద్ధి చేసుకోవడానికి ప్రయత్నించిన వ్యవసాయం కూడా చాలా ఇబ్బందిగా తయారైంది. కొత్త గ్రామాలు రావడంవల్ల తమ గ్రామం దగ్గర ఉన్న కంచెలు పోయి పశువుల మేతకు ఇబ్బందిగా తయారైందని, ఇదివరకే ఉన్న గ్రామాలవాళ్లు వీళ్ళను చాలాకాలం శత్రువులుగా చూసారు. వీళ్ళ వ్యవసాయ భూములు దూరంగా ఉండటంతో, ఇతరులు వీరి పంట పొలాల్లోకి పశువులను తోలి మేపించడం, పంటలను నాశనం చేయడం, దొంగిలించడం కొంతకాలం జరిగింది. చుట్టుపక్కల చెట్లు, చేమలు ఉండటం వల్ల ఒక్క వంట చెరకుకు మాత్రం ఏమీ ఇబ్బంది కలుగలేదు. ఈ గ్రామాలు సమగ్రమైన గ్రామాలుగా రూపుదిద్దుకోవడానికి దాదాపు 40 సంవత్సరాలు పట్టింది. ఎనిమిది సంవత్సరాల క్రితం చందంపేట మండలంలోని లంబాడి తండాలలో పిల్లలను అమ్ముకుంటున్నారని, ఈ వ్యాపారం చేసే ముఠా హైదరాబాద్‌లో ఉందని వార్తలు వచ్చాయి. ఇటువంటి సంఘటనలు ఈ గ్రామాల్లోనే జరిగాయి. ఎటువంటి దుస్థితిలో ఉండటంవల్ల ఇట్లా జరిగిందో మనం ఊహించుకోవచ్చు. నల్లగొండ జిల్లాలో యురేనియం వెలికితీయడానికి, శుద్ధి చేయడానికి ఎంచుకున్న ప్రాంతాలు కూడా ఈ పరిసరాలే. యురేనియం కోసం ఈ గ్రామాలను కొన్నింటిని మళ్ళీ విస్థాపనకు గురిచేసే ప్రమాదం పొంచి ఉంది.

('బిగ్‌డ్యామ్స్–డిస్‌ప్లేస్‌డ్ పీపుల్' పుస్తకంలోని వ్యాసం ఆధారంగా)

◆◆◆



## 'అభివృద్ధి'లో నిర్వాసితులకు

# భాగమైనా ఇవ్వండి పెన్షనైనా ఇవ్వండి

గౌరైపాటి నరేంద్రనాథ్

నిర్వాసిత సమస్య చాలా విస్తృతమై శోధించేకొద్దీ కొత్త కొత్త అంశాలు బయట పడుతూనే ఉంటాయి. పాతికేళ్ళ క్రితం ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి నాయకత్వాన లక్షన్నరపైబడిన శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల గోడుపై అధ్యయనం చేసి 'అభివృద్ధి చక్రాల కింద శ్రీశైలం నిర్వాసితులు' అనే నివేదిక ప్రచురించాం. కాని ఎక్కడో మారుమూలన ఉండే శ్రీశైలం నిర్వాసితుల (మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలలో) గోడు ఎవరిక్కావాలి?

నష్టపరిహారంగా కాస్త డబ్బు ఇచ్చి వదిలించుకుంది ప్రభుత్వం. స్టాంపు డ్యూటీ తగ్గించుకునేందుకు తక్కువగా రాసే భూముల విలువను బట్టి మాగాణికొకసారి, మెట్టభూమికొకసారి, ఇండ్లకొకసారి అందించిన నష్టపరిహారం అప్పులు తీర్చుకోవడానికి, పెళ్ళిళ్ళు, చావులకే ఖర్చు అయిపోయింది. చివరికి 1982 జూన్ మాసంలో ప్రాజెక్టు పూర్తి అయిందని, వర్షాలు వస్తున్నాయి కాబట్టి ముంపు వస్తుందని ప్రభుత్వం వారిని పోలీసుల సహాయంతో బలవంతంగా రాత్రికి రాత్రి గెంటించేసింది. ఇళ్ళని కూలగొట్టేయించింది. ఆ వర్షాలలో కొత్త ఇండ్ల జాగాలు వెతుక్కుంటూ ఇళ్ళు కట్టుకోవడం... ఆ బాధలన్నీ వర్ణనాతీతం. ఆ తరువాత వారంతా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కొందరు బ్రోకర్ లాయర్ల సహాయంతో కోర్టులను ఆశ్రయించి నష్టపరిహారం పెంచుకోగలిగారు కానీ దానిలో హెచ్చుభాగం మళ్లీ లాయర్లు, మధ్యవర్తులకే ఖర్చుపెట్టాల్సొచ్చింది. కాజేశారు. శ్రీశైలం నిర్వాసితులు నేటికీ ఆ బాధలనుండి కోలుకోలేదు.

ఇది ఒక్క శ్రీశైలం ప్రాజెక్టు గాథేగాదు. దేశంలోని అన్ని నీటిపారుదల, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులైన వారందరి గాథ. ఎవరో కొందరు దళారుల్ని మినహాయిస్తే అందరివీ ఇటువంటి

✡ మానవహక్కుల కార్యకర్త, రైతు.

దయనీయ గాథలే. పంజాబులో భాక్రానంగల్, ఒరిస్సాలో హిరాకుడ్, ఆంధ్రలో నాగార్జునసాగర్, శ్రీశైలం వగైరా అన్ని ప్రాజెక్టుల్లో నిర్వాసితులు దాదాపు నాశనమైపోయారు. హిమాచల్ ప్రదేశ్‌లోని పాంగ్ డ్యాము నిర్వాసితులకు మాత్రం ప్రాజెక్టు కింద రాజస్థాన్‌లో వేరే కాలువ కింద కుటుంబానికి 16 ఎకరాల చొప్పున ఇచ్చారు. కానీ ఒకటి రెండు సంవత్సరాలకే ఆ వాతావరణం, పరిసరాలు పడక అందరూ తిరగొచ్చేశారు.

మనం విచ్చలవిడిగా అడవులను ఆక్రమించడం వల్ల, చెట్లను నరికివేయడం వల్ల మన భూభాగంలో 33 శాతం ఉండవలసిన అడవులు అందులో మూడోవంతుకు కుదించుకుపోయాయి. ఇతర నష్టాలతోపాటు భూగర్భ జలాలు అడుగంటి పోవటం, విపరీతంగా బోరు బావులు తవ్వడం వలన తాగునీటికి, విద్యుచ్ఛక్తికి తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. దివాళా తీసిన రైతులు మూటా ముల్లా సర్దుకుని టౌనుబాట పడుతున్నారు.

## 40 కోట్లకు పెరగొచ్చు

'అభివృద్ధి'వల్ల, దానికారణంగా సంభవించే పర్యావరణ సమస్యల వల్ల నిర్వాసితులౌతున్న జనం వచ్చే 20 సంవత్సరాల్లో దాదాపు 20 నుండి 40 కోట్లు వుండవచ్చని నిపుణుల అంచనా. ఈ విషయంలో 'అభివృద్ధి'ని సమర్థించేవారు, విమర్శిం చేవారు అంతా ఏకాభిప్రాయంతోనే ఉన్నారు!



ఇదొక భయంకర పరిణామం. బలవంతంగా విస్థాపనకు గురైనా లేక స్వచ్ఛందంగా పల్లెలను వదిలేసి పట్ట ణాలు చేరినా వీరిలో అత్యధికులు మురికి వాడల్లోనో, రైల్వే స్టేషన్ల పరిసరాల్లోనో, ఫుట్‌పాత్‌లపైనో స్థిరపడతారు. వీరికి దొరికే ఉద్యోగాలు/పనులు ఏ రోజు కారోజు వెతుక్కోవలసినవే. సెక్యూరిటి గార్డులుగానో, వాచ్‌మెన్‌లగానో, చెత్త ఊడ్చేవారిగానో, వంటచేసేవారిగానో, పనిమనుషులుగానో, నిర్మాణ కార్మికులుగానో, హొటల్ పనివారిగానో బతకవలసి వస్తుంది. కొందరు పడుపు వృత్తిలోకి నెట్టివేయబడతారు.

కొద్దో, గొప్పో భూములున్న రైతులు తమ పిల్లలకి ఇంగ్లీషు చదువులు కావాలని టౌన్లలో చేర్పించి, అప్పులుచేసి ఉన్నత విద్యలను అభ్యసించేందుకు – ముఖ్యంగా ఇంజనీరింగ్ చదువుకు పంపుతున్నారు. అంటే ఆ తరంతో వారి వ్యవసాయం మూతపడుతుందన్నమాట. ఊళ్ళకు ఊళ్ళే ఖాళీ అయిపోతూ ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వ బడులు పిల్లలు సరిపోక మూతబడుతున్నాయి.

ఇలా ఆలోచిస్తూ పోతే రకరకాల నిర్వాసితులు, వారికున్న అనేక రకాల సమస్యలు మనకు తెలిసొస్తాయి. ప్రతి నిర్వాసిత సమస్యలో కొన్ని ప్రత్యేకతలుంటాయి. వాటిని పరిశీలించి తగిన పునరావాస చర్యలు చేపట్టవలసి ఉంటుంది. అన్నిటికీ ఒకే మందు పనికిరాదు. కానీ విధానాలను సూత్రీకరించవచ్చును.



## కొందరే ఎందుకు త్యాగం చేయాలి?

1) అసలు 'అభివృద్ధి'కోసం ఎవరో కొందరే ఎందుకు త్యాగం చేయాలి? ఏ ప్రాజెక్టు నిర్మాణంలోనైనా నిర్వాసిత సమస్య సాధ్యమైనంతవరకు లేకుండా చూసుకోలేమా? అంటే ఎడారిలోనో, ఎందుకూ పనికిరాని ప్రాంతాలనో వెతుక్కోమంటారా? అంటారేమో. పశ్చిమ బెంగాల్ పరిశ్రమల మంత్రి అన్నట్లు ఫ్యాక్టరీలను గాలిలో కట్టలేంకదా! వాటికీ నీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలు అవసరం. అందులో పోటాపోటీగా ఇతర రాష్ట్రాలు ముందుకు వస్తున్నపుడు ఆకర్షిత రాయితీలు ప్రకటిస్తేనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారు. మరి వాతావరణ కాలుష్యం లేకుండా, విస్థాపన జరగకుండా పరిశ్రమలను స్థాపించగలమా? వద్దనుకుంటే ఇతర ప్రత్యామ్నాయాలు, అభివృద్ధి మార్గాలు ఏమైనా మనవద్ద ఉన్నాయా? కనీసం సూచించగలమా? ప్రకృతి సహజ వ్యవసాయం చేద్దామని కొందరంటారు. అవసరాలు, కోరికలు తగ్గించుకొని స్థానిక ఉత్పత్తులను పెంచి పోషించి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని నెలకొల్పడం నేటి పరిస్థితుల్లో సాధ్యమేనా? ఏ మేరకు? మరే ప్రత్యామ్నాయమైనా ఉన్నదా? ఇట్టి పరిస్థితుల్లో పరిశ్రమలు, డ్యాములు, గనులు, విమానాశ్రయాలు, రేవులు, రోడ్లు వగైరాలవల్ల నిర్వాసిత సమస్య లేని లేదా అతి తక్కువ నిర్వాసిత సమస్య ఉన్న పరిశ్రమలనే పెట్టొచ్చు కదా అతి తక్కువ కాలుష్యం చేసే, అదీ కాలుష్య నియంత్రణ యంత్రాంగాన్ని ఉపయోగించే పరిశ్రమలనే అనుమతించొచ్చు కదా.

**వాతావరణ కాలుష్యం లేకుండా, విస్థాపన జరగకుండా పరిశ్రమలను స్థాపించగలమా? వద్దనుకుంటే ఇతర ప్రత్యామ్నాయాలు, అభివృద్ధి మార్గాలు ఏమైనా మన వద్ద ఉన్నాయా? ప్రకృతి సహజ వ్యవసాయం చేద్దామని కొందరంటారు. కాని అవసరాలు, కోరికలు తగ్గించుకొని స్థానిక ఉత్పత్తులను పెంచి పోషించి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని నెలకొల్పడం నేటి పరిస్థితుల్లో సాధ్యమేనా?**

2) ఇలా పెట్టబోయే ప్రాజెక్టుల గురించి స్థానిక ప్రజలందరికీ ముందే తెలపాలి. వాటిపై అర్థవంతమైన చర్చలు బాధిత ప్రజలతో జరగాలి. వారి సమ్మతితోనే ప్రాజెక్టులను మొదలుపెట్టాలి. ఒక ప్రాజెక్టు మొదలుపెట్టే ముందు దాని ముఖ్య అంశాలు, రాబోయే లాభ నష్టాలు గురించి ప్రముఖంగా పోస్టర్లు బాధిత ప్రాంతంలోని ప్రముఖ స్థలాల్లో వేయాలి. తద్వారా అర్థవంతమైన చర్చకు ఆస్కారం ఉంటుంది.

3) ముఖ్యంగా కాబోయే బాధిత ప్రజలను అధికారికంగా గుర్తించేటట్లు చేయాలి. ఇది చాలా సున్నితమైన కీలకమైన అంశం. సామాన్యంగా భూములు సేకరించేటప్పుడు ఎవరి భూమి పోతుందో, ఎవరి ఇల్లు పోతుందో అన్న విషయాలపైనే అధికారులు కేంద్రీకరిస్తారు. పలుచోట్ల భూమి రికార్డులు సరిగా ఉండవు. కొన్ని వివిధ కోర్టు వివాదాల్లో ఇరుక్కొని ఉంటాయి. అధికారికంగా గుర్తింపబడని కౌలుదార్లు పలుచోట్ల సాగుచేస్తూ ఉంటారు. అనేక రకాల

చేతివృత్తులవారు కంసాలి, మంగలి, చాకలి, మేదరి, కుమ్మరి పనులు చేసేవారు, చిన్న చిన్న దుకాణాలవారు ఉంటారు. పూర్తిగా నిర్వాసితులయ్యేవారు కొందరుంటే (భూమి, ఇల్లు సర్వం పోగొట్టుకున్నవారు) ఇల్లు లేదా భూములు మాత్రమే పోగొట్టుకున్నవారు ఎక్కువగా ఉంటారు. వీరందరినీ బాధితులుగా అధికారికంగా గుర్తించేట్లు చేయాలి. అలా చేయాలంటే బాధితుల తరఫున వారి హక్కులకోసం నిలబడుతున్నవారు ఓటరు లిస్టు సాయంతో ఇల్లిల్లు తిరిగి వారు నష్టపోయే ఆస్తుల వివరాలు, ఇతర నష్టాల గురించి సమగ్ర నివేదిక తయారు చేయాలి. ఈ వివరాలు ప్రజలకు, ప్రభుత్వానికి, టి.వి. వారికి, పేపరు వాళ్ళకి తెలియజేయాలి. అందరికీ న్యాయం జరిగేటట్లు చూడాలి. అంటే తమ పేర్లు ఆస్తులు పోగొట్టుకున్న వారిగా రెవెన్యూ రికార్డుల్లో లేకున్నా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నష్టపోబోయేవారందరినీ అధికారికంగా బాధితులుగా గుర్తించాలి. అలా చేయనందుకే పశ్చిమ బెంగాల్‌లోని సింగూర్‌లో టాటావారి నానో అనే బుల్లికారు ప్రాజెక్టు విపరీతమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొనవలసి వచ్చింది.

4) నేరుగా గుర్తించగల బాధితులు కొందరైతే, పరోక్ష బాధితులు మరెందరో ఉంటారని పైన చెప్పుకున్నాం. వీరేగాకుండా పరిశ్రమలు వదిలే విషపు వ్యర్థాలతో అక్కడి భూగర్భ జలాలు చెరువులు కలుషితమైపోతాయి. అలాగే ఆ ఫ్యాక్టరీలు వదిలే పొగ, దుమ్ము, ధూళితో పరిసర ప్రాంతాల గాలి కలుషితమైపోతుంది. అలాగే గనులు, ముఖ్యంగా ఓపెన్‌కాస్ట్ మైనింగు ద్వారా తీవ్ర నష్టాలు జరుగుతాయి. పరిసర ప్రాంత ప్రజలకు, అక్కడి పశువులకు, పంటలకు, ఇతర జీవరాసులకు జరిగే అన్యాయం, కలిగే అనారోగ్యం అంచనా వేయలేము. హైదరాబాదు మహానగరం చుట్టూ, ఇటు మెదక్ జిల్లా సంగారెడ్డి నుండి అటు షంషాబాద్ – ఇబ్రహీంపట్నం వరకూ ఇదే పరిస్థితి. వీరికంతా ఎటువంటి నష్టపరిహారం ఇవ్వరు.

5) వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ 1894 సంవత్సరంలో బ్రిటిషు పాలకులు జారీ చేసిన భూసేకరణ చట్టం కిందే జరుగుతోంది. ఇందులో రెండు కీలక అంశాలపై దృష్టి సారించాలి. ఒకటి 'ఎమినెంట్ డొమైన్' అనగా భూమిపై ప్రభుత్వానిదే అంతిమ హక్కు అనే సూత్రం. ఇది ప్రజాస్వామిక విధానాలకు పూర్తిగా విరుద్ధమైన అంశం. రెండోది పదిమంది సౌకర్యం కోసం ('పబ్లిక్ ఇంటరెస్టు') తప్పని పరిస్థితుల్లో కొందరు కొంత త్యాగం చేయవలసి వస్తుందనే వాదన. కానీ దేన్ని ప్రజా సౌకర్యం (పబ్లిక్ ఇంటరెస్టు)గా గుర్తించవచ్చును? దీని నిర్వచనం అవసరాన్నిబట్టి వివిధ రూపాలు తీసుకుని ప్రైవేటు కంపెనీలను, కాలుష్యభరిత పరిశ్రమలను కూడా దీనికిందకు చేర్చారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు, బాధలు 'బహిరంగ విచారణ'ల ద్వారా లెక్కలోకి తీసుకొనవచ్చును, తీసుకోకపోవచ్చును. తుది నిర్ణయం మాత్రం రాజ్యందే. దానిపై పెత్తనం చేస్తున్నవారిదే. ఈ విధానాలు మారాలి.

6. ప్రకృతి వైపరీత్యాలద్వారా జరిగే నష్టాలకు ఉదా: అటవీ జంతువుల దాడులవల్ల, వరదలు, తుఫానులు, కరువులు, భూకంపాలు, విద్యుత్ ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు–వాటిల్లో మరణించేవారికి, గాయపడ్డవారికి, ఇతరత్రా నష్టపోయిన వారికి కూడా నష్టపరిహారం విలువ కట్టడంలో ఒక పద్ధతంటూ లేదు. ప్రాణ నష్టానికి కొన్ని సందర్భాలలో 20 వేలు (ఇంకా తక్కువే) ఇస్తుంటే మరికొన్ని సందర్భాలలో 5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వగైరాలు



ప్రకటిస్తున్నారు ప్రభుత్వంవారు. వీటన్నింటికీ ప్రభుత్వం ఎందుకు ఇవ్వాలి? ఎందుకంటే తమ పాలనలో ఉన్న ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలు, బాగోగులు, సంరక్షణ చూసే ప్రాథమిక బాధ్యత ప్రభుత్వానిదే కాబట్టి.

7) ఇక్కడ మనం వేసుకోవలసిన ప్రశ్న 'అభివృద్ధి'లో పదిమంది లాభానికి కొందరే ఎందుకు త్యాగం చేయాలి? విధిలేని పరిస్థితుల్లో వారిని నిర్వాసితులను చేస్తున్నపుడు పునరావాసానికి సంబంధించి కేవలం నష్టపరిహారం సరిగా అంచనావేసి పంపిణీ జరిగిందా అన్నదొక్కటే కాకుండా వారిని కూడా ఆ జరగబోయే అభివృద్ధిలో భాగస్తులుగా ఎందుకు చేయకూడదు? వారు నష్టపోయిన ఆస్తి విలువకన్నా రెట్టింపు లేదా మూడురెట్ల ధన సహాయం, ఇతర ప్రదేశాలలో పునరావాసం, ఇప్పుడు నష్టపోయిన దానికన్నా ఎక్కువభూమి ఎందుకు ఇవ్వకూడదు?

8) ఇక్కడ మరిన్ని కొత్త సమస్యలు వస్తాయి. నష్టాన్ని డబ్బుతో విలువకట్టి ఒక ఎకరం మార్కెట్టులో ఒక లక్ష రూపాయలున్నా (దాని విలువ రెవెన్యూ కార్యాలయాల్లోనూ, రిజిస్ట్రార్ ఆఫీసుల్లోనూ సగం ఉన్నా) 5 లక్షలో, 8 లక్షలో నష్టపరిహారంగా బాధితులకు ఇచ్చారనుకోండి. అంత మందికి ఒక్కసారి అంత డబ్బు ఇస్తే చుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల రేట్లు విపరీతంగా పెరిగిపోతాయి. వారు ఆ డబ్బుతో దూర ప్రాంతాల్లోనే భూములను కొనగలుగుతారు. దూరంగా పోతే దానికుండే కష్టాలు దానికున్నాయి. ఊరు వేరు దాంతోపాటు జాతులు, కులాలు, మతాలు వేరు కావచ్చు. అక్కడి వాతావరణం, గాలీ, నీరు పడకపోవచ్చు. స్థానికులతో ఘర్షణలు రావచ్చు. కొత్త ప్రదేశాలలో, ముఖ్యంగా స్థానిక పెత్తందార్లకి కొంతమేరకు అణిగి మణిగి ఉండాల్సి రావొచ్చు. అలాగే తమ భూమిలో కొంత భాగం భూమి/ఆస్తి మాత్రమే పోగొట్టుకున్న వారేం చేయాలి? చాలా సందర్భాలలో చెల్లించిన నష్టపరిహారం పాతబాకీలు చెల్లించేందుకు, పిల్లల పెళ్ళిళ్ళకు, చదువులకు, ఆరోగ్య అవసరాలకు, ఇల్లు కట్టుకోవడానికి ఖర్చు అయిపోతుంది. మిగిలిన డబ్బుతో భూములు కొనాలన్నా, వ్యాపారాలు చేయాలన్నా సరిపోక పోవచ్చు. సరిపోయినా, డబ్బును సద్వినియోగం చేసుకునే నైపుణ్యం కొద్దిమందికే ఉంటుంది. భూమికి బదులు భూమి చెల్లించాలన్నా అంత సులభం కాదు. పైన పేర్కొన్నటువంటి సమస్యలు ఎదురౌతాయి. మంచి భూమి దొరకటం చాలా కష్టం. మరేం చేయాలి?

9) అయితే ప్రాజెక్టులు కట్టవద్దా? మనకి విద్యుత్, నీరు అవసరం లేదా? ప్రత్యామ్నాయాలు ఏ మేరకు సాధ్యం? ఎంతవరకు సమస్యను తీర్చగలవు? మన విస్తారంగా ఉన్న బొగ్గు, ఇనుము, ఇతర ఖనిజాలను అలాగే వదిలేద్దామా? చరిత్ర వివిధ దేశాల్లో, సమాజాల్లో, కాలాల్లో ఏం చెబుతోంది? ఎవరి అనుభవాలు ఎలా ఉన్నాయి? ఈ ప్రశ్నలు కేవలం ప్రభుత్వమూ, ప్రతిపక్షాలే కాదు, మనమందరమూ బాధ్యులైన పౌరులుగా మనకు మనం వేసుకోవాల్సిన ప్రశ్నలు.

10) చరిత్ర పుటల్లోకి వెళితే బ్రిటిషువారు రాకముందు కూడా విస్థాపన, పునరావాస సమస్యలను ప్రజలు నిరంతరం ఎదుర్కొంటూనే ఉన్నారు. వివిధ జాతుల, మతాల బృందాలు కరువులు, వరదలు వంటి వైపరీత్యాల వల్లనో, శత్రువులతో యుద్ధాలు దండయాత్రల వల్లనో సరికొత్త ప్రాంతాల్లో స్థిరపడటం జరుగుతూనే ఉండేది. వీటిలో అత్యంత హెచ్చు స్థాయిలో జరిగినది భారత్–పాకిస్తాన్ ఒక విభజనలో జరిగిన విస్థాపన. లక్షలాది మంది నిర్వాసితులయ్యారు. వారు పడిన బాధలు ఇన్నీ అన్నీ గావు. అవన్నీ మాయని గాయాలు.

11) విస్థాపన సమస్య నేడు విపరీత స్థాయికి చేరుకుంటున్నది. పారిశ్రామీకరణవల్ల, వివిధ 'అభివృద్ధి' ప్రాజెక్టుల వల్ల (వీటిలో అత్యధికం ఎగుమతులను సరళీకృతం, విస్తృతం చేయడానికి ఉద్దేశించినవే) జరుగుతున్న విస్థాపన, గిట్టుబాటుకాని వ్యవసాయం, పల్లె ఉత్పత్తులకు, పట్టణ, పారిశ్రామిక వస్తువులు, సేవలకు ఇస్తున్న విలువల్లో తీవ్ర వ్యత్యాసం ఉండటంవల్ల జరుగుతున్న విస్థాపన అన్నీ కలిసి వచ్చే 20 సంవత్సరాలలో సుమారు 40 కోట్లమంది నిర్వాసితులు కావచ్చునంటే అదేమీ సామాన్య విషయం కాదు. దీనికి వాతావరణ కాలుష్యం, ఇతర పర్యావరణ సమస్యలు జోడిస్తే ఇదొక అత్యవసర పరిస్థితి అవుతుంది. దీనిని ఎదుర్కొనడానికి క్రియాత్మకంగా ఆలోచించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

## బాధితులకు పెన్షన్ ఇవ్వాలి

12) నాకు తోచినంతవరకు కొన్ని తాత్కాలిక సూచనలు సూచిస్తున్నాను.

అ) ప్రభుత్వంవారు నిర్మించిన అనేక నీటి పారుదల, జలవిద్యుత్ ప్రాజెక్టులవల్ల, భారీ పరిశ్రమలు, గనుల వల్ల నిర్వాసితులైన వారిలో అత్యధికమంది జీవితాలు అతలాకుతలమై పోయాయన్నది అక్షర సత్యం. కొన్ని కోట్లలో ఉన్న ఈ జనానికి జరిగిన అన్యాయం అక్కడక్కడా తప్ప పెద్దగా గుర్తింపు పొందలేదు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్వాసితులైన ప్రతి కుటుంబానికి (భూమి ఉన్నా, లేకున్నా) వారి ఆస్తులకు నష్టపరిహారం కట్టిస్తూ, ఒక కనీస మొత్తం ప్రస్తుత ధరల్లో ప్రతినెలా జీవితాంతం అందేటట్లు ఏర్పాటు చేయాలి. పూర్తిగా నిర్వాసితులై, జీవనాధారం పోగొట్టుకున్న వారికి నెలకు 5 వేలు రూపాయలు 'పెన్షను' రూపంలో ప్రభుత్వంవారు / ప్రాజెక్టువారు చెల్లించాలి. పాక్షికంగా నష్టపోయిన వారికి అదే దామాషాలో చెల్లించాలి. కుటుంబంలో భార్యా, భర్తా ఇద్దరి పేరునా ఉమ్మడిగా డబ్బు స్థానిక పోస్టు ఆఫీసు లేదా బ్యాంకులో ప్రతి నెలా జమచేయాలి. పరిశ్రమలకు, ప్రాజెక్టులకు కోట్ల రూపాయల్లో ఇస్తున్న రాయితీలతో పోల్చితే ఇది పెద్ద ఖర్చుకాదు.

**నిర్వాసితులైన ప్రతి కుటుంబానికి (భూమి ఉన్నా, లేకున్నా) వారి ఆస్తులకు నష్టపరిహారం కట్టిస్తూ, ఒక కనీస మొత్తం ప్రస్తుత ధరల్లో ప్రతినెలా జీవితాంతం అందేటట్లు ఏర్పాటు చేయాలి. పూర్తిగా నిర్వాసితులై, జీవనాధారం పోగొట్టుకున్న వారికి నెలకు 5 వేలు రూపాయలు 'పెన్షను' రూపంలో ప్రభుత్వంవారు / ప్రాజెక్టువారు చెల్లించాలి.**

ఆ) ప్రతి నిర్వాసిత కుటుంబంలో కనీసం ఒక్కరికైనా ప్రాజెక్టులో పని కల్పించాలి. ప్రాజెక్టు పూర్తి అయ్యాక దాన్ని నిర్వహించేందుకు లేదా ఇతరత్రా బ్రతికేందుకు అవసరమైన నైపుణ్యం నేర్చుకోవటానికి తగు శిక్షణా కేంద్రాలను ఆ ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఈ శిక్షణలు పరిశ్రమల్లో పనిచేయడానికి, వ్యాపారాలు చేసుకోవడానికి అనువుగా ఉండాలి. శిక్షణా సమయంలో వారి ఖర్చులకు భత్యం ఇవ్వాలి. నల్గొండ జిల్లా, భూదాన్ పోచంపల్లి సమీపంలో ప్రభుత్వం వారు స్థాపించిన స్వామి దయానందతీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థ ఎంతోమంది పరిసర గ్రామీణ యువతకు క్రియాత్మక ఉపాధి అవకాశాలు కల్పించింది. అలాగే రెడ్డిల్యాబ్స్‌వారి నాంది ఫౌండేషన్ కూడా ఈ దిశలో మంచి ఫలితాలు సాధించిందంటున్నారు. వీరు నేర్పిన విద్యలలో



తాపీ మేస్త్రీ పని నుండి, డ్రైవరు పని, పచ్చళ్ళు, జాముల తయారీ, టివి, కంప్యూటర్ల అసెంబ్లింగు, రిపేర్ల వరకు ఉన్నాయి. ఈ విధంగా ప్రతి ఒక్కరూ వారికి తోచిన సలహాలు, సూచనలు అందిస్తే వాటిపై ప్రజా సంఘాలు కలిసి చర్చించి ఒక సమగ్ర నిర్వాసిత పునరావాస చట్టాన్ని, పాలసీ (పద్ధతి) నమూనాను రాష్ట్రానికి, దేశానికి వర్తించేటట్లు రూపొందించవచ్చును. ఇప్పటివరకు ఈ దిశలో జరిగిన ప్రయత్నాలు అంత సంతృప్తికరంగా లేవు.

## ప్రత్యామ్నాయాల ఆలోచన అవసరం

విస్థాపన - పునరావాస సమస్యలపై విధాన రూపకల్పన నివేదికను కేంద్ర ప్రభుత్వంవారు నామమాత్రపు చర్చలు జరిపి (వారంరోజులు) ఒక చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జి.ఒ. నెంబరు 68 ద్వారా భూమిలేని నిర్వాసితులకు ఒకటి, రెండు సంవత్సరాలు కనీస వేతనాలు ఇవ్వాలని చెబుతుంది. అంటే భూమిలేని నిర్వాసితుల్ని బాధితులుగా గుర్తించిదన్నమాట. ఆ తరువాతి సంగతేమిటి? వీటి వేటిలోనూ వారిని వారి ముందు పరిస్థితికన్నా మేలుగా తీర్చిదిద్దాలనే అవగాహన లేదు. ఎంత తక్కువమందిని నిర్వాసితులుగా గుర్తించి, ఎంత తక్కువ మందికి నష్టపరిహారం ఎంత తక్కువగా చెల్లించి చేతులు దులుపుకోవచ్చా అనే ఆలోచిస్తున్నారు. కాబట్టి ప్రజల హక్కులకోసం, న్యాయంకోసం పోరాడుతున్న సంఘాలు, వ్యక్తులు ఏ ప్రాజెక్టుకిందైనా ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా కానీ ప్రజలు నిర్వాసితులు కాకుండా ఉండేలా లేదా అతి తక్కువమంది నిర్వాసితులయ్యేలా, కాలుష్యం అతి తక్కువగా ఉండేలా, శుద్ధి చేసే యంత్రాంగం అమర్చేలా పోరాడాలి. కేవలం పోగొట్టుకున్నవారే కాకుండా, ప్రాజెక్టు బాధితులందరినీ ప్రత్యక్ష పరోక్ష నిర్వాసితులుగా గుర్తించి, వారందరూ పునరావాసంలోనూ, అభివృద్ధిలోనూ భాగస్వాములయ్యేలా పునరావాస చట్ట నమూనాను రూపొందించి, కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో జారీ అయ్యేటట్లు చూడాలి. అటువంటి ప్రాజెక్టులనే అనుమతించాలి. అలా లేని ప్రాజెక్టులను ప్రజా వ్యతిరేక ప్రాజెక్టులుగా ప్రకటించి వాటికి వ్యతిరేకంగా పోరాడాలి. నిరంతరం ఇటువంటి ప్రజా వ్యతిరేక ప్రాజెక్టులకు, 'అభివృద్ధి' పాలసీలకు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ ఉండాలి.

ప్రాజెక్టు బాధితులకు సాయపడదలచినవారు కొన్ని ముఖ్యమైన పనులు చేయాలి.

1. ఆ ప్రాజెక్టు పూర్తి వివరాలు సాధ్యమైన మేరకు తెలుసుకోవాలి. ఈ విషయంలో సమాచార హక్కు చట్టం ఉపయోగపడగలదు.
2. ప్రాజెక్టు వివరాలు తెలుసుకొన్నాక ఆ ప్రాజెక్టు వల్ల జరిగే దుష్ఫలితాల గురించి నిపుణులను కలిసి తెలుసుకోవాలి.
3. ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నష్టపోయే బాధితుల పూర్తి వివరాలు ప్రాజెక్టు బాధిత ప్రాంతంలో విస్తృతంగా తిరిగి సేకరించాలి.
4. సమాచార సేకరణ తరువాత బాధిత ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి, వారితో చర్చించి సరైన కోర్కెలను బాధితుల తరపున ప్రాజెక్టు అధికారులముందు పెట్టాలి. పోరాటం చేయనిదే పాలకుల నుండి న్యాయం దక్కదు. కావున నాయకులు, కార్యకర్తలు ఏ ఏ రూపాల్లో ఎంతవరకు పోరాడగలరో నిరంతరం చర్చించుకుంటూ అరెస్టులకు, కేసులకు భయపడకుండా న్యాయం జరిగేంతవరకూ ధైర్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలి.

◆ ◆ ◆

## తూర్పు కనుమల్లో బాక్సైట్ ప్రాజెక్టు

# ఆదివాసులకే కాదు అందరికీ హాని

పాట్రిక్ ఆస్కర్‌సన్

విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ నిల్వలు కనుగొని 30 ఏళ్లయింది. బాక్సైట్ ఆధారిత పరిశ్రమల కోసం తెలుగుదేశం ప్రభుత్వం రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని మరికొన్నిటికి ప్రణాళికలు రచించి కూడా విఫలం కాగా 2004 ఎన్నికల తర్వాత వీటిని ప్రోత్సహించడం కాంగ్రెస్ ప్రభుత్వం వంతయింది. 2005 జూలై ఒకటిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, జిందాల్ గ్రూపుకు చెందిన జిందాల్ సౌత్‌వెస్ట్ అల్యూమినియంకు మధ్య అవగాహన ఒప్పందం కుదరడంతో బాక్సైట్ ప్రాజెక్టులను అమలులోకి తెచ్చే ప్రయత్నాలు మరలా ప్రారంభమయ్యాయి. ఒకటిన్నర సంవత్సరం తర్వాత, 2007 ఫిబ్రవరి 14న రాష్ట్ర ప్రభుత్వానికి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని రస్ అల్ ఖైమా ప్రభుత్వానికి చెందిన అన్‌రాక్ సంస్థకు మధ్య మరొక ఒప్పందం కుదిరింది. ఈ రెండింటిలోను కూడా విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న బాక్సైట్ నిల్వల వెలికితీత విషయంలో ఒకేరకమైన పథకాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎపిఎండిసి) బాక్సైట్ ఖనిజాన్ని వెలికితీసి, ప్రైవేట్ కంపెనీలు ఏర్పరచిన అల్యూమినా రిఫైనరీలకు తక్కువ ధరకు అమ్ముతుంది. ఆ తర్వాతి దశలో ఆ కంపెనీలు స్మెల్టర్లలో అల్యూమినాను కరిగించి అల్యూమినియం తయారు చేస్తాయి.

ప్రతిపక్షంలో ఉన్నపుడు కాంగ్రెస్‌వారు చూపిన వ్యతిరేకత అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలో మారిపోగా, తెలుగుదేశానికి ప్రతిపక్షంలో కూర్చోగానే ఈ ప్రాజెక్టుల వల్ల ప్రజలు ఎదుర్కొనే సమస్యల విషయంలో అద్భుతమైన మేలుకొలుపు కలిగింది. మాకవరపాలెంలో రస్ అల్ ఖైమా వారు, అల్యూమినియం రిఫైనరీ కోసం సేకరించే భూములలో చంద్రబాబు నాయుడు ఎడ్లబండిపై ప్రయాణించడం ప్రజాకర్షక రాజకీయ వ్యవస్థ నాయకులను ఎంత దూరం తీసుకుపోగలదో చూపే

✡ పరిశోధకుడు, ఈస్ట్ యాంగ్లియా యూనివర్సిటీ, యు.కె.





డొంగరియా కోందులు: ఒరిస్సాలో వేదాంత కంపెనీ తవ్వకాలు మొదలుపెడితే వీళ్లేమయిపోతారో చెప్పలేం.

సంఘటన. ఇదే చంద్రబాబు అధికారంలో ఉండగా బాక్సైట్ పరిశ్రమను నెలకొల్పడం కోసం ఆదివాసుల హక్కులను రక్షించడానికి ఉద్దేశించిన రాష్ట్ర చట్టాలను, రాజ్యాంగం షెడ్యూల్డు ప్రాంతం రక్షణకోసం కల్పించిన నియమాలను సవరించడానికి వేయని ఎత్తులు లేవు. నాయుడు పాలనలో ఈ ప్రయత్నాన్ని నిరోధించగల పౌర సమాజ వ్యతిరేకత కాంగ్రెస్ పాలనలో విఫలమవుతున్నట్లు కనిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం ఎదుర్కొన్న సమస్యలను అధిగమించడానికి తగిన మార్గాలను వెతుక్కోవడంలో సఫలం కావడమే కాక ప్రాజెక్టు అమలుకు మరింత దృఢ నిశ్చయంతో ఉన్నట్టుంది.

## 1970లలోనే కనుగొన్నారు

ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలలో బాక్సైట్ నిల్వలను 1970ల మధ్యభాగంలో కనుగొన్నప్పటికీ ఒరిస్సాలో నిల్వలు విస్తృతంగా ఉండడం వల్ల కాబోలు 1980లలో దామన్‌జోడిలో నాల్కో (NALCO) ఆధ్వర్యంలో బాక్సైట్ పరిశ్రమ నెలకొల్పడంతో దాని వినియోగం ప్రారంభమైంది. అదే రకమైన పరిశ్రమను రష్యా సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లోనూ స్థాపించాలన్న ప్రయత్నం జరిగింది కానీ విదేశీ మారక ద్రవ్యం కొరత వల్ల, సాంకేతిక ఇంధన సమస్యల వల్ల అది సాధ్యం కాలేదు. 1991లో సోవియట్ యూనియన్ పతనమైన తర్వాత ఈ ప్రయత్నం మూలన పడింది. 1990ల ద్వితీయార్థంలో పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం విరివిగా లభ్యం కాసాగాయి కాని బాక్సైట్ ఖనిజాల వెలికితీత వలన కలిగే దుష్పరిణామాల పట్ల అప్పటికి పౌర సమాజంలో అవగాహన పెరగడం ఈ ప్రాజెక్టులను ఆలస్యం చేసింది.

బాక్సైట్ ప్రాజెక్టుల అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దాని పారిశ్రామిక భాగస్వాములు ఎలా పనిచేస్తున్నాయనే విషయాన్ని ఈ వ్యాసం వివరిస్తుంది. దాంతోపాటు ఆదివాసుల జీవనాధారంపైన, భూములపైన, అసలే నీటిఎద్దడి ఎదుర్కొంటున్న తీర ప్రాంతాల నీటివనరులపైన బాక్సైట్ వెలికితీత వేయగల దుష్ప్రభావాన్ని గురించి, పర్యావరణ సమస్యల గురించి ఉత్పన్నమైన ఆందోళన ఎలా తృణీకారానికి గురయిందో ఈ వ్యాసం చర్చిస్తుంది. రాష్ట్రానికి, స్థానికులకు దీనివల్ల వచ్చే ఆర్థిక ప్రయోజనం చాలా పరిమితమని చూపించి వాస్తవంగా ఎవరు లాభపడతారనే ప్రశ్నను చర్చిస్తుంది.

## ప్రాజెక్టు ప్రణాళిక

ప్రస్తుతం అమలు కాబోతున్న రెండు ప్రాజెక్టుల ప్రాథమిక ప్రణాళిక ఒకటే. దానిలో ఈ కింది అంశాలున్నాయి.

1. వ్యాపార ఒప్పందాన్ని ప్రభుత్వానికి కంపెనీకి మధ్య ఒక అవగాహన పత్రం (ఎం.ఒ.యు) రూపంలో చేసుకోవడం.



బాక్సైట్ తవ్వకాలు మొదలైతే విశాఖపట్నం జిల్లాలో ఇటువంటి ఆదివాసీ గ్రామాలెన్నో అదృశ్యమవుతాయి

2. బాక్సైట్ గనుల తవ్వకానికి అవసరమైన లైసెన్సు కోసం, లీజు కోసం, పర్యావరణ అటవీ అనుమతుల కోసం దరఖాస్తులను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చేస్తుంది. అనుమతులు పొందడానికయ్యే ఖర్చు మాత్రం ప్రైవేటు కంపెనీ భరిస్తుంది. మైనింగ్ ప్రాంతంలో నష్టపోయే అడవిని తిరిగి పెంచడానికయ్యే ఖర్చు కూడా ప్రైవేట్ కంపెనీయే భరిస్తుంది. ఇది ఒక్క జిందాల్ ప్రాజెక్టు విషయంలోనే 80 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.

3. పర్యావరణ నివేదికను గనులకు, రిఫైనరీకి వేరువేరుగా తయారుచేస్తారు. పర్యావరణ దుష్ప్రభావాన్ని తక్కువ చేసి చూపించడానికి దేశంలో ఈ పద్ధతి యిప్పుడు పరిపాటి అయిపోయింది. రిఫైనరీకి మొదట అనుమతి పొంది ఆ తరువాత చాలా పెట్టుబడులు పెట్టేశారన్న సాకు చూపించి గనులకు అనుమతి తెచ్చుకోవచ్చు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి ప్రైవేట్ పెట్టుబడి చాలా రావాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది కాబట్టి రిఫైనరీకి అనుమతి సంపాదించడానికి ప్రాధాన్యం ఇస్తుంది.

4. ముడిఖనిజం నుంచి అల్యూమినాను ఉత్పత్తి చేసే రిఫైనరీని ప్రైవేటు కంపెనీ ఏజెన్సీలో నెలకొల్పితే ఆదివాసుల భూ బదలాయింపు చట్టంవల్ల వచ్చే ఇబ్బంది దృష్ట్యా దానిని ఏజెన్సీ బయట, కాని రాష్ట్రం లోపలే స్థాపించడం జరుగుతుంది. పైన చెప్పినట్టు ఈ మొత్తం ప్రక్రియకు అయ్యే ఖర్చంతా ప్రైవేటు కంపెనీయే భరిస్తుంది కాని భూసేకరణకు అవసరమయ్యే పాలనా ప్రక్రియలోను, స్థానిక రైతుల వ్యతిరేకతను ఎదుర్కొనే రాజకీయ ప్రక్రియలోను ప్రభుత్వ జోక్యం అవసరమవుతుంది.

5. ఖనిజం తవ్వకం, రిఫైనరీ పనులు ప్రారంభమైన తర్వాత అల్యూమినా నుండి అల్యూమినియంను తయారు చేసే కర్మాగారాలను (స్మెల్టర్లు) స్థాపించడం జరుగుతుంది. వాటిని రాష్ట్రంలో ఎక్కడ స్థాపిస్తారు, వాటికి అవసరమయ్యే నీళ్లు, విద్యుత్తు ప్రభుత్వం ఎక్కడినుండి ఇస్తుందనేది భవిష్యత్తుకు వదిలేసారు.

బాక్సైట్ ప్రాజెక్టు ఇంత సంక్లిష్ట రూపం తీసుకోవడానికి ఒక ప్రధాన కారణం ఆంధ్రప్రదేశ్‌లో ఆదివాసుల భూమి హక్కుకు ఉన్న బలమైన రక్షణ. ఈ విషయాన్ని సమతా కేసులో (1997) సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏజెన్సీ ప్రాంతంలో భూమిని ప్రభుత్వం నుండి ప్రైవేటు కంపెనీలు కొనడాన్ని, లీజుకు తీసుకోవడాన్ని కూడా ఈ తీర్పు నిషేధిస్తుంది. తెలుగుదేశం ప్రభుత్వం 2003లో ఒక దుబాయ్ కంపెనీతో చేసుకున్న ఒప్పందానికి ఈ తీర్పు అడ్డం వచ్చింది కాబట్టే దాన్ని వదులుకోవాల్సి వచ్చింది.

రాజశేఖరరెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వపు 'పొరపాట్ల' నుంచి నేర్చుకుని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థను ముసుగు సంస్థగా వాడుకుని దాని ద్వారా ఒప్పందాలు కుదుర్చుకుంది. కేవలం 360 మంది






ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలలో బాక్సైట్ ఖనిజం నిల్వలను చూపించే చిత్రం.

ఉద్యోగులున్న ఖనిజాభివృద్ధి సంస్థ ఈ ఖనిజాలను వెలికి తీయలేని పక్షంలో ప్రైవేటు కాంట్రాక్టర్లను వినియోగించుకోవచ్చు. వారు జిందాల్, అన్‌రాక్‌లే కావచ్చు కాని మైనింగ్ లీజు రాష్ట్ర ఖనిజాభివృద్ధి పేరుమీద ఉండడంతో అది ప్రభుత్వం నిర్వహించేదిగా చెప్పబడుతుంది. ఈ విధంగా వెలికితీసిన ఖనిజం ఏజెన్సీ బయట జిందాల్, అన్‌రాక్‌లు పెట్టబోతున్న రిఫైనరీలకు చేరవేయబడుతుంది. రిఫైనరీలు నెలకొల్పడానికి పేదలకిచ్చిన అసైన్డ్ భూములు కేటాయించబడుతున్నాయి. అవి సులభంగా సేకరించడానికి, తక్కువ ధరకు కంపెనీలకు కట్టబెట్టడానికి తగినవని ప్రభుత్వం గుర్తించింది. ఖనిజాల తవ్వకంలో ఆదివాసులు, రిఫైనరీల స్థాపనలో చాలావరకు దళితులు తమ భూములను కోల్పోతున్నారు.

## బాక్సైట్ తయారీ

విశాఖపట్నం జిల్లాలో 900 నుండి 1400 మీటర్ల ఎత్తులో కొండల పైభాగాన బాక్సైట్ నిల్వలున్నాయి. వాటి మందం కొన్నిచోట్ల కొద్ది మీటర్లు మాత్రమే కాగా అరకు సమీపంలోని గాలికొండ

దగ్గర 54 మీటర్ల దాకా ఉంది. వర్షాకాలంలో భారీగా వానలు, ఆ తర్వాత వేడిగా పొడిగా ఉండే వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల లక్షల ఏళ్ల కాలంలో ఇవి ఏర్పడ్డాయి. ఖనిజం కొండల పైభాగంలో పొరలుపొరలుగా ఉండడం వల్ల దాని వెలికితీతకు భూగర్భ తవ్వకాలు సాధ్యం కావు. కొండల పైభాగాన ఉన్న మట్టిని, వృక్ష సంపదను శాశ్వతంగా తొలగించే ఓపెన్ కాస్ట్ మైనింగ్ పద్ధతినే చేపట్టవలసి ఉంటుంది. ప్రతిపాదిత మైనింగ్ భూభాగం మొత్తం రిజర్వు ఫారెస్టులో ఉంది. జర్రెల ప్రాజెక్టు నర్సీపట్నం – చింతపల్లి రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉండబోతుండగా గాలికొండ సుంకరమెట్ట రిజర్వు ఫారెస్టు పరిధిలోను, రక్తకొండ అనంతగిరి రిజర్వు ఫారెస్టు పరిధిలోనూ ఉండబోతాయి. జర్రెలకు 452 ఎకరాల అటవీ భూమిని, గాలికొండకు 97.5 హెక్టార్ల అటవీ భూమిని, రక్తకొండకు 54.7 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించమని అనుమతి పత్రంలో కోరారు.

## ఆంధ్రప్రదేశ్‌లో బాక్సైట్ నిల్వలు

| గ్రూపు | నిక్షేపాల పరిమాణం (మిలియన్ టన్నులు) | గని ప్రాంతం (హెక్టార్లు) |
|---|---|---|
| **అరకు గ్రూపు** | | |
| గాలికొండ | 14.5 | 61 |
| రక్తకొండ | 8.6 | 42 |
| చిత్తంగొంది | 28.5 | 152 |
| మొత్తం అరకు | 51.6 | 255 |
| **చింతపల్లి గ్రూపు** | | |
| సప్పర్ల | 186.3 | 1,513.2 |
| గూడెం | 38.4 | 263 |
| జెర్రెల | 246.0 | 1,350 |
| మొత్తం చింతపల్లి | 470.7 | 3,126.2 |
| **గుర్తేడు గ్రూపు** | | |
| (తూర్పు గోదావరి) | 42.6 | 180 |
| **మొత్తం** | **564.9** | **3,561.2** |

బాక్సైట్ నిల్వలున్న కొండలకు తడిని నిలుపుకునే సామర్థ్యం చాలా ఉంటుందని నిపుణులు అంటారు. ఈ విధంగా నిలిచిన నీరు వివిధ నదుల, వాగుల ప్రవాహంలో భాగమవుతుంది. అరకు గ్రూపులోని గాలికొండ, రక్తకొండలు, శారద, గోస్తనీ నదుల పరీవాహక ప్రాంతంలోను, చిలకలగడ్డ పరీవాహక ప్రాంతంలోను ఉన్నాయి. చింతపల్లి గ్రూపులోని జర్రెల సీలేరు పరీవాహక ప్రాంతంలో ఉంది. శారదానది రైవాడ జలాశయానికి, గోస్తనీ నది తాటిపూడి జలాశయానికి, సీలేరు నది ఎగువ దిగువ సీలేరు జలాశయాలకు నీరు అందిస్తాయి. బాక్సైట్ తవ్వకాల వల్ల ఈ నీటి వనరులకు ఏమి గతి పడుతుందనేది పెద్ద ప్రశ్న. దీని గురించి స్వతంత్రమైన అంచనా ఏదీ ఇప్పటిదాకా లేదు.



## కొన్ని గణాంకాలు

ఒక టన్ను అల్యూమినియం ఉత్పత్తికి 1.93 టన్నుల అల్యూమినా కావాలి. ఒక టన్ను అల్యూమినా ఉత్పత్తికి 2.9 టన్నుల బాక్సైట్ ముడి ఖనిజం కావాలి. అంటే ఒక టన్ను అల్యూమినియం తయారీకి 5.6 టన్నుల ముడి ఖనిజం కావాలి. రిఫైనరీలో జరిగేదేమిటంటే బాక్సైట్ ఖనిజాన్ని చిన్న రేణువులుగా పొడిచేసి కాస్టిక్ సోడాతో కలిపి ఆ మిశ్రమాన్ని పెద్దపాత్రల్లో వేడిచేసి తెల్లటి అల్యూమినా పొడర్‌ను వేరు చేయడం. అల్యూమినియం తయారీలో అల్యూమినా మధ్యంతర ఉత్పత్తి. దానిని స్మెల్టర్లకు తరలించి కరిగించి అల్యూమినియంను తయారుచేస్తారు. స్మెల్టర్లకు అవసరమైన విద్యుత్తు బాక్సైట్ ఖనిజం దొరికే ప్రాంతాలలో సాధారణంగా లభ్యం కాదు కాబట్టి రిఫైనరీలను, స్మెల్టర్లను వేరువేరు ప్రాంతాలలో నెలకొల్పుతారు.

అల్యూమినాను తయారు చేసే రిఫైనరీ దగ్గర వృథాగా మిగిలిపోయిన పదార్థం ఎర్రమట్టి గుంటలలోకి పోతుంది. అంటే పెద్ద పెద్ద చెరువులు తవ్వి ఈ వ్యర్థాన్ని నీళ్లతో కలిపి బురద చేసి ఆ చెరువుల్లో నింపుతారు. ప్రస్తుతానికి ఇది తప్ప ఈ వ్యర్థాన్ని వదిలించుకోవడానికి వేరే పరిష్కారాలు లేవు. ఆ వ్యర్థంలో ఇనుప ఖనిజం ఉండడం అది ఎర్రగా ఉండడానికి కారణం అయితే రిఫైనరీలో వాడే కాస్టిక్ సోడా కూడా ఈ వ్యర్థంలో ఒక ప్రధాన భాగం. అన్నిటికంటే ముఖ్యమైనవి సూక్ష్మ పరిమాణంలో ఉండే అనేక రకాల సాంద్రలోహాలు (హెవీ మెటల్స్). ఇవి తీవ్ర విష పదార్థాలు కావడం వల్ల గాలిలో గాని నీటివనరులలోగాని చేరితే పరిణామాలు చాలా హానికరంగా ఉంటాయి. అందులోని సీసం ఒక్కటే చాలు చుట్టుపక్కల మొక్కలేమీ పెరగకుండా చేయడానికని ఒరిస్సాలోని నాల్కో రిఫైనరీపై జరిగిన పరిశోధన తెలుపుతుంది. గుంటలలోని ఎర్రమట్టి భూగర్భంలోకి ఇంకకుండా చూడడానికి లైనింగ్ ఇస్తారు. వర్షానికి బయటకు పొర్లకుండా ఉండడానికి చుట్టూ గోడలు నిర్మిస్తారు. దుమ్ము రూపంలో గాలిలోకి ఎగరకుండా ఉండడానికి ఎప్పటికప్పుడు నీళ్లు చల్లే ఏర్పాటు చేస్తారు. ఇది మనకు ప్రణాళికల్లో కనిపించే విషయం. కాని ఛత్తీస్‌గఢ్‌లోని బాల్కో ప్రాజెక్టు దగ్గరున్న ఎర్రమట్టి మడుగులను ఈ మధ్య పరిశీలించగా తెలిసిందేమిటంటే అంతకుముందు కురిసిన చిన్నపాటి వర్షానికే మడుగులోని ఎర్రమట్టి గోడలను దాటి పొంగి పొర్లిందని. గోడలు అంత తగ్గులో ఉన్నాయి. ఆ బురద పల్లానికి పారుతూ స్థానిక గ్రామాల స్త్రీలు బట్టలు ఉతుక్కునే చెలమల్లోకి చేరిందట! దుమ్ము పైకి ఎగరకుండా నీళ్లు చల్లడానికైతే ఎటువంటి ఏర్పాట్లూ కనిపించలేదు. పొడిగా ఉన్న మడుగు పైభాగాన తమ ఆరోగ్యానికి కలిగే ప్రమాదం గురించి తెలియని ఇద్దరు పిల్లలు గాలిపటాలెగరేస్తూ కనిపించారు.

ఇది రిఫైనరీ వద్ద ఉండే కాలుష్యం సమస్య కాగా స్మెల్టరు అంటూ నెలకొల్పితే అక్కడ అదనంగా సమస్యలు ఉంటాయి. స్మెల్టర్ నుండి ఫ్లోరైడ్ కలిసి ఉన్న పాట్ లైనింగ్ అనే వ్యర్థం బయటికి వస్తుంది. అది చాలా ప్రమాదకరమైంది. దానిని వదిలించుకోవడానికి ఎటువంటి పద్ధతులు అవలంబిస్తారనేది ఇప్పటికింకా స్పష్టంగా లేదు. ఇంతకుముందు నెలకొన్న స్మెల్టర్ల నుండి నేర్చుకుంటారని ఆశించడానికీ వీల్లేదు. ఎందుకంటే ప్రభుత్వ రంగంలోని బాల్కో స్మెల్టరులోనే పాట్ లైనింగ్‌ను తొలగించే వ్యవస్థేదీ లేదు. 2007లో బాల్కోలో జరిపిన పరిశీలన సందర్భంగా ఫ్యాక్టరీ ప్రాంతంలో ఎటువంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ఈ వ్యర్థాన్ని పారబోసి ఉండడం గమనించాం.

తక్షణం జరిగే పర్యావరణ నష్టమే కాక బాక్సైట్ మైనింగ్ దీర్ఘకాల పర్యావరణ విధ్వంసానికి కూడా కారణమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన గనులు ఏడాదికి 30 లక్షల టన్నుల ఖనిజాన్ని

వెలికితీస్తాయి. ఈ లెక్కన 240 లక్షల టన్నుల బాక్సైట్ నిలువ ఉన్న గాలికొండలో ఎనిమిదేళ్లలో తవ్వకాలు అయిపోతాయి. జి.కె. వీధి మండలంలోని జర్రెల, సప్పర్ల నిల్వలు మరింత పెద్దవి. పైగా లోతట్టు ప్రాంతాలలో ఉన్నాయి. కాబట్టి వాటిని బయటకు తీయడానికి ఇంకా ఎక్కువ కాలం పట్టవచ్చు. అయినప్పటికీ 30 ఏళ్ల లోపల అవి కూడా ఖాళీ అయిపోతాయి. తవ్వకాలు ముగిసిన తర్వాత, జిందాల్, అన్‌రాక్ కంపెనీలు తట్టాబుట్టా సర్దుకు వెళ్లిపోయిన తర్వాత లోతైన గుంతలు, మట్టి గుట్టలు, శాశ్వతంగా విషపదార్థాలను పర్యావరణంలోకి విడిచిపెట్టే ఎర్రమట్టి గుంటలు మిగులుతాయి. ఇక్కడ మళ్లీ జనావాసాలు గాని వ్యవసాయంగాని సాధ్యం కావడానికి కొన్ని శతాబ్దాలు పట్టవచ్చు.

## నీరు ఎక్కడనుంచి?

ఎస్. కోటలోని జిందాల్ అల్యూమినా రిఫైనరీకి రోజుకు 80 లక్షల గాలన్ల నీరు అవసరం. మాకవరపాలెంలోని అన్‌రాక్ రిఫైనరీకి ఒక కోటి గాలన్ల నీరు అవసరం. భవిష్యత్తులో స్మెల్టర్లు నెలకొల్పేటట్టయితే ఈ అవసరం ఇంకా పెరుగుతుంది. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన వాటాదారుగా ఉన్న విశాఖ ఇండస్ట్రియల్ సప్లయ్ కంపెనీ ద్వారా ఈ నీటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ కంపెనీ పోలవరం ఎడమ కాలవనుండి నీళ్లు తీసుకుంటుందని అన్నారు. కాని పోలవరం నుండి నీళ్లు ఎప్పుడు వస్తాయో అసలు వస్తాయో రావో తెలియదు కాబట్టి తాత్కాలికంగానైనా దగ్గరగా ఉన్న రిజర్వాయర్ల నుండి నీటిని తరలించవలసి వస్తుంది. అయితే పర్యావరణ అనుమతి పత్రం మాత్రం నీళ్లెక్కడినుండి వస్తాయన్న విషయాన్ని ప్రస్తావించలేదు. రైవాడ నుండి గాని ప్రభుత్వం నిర్ణయించే వేరే ఏదైనా చోటినుండి గాని వస్తుందని చెప్పి వదిలేసింది. స్థానిక రైతులు మాత్రం దగ్గరనే ఉన్న తాటిపూడి రిజర్వాయరు నుండిగాని, చిలకలగడ్డ యేరు నుండిగాని తీసుకోబోతారని సహేతుకంగా ఆందోళన చెందుతున్నారు. విశాఖపట్నం నగరానికి నీళ్ళిచ్చే రైవాడ ప్రస్తావన రాగానే అసలే నీటికొరతతో బాధపడుతున్న ఆ నగర మునిసిపల్ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. ఆ సంగతి తెలిసి జిందాల్ యాజమాన్యం గోదావరి నీళ్లే తమ రిఫైనరీకి తీసుకోవడం జరుగుతుందని ప్రకటన చేసింది. అయితే విశాఖపట్నానికి నీటిసరఫరా చేయడం వలన ఆయకట్టు కోల్పోయిన రైవాడ రైతాంగానికి పోలవరం నీళ్లు ఇస్తామన్న హామీ ప్రభుత్వం ఇదివరకే ఇచ్చి ఉంది కాబట్టి జిందాల్ ప్రకటన మరింత గందరగోళానికి దారి తీసింది. చర్చ చివరికి తాటిపూడి దగ్గరికే వచ్చింది. రోజుకు 80 లక్షల గాలన్ల నీరు అందుబాటులో ఉంటుందన్న ప్రాతిపదికన దీనికి పర్యావరణ అనుమతి లభించింది. స్థానిక నీటి వనరులను ఉపయోగించబోమని కంపెనీ అంటున్నప్పటికీ సూచికలన్నీ అందుకు భిన్నంగా ఉన్నాయి. విశాఖపట్నం నగర నీటి అవసరాలు విపరీతంగా పెరగబోతాయన్న అంచనా నేపథ్యంలో తాటిపూడి తప్ప ఈ సమస్యకు వేరే పరిష్కారం కనిపించదు.

## విద్యుత్తూ కష్టమే

ఈ ప్రాజెక్టులకు అవసరమైన విద్యుత్తు ఎక్కడినుండి వస్తుందనేది కూడా ప్రశ్నార్థకంగానే ఉంది. రిఫైనరీ కన్నా అల్యూమినియం స్మెల్టరుకు పదిరెట్ల ఎక్కువ విద్యుత్ కావాలి. అన్‌రాక్ ప్రతిపాదించిన 2.50 లక్షల టన్నుల అల్యూమినియం కర్మాగారానికి 500 మె.వా. విద్యుత్ ప్లాంటు అవసరం. అందుకే స్మెల్టర్లను ఎక్కువగా బాక్సైట్ గనులకు దూరంగా విద్యుత్ చౌకగా దొరికే ప్రాంతాలలో నిర్మిస్తారు. మనం ఎక్కువగా జలవిద్యుత్తుపైన, థర్మల్ విద్యుత్తుపైన ఆధారపడుతున్నాము కాబట్టి అల్యూమినియం స్మెల్టర్లు ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్టేటట్టయితే సింగరేణి బొగ్గు గనుల దగ్గరో లేక పోలవరం డ్యామ్ దగ్గరో పెట్టవలసి ఉంటుంది. గోదావరిలో ప్రవాహం చాలావరకు వర్షం మీద ఆధారపడి ఉండడం వల్ల ఒకవేళ పోలవరం డ్యామ్ వచ్చినా అది సంవత్సరం పొడవునా అల్యూమినియం కర్మాగారాల విద్యుత్ అవసరాలను తీర్చదు. కాబట్టి బొగ్గు ఆధారిత విద్యుత్తే ప్రధాన ఇంధన మూలం కాబోతుంది. అసలే విపరీతమైన విద్యుత్ సంక్షోభం ఉన్న రాష్ట్రంలో ఇది ఇతర వినియోగ అవసరాలతో పోటీపడక తప్పదు.

## జిందాల్‌తో అవగాహనా ఒప్పందం

కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో అధికారంలోకి వచ్చిన తర్వాత కుదుర్చుకున్న పారిశ్రామిక ఒప్పందాలలో జిందాల్ సౌత్‌వెస్ట్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మొదటిది కావడం వల్ల దాని అమలు చాలా దూరం వెళ్లింది. జిందాల్ సౌత్‌వెస్ట్ హర్యానాకు చెందిన జిందాల్ గ్రూపుకు అనుబంధమైనది. జిందాల్ గ్రూపు దేశంలోని అతిపెద్ద వ్యాపారసంస్థల్లో ఒకటి. ప్రస్తుతం వివిధ రంగాల్లో దేశమంతా విస్తరిస్తూ ఉంది. తొలినాడు ఉక్కు రంగానికి పరిమితమైన ఈ సంస్థ ఇప్పుడు అల్యూమినియమే కాక సిమెంట్, విద్యుత్ ఉత్పాదనలు కూడా చేపడుతున్నది. జిందాల్ సౌత్‌వెస్ట్ అనే అనుబంధ (సబ్సిడియరీ) సంస్థను ఏర్పరచి దాని ద్వారా అల్యూమినియం పరిశ్రమలోకి ప్రవేశించింది. మన రాష్ట్రంలో ఈ సంస్థ పెట్టుబడి 9 వేల కోట్ల రూపాయలు. జిందాల్ గ్రూపుకు కాంగ్రెస్ పార్టీతో గట్టి సంబంధాలున్నాయి. జిందాల్ సోదరుల్లో ఒకరైన నవీన్ జిందాల్ కాంగ్రెస్ తరపున లోక్‌సభ సభ్యుడు. అతనికి ముందు అతని తండ్రి కూడా కాంగ్రెస్ ఎం.పి.యే.


**జిందాల్ సౌత్‌వెస్ట్ అనే అనుబంధ (సబ్సిడియరీ) సంస్థను ఏర్పరచి దాని ద్వారా జిందాల్ కంపెనీ అల్యూమినియం పరిశ్రమలోకి ప్రవేశించింది. మన రాష్ట్రంలో ఈ సంస్థ పెట్టుబడి 9 వేల కోట్ల రూపాయలు. జిందాల్ గ్రూపుకు కాంగ్రెస్ పార్టీతో గట్టి సంబంధాలున్నాయి. జిందాల్ సోదరుల్లో ఒకరైన నవీన్ జిందాల్ కాంగ్రెస్ తరపున లోక్‌సభ సభ్యుడు. అతనికి ముందు అతని తండ్రి కూడా కాంగ్రెస్ ఎం.పి.యే.**


జిందాల్‌వారి అల్యూమినా రిఫైనరీని మొదట విశాఖపట్నం జిల్లా సబ్బవరంలో పెట్టడానికి ప్రయత్నించారు. కాని ప్రజా వ్యతిరేకతను, హెచ్చుగా ఉన్న భూముల ధరలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ఈ నిర్ణయాన్ని మార్చారు. రిఫైనరీని విజయనగరం జిల్లా ఎస్.కోట దగ్గర స్థాపిస్తున్నట్లు 2007 ఏప్రిల్ నెలలో ప్రకటించారు. ప్రజాభిప్రాయ సేకరణ జూన్ 4న జరిగింది. 96 శాతం ప్రజలు వ్యతిరేకించినప్పటికీ 2007 డిసెంబర్‌లో పర్యావరణ అనుమతి ఇచ్చేశారు. రిఫైనరీని నిర్మించబోయే స్థలం కొండల కిందిభాగాన ఉంది. అది చాలా సారవంతమైన ప్రాంతం. తాటిపూడి రిజర్వాయరు వల్ల, కాలవల వల్ల పెరిగిన భూగర్భ జలాలను వినియోగించుకుని బోరు బావుల ద్వారా వరి, చెరుకు పండిస్తున్నారు. విస్తారంగా కొబ్బరిచెట్లు, పెద్దపెద్ద జీడిమామిడి తోటలు

**రిఫైనరీని విజయనగరం జిల్లా ఎస్.కోట దగ్గర స్థాపిస్తున్నట్లు 2007 ఏప్రిల్ నెలలో ప్రకటించారు. ప్రజాభిప్రాయ సేకరణ జూన్ 4న జరిగింది. 96 శాతం ప్రజలు వ్యతిరేకించినప్పటికీ 2007 డిసెంబర్‌లో పర్యావరణ అనుమతి ఇచ్చేశారు.**

ఉన్నాయి. పర్యావరణ అనుమతి పొందిన నెలలోపే అంటే జనవరి 2008 కల్లా వందల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని వేలాది జీడిమామిడి చెట్లను నరికేశారు.

## ఎస్.కోట ఎంపిక

ఎస్.కోట, చత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా గనుల నుండి విశాఖపట్నం పోర్టుకు ఇనుము ముడి ఖనిజాన్ని చేరవేయడం కోసం ఉపయోగించే రైల్వే లైను పైనే ఉండడం వల్ల ఎస్.కోట ఊరి ఎంపికను వ్యూహాత్మకమైనదిగా భావించవచ్చు. బాక్సైట్ ఖనిజాన్ని, అల్యూమినాను కూడా అదే రైల్వేలైను ద్వారా రవాణా చేయవచ్చు. అరకు గనులు ఇక్కడికి కేవలం 5 కి.మీ. దూరంలో ఉంటాయి. ఈ సౌలభ్యాలే కాక భూసేకరణలోని సౌలభ్యం కూడా ఎస్.కోట ఎంపికకు కారణమైనట్లుంది. ఎస్.కోట షెడ్యూల్డు ప్రాంతానికి వెలుపల ఉన్నా నిజానికి ఇక్కడ ఆదివాసీ జనాభా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. షెడ్యూల్డు ప్రాంతంలో చేర్చాలని ఆందోళన చేస్తున్న ఆదివాసీ ప్రాంతాలలో ఇది ఒకటి. అంతేకాక గోస్తనీ నదిపైన కట్టిన తాటిపూడి రిజర్వాయరు వలన నిర్వాసితులైన ఆదివాసులు ఇక్కడకొచ్చి ఉంటున్నారు. ఈ రిఫైనరీ కోసం (220 ఎకరాల ఎర్రమట్టి గుంటలను కలుపుకుని) 1700 ఎకరాల భూమిని సేకరించారు. పునరావాసం కల్పించవలసిన అవసరం రాకుండా ఉండడానికి చాలా నేర్పుగా ఆవాసాలను తప్పించి వ్యవసాయ భూమిని సేకరించారు. కేవలం 40 ఇళ్ల స్థలాలు, పెద్ద మొత్తంలో వ్యవసాయ భూమి తీసుకున్నారు. ఇళ్లు కోల్పోకుండా వ్యవసాయ భూమిని మాత్రం మొత్తంగా లేదా అత్యధికంగా కోల్పోయిన కుటుంబాలు 400 ఉన్నాయి. వీరిలో అత్యధికులు విద్యార్హతలు లేని ఆదివాసులు. వ్యవసాయేతర జీవన విధానానికి అలవాటు పడడం వారికి చాలా కష్టం. ధనవంతుల భూములను, విద్యార్హతలున్న ఎస్.కోట సమీపవాసులైన గిరిజనేతరుల భూములను, సొంత పట్టా ఉన్న భూములను ప్రభుత్వం ఎక్కువగా ముట్టుకోలేదు. ఎందుకంటే వాళ్లు భూసేకరణను తీవ్రంగా ప్రతిఘటించగలరు లేదా ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం డిమాండ్ చేయగలరు.

సేకరించిన భూమిలో దాదాపు మొత్తం అసైన్డ్ భూమే. అప్పుడెప్పుడో ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ చర్యగా ఇచ్చిన భూమి. ఇందులో తాటిపూడి రిజర్వాయరు ముంపు గ్రామాల ఆదివాసులకు పునరావాసం కింద ఇచ్చిన భూమి కూడా ఉంది. నిజానికి అసైన్డ్ భూమిని అమ్మడానికి వీల్లేదు. అది వారసత్వంగా మాత్రమే సంక్రమిస్తుంది. కాని జిందాల్ కోసం సేకరించిన ఈ భూములను

**ఇళ్లు కోల్పోకుండా వ్యవసాయ భూమిని మాత్రం మొత్తంగా లేదా అత్యధికంగా కోల్పోయిన కుటుంబాలు 400 ఉన్నాయి. వీరిలో అత్యధికులు విద్యార్హతలు లేని ఆదివాసులు. వ్యవసాయేతర జీవన విధానానికి అలవాటు పడడం వారికి చాలా కష్టం.**



అనుభవిస్తున్న వారెవ్వరూ అసైన్‌మెంట్ పట్టా ఉన్నవారు కాదు. పట్టాదారుల నుండి అప్పుడెప్పుడో కొనుక్కున్న వారే. దీనివల్ల ఆ భూముల సేకరణ ప్రభుత్వానికి ఇంకా సులభమై పోయింది. అటువంటి భూమిని ఏ నష్టపరిహారం ఇవ్వకుండా వెనక్కి తీసుకునే అధికారం ప్రభుత్వానికి చట్టం ప్రకారం ఉంది. అయినప్పటికీ అలజడి జరగకుండా ఉండడానికి అమ్మినవాళ్లకు, కొన్నవాళ్లకు కూడా నష్టపరిహారం చెరిసగంగా ఇచ్చి చవకగా ఔదార్యాన్ని ప్రదర్శించింది. అది తన ఔదార్యమే తప్ప వారి హక్కు కాదని స్పష్టం చేయడం ద్వారా వారి నోళ్లు మూయించాలని ప్రభుత్వం ప్రయత్నించింది. 'ఇచ్చిన నష్టపరిహారం తీసుకోండి లేకుంటే భవిష్యత్తులో మీకేమీ దక్కదు' అని ప్రభుత్వాధికార్లు ప్రజలను బెదిరించారు.

వ్యవసాయ భూములు సేకరించి ఇళ్లను వదిలిపెట్టడం జరిగిందని పైన చెప్పాం. అధికారికంగా ఈ ప్రాజెక్టు వల్ల ఒక్క గ్రామం మాత్రమే నిర్వాసితమవుతుంది. కాని వాస్తవానికి 7, 8 గ్రామాల ప్రజలు తమ వ్యవసాయ భూమిని దాదాపు పూర్తిగా కోల్పోయి భవిష్యత్తులో తమను తాము ఏవిధంగా పోషించుకోవాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉండబోతారు. అంతేకాక సేకరించని వ్యవసాయ భూములలో ఎర్రమట్టి గుంటల పక్కన ఉన్నవి త్వరలో వ్యవసాయ యోగ్యం కాకుండా పోతాయి. ఈ రెండు కోవలకు చెందినవారిని కూడా నిర్వాసితులుగా చూడడం న్యాయంగా ఉంటుంది కాని, ప్రత్యక్షంగా ఇళ్లు కోల్పోనివారిని లెక్కించకుండా ఉండడం ద్వారా నిర్వాసితులవుతున్న వారి సంఖ్యను కుదించి చూపించాలన్నది ప్రభుత్వం ప్రయత్నం. అసైన్డ్ భూములకు నష్టపరిహారం కూడా ఎకరానికి రెండు లక్షల రూపాయలు మాత్రమే నిర్ణయించారు. అదే ప్రైవేట్ భూములకు ఎకరానికి 20 నుంచి 25 లక్షల రూపాయల దాకా ఇచ్చి కొనుగోలు చేశారు. అసైన్డ్ భూములకిచ్చే రెండు లక్షల రూపాయలు కూడా పట్టాదారుకు సగం, అనుభవదారుకు సగం ఇవ్వడం వల్ల ఒక్కొక్కరికి లక్ష రూపాయలు మాత్రమే లభిస్తాయి. విద్యార్హతలను బట్టి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించబడుతుందని హామీ ఇస్తున్నారు కానీ అటువంటి విద్యార్హతలున్నవారు ఎక్కువగా ఉండబోరు.

## లక్షకు గాను 400 మందికి ఉద్యోగ శిక్షణ!

బాక్సైట్ ఖనిజముండే కొండలు ఏజెన్సీలో ఉండడమే కాక, ఆంధ్రప్రదేశ్‌లో భూములు ఎక్కువగా ఇప్పటికీ ఆదివాసుల చేతులలోనే ఉండే కొద్ది ప్రాంతాలలో అవి ఒకటి. ఇక్కడ బగత, నూకదొర, కొండదొర లాంటి ఆదివాసీ తెగలవారు వ్యవసాయం, చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, కాఫీ తోటల పెంపకం మొదలైన మార్గాలలో జీవనం పొందుతున్నారు. అరకులోయ మండలంలో 55,959 మంది (అందులో 47,005 మంది ఆదివాసులు), అనంతగిరి మండలంలో 44,192 మంది (వారిలో 40,057) మంది ఆదివాసులు) ఈ గనుల చుట్టుపక్కల జీవిస్తుండగా ప్రస్తుతం బాక్సైట్ తవ్వకాలలో పని చేయడానికి ప్రభుత్వం నుండి శిక్షణ పొందుతున్నది 400 మంది! ఈ ప్రాజెక్టుల వలన ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ఇచ్చే హామీకి దీన్నొక మచ్చుతునకగా భావించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థకు ఈ గనులను 2007లోనే లీజుకు ఇచ్చారు. గాలికొండలో 1.45 కోట్ల టన్నుల బాక్సైట్, రక్తకొండలో 86 లక్షల టన్నుల బాక్సైట్ నిల్వలున్నాయి. ఆ తరువాత తవ్వకాలు జరపబోయే వాటిలో ఒరిస్సా సరిహద్దున ఉన్న చిట్టంగొంది ప్రాంతం ఒకటి. అక్కడ 2.85 కోట్ల టన్నుల బాక్సైట్ ఉంది. సప్పర్ల కొండలలో 18.6 కోట్ల టన్నుల బాక్సైట్ నిల్వలున్నాయి. అది జిందాల్ అవసరాలకు కావలసిందానికన్నా చాలా ఎక్కువ. కాని బాగా రవాణా సౌకర్యాలున్న అరకు ప్రాంతంలోని

చిన్న కొండల తవ్వకం మొదట జరిపి ఆ తర్వాత కొంత సమయం తీసుకుని జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న పెద్దగనుల తవ్వకం మొదలు పెట్టవచ్చునని ప్రభుత్వం భావిస్తున్నట్లుంది.

శారదానది, గోస్తనీ నది అరకు కొండల్లో పుడతాయి. గాలికొండ రక్తకొండలే వాటి పరీవాహక ప్రాంతాల మధ్య విభజనరేఖ. రైవాడ జలాశయానికి నీళ్లిచ్చేది శారదానది కాగా తాటిపూడి జలాశయాన్ని నింపేది గోస్తనీ నది. ఖనిజం తవ్వకం ప్రభావం ఈ నదులపై పడితే ఆ జలాశయాల పైన ఆధారపడిన వ్యవసాయం ఏమవుతుందని ప్రభుత్వం ఇంతవరకు ఆలోచించినట్టు లేదు. రక్తకొండ నుండి నీళ్లు పొందే అద్భుతమైన కటికి జలపాతాన్ని సందర్శించడానికి వచ్చే పర్యాటకుల వల్ల స్థానిక ఆదివాసులకు కొంత ఉపాధి లభిస్తోంది. ఖనిజం తవ్వకం వల్ల వాళ్లకు లభించగల ఉపాధి ఏమో కాని ఈ ఉపాధి మాత్రం పోతుంది.

**రక్తకొండ నుండి నీళ్లు పొందే అద్భుతమైన కటికి జలపాతాన్ని సందర్శించడానికి వచ్చే పర్యాటకుల వల్ల స్థానిక ఆదివాసులకు కొంత ఉపాధి లభిస్తోంది. ఖనిజం తవ్వకం వల్ల వాళ్లకు లభించగల ఉపాధి ఏమో కాని ఈ ఉపాధి మాత్రం పోతుంది.**

గనుల తవ్వకాల వల్ల పర్యావరణం మీద పడే ప్రభావాన్ని అంచనా వేసే నివేదికలు ఇప్పటికే తయారయ్యాయి. పర్యావరణ బహిరంగ విచారణ కూడా జరిగింది. పర్యావరణ నివేదికను, పరీవాహక ప్రాంత అభివృద్ధి నివేదికను డెహ్రాడూన్‌లోని ఐసిఎఫ్ఆర్ఇ అనే పర్యావరణ సంస్థ తయారు చేసింది. వన్యమృగాల గురించి కోయంబత్తూరుకు చెందిన సలీం అలీ ఇన్స్టిట్యూట్ పరిశోధన జరిపింది. ఇవి రెండూ కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలోని సంస్థలే. కాంగ్రెస్ పాలనలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టుకు ఇస్తున్న ప్రాముఖ్యం దృష్ట్యా ఈ సంస్థలు తయారు చేసిన నివేదికల విశ్వసనీయత ఎంత అంటే అనుమానమే.

## అన్‌రాక్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం

2007 ఫిబ్రవరి 14వ తేదీన యుఎఆర్‌కు చెందిన రస్ అల్ ఖైమా (రాక్)తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ఒప్పందం చేసుకుంది. జిందాల్ ఒప్పందంలాగే ఈ ఒప్పందంలోనూ ప్రభుత్వం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా రాక్‌కు బాక్సైట్ ఖనిజం సరఫరా చేయడానికి అంగీకరించింది. రాక్ ఈ ఖనిజాన్ని ఏజెన్సీ బయట నెలకొల్పే అల్యూమినా రిఫైనరీలో వాడుకుంటుంది.

సాధారణంగా మీడియాలో కనబడడానికి అవకాశం వస్తే వదులుకోని ఆంధ్రప్రదేశ్ పాలకులు ఈ ఒప్పందాన్ని రహస్యంగా ఉంచారు. నెల రోజుల తర్వాత ఒక తెలుగు దినపత్రిక ఆ వార్త రాసింది. రాక్‌కు అల్యూమినియం సంగతి అటుంచి అసలు పారిశ్రామిక రంగంలోనే అనుభవం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో వారికి సెరామిక్ పెంకుల వ్యాపారం ఒక్కటే ఇదివరకు ఉంది. మధ్యప్రాచ్యానికి చెందిన ఒక చిన్న సంపన్న దేశమైన రాక్ దగ్గర చమురుంది, డబ్బుంది. వాటిని మదుపు పెట్టి అల్యూమినియం ఉత్పత్తి చేయవచ్చన్న ఆలోచన ఉంది. దుబాయ్, ఒమాన్, ఖతార్ మొదలైన మధ్యప్రాచ్య దేశాలు చవకగా దొరికే సహజవాయువును, చమురును ఇంధనంగా వాడే అల్యూమినియం స్మెల్టర్లలో పెట్టుబడులు పెట్టడం జరుగుతున్నది. రాక్ ప్రాజెక్టు కూడా అల్యూమినాను భవిష్యత్తులో మధ్యప్రాచ్యంలోని స్మెల్టరుకు ఎగుమతి చేసే పథకంలో భాగం కావచ్చు.



మధ్యప్రాచ్యానికి చెందిన అనేక అల్యూమినియం కంపెనీలు భారతీయుల యాజమాన్యంలో ఉన్న మాట వాస్తవమే కాని రాక్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదిర్చిపెట్టిన బంధం వేరే ఉంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కోశాధికారి, పెన్నా సిమెంట్స్ యజమాని అయిన పులివెందులవాసి పి. ప్రతాపరెడ్డి 2006లో రాక్‌లో పెట్టుబడులు పెట్టాడు. రాక్‌కు కడప జిల్లాతో సంబంధం వేరే కూడా ఉంది. చెన్నైలో కార్యాలయముండి కడపలో వ్యవహారాలు చేసే ట్రైమెక్స్ అనే బెరైటీసు కంపెనీతో రాక్ చేతులు కలిపి 'రాక్ ఇండో' అనే రియల్ ఎస్టేట్ సంస్థను ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో రియల్ ఎస్టేట్ రంగంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టబోతున్నట్టు రాక్ ఇండో ప్రకటించింది. 16,800 కోట్ల విలువగల వాడరేవు, నిజాంపట్నం రేవులు, వాన్‌పిక్ పారిశ్రామిక కారిడార్లలో రాక్‌కు భాగస్వామ్యం ఉంది.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పెద్దలు భాగస్వాములుగా ఉన్న కారణంగా కాబోలు రాక్ బాక్సైట్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యం ఇవ్వడం జరుగుతున్నది. దానికంటే సంవత్సరన్నర ముందు ప్రారంభమైన జిందాల్ ప్రాజెక్టును ఇది దాదాపు అందుకోబోతున్నది. రాక్ రిఫైనరీ సాలీనా 15 లక్షల టన్నుల అల్యూమినాను ఉత్పత్తి చేస్తుంది. అల్యూమినియం స్మెల్టరు తొలి దశలో 2.5 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇది భవిష్యత్తులో రెండింతలు కావచ్చు.

## గ్రేహౌండ్స్ పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ

రాక్ రిఫైనరీని విశాఖపట్నం జిల్లా మాకవరపాలెంలో నెలకొల్పదల్చారు. కాని గతంలో జిందాల్ కంపెనీ సబ్బవరం ప్రాంతంలో ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భూమిని ఎపిఐఐసి ద్వారా సేకరించారు. ఈ భూమి రాక్ కోసమేనని త్వరలోనే అందరికీ తెలిసిపోయినా ప్రభుత్వం భూసేకరణ జరిగిపోయేదాకా దానిపైన ఎటువంటి వివరణా ఇవ్వలేదు. ఈ భూసేకరణకు ప్రభుత్వం చాలా ప్రాధాన్యం ఇచ్చింది. భూముల సర్వేకు, పంటలు, ఇళ్ల విలువ కట్టడానికి మొత్తం జిల్లా యంత్రాంగాన్ని వినియోగించింది. ఎపిఐఐసి పేరు మీద సేకరించిన కారణంగా భూములను ప్రజాభిప్రాయ సేకరణకు ముందే ప్రభుత్వం స్వాధీనంలోకి తెచ్చుకోవడం సాధ్యమైంది. మాకవరపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ 2008 జూన్ 4న జరిగింది. పూర్తిగా పోలీసుల అదుపులో ఒక తంతులా జరిగింది. విశాఖపట్నం రూరల్ ఎస్.పి. గ్రేహౌండ్స్ పోలీసులను తెచ్చుకుని విచారణను పర్యవేక్షించాడు. ప్రజలకు తమ అభిప్రాయం చెప్పే అవకాశమే ఇవ్వకుండా రెండు గంటలలో విచారణను ముగించేశారు.

జిందాల్ సౌత్‌వెస్ట్ లాగే అన్‌రాక్‌కు కూడా నీళ్లు పోలవరం ప్రాజెక్టు నుండి గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌కు తెచ్చే నీటి నుండి తీసుకుంటున్నారని అంటున్నారు. అయితే రిఫైనరీని ఏలేరు కాలవ ఒడ్డున నెలకొల్పడాన్ని బట్టి వేరే ఆలోచనలు సహితం లేకపోలేదని అర్థమవుతుంది. రిఫైనరీ పక్కనే ఏడాదికి 2.50 లక్షల టన్నుల

**ఈ భూమి రాక్ కోసమేనని త్వరలోనే అందరికీ తెలిసిపోయినా ప్రభుత్వం భూసేకరణ జరిగిపోయేదాకా దానిపైన ఎటువంటి వివరణా ఇవ్వలేదు. ఈ భూసేకరణకు ప్రభుత్వం చాలా ప్రాధాన్యం ఇచ్చి భూముల సర్వేకు, పంటలు, ఇళ్ల విలువ కట్టడానికి మొత్తం జిల్లా యంత్రాంగాన్ని వినియోగించింది.**

అల్యూమినియం ఉత్పత్తి చేసే స్మెల్టర్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందని అన్‌రాక్ రూపొందించిన పర్యావరణ నివేదిక తెలియజేస్తున్నది కాని, రిఫైనరీ అవసరాలను మించి విద్యుదుత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న పవర్ ప్లాంటు ప్రతిపాదన లేదు. సొంత విద్యుత్ ప్రాజెక్టు లేకుండా స్మెల్టర్ నడపడం సాధ్యం కాదు. ఎందుకంటే 30 నిమిషాలు మించి విద్యుత్ కోత ఉంటే స్మెల్టర్‌ను నడపడం అసాధ్యం. కాబట్టి స్మెల్టర్ అసలు చేపడతారా అన్న సందేహం వస్తున్నది. చేపట్టేటట్టయితే దానికి కావల్సిన విద్యుత్తు ఎక్కడినుండి కేటాయిస్తారు? నీటి వనరులాగా ఈ విషయంలోనూ స్పష్టమైన సమాచారం ఏదీ అధికారిక పత్రాలలో చూపలేదు.

## అడవులు మరిన్ని ధ్వంసం

చింతపల్లి సమీపంలో జెర్రెలలో 24.6 (246 million tons) కోట్ల టన్నుల బాక్సైట్‌ను అన్‌రాక్‌కు కేటాయించారు. ఒరిస్సా చత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోలాగా కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గనులూ చిన్న చిన్న కొండలపైన ఎక్కువ మోతాదులో ఉన్నాయి. ఆ రాష్ట్రాలలో ఎక్కువ గనులున్నాయి కాని ఖనిజం పలచగా ఉంది. ఆ రాష్ట్రాలలో లాగా యిక్కడ ఒక కొండ పై భాగంలోని గని నుండి వేరొక కొండ పైనున్న మరొక గనికి కన్వేయరు బెల్టును వేయడం సాధ్యం కాదు. ఒక్కొక్క కొండ పై భాగానికి కింది నుండి రోడ్డు వేసి ఖనిజాన్ని తవ్వి లారీలలో తీసుకుపోవాలి. దీనివల్ల పర్యావరణం, అడవులు మరింతగా ధ్వంసమవుతాయి. ఈ మధ్యనే జెర్రెలకొండ దిగువకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త రోడ్డు వేసింది. అక్కడినుండి మాకవరపాలెంకు ఖనిజాన్ని లారీల్లో తీసుకుపోతారు.

**గనులకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తున్న రాజకీయపార్టీల కార్యకర్తలను నక్సలైట్లుగా చిత్రీకరించి అరెస్టు చేస్తున్నారు.**

చింతపల్లి అడవుల్లో బగత, వాల్మీకి, కోందు తదితర ఆదివాసులు నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో నక్సలైట్లు చాలాకాలంగా పనిచేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక పోలీసు బలగాలు వాళ్లను కొంతమేరకు ఒరిస్సాకు తరిమివేయగలిగారు. అయినా అక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. నక్సలైట్ల పేరుమీద నిర్బంధం కొనసాగుతూనే ఉంది. గనులకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తున్న రాజకీయపార్టీల కార్యకర్తలను నక్సలైట్లుగా చిత్రీకరించి అరెస్టు చేస్తున్నారు.

జెర్రెల గనుల లీజులో జరిగిన అవకతవకల మీద కేంద్ర విజిలెన్స్ కమిషన్ విచారణ జరుపుతున్నది. స్థానిక ప్రజల నుండి వచ్చిన వ్యతిరేకత వల్ల నేలమీద సర్వే జరపకుండానే గనుల ప్రణాళిక తయారుచేయడం జరిగింది. ఎ.పి. ఖనిజాభివృద్ధి సంస్థ సలహాదారు, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఉద్యోగి అయిన ఎం.జి. రావు ఖనిజాభివృద్ధి సంస్థ తరపున లైసెన్స్ కోసం పెట్టిన అర్జీలో జెర్రెల ప్రాంతాన్నంతా చూపించాడు. అందులో కొంత ఒరిస్సాలో ఉండడం వలన అంతటికీ లైసెన్సు రాలేదు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రాంతానికి మాత్రమే వచ్చింది. సర్వే చేసినట్టు చూపించిన స్థలానికి, లీజు పొందిన ప్రాంతానికి మధ్య తేడా ఉన్న కారణంగా సర్వే విస్తీర్ణాన్ని ఎక్కువ చూపించి కన్సల్టెన్సీ ఫీజు ఎక్కువ తీసుకునే అవకాశం అతనికి లభించింది. నేలమీద సర్వే ఎవరూ చేసే పరిస్థితి లేదు కాబట్టి ఈ మోసం బయటపడదని అతడు భావించాడు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ దీనిపై విచారణ జరుపుతున్నది. అయితే వాస్తవ గణాంకాల సేకరణ కోసం సర్వే జరపాలని



ఎప్పుడు ప్రయత్నించినా ప్రజలు తరిమేస్తున్నారు. హెలికాప్టర్ ఉపయోగించాలని ప్రయత్నించినా అది ఎక్కడ నేలపై దిగుతుందో పసిగట్టి చుట్టుముడుతున్నారు.

## బాక్సైట్ ఒప్పందాల భవిష్యత్తు

రాష్ట్రంలోని బాక్సైట్ ఖనిజంలో మూడవ వంతు గురించి ఇప్పటికింకా ఏ ఒప్పందమూ జరగలేదు. అందులో గూడెం, సప్పర్ల ప్రాంతాలలో ఉన్న 4.2 కోట్ల టన్నుల ఖనిజం కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అల్యూమినియం కర్మాగారాన్ని నెలకొల్పే ఉద్దేశంతో దేశంలోనే అతిపెద్ద మైనింగ్ సంస్థ, ఒరిస్సాలో ఒక పెద్ద రిఫైనరీ, స్మెల్టర్ నడుపుతున్న కేంద్రప్రభుత్వ సంస్థ అయిన నాల్కో (నేషనల్ అల్యూమినియం కార్పొరేషన్) చాలాకాలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నది. ఒక దశలో ఒప్పందం అయిపోవచ్చిందన్న ప్రకటన కేంద్ర గనుల శాఖ మంత్రి టి. సుబ్బిరామిరెడ్డి చేశారు. నాల్కో ఛైర్మన్ కూడా ధ్రువీకరించారు. అయినప్పటికీ ఈనాటి దాకా ఏ ఒప్పందమూ జరగలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన సహచరులుగా ఎంచుకున్న జిందాల్ సౌత్‌వెస్ట్, అన్‌రాక్‌లతో పోలిస్తే బాక్సైట్ మైనింగ్‌లోనూ, అల్యూమినియం తయారీలోనూ చాలా అనుభవమున్న నాల్కో ఎంతో యోగ్యతగల సంస్థ. ఆ సంస్థ లాభాలలో నడుస్తున్నది కాబట్టి కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండానే పెట్టుబడులు పెట్టగలనని ప్రకటించింది కూడా. అంతే కాక నాల్కోతో ఒప్పందం చేసుకుని ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ప్రైవేటు కంపెనీలకు బినామీగా వ్యవహరించడం వల్ల వచ్చే అన్ని రకాల చిక్కులను అధిగమించి ఉండవచ్చు. నాల్కో కూడా ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ లాగా ప్రభుత్వరంగ సంస్థే కాబట్టి గనులు తానే నిర్వహించి ఉండవచ్చును. గనుల పక్కనే రిఫైనరీ నెలకొల్పి ఉండవచ్చును. ఏజెన్సీలో ప్రభుత్వ సంస్థ గనులు పెట్టుకుని ఏజెన్సీ బయట ప్రైవేటు సంస్థలు రిఫైనరీలు నడిపే ప్రస్తుత ఏర్పాటు అనవసరమై ఉండేది. నాల్కో సంపాదించిన లాభాలు ప్రభుత్వానికే చెంది ఉండేవి. అవి కేంద్ర ప్రభుత్వానికే చెందినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య లాభాలు పంచుకునే ఒప్పందం చేసుకుని ఉండవచ్చు. ప్రైవేటు కంపెనీలకు ఇవ్వడం వల్ల వచ్చే రాయల్టీ చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. (బాక్స్‌చూడండి) ప్రభుత్వ రంగ సంస్థ నడిపి ఉంటే రాష్ట్ర ఖజానాకు చాలా తేడా వచ్చి ఉండేది. కాని ఖజానాను నింపడం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాధాన్యం కాదు.

**ఒరిస్సా ప్రభుత్వం ప్రైవేటు సంస్థల వైపు మొగ్గు చూపుతున్న రీతిగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాల్కోకు మైనింగ్ లీజులు ఇవ్వడానికి విముఖంగా ఉండడం, దాని బదులు పేరులేని, అనుభవం లేని ప్రైవేటు కంపెనీలను ఎంపిక చేసుకోవడం సమకాలీన ప్రభుత్వాల ప్రాధాన్యతలు ఎక్కడున్నాయో తెలుపుతుంది. రాజకీయ నాయకులకు, వారి బంధువులకు, వారి పార్టీలకు ఈ ప్రాజెక్టుల వల్ల ఏ రకమైన ప్రయోజనం ఒనగూడుతోందో చూస్తే తప్ప ఈ పరిస్థితికి గల కారణాలు అర్థం కావు.**

నిజానికి దేశంలో పెట్టుబడుల మదుపును నిర్ణయించే విధానకర్తలకు నాల్కో అంటే ఎంత చులకనంటే ఆ సంస్థ ఇక్కడ అవకాశాలు లేవని ఖతార్‌లో ఒక స్మెల్టర్‌లో, ఇండోనేషియాలో ఒక బొగ్గు

గనిలో, దక్షిణాఫ్రికాలో ఒక రిఫైనరీలో పెట్టుబడులు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది. పాలక శక్తులకు ఆసక్తి కలిగించడానికి ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఖజానాకు ప్రత్యక్షంగా లాభాలు చేకూర్చిపెడితే సరిపోదు కాబోలు. అదే సమయంలో ప్రధాన ప్రైవేటు అల్యూమినియం కంపెనీలైన హిండాల్కో, వేదాంత దేశంలో అల్యూమినియం రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఒరిస్సాలోని హీరాకుడ్ డ్యామ్ వద్ద హిండాల్కో వారి అల్యూమినియం స్మెల్టర్, ఒరిస్సాలోని జార్సుగూడలోని వేదాంతవారి అల్యూమినియం స్మెల్టరు, అదే రాష్ట్రంలోని లాంజిగడ్‌లో వేదాంతవారి గని, దాని పక్కనే రిఫైనరీ, చత్తీస్‌గఢ్‌లోని మియాపట్‌లో విస్తరించడానికి ఆ కంపెనీ చేస్తున్న ప్రయత్నాలు దీనికి ఉదాహరణలు. ఒరిస్సా ప్రభుత్వం ప్రైవేటు సంస్థల వైపు మొగ్గు చూపుతున్న రీతిగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాల్కోకు మైనింగ్ లీజులు ఇవ్వడానికి విముఖంగా ఉండడం, దాని బదులు పేరులేని, అనుభవం లేని ప్రైవేటు కంపెనీలను ఎంపిక చేసుకోవడం సమకాలీన ప్రభుత్వాల ప్రాధాన్యతలు ఎక్కడున్నాయో తెలుపుతుంది. రాజకీయ నాయకులకు, వారి బంధువులకు, వారి పార్టీలకు ఈ ప్రాజెక్టుల వల్ల ఏ రకమైన ప్రయోజనం ఒనగూడుతోందో చూస్తే తప్ప ఈ పరిస్థితికి గల కారణాలు అర్థం కావు.

## బాక్సైట్ ప్రాజెక్టుల వల్ల లాభం ఎవరికి?

ఖనిజాలతో నిండి ఉన్న మధ్యభారతం అత్యంత పేదరికంలో ఉన్నమాట వాస్తవం. ఇక్కడ పరిశ్రమలు స్థాపించాలని ప్రయత్నిస్తున్నవాళ్లు ఈ పేదవారికి అభివృద్ధి అందిస్తామని హామీ ఇస్తున్నప్పటికీ ఆ అభివృద్ధి దారిద్ర్యాన్ని పెంచడం తప్ప తగ్గించలేకపోతోంది. ఇది ఒక్క భారతదేశమే కాదు అంతర్జాతీయ అనుభవం చెపుతున్న విషయం.

భారతదేశంలో దట్టమైన అడవులున్న ప్రాంతాలు, ఆదివాసీ జనాభా ఎక్కువున్న ప్రాంతాలు, ఖనిజ సంపద విస్తారంగా ఉన్న ప్రాంతాలు ఒక్కటే. ఇక్కడ ప్రాజెక్టులు చేపట్టడమంటే అడవులను నరికివేయడం, నదీ పరీవాహక ప్రాంతాలను నాశనం చేయడం, ఆదివాసీ సమూహాల జీవితాలను ధ్వంసం చేయడమే. కొత్తగా వచ్చిన అటవీ హక్కుల చట్టం ద్వారా ఆదివాసులకు అడవుల్లో హక్కులు కల్పించే నూతన పరిణామాన్ని చూస్తున్నాం. కాని ఖనిజాలను ఏ విధంగా వినియోగించాలి, ఖనిజాల వెలికితీత వల్ల ఆదివాసులకు, అడవులకు కలిగే నష్టాన్ని ఏ విధంగా పరిష్కరించాలి అనే చర్చ జరగడమే లేదు. కార్పొరేట్ ప్రయోజనాల పరిధిలో మాత్రమే ఖనిజాల గురించి చర్చ జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోకి ప్రైవేటు పెట్టుబడులు రావాలని కోరుకుంటున్నది. ఇతర రాష్ట్రాలలాగా కేవలం ఖనిజాల వెలికితీతలోకి పెట్టుబడులు వస్తే సంతృప్తి చెందదడం లేదు. గనుల తవ్వకాల వల్ల సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ప్రయోజనం చాలా తక్కువ. బాక్సైట్ గురించే మాట్లాడుకుంటే ఒక టన్ను ఖనిజం తీస్తే ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ రమారమి వంద రూపాయలు. ఈ రాయల్టీ ప్రభుత్వానికి (అధికారికంగా) ఖనిజాల తవ్వకం నుండి వచ్చే ఏకైక ప్రయోజనం. పరిశ్రమలను ప్రోత్సహించే పేరుమీద వాటి ముడి ఖనిజాల తవ్వకంపైన రాయల్టీని అతి స్వల్పంగా నిర్ణయించడం సంప్రదాయకంగా జరుగుతోంది. అంతేకాక ప్రైవేటీకరణ జరగకముందు ఖనిజ ఆధారిత పరిశ్రమలు ఎక్కువగా సెయిల్, నాల్కో వంటి కేంద్రప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో ఉండేవి. వాటి లాభాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కంటే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. బాక్సైట్ రాయల్టీని లండన్ మెటల్ ఎక్స్ఛేంజిలో నమోదైన అల్యూమినియం ధరలో 0.40 శాతంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత



ధరల ప్రకారం ఒక టన్ను బాక్సైట్ తవ్వి తీసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మైనింగ్ కంపెనీ 86 రూపాయలు రాయల్టీ చెల్లిస్తుంది. జిందాల్ సౌత్‌వెస్ట్, అన్‌రాక్‌లు కలిసి సంవత్సరానికి 75 లక్షల టన్నుల ఖనిజాన్ని తవ్వి తీస్తాయని అంచనా వేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ ఆదాయం ఏడాదికి రూ. 64.5 కోట్లు మాత్రమే. ఇతర ప్రత్యక్ష ఆదాయాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఏమొస్తాయనేది స్పష్టంగా లేదు. గతంలో ఖనిజాల మీద చెల్లించే రాయల్టీపైన సెస్ విధించే ప్రయత్నం జరిగింది కాని ఇనుము, చమురు, సహజవాయువులకు సంబంధించినంతవరకు ఆ విధింపు చెల్లదని కోర్టులు ఆపేశాయి. అది బాక్సైట్‌కు వర్తిస్తుందో లేదో తెలియదు. రిఫైనరీలకు సంబంధించినంతవరకు అమ్మకపు పన్ను తదితర పన్నుల నుండి ప్రభుత్వానికి ఆదాయం బాగానే రావాలి కాని కంపెనీలతో చేసుకుంటున్న ఒప్పందాలలో మెగా ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులకు ప్రత్యేక మినహాయింపులు యిస్తున్నట్లు రాసుకుంటున్నారు. కాబట్టి మొత్తంమీద పన్నులను, రాయల్టీలను కలిపి లెక్కపెట్టినా రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం వచ్చే దాఖలాలు లేవు.

## 30 శాతం లాభాలు

బాక్సైట్ ప్రాజెక్టులలో ఉండే విపరీతమైన లాభాలు ప్రభుత్వరంగ సంస్థ అయిన నాల్కోను చూస్తే తెలుస్తుంది. 2006-07 సంవత్సరంలో నాల్కో 6515 కోట్ల రూపాయల స్థూల అమ్మకాల నుండి 3620 కోట్ల రూపాయల స్థూల లాభాలను ఆర్జించింది. అంటే స్థూల లాభం 56 శాతమన్నమాట అందులో కేంద్ర ప్రభుత్వానికి 574 కోట్లు ఎక్సైజ్ సుంకం రూపంలో, 1239 కోట్లు పన్నుల రూపంలో, 140 కోట్లు డివిడెండ్ల రూపంలో, 73 కోట్ల డివిడెండ్లపైన పన్నుల రూపంలో లభించింది. అంటే నికర లాభం 2026 కోట్లు లేదా 30 శాతం అన్నమాట.

నాల్కో ఒక టన్ను ముడి ఖనిజాన్ని రూ. 22,500కు, ఒక టన్ను అల్యూమినియాన్ని 1.45 లక్షల రూపాయలకు అమ్ముతుంది. అన్‌రాక్ ఏడాదికి 10 లక్షల అల్యూమినాను, 2.50 లక్షల అల్యూమినియాన్ని తయారు చేయబోతోంది. జిందాల్ ఏడాదికి 14 లక్షల టన్నుల అల్యూమినాను ఉత్పత్తి చేయబోతుంది. ఈ లెక్కల ప్రకారం అన్‌రాక్ ఉత్పత్తుల మార్కెట్ విలువ ముడి ఖనిజానికి 2250 కోట్లు, అల్యూమినాకు 3620 కోట్లు ఉంటుంది. జిందాల్ ఉత్పత్తుల మార్కెట్ విలువ ఏడాదికి కనీసం 3150 కోట్లు ఉంటుంది. నాల్కో సంపాదించే లాభాలతో సమానంగా కాకున్నా కనీసం 40 శాతం లాభం వీరు సంపాదిస్తారని అనుకున్నా అన్‌రాక్ సంవత్సరానికి 2350 కోట్ల స్థూల లాభాలను, జిందాల్ సౌత్‌వెస్ట్ 1260 కోట్ల స్థూల లాభాలను సంపాదించబోతాయి. జిందాల్ సౌత్‌వెస్ట్ పెట్టబోయే 4000 కోట్ల పెట్టుబడిని మూడేళ్ల కంటే కొద్ది ఎక్కువ కాలంలోనే రాబట్టుకుంటుంది. అన్‌రాక్ పెట్టబోయే 7020 కోట్ల పెట్టుబడిని మూడేళ్ల లోపలే

**ఈ కంపెనీలకు ఖనిజాన్ని అమ్మే ధరను ప్రభుత్వం నియమించే ఒక కమిటీ నిర్ణయిస్తుంది. 'ఉత్పాదక వ్యయం ఆధారిత' ధర వసూలు చేస్తామని అవగాహనా ఒప్పందంలో ప్రభుత్వం వారికి హామీ ఇచ్చింది. మార్కెట్ ధర ప్రకారం ముడిఖనిజం ధరను నిర్ణయిస్తే ప్రభుత్వానికి ఎన్నో రెట్లు లాభం వచ్చేది కాని ప్రభుత్వం ఆ అవకాశానికి ఒప్పందంలోనే తిలోదకాలు ఇచ్చింది.**

రాబట్టుకుంటుంది. ఈ కంపెనీలకు ఖనిజాన్ని అమ్మే ధరను ప్రభుత్వం నియమించే ఒక కమిటీ నిర్ణయిస్తుంది. 'ఉత్పాదక వ్యయం ఆధారిత' ధర వసూలు చేస్తామని అవగాహనా ఒప్పందంలో ప్రభుత్వం వారికి హామీ ఇచ్చింది. మార్కెట్ ధర ప్రకారం ముడి ఖనిజం ధరను నిర్ణయిస్తే ప్రభుత్వానికి ఎన్నో రెట్లు లాభం వచ్చేది కాని ప్రభుత్వం ఆ అవకాశానికి ఒప్పందంలోనే తిలోదకాలు ఇచ్చింది.

నియంగిరి కేసులో సుప్రీంకోర్టుకు సిఇసి సమర్పించిన నివేదికలో ఖనిజం ధరను నిర్ణయించే పేరు మీద కంపెనీకి సబ్సిడీ ఇవ్వకూడదని, లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో నమోదయ్యే అల్యూమినియం ధరలో ఒక శాతాన్ని ఖనిజం ధరగా నిర్ణయించాలని సూచించడం జరిగింది. ప్రస్తుత ధరల్లో అది టన్నుకు 1210 రూపాయలవుతుంది. 75 లక్షల టన్నుల బాక్సైట్‌ను వెలికి తీసేటట్టయితే రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థకు 907.5 కోట్ల ఆదాయం లభించేది. తన కొచ్చే ఆదాయంలో 20 శాతం ఆదివాసీ అభివృద్ధి నిధికి ఇస్తానని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ హామీ ఇచ్చింది కాబట్టి ఖనిజం ధర ఎంత ఉంటుందనేది స్థానిక ప్రజలకు ఎంతో ముఖ్యమైన విషయం.

గనుల కోసం, రిఫైనరీల కోసం భూములు కోల్పోయిన ప్రజలకు ఈ కంపెనీల వల్ల వచ్చే ప్రధాన ప్రయోజనం ఉద్యోగాలని అంటున్నారు. ఇప్పటివరకు 400 మంది ఆదివాసీ యువకులను గుర్తించి శిక్షణ కోసం కడప జిల్లాలోని బెరైటీస్ గనులకు పంపారు. అధికారికంగా వీటిని నడుపుతున్నది రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ అయినప్పటికీ నిజానికివి నడుస్తున్నది ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి బంధువులైన కాంట్రాక్టర్ల అజమాయిషీలో. ఈ యువకులకు నెలకు 3000 రూ. స్టయిఫండ్ ఇచ్చారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగం దొరుకుతుందన్న హామీ ఇచ్చారు. అయితే అరకు లోయలోని బాక్సైట్ కొండల సమీపగ్రామాలలో వాకబు చేయగా వాటిలో ఒక గ్రామం నుండి మాత్రమే యువకులు శిక్షణకు వెళ్ళారని తెలిసింది. అది కూడా కొద్దిమంది మాత్రమే. ఇతరులు దూరప్రాంతాలకు చెందినవారు. బహుశా అందువల్లనే వారు ప్రాజెక్టు పట్ల అంత ఉత్సాహం చూపుతున్నారేమో. భారీగా యంత్రాలను వినియోగించే ఈ మైనింగ్ ప్రక్రియలో ప్రస్తుతం శిక్షణ పొందుతున్న ఈ 400 కంటే ఎక్కువ మందికి పని కల్పించడం కల్ల. కాబట్టి మైనింగ్ వల్ల స్థానిక ఉపాధి పరిస్థితిలో పెద్దగా తేడా ఉంటుందనుకోవడం సత్యదూరం. అరకులోయ జనాభా దాదాపు ఒక లక్ష ఉందని ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి.

## కల్పించే ఉపాధి కన్నా తీసేసుకునేదే ఎక్కువ

అదేవిధంగా అన్‌రాక్ రిఫైనరీలో ఉన్న 2000 ఉద్యోగాలు, జిందాల్ సౌత్‌వెస్ట్ రిఫైనరీలో ఉన్న 750 ఉద్యోగాలు స్థానిక ఉపాధి మార్కెట్‌లో పెద్ద మార్పు తీసుకురాబోవు. కనీసం భూసేకరణ వల్ల కోల్పోయిన ఉపాధితో పోల్చినా అవి న్యాయం చేయబోవు. జిందాల్ సౌత్‌వెస్ట్ రిఫైనరీ పెట్టబోయే ఎస్.కోట మండలం జనాభా 74,413. ఈ రిఫైనరీ వల్ల నిర్వాసితులైన 400 కుటుంబాలలో ఒక్కొక్క కుటుంబానికి ఇద్దరు చొప్పున సొంత భూముల్లో పనిచేసేవారని, మరొక ఇద్దరు కూలివాళ్ళకు ఆ భూమిలో పని దొరికేదని అనుకున్నా, ఈ 750 ఉద్యోగాలు వారికే ఇస్తారని అనుకున్నా ఈ రిఫైనరీ కొత్తగా ఉపాధి కల్పించకపోగా ఉన్నది పోగొడుతున్నదని చెప్పవచ్చు. కాగా ఈ రిఫైనరీ వల్ల పెరిగే కాలుష్యం కారణంగా, అధికం కాగల నీటి ఎద్దడి కారణంగా జరగబోయే నష్టాన్ని ఏ విధంగా పూడుస్తారు? కనీసం ప్రభుత్వానికైనా రిఫైనరీ నిర్వహణ నుండి చెప్పుకోదగ్గ మోతాదులో పన్నులు లభిస్తాయా? లేక ప్రోత్సాహకాల పేరిట వాటిని కూడా వదులుకుంటారా? ఒకవేళ లభిస్తే వాటిని విజయనగరం జిల్లాలోను, ఎస్.కోట ప్రాంతంలోను



ప్రజల క్షేమం కోసం ఖర్చు పెట్టబోతారా? ప్రజలకు ఈ అభివృద్ధి వల్ల ప్రయోజనం అంటున్నారు కానీ నిజానికి ఎవరికి ప్రయోజనం అన్న ప్రశ్న వేసుకోవాలి.

## గనులు-రాజకీయాలు

గనుల నుండి లభించే వ్యక్తిగత  ఆదాయ అవకాశాలను, అవి రాజకీయాలలో పోషించగల ముఖ్యమైన పాత్రను ఈ మధ్యనే జరిగిన కర్నాటక ఎన్నికలలో చూశాం. బళ్లారికి చెందిన ఇనుపగనుల యజమానులంతా రాజకీయాల్లో దిగారు. బిజెపికి చెందిన గాలి జనార్ధన్ రెడ్డి గెలిచి కొత్త ప్రభుత్వంలో పర్యాటక శాఖ మంత్రి అయ్యాడు. ఆంధ్రప్రదేశ్ గురించి చెప్పుకునేటట్టయితే ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి కుటుంబానికి కడప జిల్లాలోని బెరైటీస్ గనుల తవ్వకంపైన, వర్తకంపైన చాలా సంవత్సరాలుగా ఉన్న గుత్తాధిపత్యం విదితమే. బలవంతులైన రాజకీయ నాయకులలో చాలా మందికి మైనింగ్ ఓ ప్రధాన వ్యాపకం. రాజ్యసభ సభ్యుడు, మైనింగ్ శాఖ మంత్రి అయిన టి. సుబ్బిరామిరెడ్డి పెద్ద కాంట్రాక్టరు, గాయత్రి ప్రాజెక్ట్స్ యజమాని. ఆ సంస్థకు గతంలో నాల్కో నుండి కాంట్రాక్టులు ఉండేవి. అందువల్ల అతని సంస్థ ప్రధానంగా పనిచేసేది రహదారుల రంగంలోనే అయినప్పటికీ మైనింగ్‌లో పెట్టుబడులను ప్రోత్సహించడంలో అతనికి వ్యక్తిగత ఆసక్తి ఉంది. జిందాల్ ప్రాజెక్టులను వెనకేసుకు రావడంలో మొదటి దశలో రాష్ట్ర వర్తకపు పన్నుల శాఖ మంత్రి కొణతాల రామకృష్ణ, ఆ ప్రాజెక్టు విజయనగరం జిల్లాకు పోయిన తర్వాత రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి బొత్సా సత్యనారాయణ చాలా ఆసక్తి చూపించారు. ఈ మంత్రులిద్దరికీ మైనింగ్ శాఖలో బాధ్యతలు లేవు. తమ మద్దతు గట్టిగా తెలపడం ద్వారా ప్రాజెక్టుకు స్థానిక ప్రజల మద్దతు కూడగట్టడంలో వారి ప్రయోజనాలు ఏవో ఇమిడి ఉండాలి.

## ముగింపు

ప్రజా ప్రయోజనం కోసం, అభివృద్ధి కోసం పెట్టే పెట్టుబడులుగా పరిశ్రమలను చూపిస్తారు కాని కొంచెం అధ్యయనం చేస్తే ప్రయోజనాలన్నీ ప్రైవేటు కంపెనీలకు, అందులోనూ రాజకీయ బాంధవ్యం బలంగా ఉన్నవారికి దక్కుతున్నాయని, భూములు, ఉపాధి కోల్పోవడం వలన కలిగే వ్యయాన్ని, పర్యావరణ విధ్వంసం వల్ల కలిగే వ్యయాన్ని ప్రజలే భరిస్తున్నారని  అర్థమవుతుంది. పరిశ్రమల్లో భాగస్వాములను ఎంపిక చేసే తీరు, ప్రాజెక్టుల ప్రణాళికా రచన చేసే తీరు చూస్తే పారిశ్రామికవేత్తలతో దగ్గర సంబంధాలున్న రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు తమ వ్యక్తిగత లాభాల కోసం పెద్దపీట వేసుకుంటున్న విషయం కనబడుతుంది. అనుభవమున్న ప్రభుత్వరంగ సంస్థల బదులు (ఉదాహరణకు నాల్కో) అనుభవం లేని ప్రైవేట్ పారిశ్రామిక సహచరులను (ఉదాహరణకు జిందాల్ సౌత్‌వెస్ట్, అన్‌రాక్) ఎంపిక చేయడం వల్ల ప్రభుత్వానికొచ్చే ఆదాయం తక్కువ. ఉపాధి తదితర ప్రయోజనాలు తక్కువ. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాటినే ఎంచుకోవడానికి ఇది తప్ప వేరే కారణం కనబడదు. రాజకీయ లక్ష్యంతో చేపట్టే మైనింగ్ ప్రాజెక్టుల ప్రణాళికా రచన, అమలు, నియంత్రణ ఎన్నికల కోసం నిధులు సమకూర్చుకునే దృష్టితో వ్యవహరించే వారి అదుపులో ఉన్నపుడు స్థానిక ప్రజలకు ప్రయోజనం ఒనగూడుతుందని ఆశించలేం.

◆◆◆

# జీవో నెం. 68

ప్రాజెక్టు బాధితుల కుటుంబాల కోసం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస విధానం 2005

## అధ్యాయం - 1

1.0 **పరిచయం**

1.1 మౌలిక వనరుల ప్రాజెక్టులతో సహా వివిధ ప్రజా ప్రయోజనాల కొరకు తప్పనిసరి అయిన భూస్వాధీనం వల్ల ప్రజలు వారి నివాసాలు, ఆస్తులు, జీవనోపాధి వనరులు కోల్పోవలసి వస్తున్నది. నిర్వాసితులు కావడం మూలంగా ఇతర మానసిక, సామాజిక, సాంస్కృతిక ఒత్తిడులకు కూడా గురవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధ్యమయినంత వరకూ నిర్వాసిత సమస్యను తగ్గించాల్సిన అవసరం ఉందని భావించింది. ప్రజలు నిర్వాసితులు కావలసిన తప్పనిసరి పరిస్థితులలో అత్యంత జాగ్రత్తగా మానవీయ కోణంలో, ముందు చూపుతో నిర్వాసిత బాధిత కుటుంబాలకు పునరావాసం ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వం అభిప్రాయపడింది. ముఖ్యంగా ఆదివాసులు, చిన్న, సన్నకారు రైతులు, మహిళల విషయంలో ఇటువంటి విధానం అత్యంత అవసరం.

1.2 ప్రస్తుతమున్న వ్యవస్థలో ప్రజలు ప్రభుత్వానికి సాగుభూమిని, నివాసాలను, ఇతర వనరులను అప్పగిస్తున్నారు. దానికి వారు ఇచ్చే నగదు నష్టపరిహారం తరచుగా మళ్లీ ఆ వనరులను పొందడానికి సరిపోదు. కేవలం జీవనోపాధి కోసమే భూమిని సాగుచేసుకుంటున్న వ్యవసాయ కార్మికులు అటవీ ఉత్పత్తుల మీద జీవనం సాగిస్తున్నవారు, కౌలుదారులు, చేతి వృత్తుల వారి నిర్వాసిత సమస్య చాలా తీవ్రంగా ఉంటుంది. అయినా వీరు ఇప్పటి వరకు డబ్బు రూపేణా పరిహారానికి అర్హులు కాదు.

1.3 ఈ విధానం ప్రధానంగా నిర్వాసితులయిన స్థిరాస్థులు లేని గ్రామీణ నిరుపేదలు, సన్న-చిన్నకారు



రైతులు దళితులు/ఆదివాసీలు, మహిళలకు న్యాయం చేయడానికి ఉద్దేశించినట్టిది. దీనికి తోడు ప్రాజెక్టు బాధిత కుటుంబాలు, నిర్వాసిత కుటుంబాల పునరావాస చర్యల అమలుకోసం ప్రభుత్వ అధికారులకూ వారికీ మధ్య స్వేచ్ఛా వాతావరణంలో ఫలప్రద చర్చలు జరగడానికి కూడా ఉద్దేశింపబడినది. ఇటువంటి చర్చలు ప్రాజెక్టులు నిర్ధారిత సమయంలో పూర్తి కావడానికి, నిర్వాసితులు, ముఖ్యంగా ఏ ఆధరువు లేని నిరుపేదల అవసరాల పట్ల దృష్టి కేంద్రీకరించడానికి ఉపయోగపడతాయి. చర్చలు, సంప్రదింపులకు వెసలుబాటు కల్పించడం ద్వారా అంగీకారం పొందిన ప్యాకేజీకి అన్ని వర్గాల నుంచి ఆమోదం లభించగలదనీ ఇరు పార్టీల వారికి ఒక పరిష్కార సాధనంగా ఇది ఉపయోగపడగలదనీ భావన.

1.4 ప్రాజెక్టు బాధిత, నిర్వాసిత కుటుంబాలకు ఉద్దేశించినది ఈ విధానం. దీనిలో నిర్వచించిన ప్రాజెక్టులకు, దీనికింద ప్రకటించిన ప్రాజెక్టులకు ఇది వర్తిస్తుంది.

1.5 నిర్వాసిత, పునరావాస అధికారి ఈ పథకాన్ని తు.చ. తప్పకుండా అమలు పర్చాలి. ఈ విధానం ద్వారా రూపొందించిన సహాయక ప్రయోజనాలు బాధిత కుటుంబాలకు, ప్రత్యేకించి దళిత/ఆదివాసీ తదితర నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూరాలి.

## అధ్యాయం - 2

2.0 **ఈ విధానం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు**

ఈ విధానం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

2.1 విస్థాపనను తగ్గించడం, ఎవరినీ నిర్వాసితులు చేయని, లేదా అతి తక్కువ మందిని నిర్వాసితులను చేసే ప్రత్యామ్నాయాలను గుర్తించడం.

2.2 ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు, నిర్వాసిత కుటుంబాలకు పునరావాస పథకాన్ని రూపొందించడం. ముఖ్యంగా ఆదివాసీలు, నిరుపేద కుటుంబాలపట్ల ప్రత్యేక శ్రద్ధ కనపర్చడం.

2.3 ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు, నిర్వాసిత కుటుంబాలకు మంచి జీవన ప్రమాణాల వసతులు కల్పించడం.

2.4 ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు, భూమిని కోరుకుంటున్న సంస్థకు మధ్య సుహృద్భావ వాతావరణం, సహకారం ఉండేలాగ చూడడం.

## అధ్యాయం - 3

3.0 **ప్రామాణికాలు**

ఈ విధాన పత్రంలో వాడిన వివిధ పదాలకు ప్రామాణికాలు ఈ విధంగా ఉంటాయి.

3.1 'పునరావాస పాలనాధికారి' అంటే రాష్ట్ర ప్రభుత్వంచే సంబంధిత ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు, నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడానికై నియమించబడిన జాయింట్ కలెక్టర్ హోదాకు తక్కువ కాని వ్యక్తి. ఒకవేళ ఆ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినదయితే, ఈ నియామకం చేసేముందు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలి.

3.2 'ప్రభావిత ప్రాంతం' అంటే 1) ఆ ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం కింద మునిగే భూమి 2) దానికి 100

మీటర్ల లోపల ఉన్న నివాసాలు. ఈ విధాన పత్రంలోని పేరా 5.1 కింద, భూసేకరణ చట్టం కిందగానీ వేరే ఏదయినా చట్టంకిందగానీ ప్రాజెక్టు కోసం భూసేకరణ చేసినప్పుడు ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుంది.

3.3 'వ్యవసాయ కుటుంబం' అంటే కుటుంబ పోషణార్థం ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడినటువంటిది. భూమి స్వంతదారులు, కౌలుదారులు, ఉపకౌలుదారులు ఈ నిర్వచనంలోకి వస్తారు. అటవీ భూమి అనుభవిస్తున్నవారు, చిన్న తరహా అటవీ ఫల సేకరణపైన ఆధారపడినవారు కూడా దీనిలోకి వస్తారు.

3.4 'వ్యవసాయ కూలి' అంటే ఒక ప్రాంతాన్ని 'ప్రభావితప్రాంతం'గా ప్రకటించడానికి కనీసం మూడు సంవత్సరాలు ముందునుండి ఆ ప్రాంతంలో నివసిస్తూ ఉండి, ఆ ప్రాంతంలో ఎటువంటి భూమి లేకుండ ఉండి, తమ జీవనార్థం వ్యవసాయ భూమిలో శారీరక శ్రమ చేస్తూ ఉండి, భూసేకరణ ఫలితంగా జీవనాధారం కోల్పోయినట్టు గ్రామసభ విచారించి నిర్ధారించినవారు.

3.5 'వ్యవసాయ భూమి': ఈ క్రిందివాటికోసం ఉపయోగిస్తున్న, ఉపయోగపడగల భూమి.

(ఎ) వ్యవసాయానికి లేదా పండ్ల తోటలకు

(బి) పాడి పశువుల పెంపకం, కోళ్ళ పెంపకం, చేపల పెంపకం, పశు సంవర్ధక బ్రీడింగ్ కేంద్రాలు, నర్సరీలు, మూలికా వనాలు.

(సి) పంటలు పండించడానికి, గడ్డి పెంపకానికి లేదా తోటలకు.

(డి) పశువుల పచ్చిక మేత కొరకు వ్యవసాయదారులు ఉపయోగిస్తున్న భూమి, అయితే కేవలం కలప కోత కోసం ఉపయోగిస్తున్న భూమి ఈ పరిధిలోకి రాదు.

3.6 'సంబంధిత ప్రభుత్వమ'ంటే–

ఎ) కేంద్ర ప్రభుత్వం అవసరాల కొరకు భూసేకరణ జరుపుతున్నట్టయితే కేంద్ర ప్రభుత్వం.

బి) ప్రాజెక్టు నిర్వహణ చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ లేదా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు పొందినటువంటి ఇతర సంస్థ అయితే కూడ కేంద్ర ప్రభుత్వం.

సి) ఇతర ప్రయోజనాల కొరకు భూమిని సేకరిస్తున్నట్టయితే రాష్ట్ర ప్రభుత్వం –

3.7 'బి.పి.ఎల్ కుటుంబం': భారతదేశ ప్రణాళిక కమీషను చేత నిర్ధారింపబడే దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబం –

3.8 'ప్రాజెక్టు': ఈ విధానపత్రం కింద ప్రాజెక్టుగా ప్రకటించబడినట్టిది, ఈ క్రింది మోతాదులో విస్థాపన కలిగించేది.

ఎ) మైదాన ప్రాంతాలలోనయితే 100 గానీ అంతకంటె ఎక్కువ కుటుంబాలుగానీ

బి) ఆదివాసీ ప్రాంతం లేక షెడ్యూల్డు ప్రాంతంలోనయితే (ఇళ్లనుండి, భూములనుండి) 25 కుటుంబాలు

3.9 'నిర్వాసితుల పునరావాస కమీషనరు' అంటే రాష్ట్ర ప్రభుత్వంచే ఈ విధానంకింద నియమించబడ్డ అధికారి. ఆ అధికారి కమీషనరు/కార్యదర్శి హోదా గల అధికారి అయి ఉండాలి.



3.10 'కుటుంబం' అంటే ఒక వ్యక్తి, ఆ వ్యక్తి యొక్క భర్త/భార్య, మైనరు కుమారులు, అవివాహిత కుమార్తెలు, మైనరు సోదరులు లేదా అవివాహిత సోదరీమణులు, తండ్రి, తల్లి, ఆ వ్యక్తిపైన జీవనం కోసం ఆధారపడిన ఇతర కుటుంబ సభ్యులు.

3.11 'స్వాధీనంలో ఉన్న భూమి' అంటే ఒక వ్యక్తికి చెందిన మొత్తము భూమి. అది స్వంత ఆధీనంలో ఉండవచ్చు లేదా మరొకరికి కౌలుదారుగా కలిగి ఉండవచ్చు.

3.12 'చిన్నకారు రైతు' అంటే ఒక హెక్టారు మెట్ట భూమి లేదా అర్థ హెక్టారు తరిభూమి కలిగి ఉన్న లేదా దామాషాలో రెండింటిని కలిగి ఉన్న వ్యవసాయదారు.

3.13 'వ్యవసాయేతరకూలీ' అంటే వ్యవసాయ కూలీ కాని వ్యక్తి. ప్రభావిత ప్రాంతంలో నివసిస్తూ ఉండి, ప్రకటన సమయం నుంచి మూడు సంవత్సరాలకు తక్కువ గాకుండా కాపురముంటూ భూమిలేక కేవలం శారీరక కష్టం మీదగానీ గ్రామీణ వృత్తిమీద గానీ ఆధారపడి బతుకుతూ ప్రతిపాదిత ప్రాజెక్టువల్ల జీవనోపాధి కోల్పోతున్నవాడు.

3.14 'ప్రకటన' అంటే అధికారిక గెజెట్‌లో ప్రచురించినది.

3.15 'స్వాధీనతదారులు' అంటే 25 అక్టోబరు, 1980కి ముందు అటవీ భూమిని స్వాధీనంలో ఉంచుకున్న ఆదివాసులు.

3.16 'ప్రాజెక్టు బాధిత కుటుంబం' అంటే

ఎ) ప్రభావిత ప్రాంతంలో ప్రకటన కంటే మూడు సంవత్సరాల ముందు నుండి ఉంది, ప్రాజెక్టు కోసం భూసేకరణ చేపట్టిన కారణంగా తమ జీవనాధారాన్ని చెప్పుకోదగ్గ మోతాదులో కోల్పోయిన కుటుంబం. లేదా భూమి కలిగి ఉన్నా లేకున్నా సంబంధిత ప్రాంతంలో మూడు సంవత్సరాలుగా ఏదయినా వృత్తి లేక వ్యాపారం చేస్తూ తమ జీవనాన్ని చెప్పుకోదగ్గ మోతాదులో కోల్పోయిన కుటుంబం.

బి) కుటుంబానికి చెందిన భూమిలో 50 శాతం పైగా సేకరణలో కోల్పోగా మిగిలిన భూమి అయిదు ఎకరాలు మెట్ట లేదా రెండున్నర ఎకరాలు తరి లేదా ఇదే దామాషా మీద రెండు రకాల భూమిని కలిగి ఉన్న కుటుంబాలు.

సి) ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబం.

3.17 'ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబం' అంటే ప్రతిపాదిత ప్రాజెక్టుకు జరిగిన భూసేకరణలో తన నివాసాన్ని పోగొట్టుకున్న నిర్వాసిత కుటుంబం.

3.18 'పునరావాస ప్రాంతం': ఈ విధానంలోని పేరా 5.12 ప్రకారం ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడానికి స్వాధీనం చేసుకుని లేక చేసుకోవాలని నిర్ణయించుకొని, పునరావాస ప్రాంతంగా ప్రకటించిన భూభాగం.

3.19 'కోరుతున్న సంస్థ': అంటే భూమిని ఏ కంపెనీ లేక వ్యాపార సంస్థ లేక ఇతర సంస్థకోసం సంబంధిత ప్రభుత్వం సేకరిస్తున్నదో, ఆ కంపెనీ లేక వ్యాపార సంస్థ. భూసేకరణ ఆ ప్రభుత్వం అవసరాలకోసం, లేదా భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాల కోసం ఏదయినా సంస్థ లేక కంపెనీకి లీజుద్వారాగానీ ఏ రూపంలోనయినా గానీ బదలాయించడం కోసం, చేస్తున్నట్టయితే సంబంధిత ప్రభుత్వమే 'కోరుతున్న సంస్థ' అవుతుంది.

3.20 'సన్నకారు రైతు' అంటే ఒక హెక్టారు కంటే ఎక్కువ, రెండు హెక్టారుల కంటె తక్కువ మెట్టభూమిని లేదా అర్థ హెక్టారుకంటే ఎక్కువ, ఒక హెక్టారు కంటె తక్కువ తరి భూమి కలిగిఉన్న సాగుదారు.

3.21 'చెప్పుకోదగ్గ ప్రభావం': అంటే ప్రాజెక్టు బాధిత కుటుంబం ఆదాయం వారి భూమినిగానీ ఇతరుల భూమినిగానీ సేకరించడం వలన గడచిన మూడు సంవత్సరాల కాలంలో వ్యవసాయం నుండి, ఇతర మూలాలనుండి వారు పొందిన ఆదాయంతో పోల్చినప్పుడు 50 శాతం తగ్గిపోయి ఆ కుటుంబం స్థితి దారిద్రరేఖకు దిగువస్థాయికి పడిపోవడం.

3.22 'ఆదివాసీ ప్రాంతాలు' అంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యొక్క గిరిజన సంక్షేమ శాఖ చేత ఆయా కాలాల్లో ప్రకటించబడిన ప్రాంతాలు.

## అధ్యాయం - 4

**4.0 పునరావాసం కొరకు పాలనాధికారి, కమీషనర్ల నియామకం వారి అధికారాలు, విధులు.**

4.1 సంబంధిత ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టుకు జరిగే భూసేకరణ వల్ల ప్రజలు భూములు, నివాస ప్రాంతాలు కోల్పోయి నిర్వాసితులయ్యే సమస్య ఉత్పన్నమవుతున్నట్లుగా భావిస్తే, ఒక ప్రకటన ద్వారా ఆ ప్రాజెక్టుకు జాయింట్ కలెక్టర్ స్థాయికి తగ్గకుండా ఒక అధికారిని పునరావాస పాలనాధికారిగా నియమిస్తుంది.

4.2 పునరావాస పాలనాధికారికి సహాయంగా ప్రభుత్వం అధికారులను, ఉద్యోగులను నియమిస్తుంది.

4.3 సంబంధిత ప్రభుత్వం పునరావాస కమీషనర్‌లు ఇచ్చే ఆదేశాలకు, నియంత్రణకు లోబడి పునరావాస పాలనాధికారి ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాజెక్టు బాధితకుటుంబాల పునరావాసానికి సకల చర్యలు చేపట్టాలి.

4.4 పునరావాస పథకం రూపకల్పన, దాని అమలు పునరావాస పాలనాధికారి పర్యవేక్షణలోను నియంత్రణలోను జరుగుతాయి.

4.5 సంబంధిత ప్రభుత్వం జారీచేసే సాధారణ లేదా ప్రత్యేక ఉత్తర్వులకు లోబడి పునరావాసాన్ని పాలనాధికారి ఈ క్రింది కర్తవ్యాలు, విధులను నిర్వర్తిస్తారు.

ఎ) భూమి అవసరమయ్యే సంస్థతో సంప్రదించి నిర్వాసిత సమస్య ఉత్పన్నం కాని ఇతర ప్రత్యామ్నాయాలను లేదా సాధ్యమయినంత వరకూ నిర్వాసిత సమస్య తక్కువగా ఉండే ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తారు.

బి) పునరావాస పథకాన్ని విధి విధానాల్ని రూపొందించేటప్పుడు ప్రాజెక్టు బాధిత కుటుంబాలతో చర్చలు జరుపుతారు.

సి) తీవ్రంగా నష్టపోతున్న ప్రాజెక్టు బాధిత కుటుంబాలు, ఆదివాసీ తెగలు, బలహీనవర్గాల ప్రయోజనాల్ని కాపాడతారు.

డి) ఈ విధానంలోని అధ్యాయం 5, 6 ల ప్రకారం పునరావాస పథకం ముసాయిదాను రూపొందిస్తారు. ప్రాజెక్టు బాధితులలో షెడ్యూల్డ్ తెగలు ఉన్నట్లయితే సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ) ప్రాజెక్టు అధికారిని, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారిని ముసాయిదా తయారీలో సంప్రదించాలి.



ఇ) ఎవరి కోసమైతే భూమిని స్వాధీనం చేసుకుంటున్నారో ఆ సంస్థను, ప్రాజెక్టు బాధిత కుటుంబాలను సంప్రదించి భూమి సేకరణ, పునరావాస ప్రక్రియలలో దేనికెంత అవసరమో వివరంగా బడ్జెటు ప్రణాళిక రూపొందిస్తారు.

ఎఫ్) ప్రాజెక్టు అవసరాలకు సరిపడ భూమిని, బాధిత కుటుంబాల పునరావాసానికి అవసరమైన భూమిని సేకరిస్తారు.

జి) ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు భూమి, మంజూరు చేసిన పరిహారాలు అందేటట్టు చూస్తారు.

హెచ్) సంబంధిత ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఆదేశించే కర్తవ్యాలు నిర్వర్తిస్తారు.

4.6 పునరావాస పాలనాధికారి రాతమూలకంగా తన అధికారాలను, దాని ద్వారా సంక్రమించే నిధులను రెవెన్యూ డివిజనల్ అధికారి/సబ్ కలెక్టర్ స్థాయికి తక్కువకాని అధికారికి బదిలీచేయవచ్చును. అటువంటి అధికారిని ఆ ప్రాజెక్టుకు సంబంధించి పునరావాస అధికారి అని పిలుస్తారు.

4.7 ఈ విధాన పత్రం అమలుకోసం సంబంధిత ప్రభుత్వం నియమించే ఇతర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు పునరావాస పాలనాధికారికి లోబడి పనిచేస్తారు.

4.8 రాష్ట్ర ప్రభుత్వ కమీషనర్/కార్యదర్శి స్థాయి అధికారిని ఈ విధానం వర్తించే ప్రాజెక్టులకు సంబంధించి పునరావాస కమీషనర్‌గా ప్రభుత్వం నియమించాలి.

4.9 పునరావాస పాలనాధికారి మరియు ఈ విధానం అమలుకోసం నియమించబడిన ఇతర అధికారులు, ఉద్యోగులు పునరావాస కమిషనర్‌కు లోబడి పనిచేస్తారు.

4.10 పునరావాస పథకాలు, వాటి విధి విధానాల రూపకల్పనకు వాటి సక్రమ అమలుకు, 7వ అధ్యాయంలోని ఫిర్యాదుల వ్యవస్థ పనితీరుకు, పునరావాస కమీషనర్ పర్యవేక్షక బాధ్యత నిర్వర్తిస్తారు. ఆదివాసీ బాధితులు ఉన్నచోట గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ కూడ ఈ బాధ్యతలలో భాగం పంచుకుంటారు.

## అధ్యాయం - 5

**5.0 పునరావాసానికి సంబంధించిన పథకాలు/విధివిధానాలు**

ఈ అధ్యాయంలో తెలియపర్చిన సూత్రాలను 'ప్రభావిత ప్రాంతాన్ని' ప్రకటించడంలోనూ, ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు సంబంధించి సర్వే మరియు గణాంక సేకరణలోనూ, ప్రభుత్వ భూమి ఎంత విస్తీర్ణంలో ఉన్నది, పునరావాసానికి ఎంత భూమి అవసరం అన్నవి అంచనా వేయడంలోను, ముసాయిదా పథకం రూపకల్పనలోను, దానికి తుది రూపం ఇచ్చి ప్రకటించే ప్రక్రియలోనూ తప్పనిసరిగా పాటించాలి.

5.1 సంబంధిత ప్రభుత్వం కనుక ప్రాజెక్టు కోసం చేసే భూసేకరణ కారణంగా కుటుంబాలు భూములు లేక నివాసాలు పోగొట్టుకొని నిర్వాసితులు అవుతారని భావిస్తే, అధికారిక రాజపత్రంలో ఏ గ్రామాలు లేదా ప్రాంతాలు ప్రతిపాదిత ప్రాజెక్టులో నిర్వాసితమౌతున్నాయో వాటిని 'ప్రభావిత ప్రాంతంగా' ప్రకటించాలి. వాటికి ఈ విధాన పత్రంలోని సూత్రాలు వర్తిస్తాయి.

5.2 ఈ విధాన పత్రంలోని పేరా 5.1 కింద చేసే ప్రకటన కనీసంగా రెండు వార్తాపత్రికలలో ప్రచురించాలి. అందులో ఒకటి స్థానిక భాషలో ప్రచురితమవుతూ ప్రతిపాదిత ప్రాంతంలోని గ్రామాలలో పాఠకులు ఉన్నది అయి ఉండాలి. సంబంధిత గ్రామాల పంచాయితీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లోనూ ఆ ప్రకటనను అతికించాలి. ఇతరత్రా ముఖ్యమైన బహిరంగ ప్రదేశాలలో కూడా నోటీసు ప్రకటనను అతికించాలి.

5.3 ఈ విధానంలోని పేరా 5.1 ప్రకారం ఒకసారి ప్రకటన జరిపిన తర్వాత పునరావాస పాలనాధికారి సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించాలి. ప్రాజెక్టువల్ల నష్టపోయే వ్యక్తులు, కుటుంబాల పరిస్థితిని గూర్చి సమాచారం సేకరించాలి.

5.4 ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు సంబంధించిన ఈ కింది సమాచారం సర్వేలో గ్రామాల వారీగా సేకరించాలి.

ఎ) ప్రాజెక్టు బాధిత కుటుంబాలలో శాశ్వత నివాసులుగా ప్రభావిత ప్రాంతంలో ఉంటూ వృత్తులు, వ్యాపారాలు చేపడుతున్న వారి వివరాలు.

బి) నివాసాలు, వ్యవసాయ భూములు, ఉపాధి కోల్పోతున్న ప్రాజెక్టు బాధిత కుటుంబాల వివరాలు, తమ వృత్తి లేక ఉపాధి లేక వ్యాపారం నుండి మొత్తంగా గానీ చెప్పుకోదగ్గడ పరిమాణంలోగానీ దూరమయ్యే కుటుంబాల వివరాలు.

సి) వ్యవసాయ కార్మికులు మరియు వ్యవసాయేతర కార్మికులు

డి) 25 అక్టోబరు 1980 కి ముందుగా ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలో అటవీ భూములు కలిగిఉన్న కుటుంబాలు.

5.5 పేరా 5.4 ప్రకారం చేపట్టే ప్రతి సర్వే కూడా నోటీసు ప్రకటించిన తేదీనుండి 90 రోజుల కాలవ్యవధి లోపలే పూర్తిచేయాలి.

5.6 తొంభై రోజుల కాలపరిమితి ముగిసిన తరువాత, సర్వే అంతకంటే ముందే పూర్తయితే ఇంకా ముందే, పునరావాస పాలనాధికారి సర్వే వివరాలతో ఒక ముసాయిదాను సంబంధిత గ్రామ పంచాయితీలో ప్రకటించాలి. దానిపైన బాధిత ప్రజల నుండి అభ్యంతరాలు, సలహాలు ఆహ్వానించాలి.

5.7 గ్రామంలో ముసాయిదా ప్రచురించిన 30 రోజుల కాల వ్యవధిలో వచ్చిన అభ్యంతరాలు, సలహాలు గమనించిన మీదట పునరావాస పాలనాధికారి సర్వే నివేదికకు తుది రూపు ఇచ్చి తన సూచనలతో రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు అందజేయాలి.

5.8 ఈ విధంగా పునరావాస పాలనాధికారి నుంచి సిఫారసులు అందుకున్న 45 రోజులలోపలనే రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాజపత్రంలో సర్వే వివరాలు ప్రకటించాలి. ఆ ప్రకటన నకలు సంబంధిత గ్రామ పంచాయితీలో కూడా ప్రచురించాలి.

5.9 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేసేటప్పుడు అందరూ ఒకే సమూహంగా లేదా కొన్ని సమూహాలుగా ఉండేటట్లు, సాధ్యమయినంత వరకూ ఉన్నటువంటి గ్రామపంచాయితీ ప్రాంత పరిధిలోనే ఉండేటట్టు పునరావాస పాలనాధికారి చూడాలి. ఏది ఏమైనప్పటికీ ప్రాజెక్టు



నిర్వాసిత కుటుంబాలను మరో చోటికి మార్చేటప్పుడు అప్పటికే అక్కడ ఉన్నవారితో సమానత్వంతో కలిసి మెలసి ఉండగలుగుతూ వారి సామాజిక, సాంస్కృతిక గుర్తింపులను కాపాడుకునే విధంగా ఉండాలి.

5.10 5.9 అమలు చేయుట కొరకు పునరావాస పాలనాధికారి నిర్వాసితుల పునరావాసం నిమిత్తం అదే గ్రామ పంచాయితీ పరిధిలో లభ్యమయ్యే భూములు లేదా చుట్టు పక్కల గ్రామ పంచాయితీ పరిధిలోని భూముల జాబితాను తయారు చేయాలి.

5.11 పేరా 5.10 కింద సేకరించే భూముల జాబితాలో ఈ కిందివి చోటు చేసుకోవాలి.

ఎ) ప్రభుత్వ బంజరు భూములు లేదా ప్రభుత్వ అధీనంలో ఉండి నిర్వాసితుల పునరావాసం కోసం అందుబాటులో ఉన్న భూములు.

బి) ఒకవేళ అక్కడ కావలసినంత ప్రభుత్వ భూమి దొరకని పక్షంలో నిర్వాసితుల పునరావాసం కొరకు భూసేకరణ జరపాలి. అయితే దీని వలన అదనంగా మరికొన్ని కుటుంబాలు నిర్వాసితమయ్యే సమస్య ఉత్పన్నంకాకుండా పునరావాస పాలనాధికారి జాగ్రత్త వహించాలి.

5.12 సంబంధిత ప్రభుత్వం ఒక ప్రకటన ద్వారా ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసం కోసం సేకరిస్తున్న భూమిని పునరావాస ప్రాంతంగా ప్రకటించాలి.

5.13 పునరావాస పాలనాధికారి లేదా ప్రభుత్వం చేత అధికారమియ్యబడిన ఇతర అధికారి ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కోసం భూసేకరణ చట్టం, 1894 క్రింద భూమిని సేకరించే అధికారం కలిగి ఉంటారు.

5.14 బేస్‌లైన్ సర్వే, ప్రాజెక్టు బాధిత కుటుంబాలు, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల గణాంకాల లెక్కింపు, పునరావాసానికి అవసరమైన భూముల మదింపు పూర్తిచేసిన పిమ్మట, పునరావాస పాలనాధికారి ప్రాజెక్టు బాధిత కుటుంబాల కోసం, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం, పునరావాస పథకాన్ని రూపొందించాలి. ప్రాజెక్టు బాధిత కుటుంబాల ప్రతినిధులతోనూ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల ప్రతినిధులతోను ప్రత్యేకించి వారిలోని స్త్రీలతోను, ప్రాజెక్టు ప్రాంతంలోని పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులతోను సంప్రదించిన పిమ్మటనే ఇది జరగాలి.

5.15 ముసాయిదా పథకం రూపొందించేటప్పుడు పునరావాస పాలనాధికారి పునరావాస పథకం ఖర్చు కూడా ప్రాజెక్టు ఖర్చులో ప్రధాన భాగంగా ఉండేట్లు చూడాలి. ఏ సంస్థకోసం ప్రాజెక్టు భూమిని సేకరిస్తున్నారో ఆ సంస్థ ప్రాజెక్టు భూసేకరణ ఖర్చుతోపాటు నిర్వాసిత కుటుంబాలకు చెల్లించే ప్రయోజనాలు, ఇతర పునరావాస ఖర్చులు పూర్తిగా భరించాలి.

5.16 ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు, నిర్వాసిత కుటుంబాలకు సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలు సజావుగా అందించడానికి చాలినన్ని నిధులు పునరావాస పాలనాధికారి ఆధీనంలో ఉంచాల్సిన బాధ్యత భూమిని కోరుతున్న సంస్థకు ఉంది.

5.17 పాలనాధికారి తన ఆధీనంలో ఉంచిన నిధుల జమా ఖర్చులను సక్రమంగా నిర్వహిస్తూ అవసరమైన అక్కౌంటు పుస్తకాలు, రికార్డులు నిర్వహిస్తూ సంబంధిత ప్రభుత్వానికి క్రమబద్ధంగా నివేదికలు సమర్పిస్తూ ఉండాలి.

5.18 ప్రతి పునరావాస పథకంలో ఈ క్రింది విషయాలు అంతర్భాగంగా ఉండాలి:

ఎ) ప్రాజెక్టు కోసం సేకరిస్తున్న భూమి విస్తీర్ణం, అందులో ఉన్న గ్రామాల పేరు లేదా పేర్లు.

బి) గ్రామాలవారీగా ప్రాజెక్టు బాధిత కుటుంబాల జాబితా సాధ్యమయినంత వరకూ నిర్వాసిత వ్యక్తుల సంఖ్య, భూసేకరణకు ముందు ఆ తర్వాత కుటుంబం వారీగా వారు కలిగిఉన్న భూమి విస్తీర్ణం, దాని స్వభావం, వారి ఆధీనంలో ఉన్న స్థిరాస్థి సర్వే నెంబర్లతో సహా ఉండాలి.

సి) ఆ భూభాగంలోని వ్యవసాయ కూలీల జాబితా. వ్యవసాయ పనులనుండి జీవనాధారం పొందుతున్న వారి పేర్లు.

డి) ప్రాజెక్టు కొరకు జరిపే భూసేకరణవల్ల ఉపాధి, జీవనం కోల్పోయిన లేక కోల్పోబోయే వారి జాబితా, తమ వృత్తుల నుండి పూర్తిగా గానీ చెప్పుకోదగ్గ మోతాదులోగాని దూరం అవుతున్నవారి జాబితా.

ఇ) ఒకవేళ భూ ఆక్రమణదారులు ఉన్నట్లయితే వారి జాబితా.

ఎఫ్) ప్రజల ఉపయోగంలో ఉంటూ ప్రాజెక్టులో అంతర్థానమయ్యే ప్రభుత్వ వసతులు, భవనాల జాబితా.

జి) ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు అందించే ప్రయోజనాలు, ప్యాకేజీల సమగ్ర జాబితా.

హెచ్) ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడంకోసం సేకరించడానికి అందుబాటులో ఉన్న భూముల వివరాలు.

ఐ) ప్రాజెక్టు బాధిత కుటుంబాలు పోగొట్టుకుంటున్న భూములకు బదులుగా మరొక భూమి ఇవ్వడానికి లభ్యమయ్యే ప్రభుత్వ భూముల వివరాలు.

జె) ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న వారికి దానికి బదులుగా ప్రాజెక్టు వల్ల ప్రయోజనం పొందే ప్రాంతంలో ఇవ్వడానికి లభ్యంకాగల పట్టా భూముల విస్తీర్ణతా వివరాలు.

కె) పునరావాస ప్రాంతంలో ఏర్పాటు చేసే కనీస సౌకర్యాలు మౌలిక వనరుల కల్పన, వాటి వివరాలు

ఎల్) పునరావాస ప్రాంతంలోకి నిర్వాసిత కుటుంబాలను తరలించేందుకు పట్టే కాలం, తేదీలతో సమయ నిర్ధారణ పట్టిక

యం) పునరావాస పాలనాధికారి అవసరమని భావించే ఇతర సమాచారం.

5.19 పునరావాస పాలనాధికారి ముసాయిదా పునరావాస పథకాన్ని ప్రభుత్వ ఆమోద నిమిత్తం సమర్పించాలి. ఆమోదం తెలిపేముందుగా భూమిని కోరుతున్న సంస్థ సమ్మతి తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. ఆ ముసాయిదా పథకాన్ని స్థానిక ప్రాంతంలో లేక గ్రామంలో ప్రకటించాలి. దానికి బాధిత ప్రాంతంలో విస్తృత ప్రచారం ఇవ్వడంకోసం అధికారిక రాజపత్రంలో దానిని ప్రచురించవచ్చు.



5.20 ఆ పథకాన్ని ప్రకటించిన పిమ్మట అది అధికారికమవుతుంది.

## అధ్యాయం - 6

### 6.0 ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు పునరావాస ప్రయోజనాలు

6.1 పునరావాస పథకం ప్రయోజనాలు, ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు, నిర్వాసిత కుటుంబాలకు అందరికీ చేకూర్చాలి. వారు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నా, లేదా పైన ఉన్నా, తేడా ఉండకూడదు.

6.2 ఉచిత ఇంటిస్థలం: ఏ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబమయినా ప్రాజెక్టు పరిధిలో ఇంటిని పోగొట్టుకుంటున్నప్పుడు గ్రామీణ ప్రాంతంలో అయితే 150 చ.మీ. పట్టణ ప్రాంతంలో అయితే 75 చ.మీ. ఉచితంగా కేటాయించాలి.

6.3 ఇంటి నిర్మాణానికి గ్రాంటు: ప్రతి ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబానికి ఈ విధాన పత్రంలోని పేరా 6.2 ప్రకారం ఉచిత ఇంటిస్థలము మంజూరు చేసినప్పుడు, వారు దారిద్ర రేఖ దిగువకు చెందినవారైతే 40,000/- ఆర్థిక సహాయం లేదా కాలానుగుణంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం అందించాలి. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు ఈ సహాయానికి అర్హత ఉండదు.

6.4 భూసేకరణ తర్వాత సన్న, చిన్నకారు రైతులుగా లేదా పూర్తిగా భూమిలేనివారుగా మారిన ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు వారు పోగొట్టుకున్న భూమికి బదులుగా భూమి ఇవ్వడానికి భూమి లభిస్తే, బంజరు భూములయితే వాటిని అభివృద్ధి చేసుకోవడానికి హెక్టారుకు 10 వేల రూపాయలు లేదా ప్రభుత్వం కాలానుగుణంగా నిర్ణయించిన ప్రకారం సహాయం ఇవ్వబడుతుంది. ఒకవేళ సాగుభూమి అయితే హెక్టారుకు 5 వేల రూపాయలు లేదా ప్రభుత్వం కాలానుగుణంగా నిర్ణయించిన ప్రకారం ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు సహాయం అందించబడుతుంది.

అయితే ఈ విధంగా ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు కేటాయిస్తున్న భూమి మెట్ట భూమి అయితే 2.5 హెక్టార్లు, తరి భూమి అయితే 1.25 హెక్టార్లకు మించరాదు.

**ఇటువంటి విషయాల్లో:**

ఎ) ప్రభుత్వం భూమిని ఏమేరకు ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు కేటాయిస్తున్నదో, ఆ మేరకు వారినుంచి సేకరించిన భూమికి ఎటువంటి పరిహారం ఉండదు.

బి) ప్రాజెక్టు బాధిత కుటుంబాలనుంచి ప్రాజెక్టు కొరకు ఏమేరకు భూమిని సేకరిస్తున్నారో, వారికి ఆమేరకు ప్రభుత్వ భూమిని తిరగి కేటాయిస్తే ఆమేరకు ఎక్స్‌గ్రేషియా ఉండదు.

ప్రాజెక్టు బాధిత కుటుంబాలనుంచి సేకరించిన భూమిమీద ఆమేరకు భూసేకరణ అధికారి ఈ నియమాన్ని అనుసరించి అవార్డు పాస్ చెయ్యాలి.

6.5 ప్రాజెక్టు బాధితులైన ఆదివాసీ కుటుంబాల భూమి ప్రాజెక్టు కింద పోయిన తర్వాత సన్న చిన్నకారు రైతులుగానూ, భూమిలేని వారుగానూ మారిన వారికి ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం పొందుతున్న ప్రాంతం నుంచి సేకరించిన భూమిని కేటాయించడం: అటువంటి ప్రాజెక్టు బాధితులు భూమికి బదులు భూమి కోరుకున్నట్టయితే ప్రాజెక్టు ప్రయోజనం పొందుతున్న ప్రాంత పరిధిలో ప్రభుత్వం కాలానుగుణంగా జారీచేసిన మార్గదర్శక సూత్రాలతో భూసేకరణ జరపవచ్చును. అయితే షెడ్యూల్

తెగల ఆదివాసీ బాధిత కుటుంబాల నిమిత్తం సేకరిస్తున్న ఈ భూసేకరణ కారణంగా ఆ భూమిని సేకరించడంవల్ల ఆ రైతులు తిరిగి సన్న చిన్నకారు రైతులుగానూ, భూమిలేని వారుగానూ మారరాదు.

అయినప్పటికీ అటువంటి కేటాయింపుల విస్తీర్ణం మెట్ట భూమి అయితే 2.5 హెక్టార్లకు మించకుండ, తరిభూమి అయితే 1.25 హెక్టార్లు మించకుండా ఉండాలి.

**ఇటువంటి సందర్భాలలో:**

ఎ) ఏ మేరకు భూమిని సేకరించారో, ఆ మేరకు భూమిని తిరిగి కేటాయింపులు జరిపిన సందర్భాలలో పరిహారం చెల్లించరాదు.

బి) ఏమేరకు బూమిని ప్రాజెక్టుకోసం సేకరించారో, అదే మేరకు భూమిని తిరిగి కేటాయింపులు జరిపిన సందర్భాలలో ఎక్స్‌గ్రేషియా చెల్లించరాదు.

ఈ మేరకు భూసేకరణ అధికారి భూసేకరణకు లేదా వాపసు తీసుకున్న భూమికి అవార్డు పాస్ చెయ్యాలి.

6.6 ఈ విధాన పత్రంలోని పేరాలు 6.2, 6.4, 6.5 కింద కేటాయింపులు జరిపిన భూమి ఎలాంటి సమస్యలు లేకుండా స్వేచ్ఛగా ఉండాలి. ప్రాజెక్టు బాధిత కుటుంబాలలోని భార్యా, భర్త ఇరువురి పేర్లమీద ఉమ్మడి పట్టాలు ఇవ్వాలి.

6.7 పశువుల కొట్టానికి గ్రాంటు: ప్రాజెక్టు బాధిత కుటుంబానికి పశువులు ఉన్నట్లయితే వారికి కొత్తగా పునరావాసం పొందుతున్న ప్రాంతంలో పశువులపాక నిర్మాణానికి 3,000 రూపాయలు గానీ ప్రభుత్వం కాలానుగుణంగా నిర్ణయించిన మొత్తం గానీ గ్రాంటుగా ఇవ్వబడుతుంది.

6.8 సామానుల చేరవేతకు గ్రాంటు: ప్రతి ప్రాజెక్టు బాధిత కుటుంబం ప్రాజెక్టు కోసం కోల్పోతున్న ప్రాంతం నుంచి నూతనంగా పునరావాసం ఏర్పాటుచేసుకున్న ప్రాంతానికి ఇంటి సామానులు, పశువులు, భవనవస్తుసముదాయాలు చేరవేసుకోవడానికి రూ. 5,000/- లేదా ప్రభుత్వం కాలనుగుణంగా నిర్ణయించిన మొత్తం గ్రాంటుగా ఇవ్వబడుతుంది.

6.9 ఆదాయమార్గ అభివృద్ధి గ్రాంటు: ప్రాజెక్టు బాధితులలో చేతివృత్తులమీద బతుకుతున్నవారికి, వ్యాపారులకు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు నూతనంగా షెడ్డు/షాపు నిర్మించుకోవడానికి ఒకేసారి రూ. 25,000/- గ్రాంటు లేదా ప్రభుత్వం కాలానుగుణంగా నిర్ణయించిన మొత్తం ఇవ్వబడుతుంది.

6.10 ఒకవేళ భూయజమాని భూసేకరణ తర్వాత భూమిలేని వాడుగా మారిపోతే: ప్రాజెక్టు బాధిత కుటుంబం తమ మొత్తం భూమిని ప్రాజెక్టుకింద పోగొట్టుకొని భూమిలేని వారుగా మిగిలితే, వారికి పరిహారం కింద ఎలాంటి భూమిని కేటాయించకపోతే, పోగొట్టుకున్న జీవనోపాధి పరిహారం కింద 750 రోజుల కనీస వ్యవసాయకూలి వేతనం ఒకేసారి గ్రాంటుగా ఇవ్వబడుతుంది.

6.11 భూసేకరణ తర్వాత భూమి యజమాని చిన్నకారు రైతుగా మిగిలిపోతే: ప్రాజెక్టు కింద భూమిని కోల్పోయిన తరువాత చిన్న రైతుగా మారిపోతే, అతనికి పరిహారంగా మరొక చోట భూమి కేటాయింపులేవీ జరపకపోతే అటువంటి రైతుకు 500 రోజుల కనీస వ్యవసాయ కూలీ వేతనం ఒకేసారి గ్రాంటుగా ఇవ్వబడుతుంది.



6.12 భూసేకరణ తర్వాత భూమి యజమాని సన్నకారు రైతుగా మారిపోతే: ప్రతిపాదిత ప్రాజెక్టు కింద భూమిని కలిగి భూసేకరణ తర్వాత సన్నకారు రైతుగా మారిన ప్రతిరైతుకు, ఒకవేళ వారికి పరిహారంగా ఇతరత్రా భూమిని కేటాయించకపోతే, 375 దినాల కనీస వ్యవసాయకూలీ వేతనం ఒకేసారి గ్రాంటుగా ఇవ్వబడుతుంది.

6.13 కూలీలకు: ప్రతి వ్యవసాయకూలీ, వ్యవసాయేతర కూలీ కుటుంబానికి 625 రోజుల వ్యవసాయ కనీస దినసరి కూలీ సమానంగా గ్రాంటు ఒకేసారి చెల్లించబడుతుంది.

6.14 నిర్వాసిత కుటుంబాలకు జీవనభృతి అలవెన్సు: ప్రాజెక్టు బాధిత కుటుంబం నిర్వాసితులవుతున్నప్పుడు ఒకేసారి జీవన భృతి అలవెన్సు కింద 240 దినాల కనీస వ్యవసాయ దినకూలీకి సమానంగా చెల్లించాలి. ప్రాజెక్టు బాధిత కుటుంబం ఏ ఇతర ప్రయోజనాలు పొంది ఉన్నా, ఇది అదనంగా ఉంటుంది.

6.15 ఒకవేళ అత్యవసరంగా భూసేకరణ చట్టం, 1894లోని సెక్షన్ 17 ప్రకారం లేదా అటువంటి ఇతర చట్టాలలోని సెక్షన్ల కింద భూమిని సేకరించి ఉంటే, ప్రతి ప్రాజెక్టు బాధిత కుటుంబానికి పునరావాస పథకం అమలు పర్యంత వరకూ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేయాలి. అటువంటి కుటుంబాలకు కూడా పై పేరాలలో పేర్కొన్న మాదిరిగా నిర్వాసిత ప్రయోజనాలు లభిస్తాయి.

6.16 అక్టోబరు 25, 1980 మందునుంచి అటవీ భూములను సాగు చేసుకుంటున్న ప్రాజెక్టు బాధిత కుటుంబాలు కూడా ఈ విధానంలోని పై పేరాల కింద అన్ని పునరావాస పథక ప్రయోజనాలు తప్పనిసరిగా పొందడానికి అర్హులవుతారు.

6.17 ప్రాజెక్టు బాధిత కుటుంబాలు ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలో ఏ రిజర్వేషన్ సదుపాయాలు అనుభవిస్తున్నారో, అవే రిజర్వేషన్ సదుపాయాలను పునరావాస ప్రాంతంలో కూడా అనుభవిస్తారు.

6.18 ప్రాజెక్టు రీసెటిల్‌మెంట్ సెంటర్ వద్ద కనీస వసతులు నెలకొల్పాలి:

ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంనుంచి ప్రజలను పునరావాస ప్రాంతానికి తరలించేటప్పుడు పునరావాస పాలనాధికారి సాధ్యమయినంత వరకూ ఈకింది సదుపాయాలు ఉండేట్లు చూడాలి.

ఎ) ఒకవేళ ఒక గ్రామం/ప్రాంతంలో ఉండే ఒకే సామాజిక వర్గానికి చెందిన మొత్తం జనాభాను పునరావాస ప్రాంతానికి తరలించాల్సివస్తే, వారిని ఒకేచోట దగ్గిరగా ఉండేటట్లు, వారి సాంఘిక, సాంస్కృతిక సంబంధాలు దెబ్బతినకుండా ఉండేటట్లు చూడాలి.

బి) పునరావాస కేంద్రాలలో కనీస మౌళిక వసతులైన తాగునీరు, రోడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుచ్ఛక్తి, ప్రాథమిక పాఠశాల భవనం, ఆటస్థలం, సామాజిక భవనం బయటి ప్రాంతానికి కలిపే రోడ్లు తదితరాలు ఏర్పాటు చేయాలి. ఈ సదుపాయాలకు తోడు, మునుపటి గ్రామంలో ఏమేమి సామాజిక వసతులు ఉన్నయో, అవన్నీకూడా పునరావాస ప్రాంతంలో కూడా ఏర్పాటు చేయాలి.

6.19 ప్రాజెక్టు బాధిత ఆదివాసీ కుటుంబాలకు పునరావాస ప్రయోజనాలు:

ఎ) ప్రాజెక్టు బాధిత ఆదివాసీ కుటుంబానికి భూమి కేటాయింపుల్లో ప్రాధాన్యతనివ్వాలి.

బి) ప్రాజెక్టు బాధిత కుటుంబానికి సాంప్రదాయక హక్కులు/అటవీ ఉత్పత్తుల సేకరణ పోగొట్టుకుంటున్నదానికి 500 రోజుల కనీస వ్యవసాయ దినసరి కూలీ ఇవ్వాలి.

సి) ఆదివాసీ ప్రాజెక్టు బాధిత కుటుంబాలు సాధ్యమయినంతవరకూ వారు కోరుకున్న ప్రదేశాలలో ఒకేచోట పునరావాసం ఏర్పాటు చేయాలి. దీనివలన వారు వారి సంప్రదాయక, సాంస్కృతిక, భాషా సంస్కృతులను కాపాడుకోగలరు.

డి) ఆదివాసీ ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు జిల్లాకు బయట లేదా ఆదివాసీ ప్రాంతానికి బయట పునరావాసం ఏర్పాటు చేసినప్పుడు 25% శాతం అధికంగా పునరావాస ప్రయోజనాలు పొందడానికి అర్హులు.

ఇ) ఆదివాసుల భూమి చట్టాలకు విరుద్ధంగా మార్పిడి చెంది ఉంటే ఆ మార్పును గుర్తించడం జరగదు. ఆదివాసి భూ యజమానికే నష్టపరిహారం, పునరావాస ప్రయోజనాలు చేకూరతాయి.

ఎఫ్) ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలోని నది/చెరువు/డ్యాంనందు చేపలు పట్టే హక్కు కలిగిఉన్న ఆదివాసీ కుటుంబాలకు రిజర్వాయరులో కూడా చేపలు పట్టే హక్కులు కల్పించబడతాయి.

6.20 దళిత/ఆదివాసీ/బిసి ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు పునరావాస కేంద్రంలో రాజ్యాంగ ప్రయోజనాలు:

ప్రాజెక్టు బాధిత కుటుంబాలు పూర్వపు గ్రామంలో ఏవిధమైన రాజ్యాంగ ప్రయోజనాలు అనుభవించేవారో, అవే పునరావాసకేంద్రంలోకూడా అనుభవిస్తారు.

# అధ్యాయం - 7

## 7.0 వివాదాల పరిష్కారాల యంత్రాంగం

7.1 ప్రాజెక్టు స్థాయిలో పునరావాస కమిటి

ఎ) ఈ విధానాన్ని అమలు చేస్తున్న ప్రతి ప్రాజెక్టు విషయంలోనూ ఆ ప్రాజెక్టు పాలనాధికారి అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. దీనిని పునరావాస కమిటీ అని పిలుస్తారు. ఈ కమిటీ పునరావాస పథకం/ప్రణాళిక అమలును, ప్రాజెక్టు బాధితకుటుంబాల పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంది.

బి) పైన వివరించిన పునరావాస కమిటీలో ఈకిందివారు కూడా సభ్యులుగా ఉంటారు.

1) ప్రాజెక్టు బాధిత ప్రాంతంలో నివసిస్తూ ఉండిన ప్రాజెక్టు బాధిత కుటుంబాల తరఫున ఒక మహిళా ప్రతినిధి.

2) ప్రాజెక్టు బాధిత ప్రాంతంలో నివసిస్తూ ఉండిన ఆదివాసీ, దళిత కుటుంబాలనుంచి ఒక్కొక్కరు.

3) ఒక స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి

4) లీడ్ బ్యాంక్ ప్రతినిధి

5) ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలోని పంచాయితీరాజ్ సంస్థల ఛైర్‌పర్సన్

6) ప్రతిపాదిత ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు సభ్యుడు/శాసనసభ్యుడు

సి) పునరావాస కమిటీ కార్యకలాపాల్ని బాధ్యతల్ని సంబంధిత ప్రభుత్వం నిర్దేశిస్తుంది.



7.2 ఫిర్యాదుల విచారణ విభాగం

ఎ) ఈ విధానం అమలయ్యే ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పునరావాస కమీషనర్ గారి అధ్యక్షతన ఒక ఫిర్యాదుల విచారణ కేంద్రం ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టు బాధిత కుటుంబాల ఫిర్యాదులను ఇది పరిష్కరిస్తుంది.

బి) సంబంధిత ప్రభుత్వం రూపొందించిన నిబంధనలమేరకు ఫిర్యాదుల విచారణ కేంద్రం కార్యకలాపాలు ఉంటాయి.

సి) ఏ ప్రాజెక్టు బాధిత కుటుంబమయినా, ఈ విధానంలోని నిబంధనల మేరకు పునరావాస ప్రయోజనాలు చెల్లించకపోతే ఒక పిటిషన్ ద్వారా ఫిర్యాదుల విచారణ కేంద్రానికి సమర్పించుకోవాలి.

డి) ప్రభుత్వం నిర్ణయించిన విధానాల మేరకు ఫిర్యాదులను పంపుకొను విధానం, నిర్ణీత సమయం తదితరాలు ఉంటాయి.

7.3 ఫిర్యాదుల పరిష్కారాల యంత్రాంగం ప్రాజెక్టు స్థాయిలో పునరావాస పాలనాధికారి/పునరావాస కమిటీ నిర్ణయాల మీద వచ్చిన ఫిర్యాదులను విచారించి పరిష్కరించడానికి అధికారం కలిగి ఉంటుంది. ఫిర్యాదులమీద తీసుకున్న నిర్ణయాలననుసరించి పునరావాస పాలనాధికారికి ఆదేశాలను జారీ చేసే అధికారం ఉంటుంది.

7.4 పునరావాస కమీషనర్ తనకు సంక్రమించిన పాలనాధికారాలను, విధులను రాతమూలకంగా జాయింట్ కలెక్టరు హోదాకు తక్కువకాని అధికారికి బదలాయించవచ్చును.

7.5 అంతర్రాష్ట్ర ప్రాజెక్టులు

ఎ) ఒకవేళ ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతం ఒక రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం పరిధిని మించి ఉన్నట్లయితే, అందులో ప్రాజెక్టు బాధిత కుటుంబాలు, ప్రాజెక్టు పునరావాస కుటుంబాలు నివసిస్తూ ఉన్నట్లయితే, లేదా పునరావాస ప్రాంతం ఏర్పాటు చేస్తున్నట్లయితే, ఆ రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి ఒక పునరావాస పాలనాధికారిని నియామకం చేయాలి. ఈ విధానం ప్రకారం పునరావాస కమీషనర్‌ను కూడా నియమించాలి.

బి) పునరావాస పథకం అమలుపర్చే తీరును గురించి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రప్రభుత్వం చర్చించి ఆమోదించిన తర్వాత ఈ విధాన పత్రంలోని నిబంధనల మేరకు పునరావాస పాలనాధికారి దానిని ప్రకటించాలి.

సి) పునరావాసం పథకం అమలులో ఏమైనా అభిప్రాయబేధాలొస్తే ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వానికి చెందిన గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు నివేదించాలి. వీటిమీద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాలు తప్పక పాటించాలి.

# అధ్యాయం - 8

## 8.0 పర్యవేక్షణ యంత్రాంగం : అనుసరించదగు విధానాలు

8.1 రాష్ట్రస్థాయి పర్యవేక్షక కమిటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, రెవిన్యూశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి/కార్యదర్శి అధ్యక్షతన ఒక రాష్ట్రస్థాయి పర్యవేక్షక కమిటీని నెలకొల్పాలి. ఈ విధాన పత్రం అనువర్తించే అన్ని ప్రాజెక్టులలోనూ జరుగుతున్న అభివృద్ధి, పునరావాస పథకాలు/ప్రణాళికల అమలు తీరు తెన్నులను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. అన్ని ప్రాజెక్టులలో పునరావాస కార్యక్రమాలను సమీక్షించడానికి ఈ కమిటీ కనీసంగా మూడు నెలలకొకసారి సమావేశమవ్వాలి. ఈ కమిటీలో ఈ క్రిందివారు లేక ఒక ప్రతినిధిగా సంయుక్త కార్యదర్శి స్థాయికి తక్కువకానివారుంటారు.

కార్యదర్శి : ప్రణాళిక శాఖ

కార్యదర్శి : సాంఘిక సంక్షేమం

కార్యదర్శి : గిరిజన సంక్షేమం

కార్యదర్శి : పురపాలక పట్టణాభివృద్ధి

కార్యదర్శి : పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి

కార్యదర్శి : గృహ నిర్మాణం

కార్యదర్శి : విద్యాశాఖ

కార్యదర్శి : వ్యవసాయం

కార్యదర్శి : మహిళా శిశుసంక్షేమం

కార్యదర్శి : విద్యుచ్ఛక్తి-ఇంధనం

కార్యదర్శి : న్యాయశాఖ

కార్యదర్శి : ఆర్థికశాఖ

కార్యదర్శి : కోరుతున్న శాఖ (కన్వీనర్)

రాష్ట్రస్థాయి : ఎన్.జి.ఓ.

చీఫ్ ఇంజనీర్/ప్రాజెక్టు పాలనాధికారి - ప్రత్యేక ఆహ్వానితులు

8.2 ప్రాజెక్టు అమలులో మూడవ పార్టీ ఆడిట్ పర్యవేక్షణ ఆడిట్ యంత్రాంగాన్ని రూపొందించాలి. ఆ కమిటీ ఆడిట్ రిపోర్టును రాష్ట్రస్థాయి కమిటీలో చర్చకు పెట్టాల్సి వస్తుంది.

8.3 ప్రాజెక్టుస్థాయి పర్యవేక్షణ శాఖ దేనికోసమైతే భూమిని సేకరిస్తున్నారో ఆశాఖ ప్రాజెక్టు స్థాయి పర్యవేక్షణ కమిటీని రూపొందించాలి. ప్రాజెక్టు పరిధి ఏజిల్లాకు సంబంధించినదయితే ఆజిల్లా కలెక్టరు కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఒకవేళ ప్రాజెక్టు ప్రాంతం ఒకటికన్నా ఎక్కువ జిల్లాలకు విస్తరించి ఉంటే, సీనియరు కలెక్టరును ఛైర్మెన్‌గా నియమించాలి. ఈ కమిటీ ప్రాజెక్టు స్థాయిలో పునరావాస పథకాలు/ప్రణాళికల అమలును పర్యవేక్షిస్తుంది. పునరావాస కార్యక్రమాల అమలును సమీక్షించడానికి కనీసంగా రెండు నెలలకొకమారు కమిటీ సమావేశమవ్వాలి. ఈ కమిటీలో ఈకిందివారు సభ్యులుగా ఉంటారు.



జాయింట్ కలెక్టరు/ప్రాజెక్టు ఆఫీసరు ఐ.టి.డి.ఎ.

పునరావాస అధికారి - ఆర్.డి.ఓ. / ఆ డివిజన్ సబ్ కలెక్టరు.

యస్.డి.సి. / ఆర్.డి.ఓ. / సబ్‌కలెక్టరు, భూసేకరణ

ప్రాజెక్టు డైరెక్టరు డి.ఆర్.డి.ఎ

ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ - జిల్లా పరిషత్

జిల్లా పంచాయితీ ఆఫీసరు

జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లా వైద్య ... ఆరోగ్య శాఖాధికారి

జిల్లాస్థాయి ప్రతినిధి - డిస్కాం నుంచి

సూపరింటెండెంట్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీరాజ్

ప్రాజెక్టు బాధిత కుటుంబాలనుండి ముగ్గురు ప్రతినిధులు, అందులో ఒకరు తప్పనిసరిగా మహిళ

స్థానిక స్వచ్ఛంద సంస్థలనుంచి ఒకరు

సూపరింటెండెంట్ ఇంజనీరు ప్రాజెక్టు - కన్వీనర్

**విధానం అమలు:**

8.4 ఈ ప్రాజెక్టు బాధితుల కుటుంబాలు, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల విధానం (పి.ఆర్.ఆర్ 2005) ప్రభుత్వం జారీ చేసిన రోజు నుంచి అమలులోకి వస్తుంది.

8.5 ఈ విధానం కింద అమలయ్యే ప్రాజెక్టులకు సంబంధించి, జి.ఓ.యం.యస్. నెం. 98, ఇరిగేషన్ (ప్రాజెక్టు వింగ్) శాఖ తేదీ 15.4.1986, జి.ఓ.యం.యస్.నెం. 64 సాంఘిక సంక్షేమం (టి) శాఖ తేదీ 18.4.1990 లేదా ఏవైనా ఈ విషయంమీద జారీ చేసిన ఉత్తర్వులు, ఈ విధానం అమలు ప్రకటన తేదీ నుంచి చెల్లనేరవు.

(**షరా:** ఇది మక్కీకి మక్కి అనువాదం కాదు. పాఠకుల సౌలభ్యం కోసం భావం దెబ్బతినకుండ వీలయినంత సరళంగా జీవోను తెలుగు చేసాము)

◆ ◆ ◆

అనంతపురం ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్

# ప్రజల జీవితాలపై ఎక్కుపెట్టిన తుపాకీ

ఎస్.ఎం. బాషా

అనంతపురం జిల్లాను అభివృద్ధి పర్చడానికి, జిల్లాలో వేళ్లూనికొని ఉన్న కరువును పోగొట్టడానికి ప్రభుత్వం సంసిద్ధంగా లేదుకానీ, సెజ్‌లు, ఫైరింగ్ రేంజిల పేరిట మాత్రం పెద్దఎత్తున భూముల్ని లాక్కొని రైతుల్ని, ప్రజల్ని శాశ్వతంగానే వలస పొమ్మంటోంది. దేశంలోని మిగతా ప్రాంతాలలో సెజ్‌లకోసం తీసుకుంటున్న భూమి ఏ పరిమాణంలో ఉందో తెలియదుగానీ, అనంతపురం జిల్లాలో మాత్రం వేల ఎకరాల్లోనే సెజ్‌ల కోసం భూమిని సేకరిస్తున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్దదైన సెజ్ 'ఒడిస్సీ సైన్స్ సిటీ'. ఇందులో అమడగూరు మండలం పూర్తిగా అదృశ్యమై ఓ.డి.చెరువు మండలం కొద్దిగా ఆనవాళ్లకు మిగులుతుంది. దాదాపు 65 వేల ఎకరాలు ఇక్కడ భూసేకరణ చేయబోతున్నట్లు ప్రకటించారు. దానితోపాటు ఈ జిల్లాలో మిలిటరీ ఫైరింగ్ రేంజ్‌కోసం కనగానిపల్లి, కంబదూరు రెండు మండలాల మధ్య దాదాపు 15 వేల ఎకరాలు తీసుకోవడానికి సన్నద్ధం చేస్తున్నారు. దేశంలో ఇతరచోట్ల ఫైరింగ్ రేంజిలకు ఇంత విస్తీర్ణం ఎక్కడా లేదు. వెయ్యి ఎకరాలో లేదా అయిదు వందల ఎకరాలో ఉంటే గొప్ప. కానీ అనంతపురం జిల్లాకు వచ్చేటప్పటికి అంచనాలు పెరిగాయి. కంబదూరు మండలంలోనే కర్తనపర్తి గ్రామానికి పైభాగాన దాదాపు రెండువేల ఎకరాలు చవిటి బంజరు భూములున్నాయి. అక్కడ రాత్రింబగళ్లూ ఓపికున్నంతవరకూ తుపాకులతో కాల్చుకోవచ్చు. ఎవరికీ అభ్యంతరం ఉండదు. పైగా అటూ ఇటూ ఉన్న జనావాసాలకు రోడ్లు కూడా ఈ భూభాగంలో నుంచి పోవు. ఇంత సులభంగా సమస్య పరిష్కారమైతే, రైతులు బలికాకుండా భూముల్ని తీసుకుంటే ప్రభుత్వాల గొప్పదనమేముంది? వారికి వ్యవసాయ భూములే కావాలి. అందులోనూ పెద్దరైతుల భూమి రుచి ఉండదు కాబట్టి దళితులు, ఆదివాసులు, సన్న చిన్నకారు రైతులు సాగుచేసుకుంటున్న భూములే కావాలి. వారు రోడ్డున పడాలి. తట్టాబుట్టా సర్దుకుని శాశ్వతంగా పాలోమని వలస వెళ్ళిపోవాలి. ఎంతమంది జీవితాల్ని భగ్నపరిస్తే ఆ మేరకు దేశం అభివృద్ధి చెందుతుందన్న మాటలో విశ్వాసం ఉన్నవారు పాలకులు.

✡ మానవహక్కుల కార్యకర్త, రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి

అనంతపురం జిల్లా విస్తీర్ణంలో రాష్ట్రంలో అన్ని జిల్లాలకంటే పెద్దది. జనసాంద్రత అన్ని జిల్లాలకంటే తక్కువ. మెట్ట వ్యవసాయం మాత్రమే ఆధారం. ప్రభుత్వం చెబుతున్న జలయజ్ఞం పూర్తయినా అనంతపురం జిల్లాలో సాగునీటి సౌకర్యం 10 శాతానికి మించని దుస్థితి. ఇదివరకే కేటాయింపులున్న తుంగభద్ర నీరు కూడ ప్రతి సంవత్సరం 7 టియంసిల వరకూ కోతే. అనంతపురం జిల్లాలో వ్యవసాయం బాగు పడడానికి ఇతర జిల్లాలలో ఇస్తున్నట్లుగా ఇబ్బడి ముబ్బడి నీరు అవసరం లేదు. కొద్దిపాటి వర్షానికి తోడుగా 2-3 తడులు ఇవ్వగలిగే నీటి పారుదల సౌకర్యం కల్పిస్తే చాలు. ఒక పంట పూర్తిగా పండుతుంది. భూమి బోలుగానూ, ఇసుక తెరగానూ ఉండడంచేత ఈ జిల్లాలో పండిన వేరుశెనగలో నూనెశాతం ఎక్కువగా ఉంటుంది. అలాగే పళ్ళ తోటలలో కాసిన దానిమ్మగానీ, బొప్పాయికానీ, మామిడి, జామ, సపోటా గానీ ఇతర ప్రాంతాలలో పండే వాటికంటే తీపుదనం ఎక్కువ. భూమిలో ప్రాణవాయువు ఎక్కువగా ఉండడమే దీనికి కారణమని వ్యవసాయ శాస్త్రజ్ఞులు విశ్లేషిస్తారు. జిల్లాలోని చెరువులన్నీ నింపడానికి 25 టియంసిలు అవసరమౌతాయి. ఇవి నింపినా యాభైశాతం సమస్య పరిష్కారమవుతుంది. కాబట్టి ఇప్పుడున్నటువంటి సాంకేతిక పరిజ్ఞానంతోనే ఈ జిల్లాలోని వ్యవసాయం రూపురేఖలు మార్చడం ప్రభుత్వానికి పెద్ద భారం కాబోదు. కానీ నెగటివ్ అభివృద్ధికి అలవాటు పడిన ప్రభుత్వాలు పాజిటివ్ అభివృద్ధిని గురించి ఎందుకు ఆలోచిస్తాయి? అందుకే ఎక్కడా లేనంతగా పెద్ద పెద్ద విస్తీర్ణాలలో భూముల్ని ఆక్రమించుకోవడానికి ప్రభుత్వం నడుం కట్టింది. ఎన్ని కరువులొచ్చినా ఇంకా భూముల్నే పట్టుకుని వేళ్ళాడుతున్న రైతులమీద కోపం. వేరే ఏ గత్యంతరం లేని పరిస్థితిలోనే వ్యవసాయాన్ని నమ్ముకుంటున్నారన్న వాస్తవం వీరి తలకెక్కదు.

## 40-50 ఏళ్లయినా పట్టారాని దుస్థితి

ముందుగా నల్గొండ జిల్లాలో ఈ ఫైరింగ్ రేంజ్ పెట్టాలని ప్రభుత్వం సర్వేలను నిర్వహించింది. దానిని వ్యతిరేకించిన వారిని బెదిరించారు. పరిహారం ఇస్తామని కొంతమందిని ఊరించారు. కానీ నల్గొండ జిల్లా రైతులు బాగా ప్రతిఘటించారు. సర్వేలు కూడా చేయనీయలేదు. అక్కడ ఈ ప్రయత్నం మానుకున్నారో లేదో తెలియదుగానీ ఈలోగా అనంతపురం జిల్లా వారికి గుర్తుకువచ్చింది. ఒడిస్సీ సైన్సు సిటీకోసం కనుమరుగయ్యే అమడగూరు, ఓడిచెర్వు మండలాల తర్వాత ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నవి కనగానిపల్లి, కంబదూరు మండలాల్లోనే. ఈ మండలాలలో పట్టా భూములకు మించి ప్రభుత్వ భూములున్నాయి. వందల సంవత్సరాల కాలంలో జనావాసాలు ఏర్పడి భూములు సాగుచేసుకొంటున్నా కొద్దిమందికి మాత్రమే ప్రభుత్వం పట్టాలిచ్చింది. 40-50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న వారికి కూడా పట్టాలు లేవు. వాస్తవంగా సాగుచేసుకుంటున్న రైతులందరికీ వారి అర్హతల్ని బట్టి పట్టాలివ్వడం రెవిన్యూ శాఖ విధి. రైతులకు అధికారులకు మధ్య విత్తసంబంధ అవగాహన కుదరక వారందరూ బినామీ సాగుదారులుగా ఉండిపోవలసి వచ్చింది. రాళ్ళ అనంతపురం గ్రామంలో ఫఖురొద్దీన్ అనే రైతు 40-50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నా పట్టా ఇవ్వలేదు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి కరువు నేలలో కుటుంబ శ్రమను ధారపోసి సాగుయోగ్యం చేసుకున్న భూమిని ఏ పరిహారం లేకుండా ప్రభుత్వం గద్దలా తన్నుకుపోతుంటే ఆ రైతు క్షోభ చెప్పనలవికాదు. అటువంటి రైతులు కనీసం 10 నుండి 20 కుటుంబాలదాకా ప్రతి గ్రామంలోనూ ఉన్నారు. పట్టాలున్నవారికి వారిచ్చిన పట్టాల వెనుక ఉన్న షరతులను గుర్తుచేసిలా భూమిని ప్రభుత్వం ఎపుడైనా స్వాధీనపర్చుకోవచ్చునని ప్రభుత్వం దబాయిస్తున్నది. ఇది మన రాష్ట్ర హైకోర్టు 2004లో మేకల పాండు కేసులో ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకమయినప్పటికీ ఆ సంగతి తెలియక రైతులు ఊరకుండి పోతున్నారు. అభ్యంతరపెడితే ఇచ్చే



పరిహారం కూడా ఇవ్వకుండా స్వాధీన పర్చుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారు. దీనితో రైతులందరూ అసమ్మతి తెలపడానికి కూడా భయపడిపోతున్నారు.

## పూర్తిగా భూములు కోల్పోతున్న గ్రామాలు

కనగానిపల్లి మండలం మద్దల చెర్వు గ్రామంలోని భూములలో ఒకవైపు ఉన్నవి ఫైరింగ్ రేంజ్‌లో కలిసిపోతే మద్దలచెర్వు తాండా పూర్తిగా కలిసిపోతుంది. ఇదే మండలంలోని కోనేటినాయునిపాలెం, శివపురం, వేపకుంట, భానుకోట, డి.చెన్నేపల్లి గ్రామాల భూములు పోతాయి. కంబదూరు మండలంలోని నూతిమడుగు, నూతిమడుగు తాండా, కర్తనపర్తి, రాళ్ళ అనంతపురం గ్రామాల భూములు పోబోతాయి. నూతిమడుగు గ్రామంలో పెద్ద రైతుల భూములే ఎక్కువ పోతున్నాయి. అయితే వారందరూ వ్యవసాయం మీద ఆధారపడక వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకుంటున్నవారు. వారు భూములివ్వడానికి సుముఖంగానే ఉన్నారు. కానీ మిగతా గ్రామాలలోని రైతులందరూ సన్న-చిన్నకారు రైతులు. ఈ గ్రామాలలో వ్యవసాయం ఇటీవలి కాలంలో అంటే 4-5 సంవత్సరాలుగానే అభివృద్ధి చెందింది. దీనికి కారణం ఆర్‌డిటి అనే స్వచ్ఛంద సంస్థ ఈ ప్రాంతాలలో వాటర్‌షెడ్ల పథకం కింద వాగులు, వంకలమీద చెక్ డ్యాములు కట్టడం. అవి నాణ్యంగా ఉండి రైతులకు అనుకూలంగా ఉండడంతోపాటు, వాటి చుట్టుపట్ల భూములలో భూగర్భజలాలు అభివృద్ధి చెందినాయి. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత కరెంటు కూడా రైతులు సద్వినియోగం చేసుకోవడంతో నీటిపారుదల సౌకర్యం అభివృద్ధి చెందింది. ఇందులో కర్తనపర్తి గ్రామం మొత్తంలోను భూగర్భ జలాలు ఎక్కువగా ఉండడం వల్ల ఖరీఫ్‌తోపాటు రబీ పంటలు కూడా పండిస్తున్నారు. అలాగే కోనేటి నాయునిపాలెం, రాళ్ళ అనంతపురం, డి.చెన్నేపల్లి గ్రామాలలో బోరు బావులు అభివృద్ధి చెందినాయి. గత 40-50 సంవత్సరాలుగా వ్యవసాయంలో లేని ఆదాయం ఈరోజు వారు అనుభవిస్తున్నారు.

## పూర్తికాలపు రైతులుగా మారిన తాండావాసులు

నూతిమడుగు తాండా, మద్దలచెర్వు తాండాలు రెండూ కూడా ఫైరింగ్ రేంజిలో మాయం కానున్నాయి. నూతిమడుగు తాండాను రామోజి నాయక్ తాండా అంటారు. ఈ తాండాలో 1940లోనే 85 ఎకరాలకు పట్టా ఇచ్చారు. ఈ రోజు 15 కుటుంబాలు తాండాలో ఉన్నాయి. ముందు సున్నపు బట్టీలు పెట్టుకుని అరకొరగా జీవించేవారు. ఈదినం ఆర్‌డిటి అనే స్వచ్ఛంద సంస్థ అందరికీ పక్కాఇళ్ళు కట్టించి ఇచ్చింది. వారు వ్యవసాయంలో నిలదొక్కుకోవడానికి అన్నిరకాల సహాయం చేసింది. ఈ రోజు 130 ఎకరాల వరకూ సాగు చేసు కుంటున్నారు.ఎంతో కష్టపడి అభివృద్ధి చేసుకున్న సాగుభూమిని వదులుకోవడానికి వారు సిద్ధంగా లేరు. అందుకే ప్రతిఘటనకు సిద్ధమయ్యారు.

## మద్దలచెర్వుతాండా

ఈ తాండాను గురించి చెప్పుకోవలసింది చాలా ఉంది. ఇందులో 47 కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 50-60 సంవత్సరాల క్రితం అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామంనుంచి బావ, బావమరుదుల కుటుంబాలు రెండు మద్దలచెరువు గ్రామం పైభాగాన సున్నపురాయి దొరికే చోట కాపురము పెట్టారు. సున్నపు బట్టీల్లో సున్నం తయారుచేసుకుని గాడిదలమీద తీసుకుపోయి అమ్ముకుని బతికేవారు. సున్నపు బట్టీలతోపాటు ప్రభుత్వ బంజరు భూముల్ని సాగు చేసుకోవడం మొదలుపెట్టి వ్యవసాయాన్ని రెండవ వృత్తిగా స్వీకరించారు. కుటుంబాలు పెరిగాయి. పెద్దవయ్యాయి. ఈనాటికి 47 కుటుంబాలుగా విస్తరించాయి. సాగు చేసుకుంటున్న భూముల్లో అరకొర మాత్రమే పండాయి. ఆనాటినుండి ఈనాటి వరకూ ఈ కుటుంబాలు అన్నీ ఒకేమాటమీద కట్టుబడితో ఉంటున్నాయి.

తాండాలో ఎవరూ సారాయి తాగరాదు. ఎవర్నీ తాండాలో సారాయి అమ్మనివ్వరు. బయటివారు ఎవరైనా దౌర్జన్యంగా అమ్మడానికి ప్రయత్నిస్తే ఎక్సైజ్ పోలీసులకు పట్టిస్తారు. బయటినుంచి ఎవరైనా బంధువులు, స్నేహితులు వస్తే, సాయంత్రానికంతా తాండా విడిచిపెట్టి వెళ్ళాలి. వారి వల్ల గ్రామంలో తగాదాలు వస్తాయని భయం. ఈ తాండాలో ఆర్‌డిటి సంస్థ పాఠశాలను నిర్మించింది. అందరికీ పక్కా ఇళ్ళను నిర్మించింది. వారి తాండాకు దిగువన 7 చెక్‌డ్యాములు నిర్మించడంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఒక్కొక్కరు 5–6 బోర్లు వేసుకున్నారు. డ్రిప్‌లు వేసుకున్నారు. పళ్ళ తోటలతోపాటు అన్నిరకాల పంటలు పండిస్తున్నారు. ఈరోజు తాండాలో యువకులు ప్రాథమిక స్థాయినుంచి యూనివర్శిటీ స్థాయివరకూ చదువుకుంటున్నారు. 10మంది పట్టభద్రులున్నారు. ఒకరు ఎంబియే చదువుకుంటున్నారు. మరొకరు టీచర్‌గా పనిచేస్తున్నారు. ఒక స్వచ్ఛంద సంస్థ సాయంతో మొత్తం జీవితాలనే మార్చుకున్న ఈ తండావాసులు భూములివ్వడానికి ససేమిరా అంటున్నారు. మా శవాలమీదనే భూములు తీసుకోవాలంటున్నారు.

## చట్టాల్నికూడా ధిక్కరిస్తున్న ప్రభుత్వం

ఏదైనా ఒక ప్రాంతంలో ప్రజాప్రయోజనం పేరుతో భూసేకరణ జరుపుతున్నప్పుడు పునరావాసం విషయంలో పాటించవలసిన విధి విధానాలతో ప్రభుత్వం జి.ఓ.యం.యస్. నెం 68 తేదీ 8-4-2005 లో కొన్ని మార్గదర్శక సూత్రాలను విడుదల చేసింది. అందులో ప్రధానమైనటువంటి అంశం సాధ్యమయినంత వరకు విస్థాపనను తగ్గించే ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించడం. రెండు వేల ఎకరాల చవిటి భూముల్ని వదలి రైతులు సాగు చేసుకుంటున్న భూముల జోలికి రావడంలోనే మొదటి ఉల్లంఘన జరిగింది. 100, ఆ పైగా నిర్వాసిత కుటుంబాలు ఉన్నప్పుడు పునరావాస పాలనాధికారిని నియమించాలి. గ్రామ సభలు పెట్టాలి. గ్రామీణుల అభిప్రాయాలు తెలుసుకోవాలి. కనీసం రైతులు పోగొట్టుకుంటున్న భూమికి బదులుగా భూములు ఇస్తామని కూడా చెప్పలేదు. నిర్వాసిత రైతులకు, వ్యవసాయ కూలీలకు, వ్యవసాయేతర కూలీలకు పరిహారం ప్రకటించాలి. ఇవేవీ చేయడంలేదు. అసలు ఇంత పెద్దఎత్తున భూములు ఎందుకవసరమో కూడా చెప్పడం లేదు. ఏకపక్షంగా భూములు సర్వే చేస్తున్నారు. ఏ భూమీలేని వ్యవసాయ కుటుంబాలకు 625 రోజుల వ్యవసాయ కనీస దినకూలి ఒకేసారి గ్రాంటుగా ఇవ్వాలి. ఇవన్నీ చేయకుంటే భూములు ఇవ్వకూడదని కర్తనపర్తి గ్రామం రైతులు సమావేశం చేసుకుని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలిసి స్పెషల్ పోలీసులతో గ్రామాల్లో కవాతు చేయించారు. దీంతో రైతులంతా భయపడిపోయి వ్యతిరేకత కనబరచడం మానుకున్నారు. సాధ్యమయినంతవరకూ ఏకాభిప్రాయం సాధనంగా ఇరుపార్టీలు ఒక అంగీకారానికి రావాలనే నిబంధన గాలికి కొట్టుకుపోయింది.

మరొక విషయమేమంటే కర్తనపర్తి తాండాలాంటి కొన్ని గ్రామాలలో భూములు మాత్రం ఫైరింగ్ రేంజ్‌లో కలిసిపోయి గ్రామాలు మిగిలిపోనున్నాయి. గ్రామాల చుట్టూ 100 మీటర్ల వరకూ వదిలివేస్తామని అధికారులు చెబుతున్నారు. అంటే నివాస ప్రాంతాలకు నష్టపరిహారం ఇవ్వకుండా వారంతకు వారే వదిలివెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తం భూమిని, జీవనాధారాల్ని పోగొట్టుకున్న మీద, పోలీసుల పహారాలో ఆరు బయట జైళ్ళలో లాగా ఎవరు బతగ్గలరు? ఇది ఒక రకం మోసం. రైతులు సమావేశాలు వేసుకుని ప్రతిఘటించడానికి సమాయత్తమవుతున్నారు.

◆◆◆





# భవిష్యత్ చిత్రపటం: అపాచీ

ఎ. సుబ్రహ్మణ్యం

సెజ్‌లవలన పచ్చని పంట పొలాలు పరాధీనమై పోతాయనీ, అక్కడ వచ్చే పరిశ్రమలు నిత్యావసరాలను కాక లాభాలను సంపాదించిపెట్టే వస్తువులను ఉత్పత్తి చేస్తాయనీ, అక్కడ దేశాలకు సంబంధించిన చట్టాలేవీ అమలు కావనీ, అక్కడ జరిగే ఉత్పత్తులపై ఏవిధమైన తనిఖీలు, పర్యవేక్షణలూ వుండవనీ, ముఖ్యంగా శ్రమ దోపిడీకీ అంతు వుండదని, శతాబ్దాలుగా ఉద్యమించి సాధించుకున్న శ్రామిక చట్టాలు, ఇతర హక్కులు అక్కడ నిరుపయోగమై పోతాయనీ, చివరకు అవి 'స్వతంత్ర దేశంలో విదేశీ భూభాగం'గా మనుగడ సాగించబోతున్నాయని మనమందరం భయపడుతున్నామంటే అదేమీ కాదు, వ్యవసాయం కొరగాకుండా పోతున్న కాలంలో పనికిరాని భూముల్లో పెద్ద పెద్ద పరిశ్రమలు వస్తాయనీ, ఆ విధంగా ఉపయోగంలేని భూములు మంచి ధరలు పలుకుతాయనీ, ఉత్పత్తులు పెరిగి విదేశీ మారక ద్రవ్యం లభిస్తుందనీ, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ లాభపడుతుందనీ, అక్కడ ఏర్పడే పరిశ్రమల వల్ల లక్షలాది మందికి ఉపాధి, ఉద్యోగాలు దొరికి నిరుద్యోగానికి మంచి పరిష్కారం లభిస్తుందనీ ప్రభుత్వం చెపుతూ వచ్చింది. 'సెజ్'లకు వ్యతిరేకంగా వచ్చే పుకార్లను నమ్మొద్దనీ, అవి వట్టి అపోహలు మాత్రమే అనీ చెప్పింది. నాటి 'సస్య' విప్లవం మొదలు ఇటీవలి 'నీలి విప్లవం' వరకు ప్రభుత్వం చెప్పినదానికీ, వాస్తవ పరిస్థితికీ పొంతన ఉండదని అనుభవంలో తేలిపోయింది. ఇప్పుడు ఈ 'సెజ్'ల వ్యవహారం ఏమిటో చెప్పగలిగిన అనుభవాలు నెల్లూరు జిల్లా తడ వద్ద నెలకొల్పిన 'అపాచీ' కంపెనీవద్ద బయటపడిపోయాయి. భయాలు, అపోహలు వాస్తవమై మనముందు నిలబడ్డాయి.

నెల్లూరు జిల్లా తడ మండలం మాంబట్టు గ్రామం దగ్గర 'అపాచీ' బూట్ల కంపెనీ పెట్టారు. అపాచీ ఒక చైనా కంపెనీ. దానికోసం దాదాపు వెయ్యి ఎకరాల భూమిని ఎ.పి.ఐ.ఐ.సి. సేకరించి ఇచ్చింది. ఈ ప్రాంతం చెన్నై నగరానికి 79 కి.మీ దూరంలో ఉంది. సేకరించిన భూమి సాగుభూమి, వ్యవసాయభూమి, జనావాస ప్రాంతం. సువర్ణముఖి, దాని ఉపనదులకింద సాగయ్యే నేల. తడ

✡ మానవహక్కుల కార్యకర్త, నెల్లూరులో హిస్టరీ లెక్చరర్




మండలంలోని కొండూరు, అక్కంపేట, కాదలూరు, పెద్ద మాంబట్టు, చినమాంబట్టు, ఎన్.ఎం. కండ్రిగ గామాలకు చెందిన భూములవి. మొదట ఫ్యాక్టరీ పేరుమీదే అనుమతులన్నీ పొంది ఆ తర్వాత 2006 ఫిబ్రవరిలో సెజ్ ఏర్పాటును ప్రకటించారు. ప్రకటించిన ఆరు నెలల్లోనే నిర్మాణం పూర్తయి కంపెనీ పని మొదలైంది. దాంతోపాటు అక్కడి ప్రజల ఇక్కట్లూ మొదలైనాయి.

## కష్టాలు మొదలు

అపాచీ కంపెనీకి భూమిని సేకరించే సమయంలోనే మాంబట్టు ప్రాంతం ప్రజలు కొత్త ప్రపంచాన్ని చూశారు. తమిళనాడు సరిహద్దుల్లో ఉండి, ఉద్యమాలు అంతగా తాకని ఆ ప్రాంతం ప్రజలకు 'ప్రభుత్వం' హఠాత్తుగా తమ కళ్లముందు ప్రత్యక్షమయ్యేసరికి ఆశ్చర్యంతో బిగుసుకుపోయారు. కరువు కాటకాలప్పుడు, వరదల్లో కొట్టుకుపోయినప్పుడు కూడా కానరాని వాళ్లు, ఎన్నికలప్పుడు తప్ప కంటికి కనిపించని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇంకా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, కాళ్లరిగేటట్టు తిరిగినా కరుణించని ఎమ్మార్వోలు, సర్వేయర్లు తమ గ్రామాలను పర్యటనలతో ముంచెత్తడం, ఉపేక్ష, నిర్లక్ష్యమే తప్ప చిన్న పనికి కూడా రోజులతరబడి తిప్పుకునే వాళ్లు తమదగ్గరకి వచ్చి బుజ్జగించి ఒప్పించడం – వాళ్ళకు దిగ్భ్రమను కలిగించింది. సరిగా పంటలు పండక గిట్టుబాటు కాని వ్యవసాయంతో ఇబ్బందులు పడుతున్న వారి పొలాలకు మంచి ధరలు ఇప్పిస్తామని, స్థానికులకే ఉద్యోగాలిప్పిస్తామని, మాంబట్టు గ్రామంలో ఇంటికొక ఉద్యోగం గ్యారంటీ అని, కోల్పోతున్న ఇళ్ళకు ప్రత్యామ్నాయంగా ఇళ్ళు కట్టించి ఇస్తామని వాగ్దానాలు చేశారు.



## భూభాగోతం

రాష్ట్రంలోనే తొలి 'సెజ్' నెల్లూరు జిల్లా తడ మండలంలో 'అపాచీ' గా ఏర్పాటైనట్టు లెక్క. 2006 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ అయిన నెలరోజుల లోపలే 708 ఎకరాల భూమిని అపాచీకి అప్పచెప్పారు. ఎపిఐఐసి మొత్తం వెయ్యి ఎకరాలు సేకరించి అందులో 708 ఎకరాలను అపాచీకి స్వాధీనం చేసింది. ఈ వెయ్యి ఎకరాలలో 675 ఎకరాలు రైతులవి. అవి పట్టా భూములు. ఆ భూములకు ఎకరా 3,54,000 రూ॥ల చొప్పున నష్టపరిహారం ఇచ్చారు. తక్కిన భూమి పెదమాంబట్టు, చినమాంబట్టు దళితుల, ఎన్.ఎం. కండ్రిగ గిరిజనుల అనుభవంలో ఉన్న భూమి. అందులో కొన్ని దేవాదాయ భూములు, కొంత మేతపోరంబోకు భూములు దాదాపు 40 సం॥లుగా వారు ఆ భూములను అనుభవిస్తున్నారు. అయితే ఎవరికీ పట్టాలు లేవు. అవన్నీ అసైన్‌మెంటు భూములు. తాత్కాలిక పట్టాలు గలవి, పట్టాలు లేనివి కూడా ఉన్నాయి. నాలుగు దశాబ్దాలుగా అనుభవంలో ఉన్నా పట్టాలు ఇవ్వక పోవడం ఎవరి వైఫల్యం అన్న విషయం అటుంచితే, పరిహారం దగ్గరకొచ్చేసరికి సాగులో ఉన్న అసైన్‌మెంటు భూమికి ఎకరాకు 2,40,000 రూ., బీడుగా ఉన్న భూమికి 1,80,000 రూ.ల చొప్పున ఇస్తామని ప్రకటించారు. పట్టాలు లేని భూములకు పరిహారం అస్సలు లభించదన్నారు. ఆ విధంగా అనుభవంలో ఉన్నాగాని, పట్టాలు లేని కారణంగా చాలామంది ఎస్సీ, ఎస్టీలకు పరిహారం కూడా లభించలేదు. కొందరు రైతులు మాత్రం కోర్టును ఆశ్రయించి ఎక్కువ పరిహారం పొందగలిగారు.

## దళితవాడ దిగ్బంధం

మాంబట్టు దళితవాడది మరీ విచిత్రమైన పరిస్థితి. అపాచీ కంపెనీ కట్టిన ప్రాంతంలో ఉన్న భూమిని నమ్ముకుని 18 దళిత కుటుంబాలు బతికేవి. మరో 200 కుటుంబాలకు అది నివాస స్థలం. అయితే ఆ పట్టాలు లేకపోవడంతో ఆ స్థలాలకు పరిహారం దొరకలేదు. నివాస స్థలాలు మాత్రం మిగిలాయి వాళ్లకు వేరేచోట స్థలాలు ఇచ్చి వారిని అక్కడనుంచి తరలించి ఉండవచ్చు. కాని 'అపాచీ' హంగామా తర్వాత అక్కడ పొలాల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరా 90 లక్షలదాకా పలకసాగింది. దాంతో దళితులకు అంత ఖరీదు పెట్టి స్థలం కొనడం అనవసరం అనుకున్న ప్రభుత్వం వాళ్ళను అట్లా గాలికి వదిలేసి తక్కిన భూమిని అపాచీకి అప్పజెప్పింది. తన స్థలం చుట్టూ 'అపాచీ' గోడ కట్టుకుంది. అంటే మాంబట్టు దళితవాడ చుట్టూ చైనాగోడతో దిగ్బంధనం అయిపోయింది. వాళ్ళ పొలాలు, కంచెలు, స్మశానం అన్నీ దిగ్బంధనం అయిపోయాయి. అన్నిటినీ 'అపాచీ' మింగేసింది. వాళ్ళ ఇళ్ళను ముట్టుకోలేదు గనుక ప్రభుత్వం మిగతా విషయాల గురించి పట్టించుకోవడం మానేసింది.

## వాగ్దానాలు ఘనం – అమలు శూన్యం

'అపాచీ'వల్ల మన ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది, 35,000 ఉద్యోగాలొస్తాయి, స్థానికులందరికీ ఇంటికో ఉద్యోగం, మంచి జీతాలు, పొలాలకు ప్రత్యామ్నాయంగా పొలాలు, పక్కా ఇళ్ళు ఇవీ అప్పటి వాగ్దానాలు. ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్లు పోటీలుపడి మాట ఇచ్చారు. ఒక సంవత్సరం తర్వాత చూస్తే ఉద్యోగాలు 5 వేలు కూడా లేవు. అందులో స్థానికులు 500 మంది కూడా లేరు.

## నయవంచన

అప్పటి సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం. రవిచంద్ర స్థానికులకు హామీలు కురిపించడంలో పోటీ పడ్డారు. తాను పూచీగా ఉంటానని, స్థానికుల సమస్యలు పరిష్కారం కోసం నిలబడతానని ఎమ్మెల్యే అంటే ఏ విద్యార్హతలతో నిమిత్తం లేకుండా 'కంటికి చేతికి అనుసంధానం ఉన్న వాళ్ళందరికీ' ఉద్యోగాలిప్పిస్తామని కలెక్టర్ చెప్పారు. తీరా చూస్తే 18-25 ఏళ్ళ వాళ్ళకే ఉద్యోగాలు. అదీ 8వ తరగతి ఉంటేనే ఉద్యోగం. ఆ మాత్రం చదువులు లేనందువల్ల ఒక్క గిరిజనుడు కూడా ఆ ఉద్యోగాలు సంపాదించుకోలేకపోయాడు. 1801/- కంటే ఎక్కువ మూలవేతనం గల ఉద్యోగస్తులు స్థానికులలో లేరు. పైపెచ్చు 'అపాచీ' బూట్ల కర్మాగారం నుండి వచ్చే కలుషిత నీరు, గాలి. కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులపాలౌతున్నారు.

## లోపల ఏం జరుగుతోంది?

అపాచీ ప్రాంగణం ఒక నిషిద్ధ ప్రాంతం. రహస్య ప్రదేశం. చుట్టూ ప్రహరీ, పెద్దగేటు. అక్కడొక చెక్‌పోస్టు. ఇతరులెవ్వరికీ లోపలికి ప్రవేశం లేదు. పత్రికలవాళ్ళైనా సరే. లోపల ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు.

అక్కడ పనిచేసే ఒక కార్మికుడికి రసాయనాలవల్ల చేతివేళ్ళు పోయాయని, ఆ విషయం బయటకు పొక్కకుండా అతన్ని లోపలే ఉంచుకుని జీతం ఇస్తున్నారని, మరొక కార్మికుడికి శరీరమంతా చర్మవ్యాధి సోకడంతో పని మానుకోవలసి వచ్చిందని చెప్పుకుంటారు. వాళ్ళు బయట కనపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అపాచీ 'అడిడాస్' కంపెనీకి బూట్లు సరఫరా చేస్తుంది. జంతు చర్మంతోను, దాని ప్రాసెసింగ్‌తోను కూడుకున్న పరిశ్రమ. దాని నుండి వెలువడే దుర్వాసన, కలుషిత నీరు ఇప్పటికే మాంబట్టు గ్రామాన్ని కబళించాయి. తరచు శ్వాసకోశ వ్యాధులతోను, డయేరియాతోను జనం బాధలు పడుతున్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) వారు ఇప్పటికే సాధారణంకంటే 10% ఎక్కువ కాలుష్యం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

## స్థానిక శాసనసభ్యుడికి కూడా తెలియదు

'అపాచి'లో ఏం జరిగేదీ స్థానిక శాసనసభ్యుడికి కూడా తెలియదనే అనుకోవాలి. ఎందుకంటే పోయిన అక్టోబర్ 3న కార్మికులు రోడ్డునపడి తమ బాధలను బయటపెట్టేదాకా అక్కడ పరిస్థితి బయట వాళ్లకు తెలియదు. ఆ విషయం గురించి గౌరవ శాసనసభ్యులు మాట్లాడింది కూడా అప్పుడే. అప్పుడప్పుడు 'అపాచీ' స్థానికులకు ఉద్యోగాలివ్వడం లేదని వాపోయినా, తననే లోపలికి రానివ్వలేదని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని బెదిరించినా, ఆ మర్నాడు హైవేమీద గల పున్నమి రెస్టారెంట్‌లో అపాచీ కంపెనీ యాజమాన్యంతో జరిగిన భేటీతో ఆ విషయం ముగిసిపోయేది. కార్మికులను వేధిస్తున్నారనీ, కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారనీ, కలెక్టర్‌కు, ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశాననీ పత్రికలో వార్తలొచ్చినా అవి అంతటితో సరి.



## అపాచీమాట

స్థానికులకు ఉద్యోగాలు, తక్కువ జీతాలు, వేధింపులు, పరిహారం, గ్రామస్తుల దారిని అడ్డగించడం – ఇటువంటివెన్ని జరిగినా అపాచీ యాజమాన్యం మాత్రం స్పష్టంగా, నిర్మొహమాటంగా ఒకటే మాట చెబుతూ వచ్చింది.

1. భారత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు మా బాధ్యత లేదు.

2. మా కార్యక్రమాలన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయి.

దీన్ని బట్టి ఉద్యోగాలిస్తాం, ప్రత్యామ్నాయంగా పొలాలు చూపిస్తాం, పక్కా ఇళ్ళు కట్టిస్తాం, మీ ప్రాంతాన్ని అద్భుతంగా అభివృద్ధిచేసి పారేస్తాం అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ఇచ్చిన వాగ్దానాలతో అపాచీకి సంబంధం లేదని తేలిపోయింది. నిబంధనల ప్రకారమే పనిచేస్తున్నామన్న వారి నిబంధనలేమిటో, వారితో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఏమిటో తెలిస్తే తప్ప వారి మాటల్లో నిజమెంతో ప్రజలకు తెలిసే అవకాశం లేదు.

## కర్మాగారం లోపల

అపాచీ బూట్ల కంపెనీ ఒక పరిశ్రమ. కాని ఒక పరిశ్రమలో ఉండవలసిన ప్రమాణాలుగానీ, పరిస్థితులుగానీ ఇక్కడ కనిపించవు. పనివేళలు ఉదయం 8.30 నుండి సాయంత్రం 5.30 వరకు (9 గంll పని), ఉదయం 8 గంటలకే హాజరై రోజువారీ పనిని ప్లాన్ చేసుకుని 8.30 కి పని ప్రారంభించాలి. మధ్యలో బాత్‌రూంకి వెళ్ళాలన్నా కనీసం అరగంట ముందు అనుమతి తీసుకోవాలి. 5 నిమషాలకన్నా ఎక్కువ వాడుకోరాదు. స్త్రీలైనా ఎలాంటి పరిస్థితిలోనైనా సరే 5 నిమషాలు దాటితే వాటిని నమోదు చేసి 4 గంటలు దాటగానే జరిమానా విధిస్తారు. అనగా ఒక రోజు జీతం కోతన్నమాట. మధ్యాహ్నం భోజన విరామం 30 నిమషాలు. క్యాంటీన్ ఇరుకుగా ఉండి తగినంత మంచినీటి సరఫరా లేక ఆలస్యమైపోతుంటుంది. పైపెచ్చు క్యాంటిన్ భోజనం ఘోరాతిఘోరం.

నెలలో 4 ఆదివారాలు పోను 26 రోజులకే వేతనం. మరే సెలవు దినాలూ లేవు. గాంధీ జయంతిలాంటి ప్రభుత్వ సెలవులకూ జీతం కోసేస్తారు. సెలవు పెడితే రోజుకు 350/- చొప్పున జీతం కోత. 4 రోజులు రాకపోతే జీతంలో కలిపి ఇచ్చే బోనస్ కట్. నిర్ణయించిన టార్గెట్‌ను 25వ తారీకు నాటికే పూర్తి చేయిస్తారు. అందుకోసం రోజువారీ పనులలో తరుముతారు. అందుకు సూపర్‌వైజర్లు ఎంచుకునే మార్గం బూట్లు విసిరి (కొట్టి) పనిచేయించడం. కుక్కలు, పందులు అంటూ తిట్టడం. ఇదేమని ప్రశ్నించే సాహసం చేస్తే కొలువు పోయినట్టే.

## వివక్ష

కంపెనీలో పనిచేసే చైనావారికి, స్థానికులకు మధ్య వివక్ష నడుస్తుంటుంది. కార్మికులను తీసుకొచ్చే వాహనాల దగ్గరనుండి బాత్‌రూంల వరకు చైనా వారికి వేరుగా ఉంటాయి. స్థానికులకు అసలు వాహన సౌకర్యమే లేదు. 'పంచింగ్' వాళ్ళకి రెండుసార్లే, స్థానికులకు 4 సార్లు.

## జీతాలు

స్థానికులకు ఉద్యోగాలు ఇబ్బడి ముబ్బడిగా లభిస్తాయని, 10 వేలకు తగ్గకుండా జీతాలుంటాయని చెప్పిన మాటలు ఉత్త మాటలే అయ్యాయి. స్థానికులెవరికీ జీతం 3-4 వేలు దాటదు.

| | వేతనం | తగ్గింపులు | |
|---|---|---|---|
| మూల వేతనం | 1801.00 | పి.ఎఫ్. | 216.00 |
| ఇంటి అద్దె | 650.00 | క్యాంటిన్ | 312.00 |
| రవాణా | 650.00 | వృత్తి పన్ను | 35.00 |
| ఉత్పత్తి బోనస్ | 350.00 | గైర్హాజరుకు | ---- |
| హాజరు | 360.00 | శెలవులకు | ---- |
| అదనపు పనికి | 745.00 | | |
| | 4556.00 | | 565.00 |
| **నిజ వేతనం** | **3,993.00** | | |

మహిళలకు విడిగా ఏ వసతులూ లేవు. గర్భవతులైనా, 9వ నెలలో కూడా పనిచెయ్యాల్సిందే. ప్రసవం తర్వాత మళ్ళీ కొత్తగా ఉద్యోగంలో చేరినట్టే లెక్క. కంపెనీ యూనిఫాం ఇంటినుండే వేసుకుని రావాలి. స్త్రీలతో సహా, బట్టలు మార్చుకునే గది లేదు కనుక ఇది తప్పనిసరి.

జీతంలో మినహాయించుకున్న ప్రావిడెంట్‌ఫండ్, వృత్తి పన్ను మొదలైనవాటికి లెక్కలుండవు. అవి ఎక్కడికి పోతున్నాయో తెలియదు.

## అక్టోబర్ 3న ఏం జరిగింది?

అక్టోబర్ 3, 2007న అపాచీ కార్మికులు 'మెరుపు సమ్మెకు' దిగడంతో జిల్లా ప్రజలకు విషయాలు తెలియవచ్చాయి. ఇప్పటి వరకు అపాచీ లోపల ఏం జరుగుతోందన్నది ఒక చిదంబర రహస్యం. ఏవేవో పుకార్లు ఉన్నా రంగు రంగుల యూనిఫాంలో వెళ్ళే కార్మికులను సంబరంగా చూస్తున్న ప్రజలకు అసలురంగు బయట పడిపోయింది.

'అపాచీ' లోపలున్న ప్రమాదకరమైన పని ప్రదేశాలలో 'రబ్బర్‌ప్లాంట్' ఒకటి. విపరీతమైన వేడిలో తొడుగులు వేసుకుని పనిచేయాలి. ఇక్కడ రెండే షిప్టులు. అంటే రోజుకు 11 గంటల పని. మామూలు సెక్షన్‌లలోనే 9 గంటలు పని చేస్తుండగా తమకు 11 గంటల పని చాలా కష్టంగా ఉందని 3 షిఫ్టులుగా మార్చాలని కార్మికులు డిమాండ్ చేయగా, జీతాలు పెంచుతామని, అదనపు సౌకర్యాలు కల్పిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. కానీ నెలలు గడుస్తున్నా వారి హామీకి అతీ గతీ లేకుండా పోయింది. అక్టోబర్ 3న ఈ విషయమై సత్య, రవి, వై. చెంగయ్య అనే కార్మికులు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. దీనితో ఆగ్రహించిన యాజమాన్యం ప్రశ్నించిన కార్మికులను సెక్షన్ మారుస్తామని, లేదంటే ఉద్యోగం నుండి తొలగిస్తామని బెదిరించారు. ఇదేమిన్యాయం అని అడిగిన నేరానికి వై. చెంగయ్య అనే కార్మికుణ్ణి రబ్బర్ ప్లాంట్ అధికారి 'వైకాస్' కొట్టి, చొక్కా పట్టుకుని బయటకు గెంటేశాడు. ఇహ అతడి ఉద్యోగం పోయినట్టే. అప్పటికే అసంతృప్తితో రగిలిపోతున్న కార్మికులు మర్నాడు అనగా అక్టోబర్ 4 ఉదయం డ్యూటీకి వచ్చిన ఇతర కార్మికులతో కలిసి మూకుమ్మడిగా మెరుపు సమ్మెకు దిగారు.

## సమ్మె షాక్

అపాచీ కార్మికులకు సంబంధించి ఎన్ని వార్తలు వస్తున్నా, అక్కడ ఏ చట్టాలు అమలు కాకున్నా అటువైపు చూడని జిల్లా యంత్రాంగం సమ్మె అనగానే దిగిపోయింది. అసలు సమస్య ఏమిటన్నది విలేకరులకూ తెలియలేదు. స్థానిక శాసనసభ్యుడు నెలవల సుబ్రమణ్యం, జిల్లా కలెక్టర్ రవిచంద్ర, గూడూరు సబ్ కలెక్టర్, డి.ఎస్పీ, సి.ఐలు, ఎస్.ఐలు, పోలీసులు అందరూ అపాచీ వద్ద మోహరించారు. బయట బైఠాయించిన కార్మికులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. తర్వాత భయపెట్టారు. ఇది నేరుగా ముఖ్యమంత్రి ప్రారంభించిన కంపెనీ కనుక తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. లాఠీలు ఝుళిపించారు. ఇంత జరుగుతున్నా అపాచీ యాజమాన్యం మాత్రం ఏమీ మాట్లాడలేదు. విలేకరులతో సహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. పోలీసు పహరాను ఏర్పరచుకుంది. కార్మికులు పనిలోకి రాకపోతే తీవ్రపరిణామాలుంటాయనే హెచ్చరికలు మాత్రం పంపించింది. సమ్మె మరో రోజు సాగడంతో ఎమ్మెల్యే, కలెక్టర్లు రంగంలోకి దిగారు.

## శాసనసభ్యుడు, జిల్లా కలెక్టర్ల మంత్రాంగం

తెల్లవారుజామున 4 గంటలకే ముఖ్యమంత్రి తనకు ఫోన్ చేశాడని, ఒక పవిత్ర కర్తవ్యాన్ని నిర్వహించడానికి తాను వచ్చానని జిల్లా కలెక్టర్ ప్రకటించాడు. అదే విషయాన్ని శాసనసభ్యుడూ చెప్పాడు. 'మీలో వచ్చిన ఈ ఆందోళన ఒక్క రోజుది కాదు. అది క్రమంగా గూడు కట్టుకున్న బాధ' అంటూ కార్మికుల అభిమానాన్ని పొందే ప్రయత్నం చేశాడు. కార్మికుల కరతాళధ్వనులు ముగిశాక అసలు రాయబారం మొదలుపెట్టాడు. 'తమిళనాడుకు వెళ్ళిపోతున్న ఫ్యాక్టరీలు అదృష్టవశాత్తూ మన ముందు కొచ్చాయి. వాటిని కాపాడుకుంటేనే మరిన్ని కంపెనీలు వస్తాయని' ముక్తాయించాడు. ఇటువంటి సమ్మెలవల్ల తప్పుడు సంకేతాలు పోతాయని, దానివల్ల వచ్చే కంపెనీలు కూడా రాకుండా పోతాయని, కాబట్టి కార్మికులు సంయమనం పాటించాలన్నాడు. తమ సమస్యలపై తమ సమక్షంలోనే యాజమాన్యంతో చర్చలు జరపాలన్న డిమాండ్‌ను కాదన్నాడు. సెక్షన్‌కి 10 మంది చొప్పున 20 మందిని లోపలకు అనుమతించి చర్చలు జరిపారు. లోపల ఏం జరిగిందో బయటకు తెలియదు. విలేకరులకూ అనుమతి లభించలేదు. ఇంతసేపూ కార్మికులను దబాయించిన డి.ఎస్పీ కూడా బయటే ఉండిపోయాడు. అపాచీ ప్రతినిధులు స్టీవ్, కెన్‌లతో శాసనసభ్యుడు, జిల్లా కలెక్టర్ సంప్రదింపులు జరిపారు.

## డిమాండ్‌లు

8 గంటల షిఫ్ట్ విధానం, జులై 17 నాటి కొత్త జీవో ప్రకారం వేతనాలు, నెలవారీ సెలవులు, రబ్బర్ ప్లాంట్‌వంటి చోట్ల 3 షిప్టులు, డాక్టర్‌ను అందుబాటులో ఉంచడం, కేంటిన్‌లో ఆహార పదార్థాలను మెరుగుపరచడం, కార్మికులను కాళ్ళతోనూ, చెప్పులతోనూ కొట్టడం, కుక్క, పంది అంటూ తిట్టడం మానుకోవడం, తమ సమస్యలను యాజమాన్యానికి తెలియజేసే ఏర్పాటు, గైర్హాజరుకు 1000/- కోత, రవాణా సౌకర్యాలు, బలవంతంగా షిఫ్టులు చేయడం వంటి అనేక సమస్యలను కార్మికులు ముందుకు తెచ్చారు.

ఈ రెండు రోజుల సమ్మె వల్ల కంపెనీ 40 లక్షలు నష్టపోయిందని, ఇటువంటివి పునరావృతం కాకూడదని, ఇరువర్గాల మధ్య అవగాహన లోపంవల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, కార్మికుల కోర్కెలలో చాలామట్టుకు యాజమాన్యం అంగీకరించిందని, నూతన చట్టం ప్రకారం వేతనాలు, సెలవులు లభిస్తాయని ప్రకటిస్తూ కంపెనీవారు తన్నడం, అసహ్యంగా తిట్టడం, చెప్పులతో కొట్టడం గురించి ఒక చిత్రమైన వివరణనిచ్చారు. అదేమిటంటే పైన చెయ్యివేసి మాట్లాడడం చైనావారి సంస్కృతి అని, దానిని అపార్థం చేసుకోవడం తగదని అన్నారు. కాళ్ళతోనో, చెప్పులతోనో మాట్లాడడం వాళ్ళ సంస్కృతి అయితే

తిరిగి వాటితోనే సమాధానం చెప్పడం మన సంస్కృతి, అట్లా చెయ్యమంటారా అని కొందరు కార్మికులు ప్రశ్నించగా కలెక్టర్‌గారు ఆగ్రహించి ఉద్యోగ భద్రత కోసం ఇవన్నీ సహించాలని బోధించారట. మొత్తంమీద చైనా సంస్కృతి గురించి ఒక కొత్తకోణాన్ని జనంముందు ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభినందనీయుడు!

## ఒప్పందం ఏమిటి?

ఇంతకూ కార్మికులకు యాజమాన్యానికి మధ్య జరిగిన ఒప్పందం ఏమిటో ఎవరికీ తెలియదు. ఏ వాగ్దానాలు అమలవుతాయో, ఏవి కావో తెలియదు. 'కంటికీ చేతికీ అనుసంధానం' ఉంటే అందరికీ ఉద్యోగాలని హామీ ఇచ్చిన ఆ కలెక్టరే ఇప్పుడు ఈ ఒప్పందం చేయించాడు. దీనికీ ఆ గతే పట్టదా? చర్చలు కార్మికుల సమక్షంలో జరగాలని, వర్క్‌మన్ కమిటీలు ఏర్పరచాలని, ఒప్పందం వ్రాత పూర్వకంగా ఉండాలని డిమాండ్ చేసిన మానవహక్కుల వేదిక సూచనను పట్టించుకోలేదు. సమ్మెను విరమింపజేయడమే ప్రధానం అన్నట్టు అందరూ ప్రవర్తించారు.

'సెజ్' కింద ఏర్పడిన ఒక కంపెనీలో కార్మికులు సమ్మెచేస్తే ఒక శాసనసభ్యుడు, ఒక జిల్లా కలెక్టరూ కలిసి రహస్య ఒప్పందం చేయించి సమ్మెను విరమింపజేశారు. పెద్దల ఆదేశాలను పాటించారు. చట్ట సభలలో సభ్యుడైన ఒక శాసనసభ్యుడు, కార్యనిర్వాహకాధికారియైన ఒక జిల్లా కలెక్టరు తమ బాధ్యతలను విస్మరించి ఒక కార్మిక సమస్యను ఇంతబాగా పరిష్కరిస్తే ఇక భవిష్యత్‌పై భ్రమలెందుకుండాలి? పారిశ్రామిక ప్రగతి చాటున కార్మిక అశాంతిని, ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తే వారు చెప్పే ప్రగతి ప్రశ్నార్థకమే అవుతుంది. 'టాటా'ల సింగూర్, నందిగ్రాంలు, జిందాల్ వారి 'మిద్నపూర్'లు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.

◆◆◆





# కోస్ట్‌ను కబళిస్తున్న 'కారిడార్'

కలకత్తానుండి పోర్బందర్ దాకా దేశ తీరం వెంబడి ఒక విశాల భూభాగంలో భారీగా పారిశ్రామీకరణ చేపట్టడం కోసం రోడ్లు, రైల్వేలైన్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, నీటిసరఫరా, పెట్రోల్ మరియు గ్యాస్ సరఫరా, కరెంటు సరఫరా, టౌన్‌షిప్పులు మొదలయిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి ఐటి, టూరిజం, వినోదం, వ్యవసాయాధారిత పరిశ్రమలు, పెట్రో కెమికల్స్, మందుల పరిశ్రమలు వగైరాలను ఆహ్వానించే ఉద్దేశ్యంతో ప్రతిపాదించిన ఆలోచన 'తీరప్రాంత పారిశ్రామిక కారిడార్' లేక 'కోస్టల్ కారిడార్' అనేది.

ప్రభుత్వ ప్రైవేటురంగాల సమ్మేళనమైన (పిపిపి) ఈ ప్రాజెక్టు రూపకల్పన ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతానికి సంబంధించినంతవరకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఇన్‌కాప్) అనే సంస్థ చేతిలో పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం 11 ఫిబ్రవరి 2008న జీవో నెం. 34 జారీ చేసింది. ఈ ఇన్‌కాప్ చిన్న సంస్థకాదు. ఇందులో 50 మంది 'అంతర్జాతీయ' ప్రతిష్టగల నిపుణులున్నారంట. అయితే అత్యంత విధ్వంసకరమైన కోస్టల్‌కారిడార్ ప్రతిపాదన పట్ల తీరప్రాంత ప్రజలలో ఒకపక్క వ్యతిరేకత చాలా పెరగడం, మరొకపక్క ఎన్నికలు సమీపించడం గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 34ను తెలివిగా రద్దుచేసి ఇంక ఆందోళన చెందనక్కరలేదన్న అభిప్రాయం కలిగించే ప్రయత్నం చేసింది. కానీ జీవో 34 రద్దుతో ఇన్‌కాప్‌కు ఇచ్చిన కాంట్రాక్టు రద్దయింది తప్ప కోస్టల్ కారిడార్ అన్న ప్రతిపాదన రద్దు కాలేదు.

రాష్ట్రంలో అధికారానికొచ్చిన కొత్త ప్రభుత్వం కొత్త అబద్ధాలు చెప్పి దీనిని కొనసాగిస్తుందనడంలో ఎటువంటి సందేహానికీ ఆస్కారం లేదు కాబట్టి కోస్టల్ కారిడార్ ఇప్పటికే అమలు అవుతూ ఉందని మొదట గ్రహించడం అవసరం. కోస్టల్ కారిడార్ అనేది ఒక ప్రాజెక్టు కాదు. అది ప్రాజెక్టుల సమాహారం. అందులోని ప్రధాన భాగాలు సెజ్‌లు, కొత్త విమానాశ్రయాలు, ఓడరేవులు, హైవేలు, విద్యుదుత్పత్తి కేంద్రాలు. ఇవన్నీ తయారుచేసి పరిసరాలలోకి పరిశ్రమలను ఆహ్వానించి వచ్చినకొద్దీ భూములు ఖాళీ చేయించుకుంటూ పోవడమే కోస్టల్ కారిడార్ రూపకల్పన వ్యూహం. ఇప్పటికి విశాఖపట్నం జిల్లాలో రెండు సెజ్‌లు (రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలలో), తూర్పు గోదావరి జిల్లాలో ప్రజల తీవ్ర

ప్రతిఘటన నడుమ ఒక సెజ్ (యు.కొత్తపల్లి, తొండంగి మండలాలలో), చిత్తూరు జిల్లాలో ఉన్నప్పటికీ వాస్తవానికి కోస్టల్ కారిడార్‌లో భాగమయిన ఒక సెజ్ (సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలలో) భూసేకరణ ప్రక్రియ ముగించుకొని డెవలపర్ చేతిలోకి వెళ్ళాయి, లేక వెళ్లడానికి తయారుగా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లాలో గంగవరం పోర్టు, నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు తయారయ్యాయి. తూర్పు గోదావరి జిల్లా గాడిమొగ దగ్గర




కోస్టల్ కారిడార్ చిత్రపటం

రిలయన్స్ వారి సహజవాయు కేంద్రం ఉత్పత్తి మొదలు పెట్టింది. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం దగ్గర మొత్తం 5600 మెగావాట్ల సామర్థ్యం ఉన్న థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం చాలా దూరం పోయింది. విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలంలో మందుల ఫ్యాక్టరీలు ఇప్పటికే నెలకొన్నాయి. ఇచ్ఛాపురం నుండి తడదాకా నాలుగు రోడ్ల హైవే పూర్తయిపోయి గోల్డెన్ క్వాడ్రాంగల్‌లో భాగంగా ఎనిమిది రోడ్లహైవేగా రూపాంతరం చెందడానికి సిద్ధంగా ఉంది. కారిడార్‌కోసం భూసేకరణకు గుంటూరు జిల్లాలో ప్రతిఘటన ఉంది కాబట్టి దానిని తాత్కాలికంగా వాయిదావేసి ప్రతిఘటన లేకుండా చేసుకున్న ప్రకాశం జిల్లాలోనూ, నెల్లూరులోనూ ముగించేస్తున్నారు. ప్రతీ అంగుళం పంటపొలాలు, చేపల చెరువులు ఉన్న తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల డెల్టాలో ఏమీ చేయకుండ ప్రస్తుతానికి జాగ్రత్త పడుతున్నారు.

## తీరం వెంబడి ఊర్లు ఖాళీ

మన రాష్ట్రంలో కోస్టల్ కారిడార్ వైశాల్యం 1575 చదరపు కిలోమీటర్లు ఉంటుందని అంచనా. అంత భూభాగంలో 'తీరం వెంబడి' క్రమంగా పొలాలు, ఊర్లు ఖాళీ అయిపోతాయి. ఎగుమతి మార్కెట్‌తో ముడిపడిన ఉత్పత్తి చేసే పరిశ్రమలు నెలకొంటాయి. వాటివల్ల వచ్చే ఉద్యోగాలు చాలా తక్కువ, స్థానిక గ్రామీణులు చేయగల ఉద్యోగాలు మరీ తక్కువ. కాలుష్యం మాత్రం భారీగా ఉంటుంది. మందుల పరిశ్రమలు, పెట్రోకెమికల్స్, రసాయన పరిశ్రమలు, థర్మల్ కేంద్రాలు విపరీతంగా కాలుష్యం కలిగిస్తాయి. ఆ కాలుష్యాన్ని 'ట్రీట్' చేసి సముద్రగర్భంలోకి వదిలిపెట్టడానికి కాలుష్య నియంత్రణ మండలి అనుమతిస్తున్నది. కేంద్ర పర్యావరణశాఖ కూడా

**మన రాష్ట్రంలో కోస్టల్ కారిడార్ వైశాల్యం 1575 చదరపు కిలోమీటర్లు ఉంటుందని అంచనా. అంత భూభాగంలో 'తీరం వెంబడి' క్రమంగా పొలాలు, ఊర్లు ఖాళీ అయిపోతాయి. ఎగుమతి మార్కెట్‌తో ముడిపడిన ఉత్పత్తి చేసే పరిశ్రమలు నెలకొంటాయి. వాటివల్ల వచ్చే ఉద్యోగాలు చాలా తక్కువ, స్థానిక గ్రామీణులు చేయగల ఉద్యోగాలు మరీ తక్కువ.**



ఆమోదం తెలియజేస్తున్నది. అయితే రసాయన కాలుష్యాన్ని ఎంత 'ట్రీట్' చేసినా నూటికి నూరుశాతం శుభ్రం కాదనేది అందరూ ఎరిగిన సత్యం. కాబట్టి సముద్ర జల కాలుష్యం క్రమంగా పెరుగుతుంది.

మన రాష్ట్రంలో అమలవుతున్న కోస్టల్ కారిడార్ ప్రాజెక్టును మూడుగా విడగొట్టవచ్చు. ఒకటి విశాఖపట్నం నుండి కాకినాడ దాకా 603 చ.కి.మీల వైశాల్యంలో నెలకొల్పజూస్తున్న పెట్రోకెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తుల ప్రాంతం (పిసిపిఐఆర్). 603 చ.కి.మీలంటే దాదాపు 1.50 లక్షల ఎకరాలు. రెండవది గుంటూరు ప్రకాశం జిల్లాలలో 28 వేల ఎకరాలలో నెలకొల్పుతున్న వాన్‌పిక్. (వాడరేవు నిజాంపట్నం పోర్టు పారిశ్రామిక కారిడార్). మూడవది నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నెలకొంటున్న సెజ్‌లు, రేవులు, థర్మల్ కేంద్రాల ప్రాంతం. శ్రీకాకుళం జిల్లా ఉత్తర భాగాన నెలకొంటున్న రెండు థర్మల్ విద్యుత్ కేంద్రాలను నాలుగవదిగా భావించవచ్చునేమో.

## పిసిపిఐఆర్

హైదరాబాద్, విశాఖపట్నంలాంటి నగరాలకు పట్టణాభివృద్ధి సంస్థలు (హుడా, వుడా వగైరా) ఉన్న సంగతి మనకు తెలుసు. వాటి ఆధ్వర్యంలో ఆ నగరాల మాస్టర్ ప్లాన్‌లు తయారవుతాయి. ఏ నిర్మాణమైనా ఏ అభివృద్ధి ప్రక్రియ అయినా దానికి లోబడి జరగవలసి ఉంటుంది. ఈ పట్టణాభివృద్ధి సంస్థలను ఆం.ప్ర. పట్టణ (అభివృద్ధి) చట్టం, 1975 కింద నెలకొల్పారు. విశాఖపట్నం-కాకినాడ పిసిపిఐఆర్ ప్రాంతానికి కూడ అదే చట్టం కింద అదే నమూనాలో ప్రత్యేక అభివృద్ధి సంస్థ (ఎస్‌డిఏ)ని నెలకొల్పుతూ రాష్ట్ర ప్రభుత్వం 2008 మే నెల 24 నాడు జివో నెం. 373 జారీ చేసింది. ఈ ఎస్.డి..ఎకి ఆ పారిశ్రామిక కారిడార్‌లోని 110 గ్రామాలపైన అధికారం ఉంటుంది. ఈ 110 గ్రామాలు విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ, పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్. రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలలోను, తూర్పు గోదావరి జిల్లా యు. కొత్తపల్లి, తొండంగి, కాకినాడ రూరల్ మండలాలలోను ఉన్నాయి. ఇప్పటికే ఆమోదం పొందిన మూడు సెజ్‌లు (రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలలో రెండు, యు.కొత్తపల్లి-తొండంగి మండలాలలో ఒకటి) ఈ భూభాగంలో ఉన్నాయి. సెజ్‌హోదా పొందిన పరవాడ మండలంలోని రాంకి ఫార్మా, నక్కపల్లి మండలంలోని హెటెరో డ్రగ్స్ ఇక్కడే ఉన్నాయి. సింహాచలంలోని ఎన్‌టిపిసివారి థర్మల్ పవర్ ప్లాంటు సామర్థ్యాన్ని 2000 మెగావాట్లకు పెంచి, ఇంకొక 7 గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పే ఆలోచన కూడ చేస్తున్నారు. గంగవరం పోర్టు, నిర్మాణంలో ఉన్న కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఇక్కడే ఉన్నాయి. ఇవికాక ముత్యాలమ్మపాలెం దగ్గరొకటి, రేవుపోలవరం దగ్గరొకటి, పూడిమడక దగ్గరొకటి, యు.కొత్తపల్లి - తొండంగి మండలాలలోని సెజ్‌కు అనుబంధంగా ఒకటి నాలుగు పోర్టులు రాబోతున్నాయి. అయితే ఉత్తరాంధ్రలో రాబోయే రేవులివే కావు. విశాఖపట్నంకు ఉత్తరాన భీమునిపట్నం, కళింగపట్నం, భావనపాడు, ముక్కాంలు కూడా జాబితాలో ఉన్నాయి. ఈ మౌలిక సదుపాయాలు ఒనగూడిన తరువాత ఈ ప్రాంతమంతటా రసాయన, పెట్రో కెమికల్ పరిశ్రమలు, ఎరువుల కర్మాగారాలు, ఉక్కు ఫ్యాక్టరీలు, సిరామిక్స్ ఫ్యాక్టరీలు వస్తాయని పాలకుల ఆలోచన.

ఈ 603 చ.కి.మీలలో 110 గ్రామాలున్నాయి. వేల ఎకరాల కొబ్బరితోటలు, జీడిమామిడి తోటలు, సరుగుడు తోటలు, వరిచేలు ఉన్న చాలా అందమైన గ్రామాలివి. స్వంత భూములున్న రైతులతోపాటు అసైన్‌మెంట్ పట్టాలున్నవారు, అవికూడ లేకుండ ప్రభుత్వ భూములు చేసుకొంటున్నవారు,

మత్స్యకారులు కడుపునిండా తింటూ బతుకుతున్న గ్రామాలివి. అవేమవుతాయి? ఇప్పటికింకా ఆ గ్రామాలను ఖాళీనే చేయించలేదు. అవి అక్కడే ఉన్నాయి. కానీ ఎస్‌డిఎ పాలనలోకి వచ్చాయి. ఎస్‌డిఎ అనుమతి లేకుండ ఎవరూ ఏ నిర్మాణాలూ చేపట్టడానికి వీలులేదు. అంతే కాదు భూములు అమ్ముకోవడానికీ కొనుక్కోవడానికీ కూడా వీలులేదని ఎస్‌డిఎ 23 జూన్ 2008 నాడు పత్రికలకిచ్చిన ప్రకటనలో ఆదేశించింది. (అటువంటి ఆదేశం ఇచ్చే అధికారం వారికి ఉందో లేదో తెలీదు గానీ ఇచ్చేసారు). రాబోయే రోజులలో వీటిలో కొన్ని గ్రామాలను పిసిపిఐఆర్ కబళిస్తుంది. కొన్ని గ్రామాలు తమ తోటలను, పంట భూములను పిసిపిఐఆర్‌కు కోల్పోతాయి. చుట్టూ రసాయనిక, పెట్రో కెమికల్, ఫార్మాసూటికల్ పరిశ్రమలను, థర్మల్ పవర్ ప్రాజెక్టులను పెట్టుకొని వాటి కాలుష్యాన్ని భరిస్తూ బతకబోతాయి. బతకడం సాధ్యంకాకపోతే స్వచ్ఛందంగానే ఖాళీ అయిపోతాయి. కొంచెం భూమి ఉన్న వారికి కూడా మంచి ఆదాయం ఇస్తున్న సరుగుడు తోటలు, కొబ్బరితోటలు, జీడిమామిడి తోటలు, వరిపొలాలు వట్టిపోతాయి.

రైతులతోబాటు, రైతు కూలీలతోబాటు, మత్స్యకారులు చాలా నష్టపోతారు. ఒక్క విశాఖపట్నం–కాకినాడ పిసిపిఐఆర్ వల్లనే కాదు, మొత్తంగా మన రాష్ట్ర తూర్పుతీరం వెంబడి నెలకొంటున్న కోస్టల్ కారిడార్‌వల్ల ప్రధానంగా నష్టపోయేది మత్స్యకారులు. తీరప్రాంత 'అభివృద్ధి' వల్ల పెరిగే సముద్రకాలుష్యం, కల్లోలం జలజీవాల పునరుత్పత్తిని దెబ్బతీస్తుంది. ఆ తీరం వెంబడి ఉన్న పల్లెలలో మత్స్యకారులు 80 లక్షల మంది నివసిస్తున్నారు. వారు సముద్రంలోనూ సముద్రంలో కలిసే నదులు, ఏర్లలోనూ చేపలవేట చేసుకొని బతుకుతారు. ఇప్పుడు తీరప్రాంతంలో పెద్దెత్తున తీవ్ర కాలుష్యకారకాలయిన పరిశ్రమలు, ఓడరేవులు రానున్నాయి. పరిశ్రమలన్నిటికీ కాలుష్యాన్ని 'ట్రీట్' చేసి సముద్రంలోకి వదిలిపెట్టే అనుమతి కాలుష్య నియంత్రణమండలి, కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ ఇస్తున్నాయని పైన చెప్పాము. విశాఖపట్నం దగ్గర, నక్కపల్లి దగ్గర, కాకినాడ దగ్గర నాలుగుచోట్ల కాలుష్య శుద్ధి కేంద్రాలు నెలకొంటాయి. ఒక్కొక్కదానికి సంవత్సరానికి $1^1/_2$ నుండి 2 లక్షల టన్నుల వ్యర్థాన్ని సాలీనా శుద్ధి చేసే సామర్థ్యం ఉంటుంది. 'ట్రీట్' చేసిన తరువాత ఆ కాలుష్యం సముద్రంలోకి వదలబడుతుంది. 'ట్రీట్' చేయడం అంటే పూర్తిగా శుద్ధిచేయడం కాదు. రసాయన వ్యర్థపదార్థాలను ఎంత శుద్ధి చేసినా పూర్తిగా శుభ్రం కావన్న విషయం కూడా పైన చెప్పాము. సముద్రంలో దూరంపోయి చేపల వేట చేసే పెద్దసైజు మరబోట్ల మీద దీని దుష్ప్రభావం అంతగా ఉండకపోవచ్చునుగానీ తీరం సమీపంలో వేట చేసే సంప్రదాయ మత్స్యకారులపైన బలంగా ఉంటుంది. ఓడరేవుల దగ్గరకూడ వేట అనేక కారణాలుగా కష్టం అవుతుంది. పెద్ద ఓడల రాకపోకల వల్ల సముద్రంలో పెట్రోల్/డీజిల్ కాలుష్యం పెరుగుతుంది. వేగంగా కదిలే పెద్ద ఓడలు మత్స్యకారుల పడవలకూ వలలకూ ప్రమాదకరం కూడా.

పిసిపిఐఆర్‌కు నీళ్లెక్కడినుండి వస్తాయన్నది కూడ పెద్ద ప్రశ్నే. అధికారిక పత్రాలలో ధవళేశ్వరం బ్యారేజికి చెందిన సామర్లకోట కాలవనూ, ఏలేరు ఎడమ కాలవనూ, పోలవరం ఎడమ కాలవనూ నీటి మూలాలుగా చూపిస్తున్నారు. గోదావరి నుండి నేరుగా పైప్‌లైన్ వేస్తామనికూడా అంటున్నారు. వీటిలో మొదటిరెండూ తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలలో సాగునీరు, తాగునీరు ఇస్తున్న ప్రాజెక్టులు. పోలవరం ఎడమ కాలవ ఆ రెండు జిల్లాలలోని గ్రామాలకూ, పట్టణాలకూ (ప్రత్యేకించి విశాఖ నగరానికి) తాగునీరివ్వడానికి ఉద్దేశించబడిందని ప్రభుత్వం ప్రకటిస్తూ వచ్చింది. ఇప్పుడు ఈ మూడింటి నీటి వనరులలో సింహభాగం పిసిపిఐఆర్‌కు ఇచ్చేటట్టయితే ఈ జిల్లాల వాసుల సాగునీటి, తాగునీటి అవసరాల గతేమిటి?



## పేరుకు ఫార్మా సెజ్జేగాని...

*విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలంలోని నల్లమట్టిపాలెం పంచాయితీలో ఫార్మాసెజ్ ఏర్పడింది. ప్రస్తుతం అక్కడున్నది హెటెరో డ్రగ్స్ వారి మందుల కంపెనీ. ఆ కంపెనీ నుండి వెలువడే కాలుష్యం దొండపాక, రాజయ్యపేటల మధ్య ('శుద్ధి' అయిన తరువాత) సముద్రంలో కలుస్తుంది. ఆ తీరం వెంబడి ఈ రెండే కాక బోయపాడు, చిన్నతీనార్ల, పెద్దతీనార్ల, అమలాపురం, దోనిలక్ష్మీపురం, బంగారయ్యపేట అనే (మొత్తం 8) మత్స్యకారుల గ్రామాలున్నాయి. వీటన్నిటి జనాభా కలిపి 40 వేలుంటుంది. ఇక్కడ ఫార్మాసెజ్ ఏర్పడి రసాయన కాలుష్యం ('శుద్ధి' చేసిన తరువాతే అయినప్పటికీ) సముద్రంలో కలవడం వారికి నష్టకరమయినప్పటికీ హెటెరో డ్రగ్స్ గురించి ఏర్పాటు చేసిన పర్యావరణ బహిరంగ విచారణ వారితో ఏమీ నిమిత్తం లేకుండ సాగింది. పర్యావరణ నివేదికను వాళ్లు చూడలేదు. విచారణ చాలా దూరాన నర్సీపట్నంలో జరిగింది. దానికి ప్రధానంగా ఫ్యాక్టరీ నెలకొంటున్న నల్లమట్టిపాలెం గ్రామ ప్రజలే హాజరయ్యారు.*

*రేపు జరగబోయే నష్టాన్ని గురించి విని ఈ గ్రామాల మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. వారిలో కొంతమందికి సముద్రంలో 10 కిమీల దూరం పోయి వేట చేసే మోటార్ బోట్లున్నాయి గానీ ఎక్కువ భాగం సంప్రదాయకమైన తెప్పలమీదే ఆధారపడతారు. అటువంటివి 3000 దాకా ఉన్నాయి. వీరు హెటెరో డ్రగ్స్ కాలుష్య బాధితులు మాత్రమే కాదు. ఉత్తరాంధ్ర కారిడార్‌లోని వ్యర్థపదార్థాల ఔట్‌లెట్లలో ఒకటి నక్కపల్లి మండల తీర ప్రాంతంలో ఏర్పడనుంది. అది సంవత్సరానికి $1^1/_2$ నుండి 2 లక్షల టన్నుల వ్యర్థాన్ని 'ట్రీట్' చేసి సముద్రంలోకి వదులుతుంది. దాని ఫలితం ఈ 40 వేల మత్స్యకార జనాభా మీద ఏవిధంగా ఉండగలదని ఆలోచించినవారు లేరు.*

### వాన్‌పిక్

వాన్‌పిక్ అనేది వాడపల్లి నిజాంపట్నం పోర్టు ఇండస్ట్రియల్ కారిడార్‌కు ఇంగ్లీష్ భాషలో పెట్టిన ముద్దుపేరు. పిసిపిఐఆర్ గోదావరి డెల్టా అవతలి చివరిదాకా వచ్చి ఆగిపోతుంది. గోదావరి, కృష్ణా డెల్టాలను ప్రస్తుతానికి వదిలిపెట్టి కృష్ణా డెల్టా దక్షిణ కొసనుండి ఇది మొదలవుతుంది. (ప్రస్తుతానికి అని ఎందుకంటున్నామంటే డెల్టాను కూడా వదిలిపెట్టేదేమీ ఉండదు. ప్రతిఘటన ఎక్కువ రావచ్చునన్న ఆలోచనతో తాత్కాలికంగా అక్కడ ప్రాజెక్టు రూపకల్పన చేయడం లేదంతే).

వాన్‌పిక్ విస్తీర్ణం 28 వేల ఎకరాలు. గుంటూరు జిల్లాలో నిజాంపట్నం, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాలు, ప్రకాశం జిల్లాలో వేటపాలెం, చిన్న గంజాం, కొత్తపట్నం, ఒంగోలు మండలాల తీరప్రాంతంలో ఇది నెలకొంటుంది. ఇందులో వాడపల్లి దగ్గరొకటి, నిజాంపట్నం దగ్గరొకటి రెండు ఓడరేవులు, నిజాంపట్నం మండలం డిండి దగ్గర పెద్ద థర్మల్ ప్లాంటు ఉంటాయని తెలుస్తున్నది. ప్రకాశం జిల్లా మోటుపల్లి దగ్గర నౌకా నిర్మాణ కేంద్రం రాబోతుందని, కొత్తపట్నం మండలంలో విమానాశ్రయం కట్టబోతున్నారని, వివిధ రసాయన పరిశ్రమలు, ఎరువుల పరిశ్రమలు రాబోతాయని వింటున్నాం. ఉప్పుగుండూరు దగ్గర థర్మల్ ప్లాంట్ వస్తుందన్న వదంతి సహితం ఉంది. వాన్‌పిక్ అనేది పోర్టు ఆధారిత

పారిశ్రామిక కారిడార్ కాబట్టి ఏ పరిశ్రమలొచ్చినా ఎగుమతులపైన ప్రధానంగా దృష్టిపెట్టేవిగా ఉండబోతాయి. అంటే వాటి సాంకేతిక స్థాయి హెచ్చుగా ఉంటుంది. ఆ స్థాయి చదువు ఈ గ్రామాలలో ఎవరికీ లేదు కాబట్టి వాన్‌పిక్‌లో వీళ్లకు ఉద్యోగాలు రావడం కల్ల.

పిసిపిఐఆర్‌కూ వాన్‌పిక్‌కూ ఒక ముఖ్యమైన తేడా ఏమిటంటే వాన్‌పిక్‌ను రూపొందించేది ఒక ప్రైవేట్ సంస్థ. దీనిపేరు వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్. పిసిపిఐఆర్‌ను ప్రభుత్వం చేతిలోనే ఉంచుకొని వాన్‌పిక్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించడం వెనక ఉన్న రహస్యాన్ని క్లుప్తంగా చెప్పాలంటే ఆ కంపెనీకి చెందిన ముఖ్యులు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డికి చాలా 'కావలసిన' వారయిన నిమ్మగడ్డ ప్రసాద్, చిల్లా రవిరెడ్డి, కొండా వెంకటేశ్వరరెడ్డి అనే త్రయం. గుంటూరు జిల్లాలో వాన్‌పిక్ ప్రాజెక్టుకునిమ్మగడ్డ ప్రసాద్ గారి మాత్రిక్ సంస్థే యజమాని అని ప్రజలు భావిస్తున్నారు. నిజానికి అది వాన్‌పిక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వాటాదారు మాత్రమే.

వారికి కావలసిన 28 వేల ఎకరాలలో ప్రభుత్వ భూమి చాలా ఉంది. దాని అప్పగింత ప్రభుత్వం చూసుకుంది. ప్రైవేట్ భూమిని వాన్‌పిక్ రైతులనుండి స్వయంగా కొనుక్కుంటున్నది. 9944.25 ఎకరాల అసైన్డ్ భూమిని మాత్రం ప్రభుత్వం లబ్దిదారులనుండి తీసుకొని వాన్‌పిక్‌కు అప్పగించే ప్రయత్నం చేసింది. ఆ భూమి తప్ప వేరే జీవనాధారం లేని లబ్దిదారులు గట్టిగా ప్రతిఘటించారు. ఇసుక నేలలలో చెరువులు తవ్వి ఆ నీళ్లతో కూరగాయలు పండించుకొని బతికేవారే ఎక్కువ. చేపలవేట చేసుకునే మత్స్యకారులూ ఉన్నారు. ప్రకాశం జిల్లాలోని బాధిత గ్రామాలలో కఠారివారిపాలెం, పుల్లరిపాలెం, రుద్రమాంబాపురం, పల్లెపాలెం, జీడిచెట్లపాలెం, మోటుపల్లిలలో మత్స్యకారులు పెద్దసంఖ్యలో ఉన్నారు. గుంటూరు జిల్లాలోని బాధిత గ్రామాలలో నిజాంపట్నం ప్రధానంగా మత్స్యకారుల గ్రామం. బాపట్ల మండలంలోని రామచంద్రపురం, విజయలక్ష్మిపురం కూడా అంతే. అయితే ప్రకాశం జిల్లా అధికార యంత్రాంగం పోలీసులను దించి నిషేధాజ్ఞలు ప్రకటించి భూసేకరణ ప్రక్రియను నడిపించే ప్రయత్నం చేయగా గుంటూరులో ఏకారణంగానో ఆ ప్రయత్నం అంతగా జరగలేదు. థర్మల్ ప్లాంట్ రావలసిన డిండి గ్రామ పంచాయితీలోకయితే అధికారులు అడుగుపెట్టడానికి సహితం సాహసించడం లేదు. అయితే వెనక్కిపోయే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఉన్న దాఖలాలు లేవు కాబట్టి 'సరయిన' సమయం చూసి మొదలు పెడతారేమో.

ప్రభుత్వం వాన్‌పిక్‌కు అప్పగిస్తున్న భూమిలో బాపట్ల, కర్లపాలెం మండలాలలోని మడ అడవులు కూడ ఉన్నాయి. అటవీశాఖ అధికార్లే కాదు, కర్లపాలెం తాసీల్దారు సహితం ఇది ధృవీకరించాడు. అవి క్షీణించిపోతున్నాయని గుర్తించిన అటవీశాఖ మూడేళ్ల క్రితం వాటి పునరుద్ధరణ ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. అక్కడ ఉన్న రొయ్యల చెరువు, గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫండ్ సహాయంతో కొన్ని లక్షలు ఖర్చుపెట్టారు. ఒక పక్క అది జరుగుతుండగా ఆ భూమి యావత్తు ఇప్పుడు వాన్‌పిక్‌లో భాగం అయిపోతున్నది. దీని ఔచిత్యం గురించి స్థానిక అటవీశాఖ అధికారిని (గుంటూరు సర్కిల్ ఫారెస్ట్ కన్సర్వేటర్) ప్రశ్నించగా, 'వాళ్లు పార్లమెంటును తవ్వేసి పరిశ్రమలకిచ్చేసినా అడిగేవారెవరు?' అంటూ తలపట్టుకుంటాడు.

బడుగు వర్గాలనుండి ఎదిగిన రాజకీయ నాయకులు తమ వారికి అండగా నిలబడితే ఎంత శక్తివంతమైన పాత్ర నిర్వహించగలరో, పాలకులకు ఏజెంట్లుగా మారితే అంత నష్టం కలిగించగలరనడానికి పొన్నూరు ఎంఎల్ఏ, రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో మౌలిక సదుపాయాలశాఖ మంత్రి అయిన మోపిదేవి వెంకటరమణారావును ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గతంలో ఆయన గుంటూరు ప్రకాశం తీరప్రాంతాలలో మత్స్యకారుల జీవనానికి నష్టకరమైన పరిశ్రమలు ఏవి ప్రతిపాదనకొచ్చినా తన కులంవారయిన మత్స్యకారులను సమీకరించి శక్తివంతంగా ఎదుర్కొన్నాడు. బహుశా అందుకేనేమో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆయనను కేబినెట్‌లోకి తీసుకొని మౌలిక సదుపాయాలశాఖ ఇచ్చాడు. ఆయన వాన్‌పిక్ విషయంలో నిజాంపట్నం మత్స్యకారుల నిరసనను చల్లార్చడానికి రాజశేఖరరెడ్డి ప్రభుత్వానికి బాగా ఉపయోగపడ్డాడు. 'మంత్రి మా వాడు మాకు అన్యాయం చేయడు' అన్న భరోసాతో నిజాంపట్నం మత్స్యకారులు మౌనంగా ఉండిపోయారు.

**బడుగు వర్గాలనుండి ఎదిగిన రాజకీయ నాయకులు తమ వారికి అండగా నిలబడితే ఎంత శక్తివంతమైన పాత్ర నిర్వహించగలరో, పాలకులకు ఏజెంట్లుగా మారితే అంత నష్టం కలిగించగలరనడానికి పొన్నూరు ఎంఎల్ఏ, రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో మౌలిక సదుపాయాలశాఖ మంత్రి అయిన మోపిదేవి వెంకటరమణారావును ఉదాహరణగా చెప్పుకోవచ్చు.**

## నెల్లూరు

నెల్లూరు జిల్లా అతిపెద్ద థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారనుంది. కృష్ణపట్నంలో రిలయన్స్‌వారి కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల సామర్థ్యంగల అల్ట్రా మెగా థర్మల్ ప్లాంట్ ఒకటి, జెన్‌కో యాజమాన్యంలో 1600 మెగావాట్ల సూపర్ థర్మల్ ప్లాంట్ ఒకటి వస్తున్నాయి. దీనిని కూడ త్వరలో 4000 మెగావాట్లకు పెంచనున్నారు. ఇవికాక నవయుగ, సింహపురి ఎనర్జీ, మీనాక్షి, కీనేటి సంస్థల ఆధ్వర్యంలో ఇంకొక 4160 మెగావాట్ల సామర్థ్యంగల 4 ప్లాంట్లు రానున్నాయని వినికిడి. ఇవన్నీ పూర్తయితే నెల్లూరులో 12,000 మెగావాట్లకుపైగా విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దేశంలో ఇంకొక్కచోట మాత్రమే అంతటి విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉంది. అది జార్ఖండ్‌లోని సింగ్రౌలి. సింగ్రౌలి పరిసరాలలోని కాలుష్యం ఇప్పటికే అనుభవంలోకి వచ్చింది కాబట్టి నెల్లూరు పరిస్థితి ఎంత భయంకరంగా ఉండబోతుందో ఊహించగలం. బొగ్గు మండితే వచ్చే కాలుష్యంలో ప్రధానమైనది బూడిద. దానితో పాటు భారలోహాలు (పాదరసం, నికెల్, కాడ్మియం, క్రోమియం వగైరా) ఉంటాయి. గంధకం (సల్ఫర్) మరొక ప్రధాన కాలుష్యకారకం. అది మండినప్పుడు సల్ఫర్ డై ఆక్సైడ్‌గా మారి గాలిలో కలుస్తుంది. మన దేశంలో దొరికే బొగ్గులో బూడిదపాలు ఎక్కువ ఉంటుందని చెప్పి కోస్టల్ కారిడార్‌లో భాగంగా నెలకొల్పుతున్న థర్మల్ ప్రాజెక్టులలో వాడే బొగ్గును ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. అయితే దిగుమతి చేసుకునే బొగ్గులో బూడిద తక్కువ ఉన్నా గంధకం, భారలోహాలు ఎక్కువే ఉంటాయి. భారలోహాలు కాన్సర్ కారకాలు.

4000 మెగావాట్ల రిలయన్స్‌వారి థర్మల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతి పత్రాన్ని చూస్తే ఏ కాలుష్యం ఎంత ఉంటుందో అర్థం అవుతుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గు మొత్తం దిగుమతి చేసుకొంటారు. అది సంవత్సరానికి 1.4 కోట్ల టన్నులు మించకూడదని అనుమతిపత్రం అంటుంది. అందులోని బూడిదపాలు 15 శాతం దాకా ఉండవచ్చు. అంటే సంవత్సరానికి 21 లక్షల టన్నుల బూడిద

**ఈ బూడిదతోబాటు క్యాన్సర్ కారకాలయిన భారలోహాలు కూడా చెరువులలో నిక్షిప్తం అవుతాయి. అవి భూగర్భ జలాలలో కలవకుండా ఉండడానికి బూడిద చెరువులకు పక్కన, దిగువన సిమెంట్ లైనింగ్ ఇవ్వాలని అనుమతిపత్రం అంటుంది. ఆచరణలో ఇది సక్రమంగా జరగదనీ భారలోహాల కాలుష్యంనుండి భూగర్భ జలాలు తప్పించుకోజాలవనీ సింగ్రౌలి అనుభవం తెలుపుతుంది.**

బయటికొస్తుంది. ఇందులో కొంత పొగగొట్టం ద్వారా గాలిలోకి పోతుంది. దీనిని ఫ్లైఆష్ అంటారు. దానిని మొత్తం సేకరించి పూర్తిస్థాయిలో ప్రత్యామ్నాయ అవసరాల కోసం వినియోగించాలనీ, 9 ఏళ్లలోగా పూర్తి వినియోగాన్ని సాధించాలనీ అనుమతి పత్రం అంటుంది. ఈ వినియోగం ఏమిటంటే బూడిదతో ఇటుకలు తయారు చేయడం. కోరిక బాగానే ఉన్నప్పటికీ ఒకేసారి దేశమంతా ఇంత భారీగా థర్మల్ విద్యుత్ కేంద్రాలు నెలకొల్పుతున్నప్పుడు (మన రాష్ట్రంలోనే నెల్లూరులో 6, గుంటురులో 1, శ్రీకాకుళంలో 2) ఆ ఫ్లైఆష్‌నంతా ఇటుకల పరిశ్రమ తీసుకోగలదని నమ్మకం ఏమిటి? కాగా, మిగిలిన బూడిద నేలమీద చేరుతుంది. దానిని నీళ్లతో కలిపి బురదచేసి బూడిద చెరువుల(ఆష్‌పాండ్స్)లో వేస్తారు. ఈ వ్యర్థం నిరంతరాయంగా వస్తూనే ఉంటుంది కాబట్టి బూడిద చెరువుల సంఖ్య, విస్తీర్ణం పెరుగుతూనే ఉంటాయి. ఈ బూడిదతోబాటు క్యాన్సర్ కారకాలయిన భారలోహాలు కూడా చెరువులలో నిక్షిప్తం అవుతాయి. అవి భూగర్భ జలాలలో కలవకుండా ఉండడానికి బూడిద చెరువులకు పక్కన, దిగువన సిమెంట్ లైనింగ్ ఇవ్వాలని అనుమతిపత్రం అంటుంది. ఆచరణలో ఇది సక్రమంగా జరగదనీ భారలోహాల కాలుష్యంనుండి భూగర్భ జలాలు తప్పించుకోజాలవనీ సింగ్రౌలి అనుభవం తెలుపుతుంది.

దిగుమతి అయ్యే బొగ్గులో 0.8 శాతం దాకా గంధకం ఉండవచ్చునని అనుమతిపత్రం అంటుంది. అంటే సంవత్సరంలో వినియోగించే 1.4 కోట్ల టన్నుల బొగ్గులో 1.12 లక్షల టన్నుల గంధకం ఉంటుంది. అది కాలిన తరువాత ఆమ్ల స్వభావంగల సల్ఫర్ డై ఆక్సైడ్ రూపం తీసుకుంటుంది. ఈ వాయువు పరిమితిని మించి గాలిలో కలవకుండ చూసుకోవాలని అనుమతి పత్రం అంటుంది. మళ్లీ సింగ్రౌలి అనుభవం ఏం చెప్తుందంటే అదేం జరగదని. అప్పుడేమవుతుందంటే చుట్టుపక్కల ఆమ్లవర్షం అడపాదడపా కురుస్తుంది. అది పంటలకు, భూసారానికి వినాశనకరం.

నీళ్లు రోజుకు 8.64 లక్షల ఘనపు మీటర్లు కావలసి ఉంటుంది. వాటిని సముద్రంనుండి తీసుకుంటారు. అందులో 5.77 లక్షల ఘనపుమీటర్లు తిరిగి సముద్రంలోకే పోతాయి కాని మిగిలిన 2.87 లక్షల ఘనపు మీటర్ల నీటిని 'డీసాలినేషన్' ప్లాంట్‌లో ట్రీట్ చేసి ప్రాజెక్టు ఉద్యోగులకు అవసరమయిన మంచినీటిగా వాడుకుంటారు. ఇందులో కొంత మురుగునీటి రూపంలో తిరిగి సముద్రంలోకి పోవచ్చు. మొత్తానికి అల్ట్రా మెగా థర్మల్ ప్లాంటువల్ల కృష్ణపట్నం తీరం దగ్గర సముద్రం నిరంతరాయంగా కల్లోలానికి గురవుతూ ఉంటుంది. థర్మల్ ప్లాంట్‌లలో వాడిన తరువాత వెనక్కి వచ్చే నీటి ఉష్ణోగ్రత 5 నుండి 10 డిగ్రీలు ఎక్కువ ఉంటుంది. దానికితోడు అక్కడే కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెద్ద ఓడరేవు రాబోతున్నది. ఇదంతా కలిసి చేపలు తదితర జలజీవాల పునరుత్పత్తిని బాగా దెబ్బతీస్తాయి. అంటే మత్స్యకారుల బతుకును తీవ్రంగా దెబ్బతీస్తుంది. నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో 123 మత్స్యకారుల గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ఉనికే ఇప్పుడు ప్రశ్నార్థకం అయింది.



ఈ మత్స్యకారుల విద్యాస్థాయి స్వల్పం కాబట్టి వాళ్ల జీవనాన్ని మూసేస్తున్న 'అభివృద్ధి' వారికి ఉద్యోగాలు, ఉపాధి ఇవ్వడం కల్ల.

**థర్మల్ ప్లాంట్‌లలో వాడిన తరువాత వెనక్కి వచ్చే నీటి ఉష్ణోగ్రత 5 నుండి 10 డిగ్రీలు ఎక్కువ ఉంటుంది. దానికితోడు అక్కడే కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెద్ద ఓడరేవు రాబోతున్నది. ఇదంతా కలిసి చేపలు తదితర జలజీవాల పునరుత్పత్తిని బాగా దెబ్బతీస్తాయి. అంటే మత్స్యకారుల బతుకును తీవ్రంగా దెబ్బతీస్తుంది. నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో 123 మత్స్యకారుల గ్రామాలున్నాయి.**

గుంటూరు, ప్రకాశం జిల్లాలలాగే నెల్లూరులో కూడ తీరప్రాంత 'అభివృద్ధి' అసైన్డ్ భూమిమీద బతుకుతున్న పేదల జీవనాన్ని కొల్లగొడుతోంది. కృష్ణపట్నం పోర్టు కోసం ఇచ్చిన 2500 ఎకరాలు కాక, మరొక 11000 ఎకరాలు 'పారిశ్రామిక పార్కు' పేరిట అదే కంపెనీకి (కె.పి.సి.ఎల్) అప్పగించారు. ఇందులో అసైన్డ్ భూమేకాక, అదే పేదలు కనీసం అసైన్‌మెంట్ కూడ లేకుండ సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములూ ఉన్నాయి. సరుగుడు చెట్లు, జీడిమామిడి చెట్లు వేసుకొని వేలాది కుటుంబాలు జీవనం పొందుతున్నాయి. ఈ పారిశ్రామిక పార్కు కాక టెక్స్‌టైల్ పార్కు పేరిట దాదాపు మరొక 6000 ఎకరాల భూమి 'అభివృద్ధి' కోసం కేటాయించబడింది. ప్రజల జీవనాధారం అయిన భూమిని పెద్దెత్తున పరిశ్రమలకోసం స్వాధీనం చేసుకుంటున్న జిల్లాల జాబితాలో ఇప్పుడు నెల్లూరు కూడా విశాఖపట్నం రంగారెడ్డి జిల్లాల సరసన చేరింది. కృష్ణపట్నం పోర్టు నిర్మాణం చేస్తున్న కెపిసిఎల్ అంటే రాష్ట్ర ప్రభుత్వానికి గల ప్రేమకు కారణమేమిటోగాని వారి 'అవసరాలకు' నెల్లూరునుండి వాన్‌పిక్ సరిహద్దు దాకా తీరప్రాంతమంతా 'రిజర్వు' చేయబడింది.

## సిఆర్‌జడ్ ఆటంకం కాలేదా?

కోస్టల్ కారిడార్ అనగానే పర్యావరణ పరిజ్ఞానం ఉన్న వారెవరికైనా తీరప్రాంత పర్యావరణ పరిరక్షణకోసం ఉద్దేశించిన సిఆర్‌జడ్ (కోస్టల్ రెగ్యులేటరీ జోన్) నియమాలు అడ్డం రావా అన్న సందేహం వస్తుంది. ఇప్పటిదాకా కోస్టల్ కారిడార్‌లో భాగంగా ఇచ్చిన అన్ని అనుమతులలోనూ కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జడ్) నియమాలను అతిక్రమించకూడదు అని రాస్తున్నారు గానీ అతిక్రమణ జరిగిందా లేదా అని చూస్తున్నవారెవరూ కనబడడం లేదు.

తెలుగులో ఆటు, పోటు అనేదాన్ని ఇంగ్లీష్‌లో లోటైడ్, హైటైడ్ అంటారు. ఆటుపోట్ల సమయంలో తీరంమీద సముద్రపు నీటి మట్టాన్ని లోటైడ్ లైన్, హైటైడ్ లైన్ (ఎల్‌టిఎల్, హెచ్‌టిఎల్) అంటారు. హెచ్‌టిఎల్‌కు అర్థకిలోమీటరు ఇవతలిదాకా ఉన్న ప్రాంతాన్ని (అంటే సముద్రం పోటెత్తినప్పుడు ఎంతదూరం నేలమీదికొస్తుందో అక్కడినుండి అర్థకిలోమీటరు ఇవతల ఉన్న ప్రాంతాన్ని) కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జడ్) అంటారు. సిఆర్‌జడ్‌లో సముద్రతీరం మీద ప్రత్యక్షంగా ఆధారపడిన పరిశ్రమలకు తప్ప వేరే దేనికీ అనుమతి ఇవ్వడానికి వీలులేదు. ఓడ రేవులకు ఇయ్యవచ్చు. థర్మల్ ప్లాంట్‌లకు సంబంధించి కేవలం ముడి సరుకు తెచ్చుకోవడానికి, సముద్రపునీటిని తీసుకోవడానికి అవసరమైన మేరకు మాత్రం అనుమతి ఇయ్యవచ్చు. అయితే ఆ అనుమతి కూడ సిఆర్‌జడ్‌లోని

'పర్యావరణరీత్యా సున్నితమైన' ప్రాంతాలలో, జలజీవుల పునరుత్పత్తి కేంద్రాలకు దగ్గరున్న ప్రాంతాలలో, మడ అడవులున్న ప్రాంతాలలో, వన్యప్రాణి సంరక్షక కేంద్రాలలో, జీవవైవిధ్యం బాగా ఉన్న ప్రాంతాలలో, సహజసౌందర్యం లేక చారిత్రక ప్రాముఖ్యం ఉన్న ప్రాంతాలలో, సముద్ర నీటి మట్టం పెరిగినప్పుడు ముంపుకు గురికాగల ప్రాంతాలలో ఇవ్వకూడదు. (ఎల్‌టిఎల్‌కు, హెచ్‌టిఎల్‌కు మధ్యనున్న ప్రాంతంలో కూడ ఇవ్వకూడదు. ఈ రెండింటినీ కలిపి సిఆర్‌జడ్-1 అంటారు).

గుంటూరు, ప్రకాశం జిల్లాలలో వాన్‌పిక్‌కు కేటాయిస్తున్న ప్రాంతంలో ఈ కోవకు చెందిన తీరప్రాంత భూమి చాలా ఉంది. పిసిపిఐఆర్ భూసేకరణ- సెజ్‌లున్న ప్రాంతాలలోతప్ప-ఇంకా వేగం పుంజుకోలేదుగానీ అది జరిగినప్పుడు అక్కడ కూడ ఈ పరిస్థితి కనిపించబోతుంది.

కోస్టల్ కారిడార్‌ను ప్రజలు, ప్రజా ఉద్యమాలు వ్యతిరేకించడానికి సిఆర్‌జడ్ నియమాల అతిక్రమణ ఒక్కటే కారణం కాకపోయినా ఆ అతిక్రమణ ఉన్న చోట చట్టరీత్యా వ్యతిరేకించే అవకాశం ఉంది కాబట్టి ఆ అంశాన్ని కూడ ఎత్తి చూపడం జరుగుతున్నది. మన రాష్ట్రంలో ఈ ప్రయత్నం ఒక ప్రాజెక్టు విషయంలో విజయవంతమయింది. ఇంకొక ప్రాజెక్టు విషయంలో అయినట్టే అయి చేయి జారిపోయిన దాఖలాలు కనిపిస్తున్నాయి.

## పోలాటితిప్ప

మొదటిది కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలంలోని పోలాటితిప్ప వద్ద థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ లిమిటెడ్ వారికి 1980 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ నెలకొల్పడానికి 1200 ఎకరాల భూమిని కేటాయించిన ఉదంతం. ఆ భూమిలో మడ అడవులు, మట్టి దిబ్బలు ఉన్నాయి. మడ అడవులున్న సంగతి స్పష్టంగానే కనిపిస్తున్నప్పటికీ కంపెనీవారి అభ్యర్థన మేరకు మచిలీపట్నం ఆర్‌డివోగారు పోలాటితిప్పలోని సర్వే నెం. 53/బిలో వున్న ఆ 1200 ఎకరాలు ఇచ్చేయవచ్చునని ప్రభుత్వానికి రాసారు. 2008 మే నెల 7వ తేదీన ఆ భూమిని ముందస్తుగా (అంటే చట్టపరమయిన లావాదేవీలేవీ పూర్తి కాకుండానే) కంపెనీ చేతిలో పెట్టమని ప్రభుత్వం బందరు తాసీల్దారును ఆదేశించింది. ఆయన 8వ తేదీనే వారికి అప్పగించేసారు. కొనుగోలు ఒప్పందం జూన్ 24న జరిగింది. ఇంకా కాలుష్య నివారణ మండలి నుండి క్లియరెన్స్, కేంద్రప్రభుత్వం నుండి పర్యావరణ అనుమతి లభించవలసే ఉంది.

మరి వాటికి మడ అడవులు అడ్డంకి కాదా? అందుకే ఒక రాత్రికి రాత్రే ఆ భూమిలోని మడ అడవులు మొత్తం నరికివేయబడ్డాయి. ఈ సంగతి తెలిసిన ఒక పర్యావరణ సంస్థ (ఫోరం ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్) హైకోర్టులో కేసు వేసింది. వాళ్లు థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ గురించి, వారికిచ్చిన 1200 ఎకరాల గురించి ప్రస్తావించలేదు. కేవలం పోలాటితిప్ప సర్వే నెం. 53/బిలో మడ అడవుల నరికివేత గురించి కోర్టుకు ఫిర్యాదు చేసారు. కోర్టుకు నివేదిక ఇవ్వక తప్పని ప్రభుత్వం కృష్ణా జిల్లా కలెక్టర్‌నుండి నివేదిక కోరగా వారు మచిలీపట్నం ఆర్‌డివోనుండి నివేదిక కోరారు. ఆర్‌డివో ఆ ప్రాంతాన్ని పరిశీలించి, 150 ఎకరాల మేరకు మడ చెట్లను అప్పటికి (15 ఆగస్ట్ 2008 నాటికి) 10-15 రోజులు ముందు ఎవరో కొట్టేసిన మాట సత్యమేనని, ఆ 150 ఎకరాలు థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్‌కు ఇచ్చిన 1200 ఎకరాలలో ఉన్నమాట వాస్తవమేననీ, అయితే ఈ ఘాతుకానికి ఒడిగట్టిందెవరో తెలియదనీ అన్నాడు. పోలాటితిప్ప గ్రామంలోని సర్వే నెం. 53లో 685.49 ఎకరాలు సిఆర్‌జడ్-I లో ఉన్న మాటకూడ నిజమేననీ, అయితే అదే సర్వే నెంబర్‌లో మరొక 2689 ఎకరాల



భూమి ఉందనీ, ఇది సిఆర్‌జడ్-IIIలో (కొన్ని షరతులతో థర్మల్ ప్లాంట్లకు ముడిసరుకులు, సముద్రం నీళ్లు తెచ్చుకునే మేరకు అనుమతులు ఇవ్వగల ప్రాంతం) ఉందనీ, థర్మల్ ప్లాంట్‌కు ఇచ్చిన 1200 ఎకరాల మొత్తం కూడా ఈ భాగంలోనే ఉందనీ అన్నాడు. కొట్టేసిన 150 ఎకరాల మడ అడవి ఆ 1200 ఎకరాలలో ఉందని ఆయనే అంటాడు. మడ అడవులను సిఆర్‌జడ్-I గా చట్టమే నిర్వచించింది. అయినప్పటికీ ఆ 1200 ఎకరాలు సిఆర్‌జడ్-III లో ఉందని మళ్లీ ఆయనే అంటాడు. ఆయన నివేదికను స్వీకరించిన కలెక్టర్‌గారు సహితం అదే అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదించారు. పోలాటితిప్ప థర్మల్ ప్లాంటు బహిరంగ విచారణలో పర్యావరణ వాదులు, హక్కుల సంఘాలు ఆ భూమి సిఆర్‌జడ్-Iలో ఉందనీ అనుమతులు ఇచ్చి ఉండకూడదనీ వాదించగా కృష్ణాజిల్లా కలెక్టర్ మాత్రం అది సిఆర్‌జడ్-III లో ఉందని అన్నారు. కానీ నిజం తర్వాత బయటపడింది. సిఆర్‌జడ్ నియమాల కింద ఆంధ్రప్రదేశ్ కోసం తయారు చేసిన తీరప్రాంత నిర్వహణ ప్రణాళిక (కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్లాన్)లో పోలాటితిప్ప గ్రామాన్ని పేరుపెట్టి ప్రస్తావించి ఆ ఊరిలోని మడ అడవులే కాక మట్టి దిబ్బలు, బంజరు భూములు యావత్తూ సిఆర్‌జడ్-Iగా వర్గీకరించబడినట్లు రాసింది. ఇక ఆపైన బుకాయించడం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. పోలాటితిప్పలో థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేసింది. పర్యావరణ వాదులు, ప్రజా సంఘాలు అప్రమత్తంగా ఉండి అడుగడుగూ వెంటాడకపోయి ఉంటే వారికి 'జ్ఞానోదయం' అయివుండేదన్న భరోసా లేదు.

ఇంతకూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను ఒక అక్రమానికి పాల్పడే దిశగా అంతదూరం నెట్టిన ఈ థర్మల్ పవర్‌టెక్ ఎవరిదనుకున్నారు? కాంగ్రెస్ నాయకుడు, పోషకుడు అయిన టి. సుబ్బిరామిరెడ్డిగారి కుటుంబ సభ్యులది.

**ఇంతకూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను ఒక అక్రమానికి పాల్పడే దిశగా అంతదూరం నెట్టిన ఈ థర్మల్ పవర్‌టెక్ ఎవరిదనుకున్నారు? కాంగ్రెస్ నాయకుడు, పోషకుడు అయిన టి. సుబ్బిరామిరెడ్డిగారి కుటుంబ సభ్యులది.**

## కాకరాపల్లి

రెండవది శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి దగ్గర ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నెలకొల్పుతున్న 2640 మెగావాట్ల థర్మల్ ప్లాంటు. ఈ థర్మల్ ప్లాంటు కోసం కేటాయించిన 2450 ఎకరాల చుట్టూ పచ్చని పొలాలున్నాయి. సంవత్సరం పొడవునా నీళ్లు నిలువ ఉండే విశాలమైన భూభాగం ఉంది. దీని వైశాల్యం 20 చ.కిమీలు. దీనిని నౌపడా స్వాంప్స్ అంటారు. ఈ నీటిలో మత్స్యకారులు వేట చేసుకుంటారు. చుట్టుపక్కల పొలాలున్న రైతులు ఈ నీటికుంటనుండి సాగునీరు పొందుతున్నారు. రెండవవైపు కొద్ది దూరంలో తేలినీలాపురం గ్రామంలో పక్షుల అభయారణ్యం ఉంది. సుదూర దేశాల నుండి పక్షులు అక్కడికొచ్చి గుడ్లు పొదుగుతాయి. అక్కడ 2640 మెగా వాట్ల సామర్థ్యంగల థర్మల్ ప్లాంటు, దానికి కొద్దిదూరంలో సోంపేట మండలంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆధ్వర్యంలో దాదాపు అంతే పరిమాణంగల మరొక థర్మల్ ప్లాంటు రాబోతున్నాయి.

కేంద్ర పర్యావరణ శాఖ నిపుణులు మొదట ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీవారి ప్రతిపాదనకు అనుకూలంగా లేరు. వర్షాకాలంలో అనేక వాగులు, గెడ్డలు నౌపడా స్వాంప్స్‌లోకి ప్రవహిస్తాయి. భారీ థర్మల్ ప్లాంట్ వస్తే ఇది దెబ్బతింటుంది. చేపలు, రొయ్యలు వగైరాల వేటకూ సాగునీటికీ వనరుగా ఉన్న నౌపడా స్వాంప్స్ దీనివల్ల

క్రమంగా ఎండిపోయే ప్రమాదం ఉంది. ఆపైన కాలుష్యం ప్రభావం ఉండనే ఉంది. బూడిద చుట్టూ ఉన్న పొలాలపైన వచ్చి పడినా నీటి వనరులపైన వచ్చిపడినా తీవ్ర నష్టమే. భారలోహాలు భూగర్భ జలాలలోకి ఇంకినట్టయితే అవి తిరిగి నౌపడా స్వాంప్స్‌లో ఇంకా మిగిలి ఉన్న నీటిని కలుషితం చేయగలవు. బూడిద, పొగల ప్రభావం తేలినీలాపురం పక్షుల అభయారణ్యంపైన కూడ ఉంటుంది. అందువల్ల 2008 డిసెంబర్ 15, 16 తేదీలలో జరిగిన సమావేశంలో కేంద్ర పర్యావరణ శాఖ నిపుణులు (పూర్తిపేరు కావాలంటే, థర్మల్ విద్యుత్తు మరియు బొగ్గు గనుల పర్యావరణ దుష్ప్రభావ అంచనా కొరకు నియమించబడ్డ నిపుణుల కమిటీ) నౌపాడా స్వాంప్స్ నుండి ప్రాజెక్టును దూరం జరిపితే తప్ప పర్యావరణ అనుమతి రికమెండ్ చేయలేం అన్నారు. దానికి జవాబుగా ఆ కంపెనీ, తనకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 2450 ఎకరాల భూమిలో దక్షిణాన ఉన్న 455 ఎకరాలు వదులుకొని తక్కిన 1995 ఎకరాలలోనే ప్లాంటు నిర్మాణం చేపడతానని, అన్ని నిర్మాణాలు ఆ 1995 ఎకరాలకే పరిమితం అవుతాయనీ హామీ యిచ్చి అనుమతి అడిగింది. (కేటాయించిన భూమిలో దాదాపు 20 శాతాన్ని వదులుకొని అదే ప్రాజెక్టును కొనసాగించడం సాధ్యమయినట్టయితే తొలుత ఎక్కువ భూమి ఎందుకు కోరినట్టు, వీరు ఎందుకు ఇచ్చినట్టు!)

ఫిబ్రవరి 10, 11 తేదీలలో ఈ ప్రతిపాదనను పరిశీలించిన నిపుణుల కమిటీ కంపెనీకి కొన్ని షరతులతో అనుమతి ఇచ్చేసింది. మార్చి 12, 13 తేదీలలో నిపుణుల కమిటీ మళ్లీ సమావేశమై అవే షరతులను కొన్ని సవరణలతో పునరుద్ఘాటించింది. ఈ షరతుల సారాంశమేమిటంటే, కంపెనీ ఒక పర్యావరణ పరిరక్షణ కమిటీనీ, ఒక సలహాదార్ల కమిటీనీ తన ఖర్చుతో నెలకొల్పాలి. మొదటిదానిలో ఒక పర్యావరణ వేత్త, ఒక పక్షుల శాస్త్రవేత్త, ఒక జల జీవశాస్త్రవేత్త ఉండాలి. వీరు నిరంతరాయంగా తేలినీలాపురం అభయారణ్యాన్నీ, నౌపడా స్వాంప్స్ అని పిలవబడే తీరప్రాంత నీటివనరునూ పరిశీలిస్తూ ఉండాలి. ఈ ముగ్గురు నిపుణులకు సలహాదార్లుగా ఏర్పడే రెండవ కమిటీలో బొంబాయి నేచరల్ హిస్టరీ సొసైటీకి చెందిన ఒక ప్రతినిధి, సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీనుండి ఒకరు, కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ నుండి ఒకరు, రాష్ట్ర ప్రభుత్వ అటవీ శాఖనుండి ఒకరు ఉంటారు. ఈ అయిదుగురు నిపుణుల సలహాలతో ఆ ముగ్గురు నిపుణులు కంపెనీకి పర్యావరణ పరిరక్షణ గురించి సలహాలు ఇస్తుండాలి. ఈ సలహా వ్యవస్థ ఖర్చులకోసం కంపెనీ సాలీనా 50 లక్షల రూపాయలు కేటాయించాలి. వారి సలహాలను కంపెనీ పాటించకపోతే ఏమవుతుందని మాత్రం నిపుణుల కమిటీ చెప్పలేదు.

రాష్ట్ర ప్రభుత్వానికి కూడ నిపుణుల కమిటీ ఒక సూచన చేసింది. నౌపడా స్వాంప్స్‌లోకి వచ్చి చేరుతున్న వరదనీటికి థర్మల్ ప్లాంటు అడ్డం రాకుండ ఉండేందుకు ఈ ప్రాంతపు సహజ డ్రైనేజి వ్యవస్థను సంస్కరించాలన్నారు. కానీ ఈ నిపుణుల ముందు హాజరయిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధి వైఖరే అతి విచిత్రమైనది. ఇక్కడ తూర్పు కనుమలకూ తీరానికీ మధ్య ఎడం తక్కువగా ఉండడం వల్ల వర్షాకాలంలో నీరంతా ఆ సన్నటి భూభాగంలో వరదలాగా ప్రవహిస్తున్నదన్నాడు. శాస్త్రీయమైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడం వల్ల తగ్గు భూములలో ఆ నీరంతా నిలువ ఉండి నౌపడా స్వాంప్స్ ఏర్పడ్డాయన్నాడు. సరయిన డ్రైనేజి వ్యవస్థను రూపొందించి నీటినంతా సముద్రంలోకి లాగేస్తే ఏ సమస్యా ఉండదన్నాడు. అంటే ఇసుక బస్తాలు తెచ్చి నౌపడా స్వాంప్స్‌ను పూడ్చేస్తే ఏ గొడవా ఉండదని అతని భావం కావచ్చు.

◆◆◆





## సింగరేణి బొగ్గుబీళ్ల పాలసీ

# ఓపెనయ్యేకొద్దీ విధ్వంసం

గడచిన అయిదు సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలకోసం, విమానాశ్రయాలకోసం, ఓడరేవులకోసం, సెజ్‌లకోసం చేపట్టిన భూసేకరణ ఒకెత్తయితే ఉత్తర తెలంగాణ జిల్లాలలో ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల ప్రాజెక్టులకోసం జరుగుతున్న భూసేకరణ ఒకెత్తు.

ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో సింగరేణి బొగ్గుగనుల కంపెనీ తలపెట్టిన 70 చిల్లర ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులకోసం అధికారికంగా 1.00 నుండి 1.50 లక్షల ఎకరాల భూమిని మొదటి దశలో తీసుకోవడం జరుగుతుంది. ఆపైన వాటి డంప్ విస్తరణకోసం కాలక్రమంలో ఇంకొంత భూమి విడతలు విడతలుగా తీసుకుంటారు. వారు తీసుకునేదికాక తీవ్ర కాలుష్యం, నీటికొరత, రాకపోకల అసౌకర్యం తదితర కారణాలుగా ప్రజలే విడిచిపెట్టి లేక అమ్ముకొనిపోయే భూములు మరికొంత ఉంటాయి. ఖమ్మం జిల్లాను దాటి పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, టి.నర్సాపురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాలకూ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు విస్తరిస్తాయని వింటున్నాం. ఇవన్నీ లెక్కబెట్టుకొంటే ఎంత లేదన్నా 2 లేక 2.5 లక్షల ఎకరాల భూమి వ్యవసాయానికీ, పశుగ్రాసానికీ, కట్టెపుల్లలకూ, జీవనానికి ఉపయోగపడే ప్రాకృతిక ఉత్పత్తులకూ కాకుండా పోతుంది. ఆదిలాబాద్ జిల్లా ఉత్తర భాగాన మొదలయ్యే ఈ విధ్వంసం ఉత్తరతెలంగాణ సరిహద్దు వెంబడి తూర్పుకు ప్రయాణమై పశ్చిమగోదావరి జిల్లాలో పోలవరం డ్యాం పరిసరాలలో ముగుస్తుంది. అక్కడి నుండి పైకి పోలవరం ముంపు మొదలవుతుంది. అది మళ్లీ దీనిలో సగందాకా ఉంటుంది.

ఇంత విధ్వంసం జరగకుండ ఈ రాష్ట్రం అభివృద్ధి చెందదా?

మన రాష్ట్రంలోని గోదావరి నదీలోయలో ఉన్న బొగ్గు గనులు, ఖనిజాలకు నిలయమైన మధ్యభారత పీఠభూమి దక్షిణపు అంచులో ఉన్నాయి. ఇక్కడ బొగ్గు తవ్వకం 1889 నుండి జరుగుతున్నది. అప్పట్లో బొగ్గు తవ్వకం చేపట్టిన కంపెనీ పేరు హైదరాబాద్ దక్కన్ మైనింగ్ కంపెనీ. ఇది ఇంగ్లండ్‌కు చెందిన కంపెనీ అయినప్పటికీ ఇందులో 75 శాతం పెట్టుబడి హైదరాబాద్ ప్రభుత్వానిదే. ఖమ్మం జిల్లాలోని

**1950లో సింగరేణి బొగ్గు గనులలో 11,600 మంది కార్మికులుండేవారు. 1990ల మధ్యభాగానికి ఈ సంఖ్య 1,15,000 కు చేరింది. గ్రామాలే ప్రధానంగా ఉన్న గోదావరిలోయలో ఇల్లందు, కొత్తగూడెం, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లిలాంటి పట్టణాలు వెలిసాయి.**

సింగరేణి గ్రామం దగ్గర తవ్వకం మొదలయింది. 1920లో సింగరేణి కాలియరీస్ కంపెనీ (ఎస్.సి.సి) ఏర్పడి గనులను తన చేతిలోకి తీసుకుంది. మొదటినుండి ఈ కంపెనీ హైదరాబాద్ ప్రభుత్వ నియంత్రణలో ఉండేది. కాగా 1944లో దానిని ప్రభుత్వం కొనేసి ప్రభుత్వ సంస్థగా నడపసాగింది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి యాజమాన్యంలో ఉంది.

వ్యవసాయకంగా వెనుకబడివున్న ఉత్తర తెలంగాణ ప్రాంతానికి ఈ బొగ్గుగనులు కాల క్రమంలో ఒక ముఖ్యమైన ఉపాధి వనరుగా ఎదిగాయి. మొదట్లో గనులలో పని చాలా కష్టంగా ఉండేది. అండర్‌గ్రౌండ్‌లో విపరీతమైన వేడిలో, సరయిన భద్రత లేకుండా పనిచేయవలసి వచ్చేది. వేతనాలు చాలా తక్కువగా ఉండేవి. ఈ కారణంగా తొలినాడు వేరే ఏ జీవనాధారం లేని నిరుపేదలు మాత్రమే గనులలో పనికి వెళ్ళేవారు. ప్రమాదాలు కూడా తరచుగా జరిగేవి. అయితే కాలక్రమంలో సంఘాలు పెట్టుకొని కొట్లాడి కార్మికులు జీవిత పరిస్థితులను కొద్ది కొద్దిగా మెరుగుపరుచుకోగలిగారు. బొగ్గు గనులకు ఒక ప్రత్యామ్నాయ ఉపాధి కేంద్రంగా గుర్తింపు లభించింది. వేతనాలు కూడా పెరిగి చిన్నరైతుకుటుంబాలలో పుట్టిన వారికి వ్యవసాయంకంటే మెరుగయిన జీవితం బొగ్గుబావులలో లభించింది. 1950లో సింగరేణి బొగ్గు గనులలో 11,600 మంది కార్మికులుండేవారు. 1990ల మధ్యభాగానికి ఈ సంఖ్య 1,15,000 కు చేరింది. గ్రామాలే ప్రధానంగా ఉన్న గోదావరిలోయలో ఇల్లందు, కొత్తగూడెం, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లిలాంటి పట్టణాలు వెలిసాయి.

అండర్‌గ్రౌండ్ గనులకు కూడా భూసేకరణ అవసరమే. కానీ ఆ అవసరం పరిమితమైనది. ఖనిజం తవ్వకం జరుగుతున్న ప్రాంతమంతా తీసేసుకోవలసిన అవసరం ఉండదు. నేలకింద బొగ్గు తవ్వకం జరుగుతుండగా పైన వ్యవసాయం చేసుకోవచ్చు, ఇళ్ళు వేసుకొని బతకవచ్చు. లోతయిన బోర్లు వేసుకోలేకపోవడం, గనులకు సమీపంలో ఉన్న గ్రామాలలో ఒక్కొక్కసారి భూగర్భ జలాలు ఇంకిపోయి బావులు ఎండిపోవడం జరిగేది. దీనివల్ల స్థానిక ప్రజలకూ సింగరేణి కంపెనీకీ కొంత ఘర్షణ అడపాదడపా జరుగుతూనే ఉన్నా, మొత్తంమీద ఉపాధి అవకాశాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా పెంచిన వ్యవస్థగా సింగరేణికి ఉత్తర తెలంగాణ గ్రామీణ ప్రజలలో ఆదరణ లభించింది. ఆ వ్యవస్థ ఉత్పత్తి చేసిన బొగ్గు ఆధారంగా మరిన్ని పరిశ్రమలు నెలకొల్పివుంటే ఉపాధి మరింత లభించి ఉండేది. అయితే కొత్తగూడెం, రామగుండం థర్మల్ విద్యుత్తు కేంద్రాలు, రామగుండంలో ఒక బొగ్గు ఆధారిత ఎరువుల కార్మాగారం, మంచిర్యాల దగ్గర బొగ్గు ఆధారిత రసాయన ఉత్పత్తుల కేంద్రం స్థాపించారు తప్ప స్థానికంగా లభించిన బొగ్గుతో విస్తృతమైన పారిశ్రామికీకరణ చేపట్టే ప్రయత్నం జరగలేదు.

## సంస్కరణల ప్రభావం

1989లో సింగరేణి కంపెనీ బొగ్గు గనుల శతాబ్ది ఉత్సవాలు నిర్వహించింది. ఆ ఉత్సవాల సందర్భంగా ఒక పెద్ద భవిష్యత్ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. 2000 సంవత్సరం నాటికి కొత్తగా



85 అండర్‌గ్రౌండ్ గనులు, 14 ఓపెన్ కాస్ట్ గనులు ప్రారంభించబోతున్నట్లు ఆ ప్రణాళిక చెప్పింది. జిల్లాల వారీగా ఎక్కడ ఎన్ని అనికూడ చెప్పింది. ఆ ప్రణాళిక అమలయివుంటే ఇంకొక 40,000 మందికి అదనంగా పనులు లభించేవి. కానీ 1991లో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో ఈ ప్రణాళిక బుట్టదాఖలయి వేరే ప్రణాళిక అమలులోకి వచ్చింది. ఉపాధి కల్పన కాక ఉత్పాదకత పెరుగుదల, ఉత్పత్తి ఖర్చుల తగ్గింపు, ప్రైవేటీకరణ ద్వారా వేతనం బిల్లు తగ్గింపు, యంత్రీకరణ మొదలయినవి ప్రధాన నియమాలయ్యాయి. అండర్‌గ్రౌండ్ గనుల స్థానంలో ఓపెన్‌కాస్ట్ గనులు నెలకొల్పడం, క్రమంగా కొత్త తవ్వకాలు కూడా ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో చేపట్టడం, 1990ల మధ్యభాగం నుండి కొత్త రిక్రూట్‌మెంట్‌ను బంద్‌చేసి ఉన్న కార్మికులను వయోభారమనీ అనారోగ్యమనీ క్రమశిక్షణ అనీ తొలగించడం, మిగిలిన వారిపైన పనిభారం విపరీతంగా పెంచడం దీనికి సాధనాలయ్యాయి. దాంట్లో భాగమే ఈ భారీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల పరంపర.

**1989లో సింగరేణి కంపెనీ బొగ్గు గనుల శతాబ్ది ఉత్సవాలు నిర్వహించింది. ఆ ఉత్సవాల సందర్భంగా ఒక పెద్ద భవిష్యత్ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. 2000 సంవత్సరం నాటికి కొత్తగా 85 అండర్‌గ్రౌండ్ గనులు, 14 ఓపెన్ కాస్ట్ గనులు ప్రారంభించబోతున్నట్లు ఆ ప్రణాళిక చెప్పింది. జిల్లాల వారీగా ఎక్కడ ఎన్ని అనికూడ చెప్పింది. ఆ ప్రణాళిక అమలయివుంటే ఇంకొక 40,000 మందికి అదనంగా పనులు లభించేవి. కానీ 1991లో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో ఈ ప్రణాళిక బుట్టదాఖలయి వేరే ప్రణాళిక అమలులోకి వచ్చింది.**

## ఓపెన్‌కాస్ట్‌వల్ల ఏం నష్టం?

మొదట చెప్పుకోవలసింది వాటివల్ల స్థానిక ప్రజలకు ప్రయోజనం ఏమీ లేదని. అండర్‌గ్రౌండ్ బొగ్గు బావులవల్ల కూడ కొంతమేరకు ప్రజలు భూములు కోల్పోయినా, భూగర్భ జలాలపైన కొంత దుష్ప్రభావం ఉన్నా, ఈ నష్టం కంటే ఎక్కువ తూగే ప్రయోజనం ఉపాధి అవకాశాలు, ఆదాయాల పెరుగుదల రూపంలో స్థానిక ప్రజలకు లభించింది. పట్టణాలు వెలసి విద్యావకాశాలూ పెరగడం వల్ల విద్యాప్రమాణాలూ పెరిగాయి. వ్యవసాయాధార జీవితం నుండి ఉద్యోగరంగంలోకి చెప్పుకోదగ్గ సంఖ్యలో స్థానిక యువకులు ప్రవేశించగలిగారు.

ఓపెన్‌కాస్ట్ వల్ల వచ్చే ప్రయోజనం శూన్యం. ఓపెన్‌కాస్ట్ ఉత్పత్తి యంత్రప్రధానమైనది. భారీ యంత్రాలతో కొద్దిమంది పనిచేసే ప్రక్రియ. అందులోనూ ఓవర్‌బర్డెన్ (పైమట్టి) తొలగింపును కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు కాబట్టి, కాంట్రాక్టర్లు అత్యధికం బయటి ప్రాంతాలవాళ్ళు కాబట్టి, స్థానికులకు ఆ కొన్ని ఉద్యోగాలలో కూడా ఎక్కువ వాటా దొరకదు. కాంట్రాక్టర్లు పనికోసం తమవాళ్లనే తెచ్చుకుంటారు. ఈ మధ్యన పైమట్టి తొలగింపేకాక బొగ్గు వెలికితీతకూడా కాంట్రాక్టర్లకు అప్పగించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది.

నష్టం మాత్రం అండర్‌గ్రౌండ్ బొగ్గుబావులకంటే ఓపెన్ కాస్ట్‌లు చాలా ఎక్కువ కలుగజేస్తాయి. బొగ్గు మొత్తం పైనుండే తీస్తారు కాబట్టి ఎంత విస్తీర్ణంలో బొగ్గు తవ్వకం జరిగితే అంత విస్తీర్ణంలోనూ భూమిని



కంపెనీకి అప్పగించాలి. అంతేకాదు. బొగ్గు పొరను చేరుకొనే లోపల మట్టి చాలా వస్తుంది. ఈ పైమట్టిని (ఓవర్‌బర్డెన్ లేక ఓ.బి.) తీసి పక్కనే కుప్పలుగా పోస్తారు. దీనిని ఓ.బి.డంప్ అంటారు. దీనికోసం విడిగా భూమికావాలి. అది కాక ఒక్కొక్క గనిదగ్గరా కంపెనీ కార్యాలయాలు వగైరాలకు భూమి కావాలి. చుట్టూ 'క్లియరెన్స్'కు చాలా భూమి కావాలి. ఒక ఉదాహరణ తీసుకుంటే విషయం స్పష్టం అవుతుంది. ఆదిలాబాద్ జిల్లా ఇందారం దగ్గర ఓపెన్‌కాస్ట్ గనికోసం భూసేకరణ ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఆ ప్రాజెక్టుకు అవసరమైన భూమి వివరాలు ఇట్లా ఉన్నాయి. బొగ్గు క్వారీకోసం 870 ఎకరాలు, ఓ.బి.డంప్‌కోసం 625 ఎకరాలు, క్లియరెన్స్‌కోసం రెండింటిచుట్టూ మరో 375 ఎకరాలు, బిల్డింగ్‌లు వగైరాలకోసం 75 ఎకరాలు వెరసి 1875 ఎకరాలు అవసరమని తేల్చారు. అన్ని ప్రాజెక్టులూ ఇంతే పరిమాణంలో ఉండవు కాబట్టి ఒక్కొక్క దానికీ 1500 నుండి 2000 ఎకరాల దాకా భూమి కావాలని భావించవచ్చు. ప్రస్తుతం ప్రతిపాదనలో ఉన్న 70 చిల్లర ఓపెన్‌కాస్ట్‌లకు మొత్తం 1.50 లక్షల ఎకరాల దాకా అవసరం అవుతుంది. కొన్ని వందల గ్రామాలు పూర్తిగా పోతాయి. ఆదిలాబాద్ జిల్లాలోనయితే 50వేల జనాభావున్న రామకృష్ణాపూర్, 1లక్ష జనాభావున్న బెల్లంపల్లి పట్టణాలు ఖాళీ అయ్యేసూచనలున్నాయి. మొదటి దశలో చేసే భూసేకరణతో పని అయిపోదు. బొగ్గుతవ్వేకొద్దీ మట్టి ఇంకా వస్తూనే ఉంటుంది కాబట్టి కొంతకాలానికి ఓ.బి. డంప్‌కు ఇంకా భూమి కావలసి ఉంటుంది. క్వారీ విస్తీర్ణాన్ని కూడా – బొగ్గు లభ్యతనుబట్టి పెంచవచ్చు. కాబట్టి ఒక్కొక్క ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకోసం విడతలు విడతలుగా భూసేకరణ చేస్తూపోయే అవకాశం చివరికి 1.50 లక్షల ఎకరాల దగ్గర మొదలయిన భూసేకరణ 2.00 లేక 2.50 లక్షల ఎకరాల దాకా పోవచ్చు.

ఖాళీఅయిన గ్రామాలు పోగా చుట్టు పక్కల ఉన్న గ్రామాల పరిస్థితి ఏమిటి? ఓ.బి. డంప్‌లు పెద్ద మట్టి గుట్టలు. వాటిని ఎప్పటికప్పుడు తడుపుతూ ఉండాలనీ వాటిపైన చెట్లు పెట్టాలనీ కంపెనీని ప్రభుత్వం ఆదేశించినట్టు పత్రికలలో చదువుతుంటాం. ఓపెన్‌కాస్ట్ తవ్వకం అయిపోయిన తరువాత ఓ.బి. డంప్‌లోని మట్టితోనే ఆ బొందను నింపబోతారని కూడా వింటున్నాం. (ఇవి రెండూ ఎట్లా జరుగుతాయో మాత్రం తెలీదు). వాస్తవానికి జరిగేదేమిటంటే ఆ మట్టిగుట్టలు అట్లాగే ఉంటాయి. వాటిని అప్పుడప్పుడే తప్ప నిరంతరాయంగా నీళ్ళతో తడపరు. ఆ మట్టి ఎండకు ఎండి గాలికి ఎగిరి వర్షాలకు బురదయి చుట్టుపక్కల ఇళ్ళనూ పొలాలనూ అన్ని సీజన్లలోనూ పాడుచేస్తుంటుంది. ఇదికాక బొగ్గును



తవ్వడానికి చేసే బ్లాస్టింగ్ ఒక పెద్ద సమస్య. దగ్గరలో ఉన్న ఇళ్లగోడలు బీటలువారడం, కొంతకాలానికి కూలిపోవడం, ఓపెన్‌కాస్ట్ గనుల సమీపంలోని అన్ని గ్రామాల అనుభవమూ. కరీంనగర్ జిల్లాలోని రామగుండం ఓ.సి.పి-4 వల్ల ఇళ్ళు బీటలువారిన మేడిపల్లి, ఖమ్మం జిల్లాలోని మణుగూరు సెంటినరీ ఓసిపి విస్తరణవల్ల బీటలు వారడమేకాదు ఇళ్లు కూలిపోయిన పినపాక మండలం శ్రీరంగాపురం దీనికి ప్రత్యక్ష నిదర్శనాలు. మామూలుగా బ్లాస్టింగ్ వల్ల ఇంటిగోడలు నెర్రెలుబారినట్టు సింగరేణి కంపెనీ ఒప్పుకోదు. మీరు నాసిరకం వస్తువులతో ఇళు కట్టుకొని నెపం మామీద పెడుతున్నారు అంటుంది. కానీ శ్రీరంగాపురంలోని ఇళ్ల స్థితి ఎంత ఘోరమంటే కంపెనీయే ఒప్పుకోక తప్పలేదు. ఆ ఊరిలోని 90 కుటుంబాలలో మెజారిటీ ఖాళీ చేసి వెళ్ళిపోగా 37 మాత్రం మిగిలాయి. అందరికీ కొంత దూరాన కాలనీ కట్టియ్యడానికి కంపెనీ ఒప్పుకుంది. మూడవ సమస్య భూగర్భ జలాలు ఇంకిపోవడం. ఓపెన్‌కాస్ట్ తవ్వకం భూమిలోనికి పోయేకొద్దీ నీళ్ళు ఊరుతుంటుంది. ఆ నీటిని ఎప్పటికప్పుడు బయటకు తోడి కంపెనీ అవసరాలకోసం వాడుకుంటారు. ఆయా ప్రాంతాలలో నేలలోని పొర స్వభావాన్ని బట్టి కొన్నిచోట్ల దీని ఫలితంగా సమీపంలోని వాటర్ టేబుల్ కుంగిపోగలదు. చివరి సమస్య రాకపోకలకు అంతరాయం. ఒక గ్రామం పక్కన ఓపెన్‌కాస్ట్ గని నెలకొనడం వల్ల ఆ గ్రామానికి పొరుగు గ్రామాలతో, సమీపంలోని రహదార్లతో, నీటివనరులతో, అడవితో ఉన్న సంబంధం తెగిపోవచ్చు. ఇది ఆ గ్రామస్తుల జీవితంపైన, జీవనప్రమాణంపైన తీవ్ర ప్రభావం వేయగలదు.

**వాస్తవానికి జరిగేదేమిటంటే ఆ మట్టిగుట్టలు అట్లాగే ఉంటాయి. వాటిని అప్పుడప్పుడే తప్ప నిరంతరాయంగా నీళ్ళతో తడపరు. ఆ మట్టి ఎండకు ఎండి గాలికి ఎగిరి వర్షాలకు బురదయి చుట్టుపక్కల ఇళ్ళనూ పొలాలనూ అన్ని సీజన్లలోనూ పాడుచేస్తుంటుంది. ఇదికాక బొగ్గును తవ్వడానికి చేసే బ్లాస్టింగ్ ఒక పెద్ద సమస్య. దగ్గరలో ఉన్న ఇళ్లగోడలు బీటలువారడం, కొంతకాలానికి కూలిపోవడం, ఓపెన్‌కాస్ట్ గనుల సమీపంలోని అన్ని గ్రామాల అనుభవమూ.**

అంటే ఈ 70 చిల్లర ఓపెన్‌కాస్ట్‌ల కోసం జరిగే ఒకటిన్నర లక్షల ఎకరాల భూసేకరణవల్ల ప్రత్యక్షంగా వ్యవసాయ భూములూ ఇళ్లూ కోల్పోయేవారేకాక మళ్ళీ దాదాపు అందులో సగం మంది వాటి పర్యావరణ ప్రభావం వల్ల తమ జీవన ప్రమాణం చెప్పుకోదగ్గ మోతాదులో కోల్పోతారు. ఇది చిన్న విధ్వంసం కాదు.

అకస్మాత్తుగా ఇంత పెద్దెత్తున ఓపెన్‌కాస్ట్ బొగ్గుగని ప్రాజెక్టులు చేపట్టాలని సింగరేణి కాలియరీస్ కంపెనీ ఎందుకు నిర్ణయించింది? ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం కాదు. 1991లో మొదలయిన ఆర్థిక సంస్కరణల ప్రభావాన్ని పైన ప్రస్తావించాము. దాని గురించి ఇంకొంచెం చెప్పుకుంటే ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. ఆర్థిక సంస్కరణలు ఒక అభివృద్ధి నమూనాతో ముడిపడి ఉన్నాయి. వేగంగా, భారీగా పెట్టుబడులు పెట్టి విదేశీ మార్కెట్‌ను లక్ష్యంగాగల ఉత్పత్తులు ప్రైవేట్‌రంగంలో పెద్దెత్తున చేపట్టాలి, దానికి అవసరమైన సాంకేతిక సామగ్రినీ ప్రక్రియలనూ ఎంత ఖర్చయినా ఆహ్వానించాలి, దానికి కావలసిన సకల సదుపాయాలూ మౌలిక వసతులూ ప్రభుత్వం సమర్థంగా విరివిగా చవకగా తన బాధ్యతగా కల్పించాలి అనేది ఈ అభివృద్ధి నమూనా. మౌలిక వసతులలో అతిముఖ్యమైనది విద్యుత్తు.

విద్యుత్ ఉత్పత్తికి మనదేశంలో ఇప్పటికీ ప్రధానమూలం బొగ్గు (మొత్తం విద్యుదుత్పత్తిలో 66 శాతం థర్మల్ విద్యుత్తే). అందువల్ల థర్మల్ పవర్‌ప్లాంట్ల స్థాపన, భారీగా బొగ్గు తవ్వకం అత్యవసరమైన విషయాలు. కోస్టల్ కారిడార్‌లో భాగంగా థర్మల్ ప్లాంట్లు తీరంవెంబడి పెద్దెత్తున నెలకొల్పుతున్న విషయం ఇప్పటికే చూసాము (అయితే వాటికి సింగరేణి బొగ్గుకాక బూడిద పాలు తక్కువ ఉండే విదేశీ బొగ్గు అధికంగా వాడుతున్నారు. చుట్టూ పొలాలూ, ఆవాసాలూ ఎక్కువ ఉన్న కారణంగా ఇది అవసరం అయింది). సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిని భారీస్థాయిలో చేపట్టాలన్న నిర్ణయం ఈ నేపథ్యంలో తీసుకున్నదే. జనావాసాలు తక్కువ ఉన్న ప్రాంతాలలో బూడిద కాలుష్యం ఎక్కువ ఉన్నా ఫరవాలేదని భావిస్తారు కాబట్టి దేశంలో అటువంటి ప్రాంతాలలో నెలకొల్పే థర్మల్ ప్లాంటులకు ఈ బొగ్గును తరలిస్తారు కాబోలు.

ఈ 70 చిల్లర ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులూ వాటి విస్తరణా చేపట్టి గరిష్ఠ ఉత్పాదకత లభించేస్థాయిలో తవ్వుకుంటూ పోతే 20 లేక 30 సంవత్సరాలలో ఓపెన్‌కాస్ట్‌ల ద్వారా తీయగల బొగ్గంతా అయిపోతుంది. ఆ తరువాత ఉత్తర తెలంగాణ పరిస్థితి ఏమిటంటే గోదావరిలోయ ప్రాంతమంతా బొందలు, మట్టిగుట్టలు ఉంటాయి. అక్కడ మళ్ళీ వ్యవసాయం సాధ్యం కావడానికి కొన్ని శతాబ్దాలు పడుతుంది. ఇది అభివృద్ధి పేరిట ఈ ప్రాంత జీవితంపైన జరుగుతున్న దుర్మార్గమైన దాడి తప్ప వేరే ఏంకాదు.

## ప్రతిఘటన

ఇప్పటికి రెండుచోట్ల ప్రజలు ఈ దుర్మార్గాన్ని ప్రతిఘటించి ఆపగలిగారు. ఆ విజయం తాత్కాలికమేనా అన్న సందేహం ఉన్నప్పటికీ దాని గురించి చెప్పుకోవడం అవసరం. ఈ రెండు పోరాటాలూ అత్యంత వెనుకబడిన జిల్లా అయిన ఆదిలాబాద్‌లో జరిగాయి. సాధించిన ప్రజలు సమాజంలో అత్యంత బలహీనులుగా భావించబడే ఎస్‌సి, ఎస్‌టిలు.

**ఈ దశలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన వచ్చేసరికి జనం గట్టిగా ఎదురు తిరిగారు. అండర్‌గ్రౌండ్ గనితోనే మాకిన్ని సమస్యలు వచ్చాయి, ఇక ఓపెన్‌కాస్ట్ వస్తే బతకలేం అని అడ్డు తగిలారు. ఏజెన్సీకి వర్తించే చట్టాలను ప్రస్తావించి మా అనుమతి లేకుండా ఎట్లా నెలకొల్పుతారో చూస్తాం అని హెచ్చరించారు. సింగరేణి యాజమాన్యం వెనక్కి తగ్గినట్టే కనిపిస్తోంది. 2008 ఫిబ్రవరిలో జరగవలసిన పర్యావరణ బహిరంగ విచారణను వాయిదా వేసారు. మళ్లీ జరిపే ప్రయత్నం చేయలేదు.**

కాశిపేట, ముత్యంపల్లి గ్రామాలు షెడ్యూల్డు ప్రాంతంలో ఉన్నాయి. వాటి మధ్య ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ప్రతిపాదన వచ్చేనాటికే ప్రజలు సింగరేణితో గొడవ పడుతున్నారు. అక్కడ 1995లో అండర్‌గ్రౌండ్ గని ప్రారంభం అయింది. 1997 నుండి ఆ గ్రామాలకు నీటి సమస్య మొదలయింది. అన్ని బావులలోనూ నీళ్లు ఇంకిపోయాయి. జనం సింగరేణి పనులు బంద్‌పెట్టించి ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం ప్రజలతో ఒప్పందానికి వచ్చి గనిలోని ఊటనీటిని ఫిల్టర్ చేసి ఈ గ్రామాలకు పైప్‌లైన్‌ద్వారా సరఫరా చేయడం మొదలుపెట్టింది. అయితే అది ఇంటి అవసరాలకే తప్ప చేలకు కాదు. ఈమధ్య ఫిల్టర్ కూడ సరిగ్గా చేయకపోవడం వల్ల మురికి నీళ్లు వస్తున్నాయి. ఈ దశలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన వచ్చేసరికి జనం గట్టిగా ఎదురు తిరిగారు. అండర్‌గ్రౌండ్ గనితోనే మాకిన్ని సమస్యలు వచ్చాయి, ఇక ఓపెన్‌కాస్ట్ వస్తే బతకలేం అని అడ్డు తగిలారు. ఏజెన్సీకి వర్తించే చట్టాలను ప్రస్తావించి మా అనుమతి లేకుండా ఎట్లా నెలకొల్పుతారో చూస్తాం అని హెచ్చరించారు. సింగరేణి యాజమాన్యం వెనక్కి తగ్గినట్టే కనిపిస్తోంది. 2008 ఫిబ్రవరిలో జరగవలసిన పర్యావరణ బహిరంగ విచారణను వాయిదా వేసారు. మళ్లీ జరిపే ప్రయత్నం చేయలేదు.



నెన్నెల మండలంలోని శ్రావణపల్లి, జెండా వెంకటాపూర్ గ్రామాలు, వాటిని ఆనుకొనివున్న మందమర్రి మండలంలోని మామిడిగట్టు గ్రామం ఒక సంవత్సరంపైగా తమ ఊరిలోకి సింగరేణి అధికారులను అడుగుపెట్టనీయకుండ నిరోధించాయి. ఈ మూడు గ్రామాల భూములలో సింగరేణి ఒక ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ప్రతిపాదించింది. దీనిని 'శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్' అని ప్రజలు పిలుస్తున్నారు. శ్రావణపల్లి పూర్తిగా లంబాడీ గిరిజనులు నివసించే గ్రామం. జెండా వెంకటాపూర్ వాసులందరూ నేతకాని కులానికి చెందిన దళితులే. మామిడిగట్టు భిన్నకులాలున్న గ్రామం. ఈ గ్రామాలు మామిడి తోటలకు ప్రసిద్ధిగాంచాయి. దాదాపు 4000 ఎకరాల మామిడితోటలున్నాయి. మన ప్రాంతంలో అరుదైన దస్సేరి పండ్లు పండుతాయి. ఒకప్పుడు నాగ్‌పూర్ నుండి దళారులు వచ్చి పండ్లు కొనుక్కొని పోయేవారు గానీ గత అయిదారేళ్లుగా ఈ గ్రామాల యువకులే మామిడి పండ్లను నాగ్‌పూర్ తీసుకుపోయి వ్యాపారం చేయడం నేర్చుకున్నారు. మామిడి కాత బాగా ఉన్న సంవత్సరంలో ఎకరానికి 80 వేల రూపాయలదాకా ఆదాయం పొందుతున్నారు.

ఈ మామిడి తోటలే కాక, మళ్ళీ అంత భూమిలో వరిచేలు కూడ ఉన్నాయి. కుంటలు, బోర్లు ఉన్నాయి. రెండు పంటలూ వరే వేసే భూములూ ఉన్నాయి. ఈ గ్రామాలకు చుట్టుపక్కల అయిదారు గ్రామాల నుండి కూలికి వస్తారు. సమీపంలో అడవులు ఉండడంవల్ల పశుగ్రాసమూ సమృద్ధిగా ఉంది. ఇంటింటికీ 15 నుండి 20 దాకా పశువులున్నాయి.

ఇన్ని కారణాలుగా ఈ పూర్ల ప్రజలు తమ జీవితాలను కాలక్రమంలో బాగు చేసుకొని గౌరవప్రదంగా బతకగలుగుతున్నారు. ఈ స్థితిలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన రావడం వీరికి గొడ్డలిపెట్టయింది. మొదటి దినం నుండి దానిని గట్టిగా వ్యతిరేకిస్తూ, సర్వే నిమిత్తం కూడ సింగరేణి అధికారులను రానివ్వకుండ అడ్డుపడుతూ వున్నారు. పోలీసు కేసులయినా ఖాతరు చేయలేదు. అన్ని ప్రజాసంఘాలనూ ఉద్యమకారులనూ పిలిచి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఒత్తిడి ఫలితంగా 'శ్రావణపల్లి ఓ.సి. ప్రాజెక్టు'ను వదులుకున్నట్టుగా సింగరేణి యాజమాన్యం నుండి వారికి సంకేతాలు అందాయి.

**మొదటి దినం నుండి దానిని గట్టిగా వ్యతిరేకిస్తూ, సర్వే నిమిత్తం కూడ సింగరేణి అధికారులను రానివ్వకుండ అడ్డుపడుతూ వున్నారు. పోలీసు కేసులయినా ఖాతరు చేయలేదు. అన్ని ప్రజాసంఘాలనూ ఉద్యమకారులనూ పిలిచి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఒత్తిడి ఫలితంగా 'శ్రావణపల్లి ఓ.సి. ప్రాజెక్టు'ను వదులుకున్నట్టుగా సింగరేణి యాజమాన్యం నుండి వారికి సంకేతాలు అందాయి.**



ఆదిలాబాద్ జిల్లా, తిర్యాని మండలంలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్

పూర్తిగా ఆపకపోయినా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వల్ల కలిగే నష్టాన్ని ఆందోళన చేసి తగ్గించుకున్న ఉదంతం ఖమ్మం జిల్లా ఇల్లందు పట్టణంలో జరిగింది. జెకె-5 గనిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చడానికి సింగరేణి చేపట్టిన భూసేకరణ ఇల్లందు పట్టణంలో 7 వార్డులను మింగేస్తుందని తెలిసి పట్టణ ప్రజలు అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఊరిలో భూసేకరణ ప్రధానంగా ఒ.బి. డంప్‌కోసం. ఇళ్లు కోల్పోయేవారు కోల్పోగా మిగిలిన ఊరు పక్కనే పెద్ద మట్టి గుట్టను పెట్టుకొని ఎండాకాలానికి చెలరేగే ధూళిని భరిస్తూ బతకాలి. ఓపెన్‌కాస్ట్‌లో జరిగే బ్లాస్టింగ్ కాలక్రమంలో ఊరంతటినీ శిథిలం చేసినా ఆశ్చర్యంలేదు. జెకె5లో అండర్‌గ్రౌండ్ పద్ధతిలో ఇంకా కొంతకాలం బొగ్గు తవ్వితీసే అవకాశం ఉన్నా కంపెనీ దానిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చాలని ఎందుకు నిర్ణయించిందన్న ప్రశ్నకు జవాబేమీ లేకున్నా, ఆందోళన ఫలితంగా భూసేకరణను తగ్గించడమయితే జరిగింది. ఇప్పుడు ఇల్లందు పట్టణంలో 7 వార్డులు కాదు, 2 మాత్రమే పోతాయి. అయినప్పటికీ ఆ పట్టణ భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే ఉండిపోయింది.

ఇల్లందు జెకె-5 గని ఒక్కటే కాదు, చాలా చోట్ల ఇప్పుడొస్తున్న ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు నడుస్తున్న అండర్‌గ్రౌండ్ గనులను ఓపెన్‌కాస్ట్‌గా మార్చే ప్రయత్నంలో భాగంగా నెలకొంటున్నవి. అండర్‌గ్రౌండ్ పద్ధతిలో బొగ్గు తీయగలిగినంతా తీసేసి దానిని మూసేసే స్థితి వచ్చినప్పుడు ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో కొనసాగించడం ఓపెన్‌కాస్ట్‌లను సమర్థించుకోవడానికి ఒకనాడు చేసిన వాదన. కానీ ఇప్పుడు ఇంకా చాలాకాలం అండర్ గ్రౌండ్ పద్ధతిలో నడవగల గనులను ఓపెన్‌కాస్ట్‌లుగా మారుస్తున్నారు. ఇప్పటిదాకా పనిచేస్తున్న వందలమంది కార్మికులను తొలగించి చుట్టుపక్కల గ్రామాలనూ వ్యవసాయ భూములనూ ఖాళీ చేయించి అధిక ఉత్పత్తినీ అధిక ఉత్పాదకతనూ నమోదు చేసుకుంటున్నారు. వరంగల్ జిల్లాలోని భూపాలపల్లిలోనయితే 3ఎ ఇంక్లయిన్‌ను 2008 ఏప్రిల్ నెలలో ఆర్భాటంగా ఆవిష్కరించినట్టు చేసి ఉత్పత్తి మాత్రం మొదలుపెట్టకుండ దానిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చే ప్రయత్నం మొదలుపెట్టారు.



## ఆదివాసుల హక్కులు

అప్పుడెప్పుడో వచ్చిన అండర్‌గ్రౌండ్ గనులు ఎక్కువ భాగం (ముఖ్యంగా ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలలో) ఆదివాసీ ప్రాంతాలలోనే ఉన్నాయి. అప్పుడు వారికి రక్షణ కల్పించే చట్టాలు లేవు. వారిని అడవులలోకి నెట్టేసి గనులు ఏర్పాటు చేసారు. గనులలో ఒక్క ఆదివాసీకీ పని దొరకలేదు. ఇవ్వాళ్టికీ సింగరేణి గని కార్మికులలో ఆదివాసులు అతితక్కువ. రేపు జరగబోయే ఓపెన్‌కాస్ట్ విస్తరణ మరొక విడత భారీగా ఆదివాసుల భూములను కబళించబోతుంది. ఇప్పుడెలాగూ పనులు స్థానిక ప్రజలెవరికీ పెద్దగా దక్కబోయేది లేదు కాబట్టి భూములు కోల్పోయే ఆదివాసులకూ దక్కవు. అయితే ఇప్పుడు ఆదివాసులకు బలం కల్పించే చట్టాలున్నాయి. వాటిని పాలకులు గౌరవించి ఉంటే ఈ విస్తరణ జరిగేదేకాదు. ప్రజలు వాటిని అర్థం చేసుకొని సంఘటితమై అడ్డుపడినా నిలిచిపోతుంది కానీ ఆ చట్టాల గురించి ప్రజలకేకాదు, వారి తరపున మాట్లాడుతున్న పార్టీలకూ, ప్రజాసంఘాలకూ కూడ అవగాహన లేదు.

షెడ్యూల్డు ప్రాంతాలకు పెసా (PESA) చట్టం వర్తిస్తుంది. పెసా అనేది కేవలం చట్టం కాదు, రాజ్యాంగ ఆదేశం. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశంలోని పంచాయతుల రూపురేఖలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించినప్పుడు, దానిని షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజేయకుండ ఆ పని తగురీతిలో పార్లమెంట్ చేస్తుందని అనడం జరిగింది. 1996లో పెసా చట్టం ద్వారా పార్లమెంటు 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరింపజేసింది. ఆదివాసుల ప్రత్యేక స్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక అంశాలను చేర్చింది. వాటిలో ప్రస్తుతానికి వర్తించేవి రెండు. ఒకటి షెడ్యూల్డు ప్రాంత గ్రామసభకు 'ప్రజల సంప్రదాయాలనూ, ఆచారాలనూ, సాంస్కృతిక ప్రత్యేకతలనూ, ఉమ్మడి వనరులనూ' కాపాడే అధికారం సంరక్షించే అధికారం ఉంది. 'ఉమ్మడి వనరులు' అనేదానిలో గ్రామకంఠం, బీళ్ళు, పోరంబోకులు, నీటివనరులు, అడవులు వస్తాయని వివరించి చెప్పనవసరం లేదు. వీటిని కాపాడే అధికారం సంరక్షించే అధికారం గ్రామసభకు ఉన్నాయి అంటే అర్థం గ్రామ సభ సమ్మతి లేకుండ వాటిని ప్రభుత్వం సహితం వేరే అవసరాలకోసం తీసేసుకోవడానికి, వినియోగించడానికి వీలులేదని. రెండు, ఏ అభివృద్ధి పథకం కోసమయినా భూసేకరణ చేసేముందు, వాటివల్ల నిర్వాసితులయ్యే ప్రజలకు పునరావాసం కల్పించేముందు స్థానిక మండల పరిషత్‌ను సంప్రదించాలి. ఇక్కడ సంప్రదింపు అనేది మొక్కుబడిగా ఉండడానికి వీలులేదు. అర్థవంతమైన సంప్రదింపు జరగాలంటే ప్రాజెక్టుకూ పునరావాసానికీ సంబంధించిన పూర్తి సమాచారాన్ని సంబంధిత మండల పరిషత్ ముందు ఉంచి తగు హోదాగల అధికారి మండల పరిషత్ సమావేశానికి హాజరై వారికి అన్నీ వివరించి, వారి ప్రశ్నలకు జవాబులు చెప్పి వారి అభిప్రాయం కోరాలి.

ఇవి పెసానుండి వచ్చిన హక్కులు కాగా అటవీ హక్కుల చట్టం (షెడ్యూల్డు తెగలు, ఇతర సంప్రదాయ అటవీవాసుల అటవీ హక్కుల గుర్తింపు చట్టం) అడవులలో ఆదివాసులకూ, మూడు తరాలుగా అడవిపైన ఆధారపడి బతుకుతున్న ఆదివాసీయేతరులకూ ఇచ్చిన హక్కులను లెక్కలోకి తీసుకోకుండ కూడ భూసేకరణ జరగడానికి వీలులేదు. 2005 డిసెంబరు 13 వ తేదీకి ముందు ఎన్నడైనా అడవులలో అనుభవించిన సకల హక్కులకూ ఈ చట్టం గుర్తింపు ఇస్తుంది. అందులో సమిష్టి హక్కులూ ఉన్నాయి, వ్యక్తిగత హక్కులూ ఉన్నాయి. అంటే పోగొట్టుకున్న భూములకు పట్టాయేకాక ఒక గూడెం ప్రజలు సమిష్టిగా పశువులను మేపుకున్న భూభాగం మీద, సమిష్టిగా చేపలు పట్టుకున్న నీటి వనరుల మీద, సమిష్టిగా చిన్నతరహా అటవీ ఉత్పత్తులు సేకరించిన అటవీక్షేత్రం మీద కూడ సమిష్టి 'పట్టాలు' లభిస్తాయి.

# ‘పెసా’ చట్టం

‘పెసా’ చట్టం పూర్తి పేరు ‘పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్’ చట్టం.

దేశ రాజ్యాంగం రాసినపుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారుగానీ స్థానిక సంస్థల అధికారాలకు కల్పించలేదు. వాటి అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టానికి వదిలేసారు. ఇది స్థానిక సంస్థలను చాలా బలహీనపరిచిందని గుర్తించి 1992లో 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతులకు, మునిసిపాలిటీలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అయితే ఈ సవరణలను షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజేయలేదు. వాటిని షెడ్యూల్డు ప్రాంతాలకు ఉన్నదున్నట్టు కాకుండ ఆదివాసీ ప్రజల అవసరాలనూ, ఆకాంక్షలనూ దృష్టిలో ఉంచుకొని తగిన పద్ధతిలో సవరించి వర్తింపజేయాలని భావించారు. భవిష్యత్తులో పార్లమెంటు ఆ పని చేస్తుందని 73, 74వ రాజ్యాంగ సవరణలు అంటాయి. మునిసిపాలిటీల విషయంలో ఇది ఇప్పటికీ జరగలేదుగానీ, పంచాయతుల విషయంలో పార్లమెంటు భూరియా కమిటీ ప్రతిపాదనలను లెక్కలోకి తీసుకొని 1996లో పెసా చట్టం ద్వారా 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరింపజేసింది.

వివిధ పాలనాంశాలలో ఆదివాసీ ప్రాంత గ్రామసభకూ పంచాయత్‌రాజ్ వ్యవస్థలకూ స్వయంప్రతిపత్తి కల్పిస్తూ ఆయా రాష్ట్రాల పంచాయత్‌రాజ్ చట్టాలను తిరగరాయాలని ‘పెసా’ చట్టం రాష్ట్రాలను ఆదేశిస్తుంది. ఈ స్వయంప్రతిపత్తి స్వభావాన్ని ‘పెసా’ చట్టంలోని సెక్షన్ 4(డి) సూచిస్తుంది. అదేమిటంటే గ్రామసభకు ‘ప్రజల సంప్రదాయాలు, ఆచారాలు, సాంస్కృతిక ప్రత్యేకతలు, ఉమ్మడి వనరుల’ను కాపాడుకునే హక్కు ఉంటుందనేది. ఉమ్మడి వనరులలో ఊరిచుట్టూ ఉన్న భూమి, అడవులు, నీటివనరులు వస్తాయి. ఈ సాధారణ అధికారమే కాక, భూసేకరణ చేసేముందు, నిర్వాసితుల పునరావాసం చేపట్టేముందు గ్రామసభనుగానీ పంచాయితీరాజ్ వ్యవస్థలో నిర్దేశిత స్థాయి వ్యవస్థను గానీ తప్పనిసరిగా సంప్రదించాలన్న నియమం కూడ సెక్షన్ 4(ఐ) కల్పించింది. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు ఈ ‘నిర్దేశితస్థాయి వ్యవస్థ’ మండల ప్రజాపరిషత్.

ఈ పట్టాలు మంజూరు చేసేక్రమం ఇప్పుడిప్పుడే మొదలయింది. అది పూర్తయి హక్కుల నిర్ధారణ సమగ్రంగా జరిగేదాకా అటవీ ప్రాంతాలలో ఎటువంటి భూసేకరణా జరగడానికి వీలులేదు.

ఈ చట్టాలను పాటిస్తే సింగరేణి యాజమాన్యం తలపెట్టిన ఓపెన్‌కాస్ట్ విస్తరణ మూడవవంతు కూడ సాధ్యమయ్యేదికాదు. ఆదిలాబాద్ జిల్లాలోనూ వరంగల్ జిల్లాలోనూ చేపడుతున్న ఓపెన్‌కాస్టులు కొన్ని, ఖమ్మం జిల్లాలో చేపడుతున్న దాదాపు అన్నీ (సత్తుపల్లి దగ్గర నెలకొంటున్న ఓ.సి.పి-2 తప్ప అన్నీ) షెడ్యూల్డు ప్రాంతంలో, అడవి ప్రాంతంలో ఉన్నాయి. పైన చెప్పిన చట్టాల గురించి, అవి కల్పించే హక్కుల గురించి అడిగేవాళ్ళెవరూ లేరు కాబట్టి ఏ గ్రామసభ అనుమతీ తీసుకోకుండ, ఏ మండల పరిషత్‌నూ సంప్రదించకుండ, అటవీ హక్కుల గుర్తింపు కోసం ఆగకుండ భూములు తీసేసుకుంటున్నారు. పోలవరంవల్ల ఏడు మండలాలలో (వేలేరుపాడు, కుక్కునూరు, బూర్గుం పాడు, భద్రాచలం, కూనవరం, వరరామ చంద్రాపురం, చింతూరు) భారీగా భూములు కోల్పోతున్న ఖమ్మం జిల్లా ఆదివాసులు



# పట్టణాలే మాయం

రామకృష్ణాపూర్ ఆదిలాబాద్ జిల్లా ‘కోల్‌బెల్ట్’లోని పెద్ద ఊర్లలో ఒకటి. 50 వేల జనాభా ఉన్న ఈ ఊరిలో దానికి దగ్గర ఉన్న గనులలో పనిచేసే కార్మికులేకాక, మందమర్రి, శ్రీరాంపూర్‌లలో పనిచేసే కార్మికులు కూడ నివసిస్తున్నారు. అక్కడున్న సింగరేణి ఏరియా ఆస్పత్రి బాగా పెద్దది కూడా అయితే ఆ ఊరి భూమంతా అప్పుడెప్పుడో సింగరేణికి ప్రభుత్వం ఇచ్చినదే. కంపెనీయే ఇళ్ళస్థలాలు ఇచ్చి ఉచిత కరెంటు ఇచ్చి కార్మికులు నివాసాలు ఏర్పరుచుకోవడాన్ని ఒకనాడు ప్రోత్సహించింది. ఇప్పుడొక పెద్ద బజారు, స్కూళ్ళు తదితర వసతులతో రామకృష్ణాపూర్ ఒక పెద్ద ఊరయింది. ఆ ఊరికిప్పుడు చేటొచ్చింది. సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్ట్‌ల గురించి పారదర్శకంగా ఏమీ చెప్పదు. అకస్మాత్తుగా భూసేకరణ ప్రకటనో, బుల్‌డోజర్లో వచ్చిన రోజు తెలుసుకోవాలి. అయితే అందులో పనిచేసే ఉద్యోగుల ద్వారా కొంత సమాచారం తెలుస్తూనే ఉంటుంది. తెలిసిన సమాచారం ప్రకారం, మూసేసిన ఆర్‌కె1, ఆర్‌కె3, ఆర్‌కె4 గనులను ఓపెన్‌కాస్ట్‌లుగా పునరుద్ధరించి, నడుస్తున్న ఎంకె 4, ఎంకె 4ఎ గనులను కూడ ఓపెన్‌కాస్ట్‌లుగా మార్చి ఒక బృహత్ ఓ.సి. ప్రాజెక్టు తయారు చేసే ఆలోచనలో సింగరేణి ఉంది. తొలుత ఈ ప్రాజెక్టుకు ఓ.బి. డంప్‌ను రామకృష్ణాపురం ఊరున్నచోట నెలకొల్పాలన్న ఆలోచన ఉండిందిగానీ ఇది బయటకు పొక్కి కొంత అల్లరి జరిగేసరికి ఊరిబయట, మందమర్రి శ్రీరాంపూర్ రోడ్డుకు ఆవల డంప్ నెలకొల్పబోతున్నట్లు కంపెనీ సంకేతాలు ఇచ్చింది. అయినప్పటికీ ధూళివల్ల, బ్లాస్టింగ్‌వల్ల, రోడ్డుకు ఇవతల ఉన్న ఆర్‌కె4 గడ్డ, శాంతినగర్ కాలనీలలో నివాసం అసాధ్యం అవుతుంది. అక్కడి జనాభా 15 నుండి 20 వేలదాకా ఉంటుంది. కాలక్రమంలో ఊరే ఖాళీ చేయవలసిరావచ్చు.

బెల్లంపల్లి ఇంకా పెద్దఊరు. ఒక లక్ష దాకా జనాభా ఉన్న ఊరు. ఆ ఊరిని క్రమంగా ఖాళీ చేయించే ఆలోచన సింగరేణి యాజమాన్యానికి ఉన్నట్లు అనేక సంకేతాలు లభిస్తున్నాయి. 1976లో ఒక ప్రమాదం కారణంగా మూసేసిన 2 ఇంక్లయిన్ గనిని కేంద్రం చేసుకొని ఒక భారీ ఓపెన్‌కాస్ట్‌ను తయారుచేసే ఆలోచన ఉందని కార్మికుల అనుమానం. ఆ ఊరిలో కార్మికుల క్వార్టర్స్ 5000 దాకా ఉన్నాయి. ఇప్పుడు బెల్లంపల్లికి అనుబంధంగా గనులు లేవు. అబ్బాపూర్, ఖైరిగుడ, డొర్లి, గోలేటి తదితర ప్రాంతాలలోని గనుల కార్మికులకు ఈ క్వార్టర్స్ నివాసాలుగా కేటాయించేవారు. ఇప్పుడు ఒక్కొక్కటి ఖాళీ చేయిస్తున్నారు. పాడయిన వాటిని రిపేర్ చేయడం లేదు. ఖాళీ అయిన వాటిని వేరే ఎవ్వరికీ కేటాయించడం లేదు. నీటి సరఫరా రెండు మూడు రోజులకొకసారి చేస్తున్నారు. హైస్కూల్‌ను, డిస్పెన్సరీని, టింబర్‌యార్డ్‌ను, స్టోర్స్‌ను, ఏరియా వర్క్‌షాప్‌ను గడచిన నాలుగైదు ఏళ్లలో ఒకటొకటిగా మూసేసారు. 608 పడకలు ఉండిన ఏరియా ఆస్పత్రిలో పడకల సంఖ్యను 250 కి తగ్గించేసారు. ఇక్కడ భూమంతా ఏనాడో ప్రభుత్వం సింగరేణికి అప్పగించింది కాబట్టి వారి అనుమతి లేకుండ ప్రభుత్వ కార్యాలయాలు సహితం ఆ ఊరిలో కట్టుకోవడానికి వీలులేదు. ఆ అనుమతి సింగరేణి ఇవ్వడంలేదు. చివరికి బెల్లంపల్లి మునిసిపాలిటీకి సహితం తన కార్యాలయంకోసం బిల్డింగ్ కట్టుకోవడానికి కంపెనీ అనుమతి నిరాకరించింది!

ఒక లక్ష జనాభాగల ఊరిని మెల్లమెల్లగా గొంతు నులిమి చంపేసి అక్కడ భారీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు నెలకొల్పాలని సింగరేణి యాజమాన్యం ప్రయత్నిస్తున్నదనడానికి ఇవన్నీ సంకేతాలే. అయితే కంపెనీ మాత్రం నోరువిప్పదు.

ఓపెన్‌కాస్ట్‌ల వల్ల మరొక 5 మండలాలలో (ఇల్లందు, గుండాల, టేకులపల్లి, మణుగూరు, పినపాక) భూములు కోల్పోతారు. ఇది అడవి ప్రాంతం కాబట్టి ప్రతీ గ్రామంలోనూ పోడు భూములున్నాయి. అటవీ హక్కుల చట్టం ఒకటి వచ్చిందని, దానికింద పోడు భూములకు పట్టా లభిస్తుందని తెలియని ఆదివాసుల నుండి పోడు భూములు గుంజుకోవడం ప్రభుత్వానికి చాలా సులభం అయింది. పోడు కొట్టుకోవడం నిన్నటిదాకా నేరం అని మాత్రమే వారికి తెలుసును. అయినా ఊరికే ఖాళీచేయమంటే ప్రతిఘటిస్తారుగానీ ఏదో కొంచెం చేతిలో పెడితే ప్రభుత్వం ఎంత దయగలది అనుకొని ఖాళీ చేయగలరు. కోయగూడెం ఓ.సి.పి-2 కోసం టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం అనే కోయ గ్రామంలో 250 ఎకరాల పోడుభూమిని ఎకరానికి 5వేల రూపాయలు చేతిలోపెట్టి అన్యాయంగా సింగరేణి స్వాధీనం చేసుకుంది.

**పోడు కొట్టుకోవడం నిన్నటిదాకా నేరం అని మాత్రమే వారికి తెలుసును. అయినా ఊరికే ఖాళీచేయమంటే ప్రతిఘటిస్తారుగానీ ఏదో కొంచెం చేతిలో పెడితే ప్రభుత్వం ఎంత దయగలది అనుకొని ఖాళీ చేయగలరు. కోయగూడెం ఓ.సి.పి-2 కోసం టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం అనే కోయ గ్రామంలో 250 ఎకరాల పోడుభూమిని ఎకరానికి 5వేల రూపాయలు చేతిలోపెట్టి అన్యాయంగా సింగరేణి స్వాధీనం చేసుకుంది.**

బాధితులకిచ్చే పునరావాసం గురించి ప్రభుత్వము, సింగరేణి యాజమాన్యము చాలా చెప్తుంటారు కాబట్టి ఖమ్మం జిల్లా మణుగూరు ఓ.సి. ప్రాజెక్టు బాధిత ఆదివాసీ గ్రామమైన కొండాపురం కథ చెప్పుకొని ముగిద్దాం. మణుగూరు దగ్గర సింగరేణి శతాబ్ది సందర్భంగా 1989లోనే సెంటినరీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వచ్చింది. ఆ తరువాత దాని పక్కనే మరికొన్ని ఓపెన్‌కాస్ట్‌లు ప్లాన్ చేసి చివరికి అన్నిటినీ కలిపి ఒకే పెద్ద మెగా ఓ.సి.పిని తయారు చేస్తున్నారు. దీనికి కావలసిన భూమిని ఎగ్గడిగూడెం, గుండ్లసింగారం, పద్మగూడెం, కొమ్ముగూడెం, మల్లెపల్లి గ్రామాలనుండి తీసుకుంటున్నారు. గనికోసం, ఓ.బి. డంప్‌కోసం, కార్యాలయాలు వగైరా అవసరాల కోసమేకాక మరొక దాని కోసం కూడా ఇక్కడ భూమి అవసరమయింది. ఈ ఓపెన్‌కాస్ట్‌కు దగ్గరగా గోదావరి నది ప్రవహిస్తుంది. ఈ ప్రాజెక్టు లెవెల్ గోదావరి వరద నీటిమట్టంకంటె తక్కువ ఉండడంతో గోదావరి వెంబడి మట్టికట్ట వేయవలసి వచ్చింది. దానికోసమూ భూమి సేకరిస్తున్నారు. నదినుండి పైపులైన్‌లు వేసుకొని పొలాలకు సాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులకు ఇంక ఆ అవకాశం ఉండదు.

ఇది ఇవ్వాళ్టి సంగతి కాగా, 1996లోనే సెంటినరీ ఓసి ప్రాజెక్టు ఓ.బి. డంప్ కోసం అదనంగా భూమి అవసరమయి 42 ఆదివాసీ కుటుంబాలున్న కొండాపురాన్ని ఖాళీ చేయించారు. మణుగూరు దగ్గర కాలనీ కట్టిస్తామనీ, అందరికీ వ్యవసాయ భూములిస్తామనీ, ఉద్యోగాలిస్తామనీ హామీ యిచ్చారు. కనీసం ఇంటిస్థలం కూడ ఇయ్యకపోయేసరికి కొండాపురం ప్రజలు ప్రత్యక్షచర్యకు దిగారు. 1996 డిసెంబర్ 11 నుండి 26 దాకా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు పనులకు అడ్డంపడి బంద్ పెట్టించారు. అప్పుడు మణుగూరును ఆనుకొని ఒక్కొక్క కుటుంబానికి 5సెంట్ల ప్లాట్ ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి తలా 40 వేల రూపాయలిచ్చారు. అది చాలకపోతే అందరూ అదనంగా ఖర్చుపెట్టుకొని ఇళ్ళు కట్టుకొని కాలనీకి



'కొత్తకొండాపురం' అని పేరు పెట్టుకున్నారు. ఉద్యోగాలిస్తామన్నారు కదా ఇమ్మంటే రిక్రూట్‌మెంట్ జరిగేటప్పుడు అందరితోపాటు పరుగుపందెంలో పాల్గొనండి ఇస్తాం అన్నారు. పరుగుపందెంలో సఫలమైతే ఎట్లాగూ ఇచ్చేదేకదా, మీరు నిర్వాసితులుగా మాకు ఇచ్చిందేమిటి అని కొండాపురం ఆదివాసులు అభ్యంతరం తెలిపారు. అట్లాగయితే కరీంనగర్‌లో, ఆదిలాబాద్‌లో ఉన్న గనులలో పోయి పనిచేయండి అన్నారు. మా భూములు మీరు గనికోసం తీసుకొని మమ్మల్ని వేరే జిల్లాకు పొమ్మంటే ఎందుకు పోతాం అని జనం గొడవపెట్టుకున్నారు. చివరికి ఉద్యోగాలిచ్చేది లేదనీ, దాని బదులు 60,000 రూపాయలిస్తామనీ, అయితే ఇది స్వంత భూమి ఉండిన 17 కుటుంబాలకు మాత్రమే పరిమితం అనీ సింగరేణి అనింది. పోడుభూమి మీద బంజరు భూమి మీద ఆధారపడి బతికిన తక్కిన 25 కుటుంబాలవారు కూడ జీవనం కోల్పోయినప్పటికీ వారికేమీ ఇవ్వననింది. ఉద్యోగాల ప్రహసనం అట్లా ముగిసింది. ఇక భూముల విషయానికి వస్తే – మొదట ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి 2 ఎకరాల భూమి ఇస్తానంది. స్వంత భూమి ఉండిన 17 కుటుంబాలకు 1998లో సాగు యోగ్యమైన భూమే ఇచ్చింది గానీ మిగిలిన వారికి మరొక నాలుగేళ్ళు తిప్పించుకొని 2002లో రాళ్లు రప్పలతో నిండిన భూమి ఇచ్చింది. కానీ సాగు యోగ్యమైన భూమి పొందిన 17 కుటుంబాల వారికే అంతా సజావుగా జరగలేదు. దున్నుకుందామని పోతే ఇచ్చిన 2 ఎకరాలూ ఒకచోట లేవనీ ఇక్కడ కొంచెం అక్కడ కొంచెం ఉన్నాయనీ గమనించారు. పోనీలే దున్నుకుందామని ప్రయత్నించగా గిరిజనేతరులు అడ్డుతగిలి అది తమ భూమి అన్నారు. భూమి పొందిన గిరిజనులు ఈ సంగతి మణుగూరు ఎంఆర్‌వో (తాసీల్దార్)కూ ఎస్‌ఐకీ చెప్పగా వారు గిరిజనేతరులపైన ఆగ్రహించి 'మీకెట్లా అడ్డమొస్తారు? వాళ్ళను నరకండి' అని ఉచిత సలహా ఇచ్చారు. ఇన్ని హామీలు ఇచ్చి చివరికి ఏమీ ఇవ్వని ప్రభుత్వాన్ని పట్టుకొని నిలదీయకపోయారా అని కొండాపురం కోయపెద్దను అడిగితే 'ఎట్లా పట్టుకునేది? దానికి జుట్టూ జందెం ఉంటేకదా' అని చమత్కరించాడు.

◆ ◆ ◆

## కాకినాడ, పోలేపల్లి

# రెండు సెజ్ వ్యతిరేక పోరాటాలు

57 సెజ్‌లు అధికారికంగా ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్‌లో రెండుచోట్ల మాత్రమే ప్రజలనుండి ఉద్యమం రూపంలో ప్రతిఘటన రావడం రాష్ట్రంలో ప్రజా ఉద్యమాల బలహీన స్థితికి అద్దం పడుతుంది. ఆ రెండుచోట్ల కూడ ప్రజలను కూడగట్టింది, కదిలించింది ఏ వామపక్ష ఉద్యమమూ కాదు, ప్రజాసంఘమూ కాదు. స్థానిక స్వచ్ఛంద సంస్థల కార్యకర్తల కృషే ప్రజల నిరసనకు ఉద్యమరూపం ఇచ్చింది.

## కాకినాడ సెజ్ వ్యతిరేకపోరాటం

'కాకినాడ పోర్ట్ ఆధారిత సెజ్'కు వ్యతిరేకంగా రెండు మండలాల ప్రజలు రెండేళ్లకు పైగా చేస్తున్న పోరాటం మీడియా ద్వారా రాష్ట్రం దృష్టిని బాగానే ఆకర్షించింది. ఇది రాష్ట్రంలో మొదట వచ్చిన సెజ్‌లలో ఒకటి. మిగిలిన రెండు చిత్తూరు (సత్యవేడు, వరదాయపాలెం మండలాలలో శ్రీసిటీ అనే ప్రైవేట్ డెవలపర్ చేపట్టిన సెజ్), విశాఖపట్నం (రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలలో ఎ.పి.ఐ.ఐ.సి 'ఆంధ్రప్రదేశ్ మౌలిక వసతుల కార్పొరేషన్' చేపట్టిన సెజ్) జిల్లాలలో అదే సమయంలో వచ్చాయి. కాని ఇక్కడే ప్రతిఘటన ఉద్యమం రావడానికి కారణం సకాలంలో చురుకయిన కార్యకర్తలు రంగంలోకి దిగడం ఒక్కటే కాదు. వేరే కారణాలు చాలా ఉన్నాయి.

అన్నిటికంటే బలమైనది, తొలినాడు కాకినాడ-సామర్లకోట రహదారికి సమీపంలో ప్రతిపాదించి భూసేకరణ నోటిఫికేషన్ సహితం జారీ చేసిన సెజ్‌ను అకస్మాత్తుగా అక్కడినుండి రాజకీయంగా నోరులేని తొండంగి, యు.కొత్తపల్లి మండలాల తీరప్రాంత గ్రామాలకు తరలించడం. రెండవది, ఒ.ఎన్.జి.సి. ఆధ్వర్యంలో పెట్రోలియం రిఫైనరీల స్థాపన కోసం ఉద్దేశించింది అని తొలుత ప్రకటించిన సెజ్‌పట్ల ఒ.ఎన్.జి.సి. తనకు ఆసక్తి లేదని ప్రకటించిన తరువాత కూడా కెఎస్ఇజడ్ అనే ప్రైవేట్ డెవలపర్ ద్వారా దానిని కొనసాగించడం. మూడవది ఫలవంతమైన నేలలను సారహీనమైనవిగా వర్ణించి సెజ్ స్థాపనవల్ల



జీవనానికేమీ నష్టంలేదని బుకాయించడం. నాలుగవది డెవలపర్ కొంత కొనుక్కుంటాడు, ప్రభుత్వం కొంత సేకరిస్తుంది అనే పేరుమీద వారి కొనుగోలుకు వీరి ఒత్తిడిని తోడుచేసి చవకగా భూములు తీసుకోవడం.



సెజ్‌లలో భూముల్ని కాజేసిందిలాగే...
బొమ్మ : ఫర్జానా కూపర్

మొదటి ప్రతిపాదనలోనూ యు.కొత్తపల్లి మండలంలో 4946 ఎకరాలు తీసుకునే ఆలోచన ఉండిందిగానీ అవి రహదారికి సమీప గ్రామాలు. అదనంగా, కాకినాడ రూరల్ మండలంలో 3778 ఎకరాలు, సామర్లకోట మండలంలో 368 ఎకరాలు, పిఠాపురం మండలంలో 777 ఎకరాలు ఆ ప్రతిపాదనలో ఉన్నాయి. ఇవి సారవంతమైన మాగాణి భూములు, చాలావరకు రియల్ ఎస్టేట్‌గా రూపాంతరం చెందుతున్న భూములు, వాటి యజమానులు రాజకీయంగా బలవంతులు కూడ. ఈ కారణంగానే భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసిన తరువాత కూడ ఆ ప్రతిపాదనను మార్చి, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో కూడ సముద్రతీరానికి దగ్గరగా ఉన్న ప్రాంతంలో భూసేకరణ మొదలుపెట్టారని ప్రజలు నమ్ముతున్నారు. ఈ శంక పలుమార్లు, పలు వేదికలనుండి వ్యక్తం చేసినప్పటికీ అంతకంటే సంతృప్తికరమైన కారణమేదీ ప్రభుత్వం చెప్పలేదు కాబట్టి ఇదే నిజమని నమ్మడంలో తప్పులేదు.

మొదటి ప్రతిపాదనను అనుసరించి భూసేకరణ నోటిఫికేషన్ 11 అక్టోబర్ 2005 నాడు వెలువడింది. అయితే 29 డిసెంబర్ 2005, 1 జనవరి 2006 తేదీలలో వేరే నోటిఫికేషన్ పత్రికలలో వచ్చింది. దీని ప్రకారం అవే 9869 ఎకరాలను యు.కొత్తపల్లి, తొండంగి మండలాలలో, కాకినాడ నుండి ఉప్పాడ మీదుగా తునికి వెళ్ళే తీరప్రాంత రహదారి సమీపంలో సేకరిస్తారు. ఈ నోటిఫికేషన్ చూసిన తరువాతే మొదటి భూసేకరణ ప్రతిపాదన రద్దయి కొత్తది వచ్చిందని ప్రజలకు తెలిసింది. అయితే అదే సమయంలో కర్నాటి వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని డైరెక్టర్‌గా కలిగిన కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్‌కే (ఎస్.ఇ.జడ్) చెందిన మనుషులు, రెవిన్యూ అధికారులతో కలిసి ఊర్లలోకి వచ్చి భూములు అమ్మమని రైతులపైన ఒత్తిడి పెట్టసాగారు. ఈ కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే దాని పూర్వనామధేయం కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్. సెజ్ చట్టం అనేది దేశంలో లేకముందే ఈ సంస్థకు (2002 నవంబర్ 27న) కాకినాడ సమీపంలో ఒక పోర్ట్ ఆధారిత ప్రత్యేక ఆర్థికమండలి నెలకొల్పడానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నుండి అనుమతి లభించింది. ఒక సంవత్సరం లోపల వివరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్న షరతుతో ఇచ్చిన ఈ అనుమతిని ఆ కంపెనీ అటువంటి ప్రతిపాదనలేవీ సమర్పించకుండానే సంవత్సరానికొకసారి పొడిగించుకుంటూ వచ్చింది. 2005లో సెజ్‌చట్టం వచ్చిన తరువాత తనపేరు కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకొని వివరమైన ప్రతిపాదనలు సమర్పించి, చివరికి 27 జూన్ 2006న 'బహుళ ఉత్పత్తుల ప్రత్యేక ఆర్థిక మండలి' నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందింది. అయితే దీని ఏర్పాటు ఎక్కడ జరుగుతుందన్న ప్రస్తావన ఆ అనుమతిపత్రంలో

**కాకినాడ సెజ్‌పైన ఓ.ఎన్.జి.సి.కి ఆసక్తిపోగా వారికోసం మొదలుపెట్టిన భూసేకరణను ఆపవలసిన ప్రభుత్వం కాకినాడ సెజ్‌ప్రైవేట్ లిమిటెడ్ వారికి ఆ భూమిని అప్పగించే ఆలోచన చేసింది. భూమికి ప్రజల జీవనాధారంగా ఏ విలువా లేదనీ, ఒక వ్యవసాయేతర ప్రయోజనం కోసం కాకపోతే మరొక దానికోసం దానిని బదలాయించవచ్చుననీ నమ్మే ఒక స్పష్టమైన వైఖరి ఇక్కడ కనిపిస్తుంది.**

లేదు. 'తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో' అని మాత్రమే ఉంది.

మొదట ఈ భూసేకరణ ఓఎన్‌జిసివారి రిఫైనరీ తదితర పెట్రోలియం ఆధారిత పరిశ్రమల సెజ్‌కోసం అన్న అభిప్రాయంతో ప్రజలున్నారు. అయితే 2005 చివరి భాగానికి వచ్చేసరికి ఈ ప్రాజెక్టుపట్ల వారికి ఆసక్తి లేదన్న వదంతి వ్యాపించింది. అదే సమయంలో కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రెవెన్యూ వారిని వెంటబెట్టుకొచ్చి ఒత్తిడిపెట్టి భూములు కొనుగోలు చేయసాగారు. భూసేకరణ నోటిఫికేషన్ విడుదలయిన తరువాత భూములు కొనుగోలు చేయడంపైన నిషేధం లేదుగానీ అటువంటి కొనుగోళ్లను రిజిస్టర్ చేయరు. వాటిని రెవెన్యూ అధికారులు అసలే ప్రోత్సహించకూడదు. కొంతకాలానికి తేలిందేమిటంటే 2005లో కేంద్రప్రభుత్వ పెట్రోలియం మంత్రిత్వశాఖ, ఓ.ఎన్.జి.సి. కొత్త మేనేజ్‌మెంట్ ఆ సంస్థ వ్యవహారాలను సమీక్షించే క్రమంలో చమురు వెలికితీతకే ఓ.ఎన్.జి.సి. పరిమితం కావాలనీ రిఫైనరీల వంటివాటి జోలికి పోకూడదనీ నిర్ణయించారని. ఆ కారణంగా కాకినాడ సెజ్‌పైన ఓ.ఎన్.జి.సి.కి ఆసక్తిపోగా వారికోసం మొదలుపెట్టిన భూసేకరణను ఆపవలసిన ప్రభుత్వం కాకినాడ సెజ్‌ప్రైవేట్ లిమిటెడ్ వారికి ఆ భూమిని అప్పగించే ఆలోచన చేసింది. భూమికి ప్రజల జీవనాధారంగా ఏ విలువా లేదనీ, ఒక వ్యవసాయేతర ప్రయోజనం కోసం కాకపోతే మరొక దానికోసం దానిని బదలాయించవచ్చుననీ నమ్మే ఒక స్పష్టమైన వైఖరి ఇక్కడ కనిపిస్తుంది.

## మోసపూరిత భూసేకరణ వ్యూహం

ఒక ప్రయోగంగా, ఈ భూమిని కొంత డెవలపర్ కొనుక్కుంటే కొంత ప్రభుత్వం సేకరిస్తుందన్న వ్యూహాన్ని అనుసరించారు. ప్రైవేట్ కంపెనీలకు అవసరమైన భూమిని వారే కొనుక్కోవాలనీ, ఏమయినా తక్కువ పడితేనే ప్రభుత్వం భూసేకరణ చట్టం ద్వారా సేకరించాలనీ ఇప్పుడు చాలా మంది అంటున్నారు కాబట్టి వినడానికి అందంగా అనిపించే ఈ వ్యవస్థ ఆచరణలో ఏవిధంగా ఉంటుందో కాకినాడ సెజ్‌లో చూడవచ్చు. దీనిని బాధితుల మాటలలోనే చూస్తే బాగుంటుంది. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు కాకినాడ సెజ్‌వ్యతిరేక సమితి ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఇచ్చిన వివరణకు సమాధానంగా బాధితులు ఏమన్నారో చూడండి.

4850 ఎకరాల మేరకు రైతులు ఇప్పటికే ఎకరాకు మూడు లక్షల చొప్పున కెఎస్‌ఇజడ్ డెవలపర్‌కు అమ్మేసారని జిల్లా కలెక్టర్ అన్నారు. అయితే ఈ అమ్మకం ఏవిధంగా జరిగిందో తెలిస్తే అది ఎంతమాత్రం స్వచ్ఛందం కాదని తెలుస్తుంది. గ్రామ కార్యదర్శులు, ఎంఆర్‌వోలు, ఆర్‌డివోలు వచ్చి మూడు లక్షలకు అమ్మకపోతే ప్రభుత్వం వెలప్రకారం ఒక లక్ష లేక ఒక లక్షా యాభైవేలు మాత్రమే ఇస్తామనీ ఆపైన



కోర్టులో వ్యాజ్యం నడుపుకోవలసి వస్తుందనీ బెదిరించారు. మోసమూ చాలా జరిగింది. కొంతమందితో 'నీ ఇరుగు పొరుగు వారు తమ భూమిని అమ్మేసారు' అని అబద్ధాలు చెప్పి అమ్మించారు. ఒకరు తన భూమిని అమ్మితే దానిని కొలుచుకునే పేరిట పక్కవారి భూమిని కొంత కలిపేసుకోవడం చాలా సందర్భాలలో జరిగింది. పక్కవారు దాని గురించి అధికారులకు ఫిర్యాదు చేయగా, 'నీ భూమిని కూడా అమ్మేస్తే నీకు మొత్తం నష్టపరిహారం వచ్చేటట్టు చూస్తాం తప్ప నీ భూమిని కలిపేసుకోకుండ ఆపలేము' అన్నారు. ఎక్కువ మంది ఈ రకంగా అమ్మినవారే. రైతులమీద ఒత్తిడి పెట్టడంలో కెఎస్‌ఇజడ్ డెవలపర్ తరఫున వచ్చిన వ్యక్తి, గ్రామ కార్యదర్శులు, ఎంఆర్‌వోలు, ఆర్‌డివో కలిసి పనిచేసారు. ఈ సమాధానంతో 112 మంది ఇచ్చిన వాంగ్మూలాలు జతచేస్తున్నాము. వాటిని పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయి.

మూడు రకాల ఒత్తిళ్లు, మోసాలగురించి, అందులో ప్రభుత్వ సిబ్బంది పాత్ర గురించి ఈ వాక్యాలు తెలుపుతాయి. డెవలపర్ ఇచ్చే 3 లక్షలకు నీ భూమి అమ్మకపోతే ప్రభుత్వం అందులో సగం చెల్లించి భూసేకరణ చట్టం కింద నీ భూమిని తీసుకుంటుంది, ఆపైన నువ్వు కోర్టుల చుట్టూ ఒక దశాబ్ద కాలం తిరగాలి అని రెవెన్యూ సిబ్బందే బెదిరించడం. డెవలపర్ మనుషులు నీ పక్క కమతం యజమాని అమ్మేసాడు, అక్కడ సెజ్ వచ్చేస్తుంది, నువ్వింక వ్యవసాయం ఏం చేసుకుంటావని బెదిరించి కొనుక్కోవడం. చాలా సందర్భాలలో ఆ రైతు తరువాత వాకబు చేస్తే పక్కరైతు అమ్మనేలేదని తెలిసింది. మూడవది, ఒకరి భూమి రెండెకరాలు కొని దానికి గట్లు పెట్టుకునే క్రమంలో పక్క పొలాన్నీ కలిపేసుకోవడం. అధికారులకు ఫిర్యాదు చేస్తే వాళ్లు చేతులెత్తేసి నీ భూమి కూడ అమ్మేయరాదా, డబ్బులయినా వస్తాయి అనడం. బాధితులు జతచేసిన 112 వాంగ్మూలాలలో ఈ మూడు రకాల అనుభవాలూ నమోదయినాయి.

ఈ అమ్మకాలలో ఇంకొక విచిత్రమైన విషయం కూడ ఉంది. అన్ని క్రయపత్రాలలోనూ అమ్ముతున్న వ్యక్తి 'ఆ భూమి నుండి సరయిన ఆదాయం రావడం లేదు కాబట్టి' అమ్ముకొంటున్నానని రాసాడు. వందల క్రయపత్రాలలో అమ్మకానికి ఈ కారణమే చూపించారంటే ఇది కొనుగోలుదారు రాయించిన కారణమే తప్ప అమ్మకందారు స్వచ్ఛందంగా రాసింది కాదని స్పష్టం అవుతుంది. భూమి సరయిన ఫలం ఇవ్వడంలేదని రాయించడం వల్ల సెజ్ డెవలపర్‌కు వచ్చే ప్రయోజనం ఏమిటి? అది అతని ప్రయోజనార్థం కాదు, ప్రభుత్వం ప్రయోజనార్థం. అతను కొనుక్కోగా మిగిలిన భూమిని ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి సేకరించవలసి ఉంటుంది కదా. చుట్టుపక్కల భూములు సరయిన ఆదాయం ఇవ్వని కారణంగా రైతులు అమ్మేసుకున్నారన్న ఆధారం కల్పించినట్టయితే భూసేకరణ తక్కువ ధరకు చేయవచ్చు.

**భూమి సరయిన ఫలం ఇవ్వడంలేదని రాయించడం వల్ల సెజ్ డెవలపర్‌కు వచ్చే ప్రయోజనం ఏమిటి? అది అతని ప్రయోజనార్థం కాదు, ప్రభుత్వం ప్రయోజనార్థం. అతను కొనుక్కోగా మిగిలిన భూమిని ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి సేకరించవలసి ఉంటుంది కదా**

మొదట రైతులపైన ఒత్తిడి పెట్టి వారి భూములు డెవలపర్‌కు 'స్వచ్ఛందంగా' అమ్మించడానికి ప్రభుత్వ సిబ్బంది సహకరిస్తారు. తక్కిన భూమిని ప్రభుత్వం చవకగా సేకరించడానికి అవసరమైన ఆధారం క్రయపత్రాలలో డెవలపర్ రాసి పెడ్తాడు.

## వ్యవసాయానికి పనికిరాని భూములా?

చవకగా సేకరించడానికే కాదు, భూసేకరణను సమర్థించుకోవడానికి కూడ ఈ అబద్ధం అవసరం అయింది. సెజ్‌ల కోసం భూసేకరణ దేశంలో మొదలయినప్పటి నుండి సాగుభూములలో సెజ్‌లు నెలకొల్పడంవల్ల వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతింటున్నదన్న విమర్శ దేశంలో బయలుదేరింది. కాబట్టి సెజ్‌ల కోసం సారహీనమైన భూములు మాత్రమే తీసుకుంటున్నామన్న దబాయింపు ప్రభుత్వాలు మొదలుపెట్టాయి. అది నిజంకాని చోట ఈ దబాయింపే రైతులకు ఎక్కువ కోపం తెప్పించింది. కాకినాడ సెజ్ ప్రాంతమే కాదు, విశాఖపట్నం జిల్లాలోని రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలలో జరిపిన భూసేకరణలోనూ ఆ భూమి సారహీనమయినదని ప్రభుత్వ నివేదికలలో రాసారు. మాకు తిండిపెట్టే భూములు బలవంతంగా తీసేసుకోవడం కాక అది పనికిరాని భూమి అంటారా అని రైతులు చాలా ఆగ్రహం వ్యక్తం చేసారు.

అక్కడయినా, ఇక్కడయినా సేకరణ చేస్తున్న భూములు చాలా ఫలవంతమైనవి. వాటిలో అధిక భాగానికి సాగునీటి సదుపాయం లేనిమాట వాస్తవమే. ఆ కారణంగా వాటిని 'మెట్ట' భూములుగా వర్గీకరించి ఉండవచ్చును గానీ, అవి ఇచ్చే ఆదాయాన్నిబట్టి లెక్కిస్తే అవి మంచి భూములు. సరుగుడుతోట మూడేళ్ళలో ఎకరానికి రు. 1,50,000/- రూపాయల ఆదాయం ఇస్తుంది. సరుగుడునారు పోసి అమ్మినట్టయితే ఎకరానికి 3 లక్షలదాకా ఆదాయం లభిస్తుంది. పండ్లతోటలు సగటున సంవత్సరానికి 30 నుండి 40 వేల రూపాయల ఆదాయం ఇస్తాయి. కొబ్బరితోట సంవత్సరానికి 50 వేల రూపాయల ఆదాయం ఇస్తుంది. ఇసుక నేలలు అధికంగా ఉన్నా ఈ భూములలో సరుగుడు తోటలు, మామిడి తోటలు, కొబ్బరితోటలు విస్తారంగా వేసారు. జీడిమామిడితోటలూ ఉన్నాయి. సపోటాచెట్లు ఉసిరిచెట్లు కూడ ఉన్నాయి. నీటి వసతి ఉన్నచోట వరి పండిస్తున్నారు. నిజానికి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలలో సెజ్‌లు నెలకొల్పుతున్న ప్రాంతమంతా ఎటు చూసినా పచ్చదనంతో చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చదనంలో విశాఖపట్నం జిల్లా రాంబిల్లి మండలం కోనసీమ వంటిదని పేరు పొందింది. ఈ మండలంలో సెజ్‌కింద పోతున్న గ్రామాలలో అధికం కొబ్బరి తోటలపైనే ప్రధానంగా ఆధారపడినవి. అయినప్పటికీ అధికార రికార్డులలో ఇవి ఇసుకనేలలుగా, మెట్టభూములుగా నమోదయి ఉన్నాయి. సారవిహీనమైన, నిష్ఫలమైన భూములనే సేకరిస్తున్నామని ప్రభుత్వం దబాయిస్తున్నది.

తూర్పుగోదావరి జిల్లా సెజ్ ప్రాంతమయితే అధికంగా సాగునీటివసతి ఉన్న ప్రాంతం కూడ. ఆ సత్యాన్ని కూడ ప్రభుత్వం దాచిపెట్టింది. గోదావరి నుండి ధవళేశ్వరం ఎడమ కాలువ, ఏలేరు కాలవ ఈ ప్రాంతంలోని చెరువులను నింపుతాయి. తొండంగి మండలం భూములకు మల్లవరం గ్రామం దగ్గరున్న పెద్దచెరువు, ఎ.వి.నగరం దగ్గరున్న మూడు చెరువులు సాగునీరిస్తాయి. ఈ చెరువులకు గోదావరి, ఏలేరు నీళ్ళొస్తాయి. ఈ రకంగా సాగయ్యే భూములు 4500 ఎకరాలదాకా ఉన్నాయి.

ఇన్ని కారణాలుగా అసంతృప్తితో ఉన్న కాకినాడ సెజ్ బాధిత రైతులు ఇప్పటికి రెండేళ్లుగా సంఘటితంగా ఆందోళన చేస్తున్నారు. సెజ్‌కోసం మొత్తం దాదాపు 10 వేల ఎకరాలు కావలసి ఉండగా అందులో 4850 ఎకరాలను రకరకాల అక్రమ పద్ధతులలో డెవలపర్ కొనుక్కోవడం జరిగిందని



చెప్పాము. సెజ్‌ల నైజాన్ని గురించి అవగాహన ఏర్పడిన తరువాత రైతులు అమ్మడం మానేసారు. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తానిచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను అనుసరించి తక్కిన భూమిని సేకరించడం మొదలుపెట్టింది. రైతులు దాదాపు ఎవ్వరూ ఈ భూసేకరణ ప్రక్రియలో పాల్గొనలేదు. అయినప్పటికీ దానిని పూర్తిచేసి నష్టపరిహారం కోర్టులో డిపాజిట్‌చేసి, సేకరించిన భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వ సిబ్బంది బయలుదేరారు. రైతులు వారిని ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తూనే ఉన్నారు. దిమ్మలు పాతితే పీకేస్తున్నారు. సర్వేకోసం వస్తే వెనక్కి పంపించేస్తున్నారు. పోలీసులు రంగంలోకి దిగి సెజ్ వ్యతిరేక సమితి నాయకులపైన కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నా ఆందోళన కొనసాగిస్తున్నారు. డెవలపర్ రైతులనుండి కొనుక్కున్న భూములను స్వాధీనం చేసుకోవడానికి అతని మనుషులు వస్తేకూడ రైతులు అటకాయించి పంపించేస్తున్నారు. ఈ కొనుగోలు అక్రమమని రాష్ట్ర మానవహక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేసి ఉన్నాము కాబట్టి తేలేంతవరకు ఆ భూమిపైకి రావద్దని రైతులు అన్నారు. దీనిమీద కూడ కేసులు, అరెస్టులు జరిగాయి.

నిజానికి రాష్ట్ర మానవహక్కుల కమిషన్ 2007 డిసెంబర్ 24నాడు జారీచేసిన ఆదేశంలో బాధితుల ఫిర్యాదుపైన విచారణ పూర్తయ్యేంత వరకు 'జిల్లా కలెక్టర్‌గానీ పోలీసులుగానీ భూసేకరణ అధికారులుగానీ రైతులను తొలగించడానికి ఎటువంటి బలవంతపు చర్యలకు పాల్పడవద్దు' అని ఆదేశించింది. అటువంటప్పుడు రైతుల ఇష్టానికి వ్యతిరేకంగా సేకరించిన లేక కొనుగోలు చేసిన భూములలో దిమ్మలు పాతి స్వాధీనం చేసుకోవడం తప్పు. దానిని ప్రతిఘటించిన రైతులపైన కేసులు పెట్టడమూ తప్పే. ఈ విషయాన్ని కమిషన్ తన తదుపరి ఆదేశంలో స్పష్టం చేసింది. రైతుల అరెస్టులకు స్పందిస్తూ, కమిషన్ 2008 జనవరి 21నాడు జారీ చేసిన ఆర్డర్‌లో ఈవిధంగా అనింది.



బడాబాబుల భూమిదాహానికి కుదేలైన రైతు
బొమ్మ : ఫర్జానా కూపర్

తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు ఈ కమిషన్ 2007 డిసెంబర్ 24వ తేదీన జారీ చేసిన ఆదేశాన్ని అతిక్రమించి భూమిని స్వాధీనం చేసుకోవడానికి బలవంతపు చర్యలు తీసుకుంటున్నాడనీ, ప్రతిఘటించిన రైతులను అరెస్టు చేసి జైలుకు పంపించాడనీ ఫిర్యాది అంటున్నారు. సెక్షన్ 144ను ప్రయోగించడం జరిగిందని కూడ ఫిర్యాదు. భూసేకరణ చేయని భూముల మీదికి కూడ సిబ్బంది వస్తున్నారని అభియోగం.

సెక్షన్ 144 ఎందుకు ప్రయోగించవలసి వచ్చిందో, రైతులను ఎందుకు అరెస్టు చేయవలసివచ్చిందో తూర్పుగోదావరి జిల్లాకలెక్టరు మాకు తెలపాలి. తమ భూములు స్వాధీనం చేసుకుంటున్న అధికారులను ప్రతిఘటించిన రైతులను సాధారణ నేరగాళ్లలాగ చూడడం, హుటాహుటిన అరెస్టు చేయడం తగదు. ఇటువంటి విషయాలలో నచ్చచెప్పే వైఖరి చాలా అవసరం. జిల్లా కలెక్టర్ తన తొందరపాటు వైఖరివల్ల

సమస్యను మరింత జటిలం చేయదనీ సానుభూతిగా అర్థంచేసుకుంటాడనీ కమిషన్ ఆశిస్తుంది, విశ్వసిస్తుంది. రైతులందరినీ బేషరతుగా విడిచిపెట్టడం సబబని కమిషన్ భావిస్తుంది.

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన ఈ ఆర్డర్‌ను సైతం తూర్పుగోదావరి జిల్లా అధికారులు గౌరవించలేదు. వాళ్లు భూములు స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు, రైతులు ప్రతిఘటిస్తూనే ఉన్నారు, పోలీసులు కేసులు పెడుతూనే ఉన్నారు. జనం ఆందోళన చేస్తున్నచోట రాజకీయనాయకుల రాకపోకలకు కొదవ ఉండదు. నిజాయితీగా వచ్చి సంఘీభావం తెలియజేసినా, ఆందోళనలో పాల్గొన్నా అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదు. కేవలం పాపులారిటీ కోసం తమకే విశ్వాసంలేని మాటలు మాట్లాడేవారిని మాత్రం విమర్శించవలసి ఉంది. గుజరాత్‌లో అత్యంత విధ్వంసకమైన 'అభివృద్ధి' అమలు చేస్తున్న భారతీయ జనతాపార్టీకి చెందిన మన రాష్ట్ర నాయకులు కాకినాడ సెజ్ ప్రాంతం పర్యటించి సెజ్‌ను రద్దు చేయాలంటూ భీకరంగా ఉపన్యాసాలిచ్చారు. కేంద్రం ఒక సెజ్ చట్టాన్ని జారీ చేయక ముందే 2002 సంవత్సరంలో కాకినాడ సెజ్ డెవలపర్‌కు ప్రత్యేక ఆర్థికమండలి ఏర్పాటు చేయడానికి అనుమతిచ్చిన తెలుగుదేశం ప్రభుత్వ వారసులు సహితం 2008లో ఈ గ్రామాలలో పర్యటించి చివరి దాకా పోరాటంలో ఉంటామని హామీ ఇచ్చిపోయారు.

మత్స్యకారుల విషయం చెప్పి ఈ నివేదిక ముగిద్దాం. కాకినాడ సెజ్ భూభాగం సముద్రతీరానికి సమాంతరంగా సాగుతుందిగానీ తీరాన్ని తాకదు. సెజ్ భూభాగానికీ, సముద్ర తీరానికీ మధ్య ఒక విశాలమైన కారిడార్‌లాంటిది ఉంది. అక్కడ అనేక మత్స్యకారుల గ్రామాలున్నాయి. యు.కొత్తపల్లి మండలంలో 8 గ్రామాలు, తొండంగి మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. వీటిలో కొన్ని పూర్తిగా మత్స్యకారుల గ్రామాలు కాగా కొన్నిటిలో ఇతర ప్రజలూ ఉన్నారు. దాదాపు 50 వేల మత్స్యకారుల జనాభా ఉందని అంచనా. వీరంతా సెజ్‌కూ సముద్రానికీ మధ్య చిక్కుకొని బతుకుతారు. ఏలేరు నది గొల్లప్రోలు దగ్గర పాయలుగా చీలి సెజ్ భూభాగంగుండా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. ఈ పాయలు ప్రస్తుతం ఎగువ గ్రామాల వ్యవసాయ భూములకు డ్రైన్‌గా కూడ పని చేస్తున్నాయి. మత్స్యకారులు వాటిలో పీతలు, రొయ్యలు, చేపలు పట్టుకుంటున్నారు. ఈ వేట మొత్తం రేపు పోతుంది. అంతేకాక ఇవ్వాళ్టిదాకా పంటపొలాల డ్రైన్‌గా పనిచేసిన ఈ పాయలు రేపు సెజ్ కాలుష్యానికి డ్రైన్‌గా పనిచేస్తాయి. రిఫైనరీలు గానీ పెట్రోకెమికల్ ఉత్పత్తులుగానీ సెజ్‌లో నెలకొనేటట్టయితే చాలా కాలుష్యం బయటికొస్తుంది. దానిని శుద్ధిచేయకుండ నీటివనరులలోకి విడుదల చేయకూడదని కాలుష్య నియంత్రణ బోర్డు ఆంక్షలు పెడుతుంది, అందులో సందేహం లేదు కానీ అటువంటి ఆంక్షలు ఎంత మేరకు అమలవుతాయనేది హైదరాబాద్ పరిసరాలలోని పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం తెలుపుతుంది. ఈ కాలుష్యమంతా సముద్రంలోకి చేరుతుంది. దానివల్ల మత్స్యకారులు తమ జీవనాన్ని భారీగా కోల్పోతారు.

## పోలేపల్లి సెజ్ వ్యతిరేకపోరాటం

కాకినాడ సెజ్ తెలుగుదేశం హయాంలో ప్రారంభమయి కాంగ్రెస్ హయాంలో కొనసాగిందని చూసాము. పోలేపల్లి సెజ్‌కూడ అంతే. ఎటొచ్చీ 2001లో ఇది మొదలయినప్పుడు ఇక్కడ సెజ్ నెలకొల్పుతామని ప్రభుత్వం అనలేదు. పారిశ్రామీకరణకోసం 1000 ఎకరాలు సేకరించి ఆం.ప్ర. పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏ.పి.ఐ.ఐ.సి) చేతిలో పెడతామని మాత్రమే అన్నారు. దానికి 'గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్' అని పేరు పెట్టారు. గ్రీన్ అనీ, పార్కుఅనీ ఉండేసరికి కళ్లకు పచ్చదనం



కనిపిస్తుంది. అదే వారికి కావలసింది. పరిశ్రమలు నెలకొల్పుతామనగానే కాలుష్యాన్ని గురించి, దాని నుండి వచ్చే వివిధ రకాల అసౌకర్యాన్ని గురించి స్థానిక ప్రజలు ఆందోళన చేస్తారు. 'పచ్చటి' పారిశ్రామీకరణ చేస్తామన్న హామీ ఈ ఆందోళనను చల్లార్చడానికి ఉద్దేశించింది. దానిని నిజాయితీగా ఆచరించినట్టయితే కాలుష్య నియంత్రణ వీలయినంత సమర్థంగా అమలు చేసే సంస్థలను అక్కడ స్థాపించవచ్చు. అయినప్పటికీ గాలిలోకి చేరక తప్పని అపాయకరమైన వాయువులను బ్యాలన్స్ చేయడానికి ప్రాణవాయువును గాలిలోకి వదిలే చెట్లను ఆ సంస్థకోసం కేటాయించిన భూమిలో కొంత భాగంలోనైనా పెంచవచ్చు. అయితే ఆ సంస్థకోసం తీసుకున్నది వ్యవసాయ భూమి లేక తోపులు, అడవులు అయినట్టయితే వారికోసం ఆ భూమి స్వాధీనం చేసుకోకపోతే అక్కడ మొక్కలు చెట్లు పెరిగేవే కాబట్టి ఈ గ్రీనరీవల్ల కొత్తగా వచ్చేదేంలేదు. ఎటొచ్చీ పచ్చటి గడ్డి సహితం కనిపించని పారిశ్రామిక ప్రాంతాలను చూసి అలవాటయిన వారికి ఒక కేశోరాం సిమెంట్స్‌వారు, ఉయ్యూరు షుగర్స్‌వారో 'వారి' భూములలో చెట్లు, మొక్కలు పెంచడం ముచ్చటగా తోచవచ్చు.

పోలేపల్లి సెజ్ విషయానికొస్తే 'గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్'గా మొదలయినది సెజ్‌గా మారి మందుల కంపెనీలకు కేంద్రం కానుంది. రెండు సంస్థలు ఇప్పటికే నెలకొన్నాయి. ఇంకొక 10 నుండి 25 దాకా రానున్నాయి. మందుల పరిశ్రమ తెచ్చే కాలుష్యం అతి భయంకరమైనది. అయినప్పటికీ ఈ సెజ్ వాకిట గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అన్న పచ్చటి రంగు బోర్డు అట్లాగే ఉంది.

**పోలేపల్లి సెజ్ విషయానికొస్తే 'గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్'గా మొదలయినది సెజ్‌గా మారి మందుల కంపెనీలకు కేంద్రం కానుంది. రెండు సంస్థలు ఇప్పటికే నెలకొన్నాయి. ఇంకొక 10 నుండి 25 దాకా రానున్నాయి. సెజ్‌ల ఏర్పాటులో చెప్పేదొకటి, చేసేదొకటి అనే నైజానికి కూడ పోలేపల్లి సెజ్ ఒక ఉదాహరణ.**

సెజ్‌ల ఏర్పాటులో చెప్పేదొకటి, చేసేదొకటి అనే నైజానికి కూడ పోలేపల్లి సెజ్ ఒక ఉదాహరణ. దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే ఎగుమతులపైన ప్రధానంగా ఆధారపడాలనీ, దానికోసం ఎక్కువ పెట్టుబడులు అవసరమయ్యే నాణ్యమైన సాంకేతిక ప్రక్రియలను నెలకొల్పాలనీ, అందుకోసం ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలుగల పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు చేయాలనీ, పూర్తిస్థాయిలో పన్ను రాయితీలు ఇవ్వాలనీ, ఇబ్బందికరమయిన ఆంక్షలను సడలించాలనీ, పారిశ్రామిక సంస్థలకు సామాజిక బాధ్యతలు కట్టబెట్టే సంక్షేమ చట్టాలనుండి మినహాయింపు ఇవ్వాలనీ సెజ్‌లను సమర్థించుకోవడం కోసం వాదిస్తూ వచ్చారు. ఈ వాదనలోని అనేక లోపాలను అటుంచి, అసలు జరిగేది అది కూడ కాదని పోలేపల్లి సెజ్‌లాంటివి తెలుపుతాయి.

చాలాకాలంగా ఫార్మాసూటికల్ (మందుల) పరిశ్రమకు కేంద్రంగా పేరుగాంచి ఉన్న హైదరాబాద్ నుండి ఒకటొకటిగా మందుల పరిశ్రమలు ఉత్తరాదికి వెళ్ళిపోతున్నాయంట. ఎందుకోసమంటే హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల ప్రభుత్వాలు వారికి అనేక రాయితీలిచ్చి అక్కడికి తీసుకుపోతున్నాయంట. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఆ ప్రభుత్వాలను అదుపు చేసి మందుల పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్ స్టేటస్‌ను కాపాడమని

కోరిందంట. అయినా కేంద్ర ప్రభుత్వం తనకా అధికారం లేక కొంత, వినియోగించడానికి ఇష్టంలేక కొంత, ఏం చేయలేదంట. ఈ లోపల 40 కంపెనీలు హైదరాబాద్ నుండి వెళ్ళిపోయాయి. ఇంకొక 50 వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ వలసకు విరుగుడుగా మనవాళ్ళు కూడా అవే రాయితీలు ఇచ్చి కంపెనీలను వెళ్లిపోకుండ ఆపవచ్చును కదా? కానీ హిమాచల్‌ప్రదేశ్‌లాగ, ఉత్తరాఖండ్‌లాగ ఆలోచిస్తే మన గొప్పదనం ఏముంది? విడివిడిగా ఒకటీ రెండు రాయితీలివ్వడం కాదు. ఊహకందే అన్ని రాయితీలూ ఇచ్చే మందుల కంపెనీల సెజ్‌లు (ఫార్మాసెజ్) ఏర్పాటు చేయాలన్నది మనవాళ్లకొచ్చిన ఆలోచన. దాని ఫలితమే విశాఖపట్నం జిల్లాలో రెండు ఫార్మాసెజ్‌లు, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి దగ్గర గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం తీసుకున్న 1000 ఎకరాల భూమిలో ఒక ఫార్మాసెజ్ నెలకొల్పాలన్న నిర్ణయం.

ఈ ఆలోచనలు, ఏర్పాట్లు ఒకపక్క జరుగుతుండగా భూసేకరణ మరొకపక్క జరిగిపోతూ ఉంది. జడ్చర్ల మండలం పోలేపల్లిలో 439 ఎకరాల పట్టా భూమి, 350 ఎకరాల లావొణిపట్టా (డి-ఫారం లేక అసైన్‌మెంట్ పట్టా) భూమి, పక్కనే ఉన్న బాలానగర్ మండలం రాజాపూర్ శివారు గ్రామమైన ముదిరెడ్డిపల్లిలో 239 ఎకరాల పట్టా భూమి స్వాధీనం చేసుకొని ఎ.పి.ఐ.ఐ.సికి అప్పగించారు. 2001లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ నెలకొల్పాలనుకున్నప్పుడు ఎ.పి.ఐ.ఐ.సి అక్కడ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు కల్పించి కంపెనీలకు భూమి లీజుకిచ్చే మధ్యవర్తి. పాత్రలు మారకుండ నాటకాన్ని మార్చి ఇండస్ట్రియల్ పార్క్‌ను ఫార్మాసెజ్‌గా రూపాంతరం చేసిన క్రమంలో ఎ.పి.ఐ.ఐ.సి. ఆ సెజ్‌కు డెవలపర్ అయింది. 2005 ఫిబ్రవరి నెలలోనే జిల్లా కలెక్టరు పట్టా భూములకు సంబంధించిన అవార్డు ప్రకటించారు. రైతులందరికీ నష్టపరిహారం ఇచ్చారు. లావొణి పట్టా భూముల వారికీ నష్టపరిహారం ఇచ్చేసారు. దానితో ఆ భూమంతా ప్రభుత్వపరం అయింది. 2005 సంవత్సరం జూన్ నెలలో పార్లమెంట్ సెజ్ చట్టాన్ని జారీ చేసింది. అది 2006 ఫిబ్రవరి 10 నుండి అమలులోకి వచ్చింది. ఆ చట్టాన్ని అనుసరించి పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఫార్మాసెజ్‌గా ప్రకటించడం, ఎపిఐఐసిని దానికి డెవలపర్‌గా నియమించడం జరిగింది. ఎ.పి.ఐ.ఐ.సి మొదటగా అరబిందో ఫార్మా, హెటరో డ్రగ్స్ అనే రెండు మందుల కంపెనీలను ఆహ్వానించి వారిరువురికి కలిపి 240 ఎకరాల భూమిని ఎకరా 7 లక్షల రూపాయలకు అమ్మింది.

ఈ వార్త విని పోలేపల్లి భగ్గుమనింది. అప్పటినుండి ఇవ్వాళ్టి దాకా భూములు కోల్పోయిన పోలేపల్లి రైతుల ఆందోళన ఏదో ఒకరూపంలో కొనసాగుతూనే ఉంది. వారికంత కోపం రావడానికి కారణం ఏమిటంటే వారెవ్వరికీ ఆ భూమికి 7 లక్షలలో 7వ వంతుకూడ నష్టపరిహారం దక్కలేదు. తమదగ్గర కారుచవకగా భూములు తీసుకొని మందుల కంపెనీలకు ఎకరా 7 లక్షలకు అమ్ముకున్న ప్రభుత్వం దళారీ బుద్ధి వారి కడుపులు రగిల్చింది.

ఈ సెజ్ ప్రాంతం హైదరాబాద్ నుండి బెంగుళూరు వెళ్లే జాతీయ రహదారి నెం. 7కు కుడిపక్క (పడమటి దిక్కున), జడ్చర్లకు దగ్గరగా ఉంది. నష్టపరిహారం లెక్కించడంకోసం ప్రభుత్వం ఈ భూమిని నాలుగు రకాలుగా విభజించింది. అవి హైవేకి దగ్గరగా ఉన్న ఆరుతడి పంటల భూములు, హైవేకి



దగ్గరగా ఉన్న మెట్టభూములు, హైవేకి దూరంగా ఉన్న ఆరుతడి పంటల భూములు, హైవేకి దూరంగా ఉన్న మెట్ట భూములు. వీటి మార్కెట్ ధర... వరుస క్రమంలో ముదిరెడ్డిపల్లిలో 1 లక్ష, 81 వేలు, 95 వేలు, 76 వేల రూపాయలు. పోలేపల్లిలో 40 వేలు, 30 వేలు, 34 వేలు, 24 వేల రూపాయలు. ఇది 'బేసిక్' మార్కెట్ ధర. అంటే ఆ ప్రాంతంలో గడచిన మూడు సంవత్సరాలలో జరిగిన భూముల అమ్మకాల సగటు రిజిస్ట్రేషన్ ధర. ఈ రెండు గ్రామాలు వేరువేరు మండలాల్లో ఉన్నప్పటికీ పక్కపక్కనే ఉన్నాయి. వాటి బేసిక్ మార్కెట్ ధరలో ఇంత తేడా ఉందంటే నమ్మడం కష్టం. పైగా జడ్చర్ల దగ్గర జాతీయ రహదారి పక్కన బోరుబావులు పెట్టుకొని ఆరుతడి పంటలు పండించే భూమి వెల 2005లో ఎకరానికి 40 వేలేనంటే నమ్మడం మరీ కష్టం.

ఈ 40 వేలకు, బలవంతపు సేకరణకు గాను పరిహారం (సోలేషియం) 30 శాతం చేర్చి, ఆపైన నోటిఫికేషన్ విడుదలయిన నాటినుండి అవార్డు ఇచ్చేనాటిదాకా 12 శాతం వడ్డీ (దీనిని అదనపు మార్కెట్ విలువ అంటారు) కలిపి ప్రభుత్వమిచ్చే నష్టపరిహారంగా లెక్కించారు. అది 65 వేల దాకా ఉంటుంది. ఇదే ఇచ్చివుంటే రైతులు కోర్టుకుపోయి పైన చెప్పిన విషయాలనూ ఇతర ఆధారాలనూ ప్రాతిపదిక చేసుకొని ఎక్కువ నష్టపరిహారం తెచ్చుకొని ఉందురు. కానీ మన రాష్ట్రంలో ప్రభుత్వాలు ఈ మధ్యకాలంలో 'ఒప్పుకోలు అవార్డులు' లేక 'సమ్మతి అవార్డుల'వైపు మొగ్గు చూపుతున్నాయి. అంటే భూసేకరణ చట్టం ప్రకారం ఇచ్చే నష్ట పరిహారానికి, రైతుకూ, ప్రభుత్వానికీ ఆమోదనీయమైనంత చేర్చి ఇంక కోర్టుకు పోనని రైతుచేత రాయించుకొని ఆ మొత్తం ఇవ్వడం. ఇది మధ్యదళారులు, వకీళ్ల దోపిడీని (రెండూ కలిపి రైతుకొచ్చే నష్టపరిహారంలో 50 శాతం దాకా ఉండగలదు) అరికట్టడానికి పనికొస్తుంది కాబట్టి ఇది మంచి ఆలోచనేగానీ దీనిని ప్రభుత్వం వేరే ఉద్దేశ్యంతో అమలు చేస్తున్నది. సక్రమంగా చేసినట్టయితే (1992లో జారీ చేసిన నియమాల ప్రకారం) రైతులతో సంప్రదింపులు జరపడానికి ఒక జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ, ఒక రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ నెలకొల్పాలి. జిల్లాస్థాయి కమిటీలో జిల్లా కలెక్టరు, ఒక సీనియర్ సివిల్‌జడ్జి, ఒక రిటైర్డు జిల్లా జడ్జి ఉండాలి. వీరు 'ఒప్పుకోలు అవార్డు' పొందే ఆసక్తి చూపిన రైతులందరితోనూ చర్చించాలి. వారు చూపించిన ఆధారాలన్నీ పరిశీలించాలి. ఈ క్రమంలో స్వచ్ఛందమైన ఒప్పుకోలు జరగాలి. రైతులు కాంక్షిస్తున్నది ఒక మోతాదు దాటిపోతే, సంప్రదింపులు రాష్ట్రస్థాయి కమిటీ చేపట్టాలి.

పోలేపల్లిలో జరిగింది అదికాదు. ఏ సంప్రదింపుల కమిటీ ఏర్పడలేదు. ఆర్‌డివో కొందరు 'పెద్దమనుషులను' (అంటే పాలక పార్టీకి చెందినవారిని బ్రాకెట్లో రాసుకోండి) పిలిపించుకొని, ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇవ్వవలసిన నష్టపరిహారానికి 50 శాతం అదనంగా చేర్చి దీనికి ఒప్పుకొమ్మని నచ్చజెప్పారు. అంటే పోలేపల్లి గ్రామంలో అత్యధిక నష్టపరిహారం (65 వేలు, మళ్లీ అందులో సగం, ఎకరానికి 1 లక్ష రూపాయలకంటే కొంచెం తక్కువే. వాళ్లు ఒప్పుకున్న తరువాత తక్కిన రైతులపైన ఒత్తిడి పెట్టారు. ఒప్పుకుంటే దీనికి ఒప్పుకో- లేకపోతే ప్రభుత్వమిచ్చే నష్టపరిహారం తీసుకొని ఒక దశాబ్ద కాలం కోర్టుల చుట్టూ తిరుగు అని బెదిరించారు. 'దాదాపు రైతులందరూ ఒప్పుకున్నారు' అని కలెక్టర్ తన అవార్డులో సగర్వంగా రాసుకున్నాడు.

రోడ్డు పక్కనున్న ఆరుతడి పంట భూములకు ఇచ్చిన నష్టపరిహారం ఇది. ఆ భూమిని ఒక సంవత్సరం తిరిగే లోపల ఎ.పి.ఐ.ఐ.సి. ఎకరా 7 లక్షలకు అమ్ముకుందని తెలిస్తే వారికి కోపం రాదామరి!

ఇది భూమిపైన స్వంత హక్కు ఉన్న రైతుల సంగతి. వీరుకాక 350 ఎకరాలలో లావొణి పట్టా ఉన్న రైతులున్నారని చెప్పాము. వీరికి ఎకరాకు 18 వేలు మాత్రమే ఇచ్చారు. ఈ లెక్క ఏవిధంగా చేసారు? 23 డిసెంబర్ 1993న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.వొ.నెం. 1307 (రెవెన్యూ) ప్రకారం డి-ఫారం లేక లావొణి పట్టా ఉన్నవారికి ప్రభుత్వం నిర్ణయించిన బేసిక్ మార్కెట్ ధర, దానిపైన బలవంతపు సేకరణకుగాను పరిహారంగా (సొలేషియం) 30 శాతం ఇవ్వాలి. ఆపైన మాత్రం వారికి కోర్టుకు పోయి నష్టపరిహారం పెంపుదల కోరే హక్కు ఉండదు. అయితే జివొ 1307 లోని ఈ షరతును మన రాష్ట్ర హైకోర్టు 2004లో 'భూసేకరణ అధికారి, చేవెళ్ల వర్సస్ మేకల పాండు' అనే కేసులో కొట్టేసి, డి-ఫారం పట్టా ఉన్న రైతులను పూర్తి హక్కుదారుడయిన రైతుతో సమానంగా చూసి సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసిన కారణంగా మన రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదు కాని కనీసం జివొ 1307నయినా అమలు చేయాలి కదా? పోలేపల్లి భూముల అతి తక్కువ బేసిక్ మార్కెట్ ధర (హైవేకి దూరాన ఉన్న మెట్ట భూముల ధర) ఎకరానికి 24 వేలని పైన చూసాం. దానికి 30 శాతం సోలేషియం కలిపితే 32 వేలవుతుంది. మరి 18 వేలే ఎట్లా ఇచ్చారు? రెండు సంవత్సరాలకు పైగా పోలేపల్లి ఉద్యమం ఈ ప్రశ్న అడుగుతూనే ఉన్నా దీనికి జవాబు లేదు. కానీ ఈ భూమిని కూడ ఫార్మాసూటికల్ కంపెనీలకు ఎకరానికి 7 లక్షలు తీసుకొని అమ్మారు!

నిర్వాసితులయిన వారి పునరావాసం విషయంలోనూ ప్రభుత్వం ఇదేరకంగా వ్యవహరించింది. నిర్వాసితులు తాము మోసపోయామని ఆందోళనకు దిగడంతో వాళ్లచేత ఎట్లాగయినా పునరావాస పథకాన్ని స్వీకరింపజేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. అప్పుడు ఆందోళనను విరమించినట్టవుతుందని వారి భావన. అయితే రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం (జి.వొ.నెం. 68) ప్రకారం పునరావాసాన్ని ఏకపక్షంగా నిర్ణయించడానికి వీలు లేదు. సంబంధిత అధికారి నిర్వాసితులను సంప్రదించి నిర్ణయించాలి. పోలేపల్లిలో ఆ ప్రయత్నం సఫలం కాదన్న భయంతో కాబోలు అధికారులే పునరావాస కాలనీ స్థలాన్ని నిర్ణయించి బాధితుల చేత దానిని ఆమోదింపజేయాలని నానా ప్రయత్నాలు చేసారు. వాళ్ళ అనుమతి లేకుండా వారి పేర్లమీద బ్యాంక్ ఖాతాలు తెరిచి పునరావాస స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికని చెప్పి 70 వేల రూపాయలు ఆ ఖాతాలలో జమ చేసారు. పునరావాస పథకాన్ని ఆమోదిస్తే నష్టపరిహారం కొంచెం ఎక్కువిస్తామని ఆశచూపారు. 2008 మే నెలలో జరిగిన ఉప ఎన్నికలలో జడ్చర్ల ఎంఎల్ఏగా గెలిచిన కాంగ్రెస్‌నాయకుడు మల్లురవి గారు అన్ని రకాలుగా వారిపైన ఒత్తిడిపెట్టే ప్రయత్నం చేసారు. అయినప్పటికీ పోలేపల్లి సెజ్ వ్యతిరేక ఐక్యసం ఘటన ఆధ్వర్యంలో ప్రతిఘటన సాగుతూనే ఉంది. అత్యధికంగా దళితులయిన లావొణి పట్టాదారులు ఈ ప్రతిఘటనలో అగ్రభాగాన ఉన్నారు.

తమ భూమి తమకు వెనక్కి ఇచ్చేయమనీ కావాలంటే తీసుకున్న నష్టపరిహారం వెనక్కి ఇచ్చేస్తామనీ వారి డిమాండ్. 1000 ఎకరాలకుగాను 240 ఎకరాలలో ఇప్పటికే అరబిందో ఫార్మా, హెటెరో డ్రగ్స్ వారి ఫ్యాక్టరీల నిర్మాణం దాదాపు జరిగిపోయింది. కానీ తక్కిన భూమి ఇప్పటికీ ఖాళీగానే ఉంది కాబట్టి దానిని వెనక్కి ఇచ్చేయమన్న డిమాండ్ నిరర్థకం కాదు. భూసేకరణ విషయంలో అన్యాయం సంగతి అటుంచి మిగిలిన 760 ఎకరాలలోనూ మందుల కంపెనీలు వచ్చేస్తే ఆ పరిసరాలలోని నీటివనరులపైన, భూగర్భ జలాలపైన కాలుష్య దుష్ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

పోలేపల్లి బాధితులు వినూత్నమైన ఎన్నికల పోరాట రూపాన్ని ఎంచుకున్నారు. తమ ఆందోళనకు ఏ ఒక్క రాజకీయ పార్టీ, ఏ ఒక్క అభ్యర్థి మద్దతు తెలపడం లేదన్న కోపంతో తామే బహుళ సంఖ్యలో నామినేషన్లు వేసి పోటీ చేస్తున్నారు. 2008 మే నెలలో జరిగిన జడ్చర్ల అసెంబ్లీ ఉప ఎన్నికలలో 13 మంది (అందరూ లావొణి పట్టా భూములు కోల్పోయిన వారే) పోటీ చేసారు. 13 మందికీ కలిపి 8600 ఓట్లు వచ్చాయి. మళ్లీ 2009 ఏప్రిల్ నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానానికి పోలేపల్లి బాధితులు 16 మంది నామినేషన్ వేసారు. ఊరూరూ ఇల్లిల్లూ తిరిగి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి చెపుతూ ప్రచారం చేసారు. అందరికీ కలిపి 7,51,786 వోట్లు వచ్చాయి.

పోలేపల్లి సెజ్ వ్యతిరేక ఐక్యసంఘటన ఈ ఉద్యమాన్ని బాధిత రైతులకే పరిమితం చేయకుండ, చుట్టుపక్కల గ్రామాలవారికి ఉండగల కాలుష్యం ప్రమాదాన్ని కూడ తెలియజెప్పి వారిని కూడ ఇందులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నది. మందుల కంపెనీల కాలుష్యం తీవ్రతకు హైదరాబాద్ సజీవ సాక్షి అని ఇదివరకే చెప్పాము. ఇప్పటికే పోలేపల్లి దగ్గర రెండు ఫార్మా కంపెనీలు వచ్చి ఉన్నాయి. అదే పరిమాణం గలవయితే ఇంకొక 6 నుండి 8 దాకా రాగలవు. అయితే ఇంక రాబోయేవి చిన్నవనీ మొత్తం 20 పైనే మందుల కంపెనీలు పోలేపల్లి సెజ్‌లో స్థాపించబోతారనీ వింటున్నాం. అన్ని ఫార్మా కంపెనీలు 1000 ఎకరాల స్థలంలో నెలకొనడం పర్యావరణానికి చాలా ప్రమాదకరం. ఈ సెజ్‌కు దాపునే బాలానగర్ మండలంలో దుందుభి వాగు ప్రవహిస్తుంది. అది డిండి నదిలోనూ తద్వారా కృష్ణా నదిలోనూ కలుస్తుంది. ఫార్మాకంపెనీల కాలుష్యం విషపూరితమైన వ్యర్థపదార్థాల రూపంలో చుట్టుపక్కల ఉన్న నీటి వనరులలో కలుస్తుంది కాబట్టి దుందుభి వాగు, తద్వారా పరిసరాల భూగర్భజలాలు, డిండి ప్రాజెక్టు రిజర్వాయరు క్రమంగా కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ విషయాలు సంబంధిత గ్రామాల ప్రజలకు తెలియజెప్పి వారిని కూడ పోరాటంలో భాగం చేయాలన్న పోలేపల్లి బాధితుల ప్రయత్నం సఫలం అవుతుందని ఆశిద్దాం.

◆◆◆

## సత్యవేడు - వరదయ్య పాలెం మండలాలలో

# ఎస్.ఇ.జడ్. కోసం భూసేకరణ ఆపాలి

రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా వరదయ్యపాలెం, సత్యవేడు మండలాలలో 'స్పెషల్ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేయడం కోసం దాదాపు 12 వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని తాపత్రయపడుతున్న సంగతి తెలిసిందే. అందులో మూడింట రెండు వంతులు రైతుల పట్టా భూమికాగా, మిగిలిన ఒక వంతు బంజరు భూమి. అయితే ఆ బంజరు భూమిలో కూడ చాలావరకు భూమిలేని పేదలకు డి-ఫారం (స్థానిక పరిభాషలో డికెటి) పట్టాలు ఇచ్చి ఉన్నారు కాబట్టి దాదాపు మొత్తం 12 వేల ఎకరాలు వ్యవసాయ భూములే. అక్కడ చాలా చెరువులు, వందల సంఖ్యలో బావులు, బోర్లు ఉన్నాయి. వరిమళ్లు, మామిడి తోటలు, మల్లె, రోజా మొదలైన పూతోటలు, శెనక్కాయలు, సజ్జలు పండే మెట్ట భూములు ఉన్నాయి. ఈ నీటి వనరులన్నిటినీ పూడ్చి, తోటలన్నిటినీ నరికి, వరిమళ్ళు సాపుచేసి ఏవో పరిశ్రమలు నెలకొల్పడం కోసం ఒక ప్రత్యేక ఆర్థిక క్షేత్రాన్ని తయారు చేయాలన్న ఆలోచన ఎంతవరకు ఉచితమైనది?

ఈ భూములు 16 గ్రామాలలో పరచుకొని ఉన్నాయి. జనాభా 25 వేల దాకా ఉంటుంది. పశువులయితే ఒక్కొక్క ఊరిలో 4 వేల సంఖ్యలో ఉన్నాయి. వ్యవసాయ భూములే తప్ప ప్రజల ఆవాసాలు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రభుత్వం అంటున్నప్పటికీ ఇక్కడ ఉంటూ ఎక్కడో పనిచేసుకొని బతకడం అయ్యేపని కాదు కాబట్టి ఈ ప్రజలంతా ఏదో ఒకరోజు 'స్వచ్ఛందంగా' ఇళ్ళు ఖాళీచేసి పశువులను మాంసం పరిశ్రమకు అమ్మి వెళ్ళిపోవలసి ఉంటుంది.

## ఇదంతా దేనికోసం?

స్పెషల్ ఎకనమిక్ జోన్ అంటే ప్రత్యేక ఆర్థిక క్షేత్రం అని అర్థం. మామూలుగా ఒకరు ఒక ఫ్యాక్టరీ నెలకొల్పాలంటే భూమి కొనుక్కొని, కరెంటు కనెక్షన్ కోసం, నీటి సరఫరా కోసం, రోడ్ల కోసం వివిధ ప్రభుత్వ శాఖలకు అర్జీలు పెట్టుకొని, సాధించుకోవాలి. వారికి ఆ బెడద లేకుండా ప్రభుత్వమే ఒక విశాల భూభాగం నుండి ప్రజలను తరిమేసి, రోడ్లు వేసి, కరెంటు వ్యవస్థ, నీటి వ్యవస్థ ఏర్పాటు చేసి, అక్కడ సంస్థలు ఏర్పాటు చేసే వారికి రకరకాల పన్ను రాయితీలు, కార్మిక చట్టాలనుండి మినహాయింపు ఇచ్చే ఏర్పాటును స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఎస్.ఇ.జడ్) అంటారు. మామూలుగా దానిని ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వం తన చేతిలోనే ఉంచుకొని అక్కడ సంస్థలు ఏర్పాటు చేయడానికి రమ్మని ప్రైవేటు



కంపెనీలకు ఆహ్వానం పలుకుతుంది. ఇక్కడ ఆ బరువు కూడా ప్రభుత్వం దించేసుకుంది. శ్రీసిటీ (ప్రై) లిమిటెడ్ అనే సంస్థకు ఈ ఎస్.ఇ.జడ్. క్షేత్రాన్ని అప్పగించి దానిని కంపెనీలతో నింపే బాధ్యతను వారిపైన పెట్టింది. మరి అక్కడ ఏ రకమైన పరిశ్రమలు రాబోతాయి? శ్రీసిటీ వారికయినా తెలుసునో తెలియదోగానీ ప్రభుత్వానికి మాత్రం తెలియదు. ప్రజలకు తెలియజెప్పలేదు. అవి గ్రామీణులకు పని కల్పించే పరిశ్రమలా లేక భారీగా పెట్టుబడులు పెట్టి పదిమంది విద్యావంతులకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చే సంస్థలా? అదీ తెలీదు. వాటివల్ల వాతావరణ కాలుష్యం ఎంత ఉంటుంది? పోయినవాళ్ళు పోగా మిగిలినవారి బతుకులమీద ఈ ఎస్.ఇ.జడ్. ప్రభావం ఏ విధంగా ఉండబోతోంది? అది సహితం తెలీదు. అసలు నిజంగా 'అభివృద్ధి' అనేది వస్తుందా లేక క్షేత్రం యావత్తు చెన్నై రహదారికి దగ్గరగా ఉంది కాబట్టి నాలుగు పెద్ద హొటళ్ళు, రెండు ధాబాలు మాత్రమే వెలుస్తాయా? ఏమో తెలీదు.

ఏమీ తెలియకుండా 25 వేల ప్రజానీకం తమ జీవన వనరులన్నీ శ్రీసిటీ వారికి అప్పగించి ఎందుకు వెళ్ళిపోవాలి? అభివృద్ధి కోసం ప్రజలు త్యాగం చేయాలి అంటున్నారు. అది ఎట్లాంటి అభివృద్ధో తెలియకుండ కూడా త్యాగం చేయాలా? ఆ అభివృద్ధి స్వభావం ఏమిటో దానివల్ల ఎవరికి ఏమి ఒరుగుతుందో స్పష్టంగా సూచించి, దానికోసం భూములు అప్పగించే ప్రజలకు వచ్చే నష్టమెంతో కూడా అంచనా వేసి ఆ అభివృద్ధి మేలో, ఇప్పుడుండే బతుకులే మేలో నిర్ణయించడం సబబు కాదా? ఆ నిర్ణయం చేయడంలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం సబబు కాదా?

కాదన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. అబద్ధాలు చెప్పి, తప్పుడు ఆశలు కల్పించి, కొంతమందిని తన వ్యూహానికి అనుకూలంగా మలచుకొని, మిగిలినవారికి వారిని చూపించి లోబరుచుకొని, చివరికి ఆలస్యం చేస్తే ఏమీ ఇవ్వకుండ భూములు తీసుకుపోతాం అని బెదిరించి భూములు స్వాధీనం చేసుకునే ఆలోచనతో ప్రభుత్వం ఉంది.

వ్యవసాయంలో భద్రత లేదు కాబట్టి ఉద్యోగం సంపాదించుకోవాలన్న ఆశ వ్యవసాయ కుటుంబాల యువకులకు ఉంటుంది. దానిని ప్రభుత్వం మోసపూరితంగా వాడుకుంటున్నది. భూమిని కోల్పోయిన ప్రతీ కుటుంబంలోనూ ఒకరికి ఎస్.ఇ.జడ్. లో ఉద్యోగం ఇస్తామన్న హామీ అధికారులు ఇస్తున్నారు. అక్కడ ఏ కంపెనీలు రాబోతాయో కూడా తెలియనివారు ఉద్యోగాల హామీ ఎట్లా ఇయ్యగలరు? బట్టల మిల్లులో, చెప్పుల కర్మాగారాలో నెలకొల్పితే అందరికీ కాకున్నా కొందరికి ఉద్యోగాలు దొరకవచ్చునేమో. కానీ ఐ.టి. కంపెనీలు వస్తే? అయినా వచ్చేవన్నీ ప్రైవేటు కంపెనీలయినప్పుడు బహుశా విదేశీ పెట్టుబడులతో కూడిన కంపెనీలయినప్పుడు. స్థానికులకు ఉద్యోగాలు వస్తాయన్న హామీ రాష్ట్ర ప్రభుత్వం ఎట్లా ఇవ్వగలదు? ప్రైవేట్ కంపెనీలకు అటువంటి ఆదేశం జారీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందా? అసలు గతంలో ప్రభుత్వరంగ సంస్థల కోసం భూములు స్వాధీనం చేసుకున్న చోటయినా ఉద్యోగాలిస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందా? విశాఖపట్నం ఉక్కు కర్మాగారం కోసం, రామగుండం సూపర్ థర్మల్ కేంద్రం కోసం భూములు ఇదే హామీ కారణంగా అప్పగించిన రైతు కుటుంబాల యువకులు 30 సంవత్సరాలుగా ఆ హామీ అమలు

కోసం కోర్టుల చుట్టూ తిరుగుతుండడం వాస్తవం కాదేమో ప్రభుత్వాన్ని చెప్పమనండి!

సేకరించబోయే భూమిలో దాదాపు మూడవ వంతు డికెటి పట్టా భూములు కావడంతో డికెటి పట్టాదారులకు కూడా స్వంత పట్టా ఉన్న రైతులతో సమానంగా భూములకు నష్టపరిహారం ఇస్తామన్న హామీ ప్రభుత్వం ఇస్తున్నది. రాష్ట్రంలో ఎక్కడయినా అట్లా ఇచ్చారేమో ప్రభుత్వాన్ని అడగండి! స్వంత పట్టా అయినా డికెటి పట్టా అయినా భూసేకరణ చేసినపుడు నష్ట పరిహారం ఇవ్వాలని మన రాష్ట్ర హైకోర్టు ఏడుగురు జడ్జీల బెంచి ఎల్.ఎ.ఓ, చేవెళ్ల వర్సస్ మేకల పాండు కేసులో ఇచ్చిన తీర్పు అన్యాయమంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకొని 'స్టే' తీసుకోలేదా? తీసుకోలేదేమో ప్రభుత్వాన్ని అడగండి! అక్కడ 'స్టే' తీసుకొని ఇక్కడ సమానంగా ఇస్తామంటే మనం నమ్మాలా?

పట్టా ఉన్న రైతులకయినా ప్రభుత్వం ఇవ్వబోయే నష్టపరిహారం ఏరకమైన పునరావాసం ఇస్తుంది? ఎకరానికి రెండున్నర లక్షలో మూడు లక్షలో ఇస్తారంట. ఇక్కడున్నది ఎక్కువగా రెండు, మూడెకరాల రైతులు. వారికి ఆరేడు లక్షల నష్టపరిహారం వస్తుందేమోగాని అందరికీ అంత మోతాదులో అప్పులూ ఉన్నాయి. రైతు వ్యవసాయం చేస్తున్నంతకాలం అప్పులవాళ్లు మెడమీద కూర్చోకపోవచ్చు గానీ భూమి అప్పగించి పోతున్నారని తెలిస్తే బాకీ తీర్చేదాకా కదలనివ్వరు. ఇంక చిన్న రైతులకు ఏమి మిగులుతుంది? భూమి లేని కూలీలకు ఎట్లాగూ నష్టపరిహారం రాదు. ఈ రెండు వర్గాలూ కలిపితే నిర్వాసితులు కాబోయే జనాభాలో వారే మెజారిటీ అవుతారు.

శ్రీసిటీ కంపెనీకి, వారి ఆహ్వానం మీద రేపు రాబోయే కంపెనీలకు వచ్చే లాభాన్ని, వారి అభివృద్ధిని 'దేశం అభివృద్ధి'గానో, 'రాష్ట్ర అభివృద్ధి'గానో పిలిచేవారు ఈ వేలాది ప్రజలకు కలిగే నష్టాన్ని 'దేశం నష్టం' గాను, 'రాష్ట్రం నష్టం'గాను భావించి దేశం, లేక రాష్ట్రం దానిని భరించాలని ఎందుకు అడగరు? అటువంటి చట్టంగాని, విధానంగానీ దేశంలో ఎందుకు లేదని ఎందుకడగరు? ఉన్నవాళ్ళ అభివృద్ధికోసం లేని వాళ్ళు పూర్తిగా పతనం అయ్యే ప్రగతిని ఎందుకు అంగీకరించాలి?

1970లలో నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ కేంద్రం కోసం భూములు అప్పగించి వలసవచ్చి వరదయ్యపాలెం మండలంలోని తొండూరు సొసైటీ, శ్రీహరికోట కాలనీలలో ఉంటున్న జనాన్ని చూస్తే ప్రభుత్వం హామీలు ఎంత బూటకమో అర్థం అవుతుంది. ఒక్కొక్క కుటుంబానికి అయిదెకరాలు ఇస్తామన్నారు. రెండున్నర ఎకరాలే ఇచ్చారు. అదికూడా రాళ్లు, రప్పలు, పాము పుట్టలు నిండిన బంజరు ఇచ్చారు. దానికి పట్టా ఇవ్వడానికి 20 సంవత్సరాలు, రెండు హైకోర్టు కేసులు అవసరం అయ్యాయి. చివరికి దక్కింది డికెటి పట్టాయే. ఒక్కొక్క కుటుంబంలోనూ ఒక్కొక్కరికి ఉద్యోగం ఇస్తామన్నారు. అందరికీ కలిపి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఎస్.ఇ.జడ్. కోసం ఆ ప్రజలు మళ్ళీ ఊళ్ళు ఖాళీ చేయాలి.

ప్రభుత్వం ఒక భరోసాతో ఉన్నట్టుంది. కొన్ని గ్రామాలలో – ముఖ్యంగా సత్యవేడు మండలంలో 20 నుండి 50 ఎకరాలదాకా భూములున్న అగ్రకులాల భూస్వాములు ఉన్నారు. వాళ్ళకు 50 లక్షల నుండి 1 కోటి రూపాయల దాకా నష్టపరిహారం దక్కుతుంది. కాబట్టి వాళ్ల భూములు ఇచ్చేసి వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్లే ఆ ఊర్లలో 'పెద్దమనుషులు' కాబట్టి మిగిలిన జనం నోరు నొక్కుకొని వారివెంట పోతారని ప్రభుత్వం ఆశిస్తున్నది. చెరివి గ్రామంలో ఇప్పటికే ఇది జరిగింది. ఆ పంచాయితీలో భాగమైన చిగురుపాలెం వాసులు చెరివి గ్రామపెద్దలు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం తమ సమ్మతితో



చేసుకున్నది కాదని అంటున్నప్పటికీ ఆ ఊరికి సంబంధించిన ఒప్పందం జరిగిపోయినట్టే ప్రభుత్వం మాట్లాడుతున్నది. ఇటువంటి మోసాలకు లొంగవద్దని పేదలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

నష్టపరిహారం, ఉద్యోగాలు తరువాతి సంగతి. అంతకంటే మౌలికమైన ప్రశ్నే ప్రభుత్వాన్ని అడుగుదాం. ఎప్పుడు వస్తాయో ఎన్ని వస్తాయో తెలియని కంపెనీల కోసం 12 వేల ఎకరాల సాగుభూమిని, పళ్ల తోటలను, పూతోటలను ఎందుకు ఖాళీ చేయించాలి? మహా అయితే ఒక్కొక్క కంపెనీకి నూరు, ఇన్నూరు ఎకరాల భూమి అవసరం అవుతుందేమో. ఎవరి సాగులోనూ లేని బంజరు ఆ మేరకు దొరకదా? శ్రీకాళహస్తి సమీపంలో అటువంటి బంజరు చాలా ఉందని ఆ ప్రాంత ఎమ్.ఎల్.ఎ. ప్రకటించి ఉన్నాడు. ఒకేచోట ఒక పెద్ద ఎస్టేట్ లాంటిది తయారుచేసి, ముందే రోడ్లు కరెంటూ నీళ్లూ ఏర్పాటు చేసి, రాబోయే కంపెనీలకు అప్పగించాలన్న ఈ ఆలోచన ఎందుకు? విడివిడిగా బంజరు భూములు, కోర్టు వివాదాలలో ఉన్న 2000 ఎకరాల శ్రోత్రియం భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయి. శ్రోత్రియందార్లు కోర్టులో గెలిచినా ఆ భూములకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవచ్చు. వాళ్లు సంతోషంగానే ఇచ్చేయగలరు. అటవీ భూమికూడ రెండు మండలాలలో విస్తారంగా ఉంది. వేరేచోట అడవుల పెంపకానికి బంజరు భూమి అప్పగించి ఇక్కడి అటవీ భూమిని తగు మొత్తంలో రేపు రాబోయే ఏదయినా కంపెనీకి కేటాయించవచ్చు. నిజంగా కంపెనీ పెట్టి అభివృద్ధి చేయాలన్న కోరిక ఉన్న వారికి ఒక్కొక్కరికీ ఒక్కొక్కచోట తగు మాత్రం భూమి ఇవ్వడానికి 16 ఊర్లు ఖాళీ చేయించనక్కరలేదు. ఈ ప్రత్యామ్నాయాలన్నీ ఉండగా, పేద రైతులు, కూలీల జీవనాధారం అయిన 12 వేల ఎకరాల సాగు భూములే అభివృద్ధికి కావలసి వచ్చాయా?

ఈ ప్రశ్నలు మనమెందుకు అడగకూడదు? దీనికి జవాబు చెప్పేంతవరకు భూసేకరణ ప్రయత్నాలన్నీ ఆపమని ప్రభుత్వాన్ని ఎందుకు డిమాండ్ చేయకూడదు?

చిత్తూరు జిల్లాశాఖ, సెప్టెంబర్ 2007

## సింగరేణి విస్తరణ – నిర్వాసితులు

# పర్యావరణంపై సదస్సు

**ప్రజలారా!**

“పరిశ్రమల కోసం సారవంతమైన వ్యవసాయ భూములు తీసుకోకూడదు” అన్న ప్రకటన అధికార కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల నుంచి మీరు ఎన్నిసార్లు విని ఉన్నారు? కొన్ని దజన్లసార్లు విని ఉంటారు. ఊరటకోసం ఇటువంటి ప్రకటనలు ఇస్తూ ఎప్పటిలాగే పరిశ్రమలకు ఎక్కడ అవసరమనుకుంటే అక్కడ, ఎంత అవసరం అనుకుంటే అంత భూమిని ఎటువంటిదైనా సరే బలవంతంగా సేకరించి అప్పగించడం మన పాలకులకు అలవాటయిపోయింది.

దేశ స్థాయిలో ఒక న్యాయమైన పునరావాస విధానమేదీ లేకుండా పరిశ్రమల కోసం, ప్రాజెక్టులకోసం భూసేకరణ చేసుకుంటూ పోతే నిరాశ్రయులైన ప్రజలు ఏమైపోవాలన్న ప్రశ్నకు జవాబుగా “జాతీయ పునరావాస విధానం” అదిగో వచ్చేస్తోంది, ఇదిగో వచ్చేస్తుంది అంటున్నారు. కానీ అదింకా రాకముందే దాని రూపురేఖలూ మంచి చెడులూ తెలియక ముందే భూసేకరణ మాత్రం చేసుకుంటూ పోతున్నారు. ఏమంటే దేశ అభివృద్ధి ‘అర్జెన్సీ’ ఉన్న విషయమనీ అది ఆగజాలదనీ అంటున్నారు. ఊరి ప్రజల ప్రాణాల్నీ, జీవితాల్నీ కాపాడే బాధ్యతకు ‘అర్జెన్సీ’ లేదా? ప్రజామోదం పొందిన సమగ్ర పునరావాస విధానం వచ్చేదాకా భూసేకరణ ప్రక్రియను ఆపవచ్చు కదా? వ్యవసాయం మీద, భూమిమీద, ప్రకృతి మీద ఆధారపడి బతికే ప్రజలంటే చిన్నచూపు తప్ప వేరే ఏమైనా కారణముందా ఈ వైఖరికి?

సింగరేణి యాజమాన్యం రామగుండం రీజియన్‌లో ప్రస్తుతం నడుస్తున్న నాలుగు ఓసిపి ప్రాజెక్టులకోసం భూసేకరణ జరిపింది. మానవహక్కుల వేదిక ఈ నాలుగు ఓసిపి గనులకు భూములు అప్పగించిన గ్రామాల ప్రజలను కలిసింది. ఏ గ్రామ ప్రజలు కూడా ఓసిపి ప్రాజెక్టులు రావడంవల్ల బాగుపడ్డామని చెప్పలేదు సరికదా కొత్త సమస్యలు తెచ్చుకున్నామని తమ బాధలను ఏకరువు పెట్టారు. సింగరేణి యాజమాన్యం తమకు భూములు అప్పగించిన స్థానికుల ప్రయోజనాలను పక్కకు పెట్టి తమ అవసరాలనే చూసుకుంది. అస్తవ్యస్తంగా భూసేకరణ జరపడం వల్ల భూములున్న కొందరు లాభపడితే మెజారిటీ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. మేడిపెల్లి ఓసిపి కింద మేడిపెల్లి గ్రామశివారు భూములను



సింగరేణి యాజమాన్యం తీసుకొని రైతులకు నష్టపరిహారం చెల్లిస్తే ఆ భూముల్లో విస్తారంగా ఉన్న తాడిచెట్లపై ఆధారపడి బతుకుతున్న గౌడ కులస్థులు వందల సంఖ్యలో జీవనాధారాన్ని కోల్పోయి బజారునపడ్డారు. మేడిపెల్లి, మారేడువాక గ్రామాల పంట పొలాలను స్వాధీనం చేసుకున్న యాజమాన్యం నివాసగృహాలను మాత్రం వదిలివేసి వాళ్ల ఇళ్ళ పక్కనుండే ప్రాజెక్టును ప్రారంభించడంతో ఆయా గ్రామాల ప్రజలు దినమొక గండంగా గడుపుతున్నారు. ప్రాజెక్టుల్లో జరిగే భారీ బ్లాస్టింగ్‌ల వల్ల కలిగే వైబ్రేషన్‌లకు ఇళ్ళు బీటలువారి కూలిపోతున్నాయి. ఓసిపి ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయే రైతులకు మాత్రమే అరకొరగా నష్టపరిహారం అందుతుంది. భూమిలేని అనేకమంది వివిధ గ్రామీణ వృత్తుల వారికి ఏవిధమైన పరిహారం అందడం లేదు. ఇంతకాలం ఊరిని నమ్ముకొని శ్రమచేసుకొని బతికిన వారికి కూడా జీవనాధారం చూపించాల్సిన బాధ్యత తమపై ఉందని ప్రభుత్వంగానీ, సింగరేణి యాజమాన్యంగానీ గుర్తించడం లేదు.

ఓసిపి ప్రాజెక్టులు 150 నుంచి 300 మీటర్ల లోతుకు పోతున్నందున భూగర్భ జలాలు, బావులు ఇంకిపోయి అడుగంటిపోతున్నాయి. గ్రామాల చుట్టూ పోసిన మట్టిగుట్టల కారణంగా రవాణా సౌకర్యాలు అస్తవ్యస్తమై పోతున్నాయి. ఓసిపి నుంచి వెలువడుతున్న విష యవాయువులు, దుమ్ము, శబ్ద కాలుష్యాలవల్ల ప్రజలు అనారోగ్యం పాలవడమేగాక పరిసర ప్రాంత పంటపొలాల్లో దిగుబడి తగ్గిపోతోంది. ఓసిపిల నుంచి వెలువడుతున్న కాలుష్యపు నీరు కారణంగా సమీపంలోని చెరువులు కలుషితమైపోయాయి. 20 సంవత్సరాల కింద రామగుండం రీజియన్‌లో ఓపెన్‌కాస్టులు ప్రారంభమైతే నిర్వాసితులకు ఈరోజు వరకు కూడా పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందక కేసులు కోర్టులో మూలుగుతున్నాయి. యాజమాన్యం కోర్టు గడపలో నిర్వాసితుల బ్రతుకుల్ని బందీచేసి యదేచ్ఛగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను తవ్వుకుంటూ పోతోంది. ఇది ఓసిపి నిర్వాసిత గ్రామాల ప్రజల వాస్తవ పరిస్థితి. బొగ్గు గనుల తవ్వకాలకు తమ భూములను అందించి, తమ బతుకుల్లో మంటలు పెట్టుకున్న నిర్వాసితుల దయనీయమైన స్థితి ఇది. వెన్నెముకలేని కాలుష్య నియంత్రణ అధికారులు ప్రజల అభ్యంతరాలను పక్కనపెట్టి అనుమతులిస్తున్నారు. దేశ అభివృద్ధికి బొగ్గు అవసరం లేదని ఎవ్వరూ అనరు. అయితే వ్యవసాయమూ, ప్రజల ఆరోగ్యమూ, సంక్షేమమూ కూడా అవసరం కాదా? దానికీ దీనికీ మధ్య సమతుల్యం పాటించే సమగ్ర విధానమేదీ లేకుండా పారిశ్రామిక అభివృద్ధి పెరుగుదలకీ పెద్దపీట వేయడం సమంజసమా?

ఆదిలాబాద్ తూర్పు డివిజన్‌లో సింగరేణి యాజమాన్యం ప్రారంభిస్తున్న ఓసిపి ప్రాజెక్టుల విషయానికి వస్తే వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కోల్‌బెల్ట్ ప్రాంతాలు రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, మందమర్రిలు. రామకృష్ణాపూర్‌లో ప్రారంభిస్తున్న ఓసిపి ప్రాజెక్టు ప్రాంతం సింగరేణి ఆధీనంలో ఉన్న ఊరేగాబట్టి వెంటనే ప్రారంభించడానికి యాజమాన్యం సిద్ధపడుతోంది. కానీ రామకృష్ణాపూర్‌లో ప్రారంభమయ్యే ఓసిపి వల్ల క్యాతన్‌పల్లి, శేషపెల్లి, అమరవాజి, కుర్మపల్లి గ్రామాలలో నివసిస్తున్న దాదాపు 30 వేల ప్రజానీకం ఓసిపిల ప్రభావానికి గ్రామాలు వదిలివెళ్ళాల్సిందే, వారి పంటపొలాలు బీళ్ళుగా మారవలసిందే. అదే

విధంగా బెల్లంపల్లి టౌన్‌లో ప్రారంభమవుతున్న ఓసిపి ప్రాజెక్టు వల్ల చిన్నబూదె, కాశిరెడ్డిపల్లి, సంద్రావెల్లి, తాళ్ళ గురిజాల, రంగంపేట, దుద్దెనపల్లి, మాలగురిజాల గ్రామాల ప్రజలు కూడా పైప్రభావానికి గురికావాల్సిందే.

మందమర్రి సమీపంలోని శ్రావణపల్లి ఓసిపి ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల ప్రజల సమస్య ప్రత్యేకమైనది. అక్కడ 400 ఎకరాల మామిడితోటలను, అంతే విస్తృతి గల పంట పొలాలను కబళించే ఓసిపి నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం ఒడిగట్టింది. నేతకాని కులానికి చెందిన దళితులు నివసించే జెండావెంకటాపూర్, పూర్తిగా లంబాడా గిరిజనులు నివసించే శ్రావణపల్లి తమ జీవనాధారాన్ని సంపూర్ణంగా కోల్పోతాయి. ఈ రెండు గ్రామాలూ నెన్నెల మండలంలో ఉన్నాయి. వాటితోపాటు మందమర్రి మండలం మామిడిగట్టు కూడా తన శివారు మొత్తం కోల్పోతుంది. ఈ మూడు గ్రామాలలో పశుసంపద చాలా ఉంది. వరిగడ్డీ, అడవులలో దొరికే మేత వాటికి మంచి పౌష్టికాహారం. వీటి పాలు గ్రామస్తులకు మంచి ఆదాయం. భూములుపోతే ఈ పశువులను అమ్ముకోవలసిందే. ఈ మూడు గ్రామాలకు సంవత్సరంలో కనీసం రెండు నెలలు వచ్చి కూలీ చేసుకునే చిత్తాపూర్, కొత్తూరు, నర్వాయిపేట, జోగాపూర్, ఆదిల్‌పేట, పొన్నారం గ్రామాల పేదలు కూలివల్ల దొరికే జీవనాధారాన్ని కోల్పోతారు. సేకరిస్తున్న భూమిని ఆనుకొని ఉన్న ఆవడం, చిత్తాపూర్, కొంపల్లె, నారవాయిపేట, ఎదులాపురం గ్రామాల ప్రజలు ధూళికాలుష్యంతో భూగర్భ జలాల క్షీణతనూ, పేలుళ్ళ దుష్ప్రభావాన్నీ ఎదుర్కొంటారు. అవడం గ్రామంలోనూ కొంత భూమి పోతుంది. అదికూడా మామిడి తోటే.

ఇవి నిన్న మొన్న వేసిన మామిడి తోటలు కావు. 30-35 సంవత్సరాల వయసుగల చెట్లున్నాయి. బంగినపల్లేకాక, మన దగ్గర అరుదైన దస్సేరీ పళ్ళ చెట్లూ ఉన్నాయి. జెండా వెంకటాపూర్, శ్రావణపల్లి గ్రామస్తులంతా దళితులు, గిరిజనులు కావడంవల్ల మామిడి పళ్ళు అమ్ముకునే విషయంలో చాలాకాలం దళారుల మోసానికి బలయ్యారు. ఇప్పుడిప్పుడే వారిలోని యువతరం కాయల అమ్మకాన్ని తమ చేతిలోకి తీసుకొని దళారుల ప్రమేయం లేకుండా నేరుగా నాగపూర్‌కు తీసుకుపోయి అమ్ముకు రావడం నేర్చుకుంది. ఎకరానికి 50 వేల నుంచి 80 వేల రూపాయల ఆదాయం పొందగలుగుతున్నారు. ఇప్పుడిప్పుడే మంచిబట్టలు వేసుకోవడం, పిల్లల చదువు గురించి ఆలోచించడం, పక్కా ఇళ్ళు కట్టుకునే సాహసం చేయడం మొదలయింది. ఇది 'అభివృద్ధి' కాదని ఇంగితం ఉన్న వారెవరూ అనరు. కానీ ఈ అభివృద్ధిని ధ్వంసం చేసి, బొగ్గు తవ్వి తీసి కరెంట్ భారీగా ఉత్పత్తి చేసి వార్షిక వృద్ధి రేటులో సింగపూర్‌ను, చైనాను దాటిపోతేనే 'అభివృద్ధి' అని మన్మోహన్‌సింగ్‌లు, రాజశేఖర్‌రెడ్డి భావిస్తున్నారు. అదే మన దురదృష్టం.

ఇప్పటికీ రేపు ఏం జరుగబోతుందో సింగరేణి యాజమాన్యంగాని, ప్రభుత్వంగానీ ప్రజలకు చెప్పదు. భూములు పోతాయి, ఓసిపి వస్తుంది అని గాలి వార్తలు మాత్రం ప్రచారం అవుతుంటాయి. స్పష్టంగా ఏమీ తెలియదు. ప్రజలు భయంభయంగా బతుకుతుంటారు. సమయం చూసి ఊరికి పది మందికి ఆశచూపి తమ ఏజంట్లుగా మార్చుకోవడానికి ఈ అనిశ్చిత అనువైన స్థితి అని ప్రభుత్వంవారు భావిస్తారు. కొందరికి ఓసిపిలో చిన్నా చితకా కాంట్రాక్టులు ఇస్తామంటారు. కొందరికి ఉద్యోగాలిస్తామని హామీలిస్తారు. రేపు నిర్వాసితులు గట్టిగా అడిగితే అందరికీ ఉద్యోగాలిస్తామంటారు గానీ ఓసిపిలలో ఉండే ఉద్యోగాలే కొన్ని కాగా అందులో మందమర్రి వంటి వెనుకబడిన ప్రాంతాల గ్రామీణ జీవులకు



అందుబాట్లోకి వచ్చేవి మరీకొన్ని. ఈ వాస్తవాన్ని ప్రజలు గ్రహించకపోతే ఉద్యోగం దొరుకుతుందన్న ఆశపెట్టుకొని జీవనాధారమైన భూమిని వదులుకోవడం జరుగుతుంది.

ఓసిపి తవ్వకం చేపట్టడానికి ఇది తప్ప వేరే అనువయిన ప్రాంతం లేదా? మెజారిటీ ప్రజలు నేతకాని కులానికి, లంబాడా తెగకూ చెందిన వారు కాబట్టి సులభంగా పనయిపోతుందని ఈ చోటును ఎంచుకున్నారా? ప్రభుత్వం నుంచి ఏ ఆసరా లేకుండా తమపాటికి తాము ఈ తరంలో జీవితాలు బాగుచేసుకున్న అట్టడుగు సామాజిక వర్గాల ప్రజల క్షేమం 'అభివృద్ధి' లెక్కలలో కనబడదా? పారిశ్రామీకరణ కోసం ప్రజలను వారి గ్రామాల నుంచి నిర్వాసితులను చేయకతప్పనట్టయితే వారి జీవన ప్రమాణం తగ్గని పద్ధతిలో వారికి సమ్మతమైన రీతిలో వారికి పునరావాసం కల్పించటం న్యాయం కాదా? దానికొక చట్టంగానీ, విధానంగానీ ఇప్పటికింకా దేశంలో ఎందుకు లేదు? ఇదిగో ప్రకటిస్తున్నా, అదిగో ప్రకటిస్తున్నా అంటూ కాలయాపన చేస్తూ, మరొకవైపు భూసేకరణ చేసుకుంటూ పోవడం ఏం న్యాయం? ప్రజలకు సమాచార హక్కు ఉందంటూ ఆర్భాటంగా చట్టం చేసేసి, ఇంత ముఖ్యమైన విషయంలో వారి నుంచి సమాచారాన్ని దాచిపెట్టి ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితిలో వారిని ఉంచడం ఏ పద్ధతి? ఉత్తర తెలంగాణ జిల్లాల్లో విస్తరించి ఉన్న అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులు ఇప్పటివరకు తెలంగాణ ప్రజలకు ఉద్యోగ వనరులుగా కొనసాగాయి. పారిశ్రామిక విధానాల పుణ్యమా అని బొగ్గు గనుల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికులు గణనీయంగా తగ్గించబడుతున్నారు. లాభాల మోజులో ఉన్న యాజమాన్యం నేడు స్థానికంగా ఉన్న గనులను మూసి ఓపెన్ కాస్టులపై మక్కువ చూపుతున్నది. ఈ దురాలోచన అమలులో స్థానిక ప్రజలు ఉన్న ఊరును, గూడును, బతుకునిచ్చిన పొలాలను ఓసిపి గనుల్లో కోల్పోతున్నారు. వారి జీవించే హక్కు అభివృద్ధి పేరుతో హరించబడుతోంది. స్థానికంగా వచ్చే పరిశ్రమలు స్థానికుల జీవన ప్రమాణాలను పెంచే విధంగా ఉండాలే గానీ, హరించే విధంగా ఉండకూడదనేది ప్రజాస్వామిక వాదులుగా మా అవగాహన. తెలంగాణ ప్రజల బతుకుల్ని బుగ్గి చేస్తున్న, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ఓసిపి గనుల గురించి చర్చించుకొని వారికి న్యాయం జరిగేటట్టు ప్రభుత్వాన్నీ సింగరేణి యాజమాన్యాన్నీ నిలదీద్దాం రమ్మని అందరినీ ఆహ్వానిస్తూ...

ఆదిలాబాద్ జిల్లా శాఖ, 27-1-2008

# కృష్ణపట్నం పట్టపోళ్ళ భవిష్యత్ ఏమిటి?

కృష్ణపట్నంలో 'అల్ట్రా మెగా థర్మల్ ప్లాంట్'ను ఇంకా కట్టలేదు. కేవలం పోర్టు విస్తరణే 16 గ్రామాల పట్టపోళ్ళ (మత్స్యకారుల) బతుకును ప్రశ్నార్థకం చేసింది. పోర్టు విస్తరణ కూడా నిజానికి ఇంకా జరగలేదు. దానికోసం తీరం మీద జరుగుతున్న లెవెలింగ్ పనులే చేపల వేటను చంపేశాయి. అంతా అయిపోయి 5,600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు థర్మల్ కేంద్రాలొకపక్క, వాటికోసం బొగ్గు దిగుమతి చేసుకోవడానికి ప్రధానంగా ఉద్దేశించిన పోర్టు మరొకపక్క పూర్తి స్థాయిలో వచ్చేస్తే అక్కడ మత్స్యకారులనే వారు ఒక్కరైనా మిగులుతారా?

రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఒకానొక సంకేతంగా కృష్ణపట్నం పత్రికలలో తరచుగా దర్శనం ఇస్తుంటుంది. దాని వెనక ఉన్న చీకటి కథ మాత్రం పత్రికలలో కనిపించదు. ప్రాజెక్టులకు భూములు తీసుకునేటప్పుడు స్వంత భూమి ఉన్న రైతులకు ఎకరానికింత నష్టపరిహారం ఇచ్చి, ఇళ్ళు ఖాళీ చేయవలసి వచ్చే వారికి ఎక్కడో ఒకచోట ఇళ్ళ స్థలం చూపిస్తే సరిపోతుందని ప్రభుత్వం భావిస్తుంది. చట్టం గుర్తించే యాజమాన్య హక్కేదీ లేకుండా ఆ నేలమీద, ఆ ప్రకృతి మీద ఆధారపడి బతికే జనం వాళ్ళ లెక్కలోకే రారు.

కానీ ఈ 'అభివృద్ధి' చాలా ప్రాథమిక దశలో ఉండగానే ప్రభుత్వం దాచిపెట్టిన విషయాలు బయటపడుతున్నాయి. ఈ తీరం వెంబడి ఉన్న గ్రామాలలో నివసిస్తూ సముద్రంలో, కండలేరు నదిలో, బకింగ్‌హాం కాలవలో చేపలు, రొయ్యలు పట్టుకొని జీవించే జనం వేట దొరకక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పోర్టుకు సంబంధించిన నిర్మాణాలు చేపట్టేచోట నేల లెవెలింగ్ చేయడం కోసం అవసరమైన మట్టిని పోర్టు యాజమాన్యం సముద్రంలో నుండే 'డ్రెడ్జింగ్' చేసి తీసుకొస్తోంది. మట్టి తవ్వుకుంటూ, ఇక్కడి మట్టి అక్కడ పోసుకుంటూ హడావుడిగా తిరిగే 'తవ్వోడల' పుణ్యాన జలజీవాల పునరుత్పత్తి బాగా దెబ్బ తినింది.

మొదట రాష్ట్ర ప్రభుత్వం ఇదేమీ తనకు పట్టనట్టు, తన నిర్ణయాలతో దీనికేమీ సంబంధం లేనట్టు నటించింది. ఊరు ఖాళీ చేసి పోవలసి ఉన్న ఆదాలనగర్, మిద్దిరేవు, రామలింగాపురం అనే మూడు మత్స్యకారుల గ్రామాలకు మాత్రం ముత్తుకూరు దగ్గర కాలనీ కట్టిస్తానంది. పోర్ట్‌లో ఉద్యోగాలు ఇస్తామని కూడా అంటున్నారు గానీ అది అబద్ధం అని అందరికీ తెలుసు. నిర్మాణం జరుగుతున్న దశలో మట్టితట్టలు మోసే పని కొందరికి దొరుకుతుంది గానీ ఆ తరువాత మారుమూల గ్రామాల మత్స్యకారులు చేయగల పనేమీ పోర్ట్‌లో దొరకదు.



కానీ ఆ మూడు గ్రామాల వారికేకాక మొత్తం 16 గ్రామాల పట్టపోళ్ళ జీవనం ఇప్పటికే దెబ్బతినింది, ఇంకా పెద్దెత్తున దెబ్బతినబోతోంది. నేలటూరు, కృష్ణపట్నం, ఆదాలనగర్, రామలింగాపురం, ఈపూరు వెంకన్నపాలెం, మిట్టపాలెం, కోనేటి మిట్ట, బీచికాలనీ, మద్దిరేవు, గుమ్మళ్ళ దిబ్బ, లింగవరం, వరగలి, మోమిడి గ్రామాలలో వెయ్యి కుటుంబాలకు పైబడి మత్స్యకారులుంటున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ముందుకొచ్చి డ్రెడ్జింగ్ పనులు నడుస్తున్నంతకాలం ఈ సమస్య ఉంటుందని చెప్పి కొంత నష్టపరిహాం ఇచ్చే ఆలోచన చేస్తున్నదని వింటున్నాం.

తూర్పుగోదావరి జిల్లా తాళ్ళరేవు దగ్గర రిలయెన్స్ కంపెనీవారి సహజవాయు ప్రాజెక్టు విషయంలోనూ ఇదే జరుగుతున్నది. అక్కడ కూడా ప్రాజెక్టు నిర్మాణాల నిమిత్తం నేలను లెవెల్ చేయడానికి అవసరమైన మట్టిని సముద్రం నుండే డ్రెడ్జర్ల సహాయంతో తవ్వి తీసుకొచ్చారు. కృష్ణపట్నం రేవు కండలేరు సముద్రాన్ని కలిసే చోటికి దగ్గరున్నట్టే అది గాడేరు సముద్రాన్ని కలిసే చోటికి దగ్గిర. అక్కడ కూడా మత్స్యకారులకు వేట బాగా ఉండేది. కానీ 'తవ్వోడల' పుణ్యాన ఇసుక అడ్డదిడ్డంగా మేటవేసి, నీళ్ళు బురదై, జలజీవాల పునరుత్పత్తి దెబ్బతినడం, మత్స్యకారుల పడవల రాకపోకలు కష్టతరం కావడం జరిగింది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం డ్రెడ్జింగ్ ఎంతకాలం జరగబోతుందో అంతకాలానికి మాత్రం నెలకింత అని లెక్కగట్టి మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చింది. ఇక్కడ కూడా ఆ విధంగా ఇచ్చే ప్రతిపాదన ఉన్నట్టుంది.



కానీ రేవు నిర్మాణం పూర్తయి డ్రెడ్జర్లన్నీ వెళ్ళిపోయిన తరువాత కూడా సమస్య ఉంటుంది. ఉండడమే కాదు, అప్పుడే అసలు సమస్య మొదలవుతుంది. అందుకే ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి నాలుగు కాసులు చేతిలో పెట్టిందని మురిసిపోవద్దని మత్స్యకారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

మన రాష్ట్రంలో ఎక్కడా ఇప్పటిదాకా 1000 మెగావాట్ల సామర్థ్యాన్ని మించిన థర్మల్ కేంద్రాలు లేవు. కృష్ణపట్నంలో ఒకటి 4,000 మెగావాట్లు, మరొకటి 1,600 మెగావాట్లు, మొత్తం 5,600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు థర్మల్ కేంద్రాలు రాబోతున్నాయి. వీటికోసం రోజుకు 5.84 లక్షల ఘనపు మీటర్ల నీళ్ళు సముద్రం నుండి తీసుకుంటారు. ఈ నీళ్ళు తిరిగి సముద్రంలోకే పోతాయిగానీ ఇంత పెద్దెత్తున ప్రతిరోజూ సాగర మధనం జరుగుతుండగా మత్స్యకారులు పడవలేసుకుని చేపల వేటకు పోయి వస్తుంటారనుకుంటే భ్రమే.

కాగా, కాలుష్యం ప్రమాదమూ చాలా ఉంటుంది. థర్మల్ కేంద్రాల నుండి వచ్చే ప్రధానమైన కాలుష్యం బూడిద. ఈ రెండు ప్లాంట్లలో పెద్దదైన రిలయన్స్ వారి 4000 మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని విదేశీ బొగ్గుతో నడుపుతారనీ, దానిలో బూడిద మన బొగ్గుకంటే మూడవ వంతు తక్కువ ఉంటుందనీ అంటున్నారు. అయినప్పటికీ, 4,000 మెగావాట్ల థర్మల్ కేంద్రం నుండి వెలికి వచ్చే బూడిద రామగుండంలోని ఎన్‌టిపిసి థర్మల్ కేంద్రం కంటే రెండున్నర రెట్లు ఎక్కువ ఉంటుంది. రెండవ థర్మల్ కేంద్రం ప్రధానంగా మన బొగ్గుతో నడుస్తుంది కాబట్టి బూడిద కాలుష్యం పూర్తి పరిమాణంలో ఉంటుంది.

ఈ బూడిదను నీటితో కలిపి పెద్ద పెద్ద చెరువులలో ఉంచుతారనీ, దానిని ముడిసరుకుగా వాడుకునే పరిశ్రమలు ఆ బూడిదను ఎప్పటికప్పుడు తీసుకుపోతుంటాయనీ, అందువల్ల బూడిద కాలుష్యం ప్రమాదం ఎక్కువ ఉండదనీ అంటారు గానీ ఇది చెప్పినంత సజావుగా జరగదని అనుభవం తెలుపుతుంది. రామగుండం థర్మల్ కేంద్రమే దీనికి ఉదాహరణ. ఎండల కాలంలో బూడిద ఎండి చుట్టూ ఉన్న ఆవాసాలపైన, పొలాలపైన మంచులాగ కమ్ముకొని అక్కడి వారి జీవితాన్ని దుర్భరం చేస్తుంది. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ సముద్రం పక్కన ఉంటుంది కాబట్టి, పగటి సమయంలో గాలి సముద్రం వైపు వీస్తుంది కాబట్టి, అక్కడ ఈ బూడిద సముద్రం మీదికి పోతుంది. దాంతోపాటు తీరంమీద నెలకొనబోయే జనావాసాల మానవ కాలుష్యమూ సముద్రంలోకే పోతుంది. ప్రాజెక్టు కాలనీ తీరానికి అర్ధ కిలోమీటర్ లోపలికి ఉండాలని పర్యావరణ అనుమతి పత్రం అంటుంది కాని దాని మురుగునీరు సముద్రంలోకి వెళ్ళదన్న భరోసా ఏమీ లేదు. అందువల్ల రాబోయే కాలంలో ఈ తీరంలో చేపల వేట సాధ్యపడదు. అంటే 16 గ్రామాల మత్స్యకారులూ తట్టాబుట్టా సర్దుకొని పిల్లాజెల్లాతో సహా వెళ్ళిపోవలసి ఉంటుంది. వాళ్ళకు థర్మల్ ప్రాజెక్టులోనో, పోర్టులోనో పనులు కల్పిస్తామన్న హామీ ఇచ్చి వాళ్ళ నోళ్ళు మూయించే ప్రయత్నం నాయకులు ఇప్పటికే చేస్తున్నారు. కాని ఇది వట్టి దగా. అభివృద్ధి పేరిట ఇప్పుడు మన నాయకులు రాష్ట్రంలోకి ఆహ్వానిస్తున్న ఏ పరిశ్రమలోనూ పెద్ద చదువులు లేని వారికి పిడికెడుకు మించి ఉద్యోగాలు ఇవ్వలేదు.

'ఇంకెక్కడన్నా పోయి చేపలు పట్టుకోండి' అంటుందేమో ప్రభుత్వం. ఎక్కడికి పోయినా ఇప్పటికే అక్కడ చేపల వేట చేస్తూ బతుకుతున్న వారు ఉండవచ్చు. అప్పుడు వారికీ వీరికీ కొట్లాట పెట్టడమే కదా ప్రభుత్వం చేసేది! ఎక్కడైనా ఖాళీ ఉన్నా అక్కడ నివాసానికి కాలనీ కావాలి, సహజంగా ఏర్పడిన రేవు లేకపోతే కనక జెట్టీ కావాలి. 'పునరావాసం' అనే మాటకేమైనా అర్థం ఉంటే ఇవన్నీ కల్పించాలి. అటువంటి ఆలోచనేదీ ప్రభుత్వం చేయడం లేదు. ఇటువంటి వాళ్ళకోసం జాతీయ పునరావాస విధానం రాబోతున్నదని చాలా ఏళ్ళుగా వింటున్నాం. అటువంటి బిల్లు ఒకటి ఇప్పుడు పార్లమెంటు ముందు ఉంది, త్వరలో అది చట్టం కాబోతున్నదని ప్రధానమంత్రి మొన్నటి గణతంత్ర దినోత్సవం నాడు అన్నారు. దానికేమీ తొందర లేదుగానీ ప్రాజెక్టులకు మాత్రం ఎక్కడలేని తొందర ఉంటుంది. ఆ బిల్లులో ఏముందో ప్రజలకు తెలీదు. అదింకా చట్టం కాలేదు. సమాజం దాని మంచి చెడులు చర్చించలేదు. అంత లోపల లక్షలాదిగా ప్రజల విస్థాపన మాత్రం జరిగిపోతుంటుంది.

కృష్ణపట్నం తీరప్రాంత మత్స్యకారులు ఈ వాస్తవాలను అర్థం చేసుకొని తమ హక్కులకూ, జీవనానికీ ఏ విలువా లేనట్టు నడుచుకుంటున్న ప్రభుత్వానికి ప్రజలంటే ఏమిటో, వారి సంకల్పం ఎటువంటిదో నేర్పించాలని కోరుతున్నాం. సమాజంలోని సకల ప్రజాతంత్ర శక్తులూ, మంచినీ మానవతనూ అభిమానించే వ్యక్తులూ వారికి అండగా నిలబడాలని కోరుతున్నాం.

నెల్లూరు జిల్లాశాఖ, 15-2-2008





## రిలయన్స్‌కు ఏ రూల్సూ వర్తించవా?

# జీవనం కోల్పోతున్న గాడిమొగ, భైరవపాలెం మత్స్యకారులు

**తా**ళ్ళరేవు మండలం గాడిమొగ దగ్గర నెలకొన్న రిలయన్స్‌వారి సహజవాయువు ప్రాజెక్టు రెండు మండలాలలో ఎంతలేదన్నా 12 వేల మత్స్యకారుల పొట్టగొట్టిన వైనం తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పుడందరూ ఎరిగినదే.

'రిలయన్స్‌ను కేంద్ర ప్రభుత్వమే ఏమీ చేయలేదు' అని జిల్లా అధికారులు నమ్మో నమ్మకో తమ అశక్తతను వ్యక్తం చేసినప్పటికీ మత్స్యకారులు మాత్రం నిస్సహాయంగా చేతులెత్తేయలేదు. తమ జీవనాన్ని పోగొట్టిన ప్రాజెక్టును వారు నిరసిస్తున్నారు, న్యాయం కోరుతున్నారు. ప్రతి రోజూ టి.వి. కెమెరాల ముందు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మీద నిప్పులు చెరుగుతూ దుమ్మెత్తి పోస్తూ కనిపించే ప్రతిపక్ష పార్టీలుగానీ, ఏ ప్రజాసంఘాలు వారికి అండగా రాకున్నా వారికి తెలిసిన పద్ధతిలో ప్రతిఘటిస్తున్నారు. ప్రతిఘటన మత్స్యకారులకు కొత్త కాదుగానీ తుఫానులను ప్రతిఘటించడం వేరు, పెట్టుబడిని ప్రతిఘటించడం వేరు. దీనికి తెలిసినన్ని కిటుకులు దానికేం తెలుసు?

రిలయన్స్ కిచ్చిన 217 ఎకరాల భూమిలో 80 ఎకరాలలో మడ అడవులుండేవి. తక్కిన భూభాగంలో చేపల చెరువులూ, రొయ్యల చెరువులూ ఉండేవి. మడ అడవులుండే భూమిని ఏ పరిశ్రమకైనా అప్పగించడం చట్టాల పరిధిలో అంత సులభంకాదు. ప్రభుత్వం ఒకవేళ చట్టాన్ని పక్కనపెట్టి అప్పగించేసినా కోర్టులు ఒప్పుకోవు. తీరప్రాంత పర్యావరణ రక్షణలో మడ అడవులకుండే ప్రాధాన్యం అటువంటిది.

అయినప్పటికీ రిలయన్స్‌కు ఆ భూమి అప్పగించారంటే దాని వెనకొక కథ ఉంది. మొదట ఆ భూమిని ప్రైవేటు భూమిగా చూపించి ఎవరి నుండో కొనుక్కున్నారు. స్థానిక సామాజిక కార్యకర్తలు ఆ విషయాన్ని గ్రహించి కోర్టులో కేసు వేయకపోతే కథ అక్కడితో అయిపోయేది. ఆ తరువాత ప్రభుత్వమే ఆ భూమిని రిలయన్స్ వారికి ఎకరా 50 వేలకు ఇచ్చేసింది. మడ

అడవులుండే భూమిని ఎట్లా ఇస్తారని ఎవరైనా అడగగలరని ఇచ్చినవారికీ, తీసుకున్నవారికీ కూడా తెలుసు. కాబట్టి రిలయన్స్‌వారే స్థానిక ప్రజలకు హెచ్చుకూలి ఇచ్చి రాత్రికి రాత్రే మడ అడవి మొత్తం కొట్టేయించారు. ఆ తరువాత పర్యావరణ నివేదిక తయారుచేసి బహిరంగ ప్రజావిచారణ చేపట్టారు. ఆ నివేదిక ప్రకారం రిలయన్స్‌కిచ్చిన భూమికి మూడు హద్దుల వెంబడి మడ అడవులున్నాయి గానీ (నాలుగవ హద్దు తాళ్ళరేవు – భైరవపాలెం రోడ్డు) ఆ భూమిలో మాత్రం మడ అడవులు లేవు. చుట్టూ ఉన్న మడ అడవులకు నష్టం కలిగించని పద్ధతిలో రిలయన్స్ వారు పర్యావరణ రక్షణ చేపట్టాలన్న షరతులతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తన సమ్మతి వెనువెంటనే తెలిపేసింది.

## తుఫానులకు ఇంత తెలివెక్కడిది?

అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖకు సందేహం వచ్చింది. వారి దగ్గరున్న మ్యాపులను చూస్తే ఈ ప్రాంతంలో గోదావరి నదికి ఉత్తరాన, నది ఒడ్డుదాకా, కోరింగ అభయారణ్యం అనే రక్షిత ప్రాంతం ఉండాలంట. దానిలో అరుదైన జంతుజాతులు, మడ అడవులు ఉండాలంట. కానీ పర్యావరణ అనుమతికోసం రిలయన్స్ వారు పంపిన ప్రతిపాదనతో జతచేసిన మ్యాపులో ఆ అభయారణ్యం ప్రస్తావనే లేదట. దీని సంగతేమిటి మహాశయా అని వారు రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణాధికారిని అడిగారు.

ఆ అధికారి ఈ ప్రశ్నలకు తొణకలేదు, బెణకలేదు. మ్యాపులో అభయారణ్యం ఎందుకు లేదన్న ప్రశ్నకు జవాబు చెప్పకుండా, అభయారణ్యానికి గానీ, రిజర్వ్ ఫారెస్టుకు గానీ నష్టం వాటిల్లకుండా రిలయన్స్‌వారు సహజవాయువు పైప్‌లైన్లను నది గర్భంగుండా తీసుకురావడం ద్వారా 'తగు జాగ్రత్తలు తీసుకుంటారని మాకు అనిపిస్తున్నది' అనీ, వారికి అప్పగించిన భూమి పరిసరాలలో పాడైపోయిన మడ అడవులున్నాయి కాబట్టి రిలయన్స్‌వారు వాటిని ఉద్ధరించడానికి ప్రయత్నించడం అభిలషణీయమనీ, మొత్తంమీద 'కోరింగ అభయారణ్యానికి చెప్పుకోదగ్గ హాని జరగదని నమ్మకంగా చెప్పగలం' అనీ జవాబు చెప్పారు. మ్యాపులో చూపించని అభయారణ్యానికి హాని జరగడం ఏమిటి, జరగకపోవడం ఏమిటి?

ఇంకెప్పుడైనా అడవిలో చెట్లు నరికారని పేదల మీద కేసులు పెట్టినప్పుడు ఈ కథ జ్ఞాపకం చేసుకుందాం.

ఈ విధంగా దొడ్డిదారిన భూమి పొందిన రిలయన్స్‌వారు ఆ 217 ఎకరాలనూ చదును చేసి తమ పరిశ్రమ నిర్మాణం మొదలుపెట్టారు. అప్పటివరకు అక్కడ కొన్ని చేపల చెరువులూ, రొయ్యల చెరువులూ ఉండేవని చెప్పాము కదా. తాళ్ళరేవు మండలం గోపాలపురానికి చెందిన దళితులూ, ఇతర పేదలూ ఆ చెరువులలో కూలి చేసుకుని జీవనం పొందేవారు. మొత్తం 70 మందికి జీవనం దొరికేది. రిలయన్స్‌వారు ఆ భూములు తీసుకున్న తరువాత చెరువుగట్లన్నీ తెంపేసి నేలంతా చదును చేశారు. గోపాలపురం పేదలకు జీవనం పోయింది.

చట్టం పరిభాషలో వారు ప్రాజెక్టు నిర్వాసితులు కారు గానీ ప్రాజెక్టు బాధితులు. అంటే వాళ్ళ గుడిసెలు పదిలంగానే ఉన్నాయి గానీ పని పోయింది. 2005 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నెం. 68 ప్రకారం వారికి 750 రోజుల దినకూలి నష్టపరిహారంగా దక్కాలి. కానీ అటువంటి జీవో ఒకటి లేనట్టు, గోపాలపురం పేదలకు ఏ హక్కులూ లేనట్టు జిల్లా అధికారులు నటిస్తున్నారు. అటువంటి జీవో ఉందని జనానికి కూడా తెలీదు కాబట్టి వాళ్ళూ ఆ హక్కు అడగలేదుగానీ మా గతేమిటని మాత్రం అడిగారు. రిలయన్స్‌వారి పరిశ్రమలో మీకు ఉద్యోగాలొస్తాయని జవాబు చెప్పారు. ప్రస్తుతం నడుస్తున్న



కట్టడం పనులలో గోపాలపురానికి చెందిన 20 మందికి మాత్రమే కాంట్రాక్ట్ కార్మికులుగా పని దొరికింది. కట్టడం పని అయిపోయిన తరువాత అదీ ఉండదు.

ఇక మత్స్యకారుల విషయానికొస్తే, దాదాపు 12,000 జనాభా గల రెండు గ్రామ పంచాయతీల వారు తమ జీవనాన్ని కోల్పోయారు. ఆ గ్రామాలు తాళ్ళరేవు మండలానికి చెందిన గాడిమొగ, ఐ.పోలవరం మండలానికి చెందిన భైరవపాలెం. ఆ జనం సముద్రంలోనూ, అక్కడికి సమీపంలో సముద్రంలో కలిసే గాడేరు, నీలారం నదులలోనూ చేపలు, రొయ్యలు పట్టుకొని జీవించేవారు. మంచి ఆదాయం పొందేవారు. ఆ నదులలోకి నీళ్ళు తెచ్చే కాలవలన్నిటినీ రిలయన్స్‌వారు నేల చదును చేసే క్రమంలో మూసేశారు. నేల చదును చేయడానికి కావలసిన మట్టిని గాడేరు సముద్రాన్ని కలిసే చోట డ్రెడ్జర్ల సహాయంతో తవ్వి తీశారు. ఈ పనిలో డ్రెడ్జర్లు (తవ్వోడలు) అటూ ఇటూ తిరగడంతో గాడేరులో ఇసుక అడ్డదిడ్డంగా మేటవేసింది. వేటకోసం బయలుదేరిన మత్స్యకారుల పడవలు మేటవేసిన ఇసుకలో చిక్కుకు పోసాగాయి. తవ్వోడల హడావుడి వల్ల చేపలు తదితర జలచరాల పునరుత్పత్తి బాగా దెబ్బతింది. వేగంగా దూసుకుపోయే రిలయన్స్ కంపెనీ వారి పడవల దెబ్బకు మత్స్యకారులు విసిరిన వలలు తెగిపోసాగాయి.



ఇదంతా సహజవాయువు సరఫరా మొదలుకాకముందే జరిగిపోయింది. 'ఆన్‌షోర్' కట్టడాల నిర్మాణం జరుగుతున్న దశలోనే జరిగిపోయింది. ఈ నష్టాన్ని కాదనలేకపోయిన ప్రభుత్వం, ఇది కేవలం కట్టడపు పనుల దశలోనే జరుగుతుందనీ, ఆ తరువాత తవ్వోడల హడావుడి ఉండదు కాబట్టి మత్స్యకారులు స్వేచ్ఛగా వేట చేసుకోవచ్చుననీ చెప్పి, 6 నెలల కాలానికి ఒక్కొక్క నావకు నెలకు 6,000 రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించే ఏర్పాటు చేసింది. అయితే ఇది కూడా సమంగా జరగలేదు. ఇన్స్యూరెన్స్‌గానీ, మత్స్యశాఖ గుర్తింపు కార్డు గానీ ఉంటేనే లెక్కలోకి తీసుకుంటామని చెప్పి గాడిమొగలో ఉన్న 600 నావలకు గాను 150 నావలకు, భైరవపాలెంలోని 776 నావలకు గాను 400 నావలకు మాత్రమే ఈ నష్టపరిహారం పరిమితం చేశారు.

అసలు సమస్య ముందుంది. ఆఫ్ షోర్ (సముద్రంలో) డ్రిల్లింగ్ చేసి వెలికితీసే సహజవాయువును, కొంత పెట్రోలియంను రిలయన్స్‌వారు గొట్టాలద్వారా గాడిమొగ వద్ద నిర్మిస్తున్న ఆన్‌షోర్ (సముద్రతీరం మీదనున్న) ప్రాసెసింగ్ కేంద్రానికి తీసుకురావాలి. చుట్టూ ఉన్న రిజర్వ్ ఫారెస్టు, మడ అడవులు, కోరింగ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలకు నష్టం కలిగించకుండా ఉండవలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పైపులైన్లను నీటిలో నుండి వేసి గాడిమొగవద్ద తీరం మీదికి తీసుకురావాలని ప్రతిపాదించారు. సముద్ర గర్భంలోను, నది గర్భంలోను నేలకింద ఒకటిన్నర మీటర్ల లోతున ఈ పైప్‌లైన్ వేయబడుతుంది. పైప్‌లైన్ నీటికింద నేలలో పూడ్చి పెట్టబడుతుంది కాబట్టి సముద్ర జీవులకేమీ కష్టం కలగదని రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణాధికారి అంటాడు గానీ ఈ పైప్‌లైను వేసేటప్పుడు, ఆ తరువాత దాని సంరక్షణ చేసేటప్పుడు కంపెనీ పడవల హడావుడి చాలా ఉంటుందని, మత్స్యకారుల పడవలు స్వేచ్ఛగా తిరగలేకపోవచ్చునని ఆయనే ఒప్పుకుంటాడు. ఈ హడావుడి వల్ల నీళ్ళు బురదై

జలజీవాల పునరుత్పత్తి దెబ్బతినగలదని పర్యావరణ అనుమతిపత్రం గుర్తించింది. పైప్‌లైన్ల ద్వారా సహజ వాయువేకాక పెట్రోలియం కూడా కొంత వెలికి తీయబడుతుంది కాబట్టి పెట్రోలియం ప్రమాదవశాత్తు నీటిలోకి ఒలికిపోయే ప్రమాదం (ఆయిల్ స్పిల్) లేకపోలేదని కూడా పర్యావరణ అనుమతి పత్రం గుర్తించింది. అది ఒక్కసారి జరిగితే ఇంక ఆ నీళ్ళు నీళ్ళుకావు. ఆయిల్ స్లిప్ ఎప్పుడోగానీ సంభవించకపోవచ్చును గానీ రసాయన కాలుష్యం, డ్రైనేజీ నీటి కాలుష్యం మాత్రం నిత్యం ఉంటాయి. నీటి సహజత్వం, నీటి ప్రవాహం సహజత్వం ధ్వంసం అవుతాయి. ఆ తరువాత గాడిమొగ, భైరవపాలెం గ్రామాల మత్స్యకారులు అక్కడ రొయ్యలు, చేపలు పట్టుకొని బతకడం కల్ల.

వాళ్ళంతా ఏం కావాలి అన్న ప్రశ్న ప్రభుత్వానికి అక్కరలేదా? దేశ అభివృద్ధికి కావలసిన ఇంధనాల వెలికితీత కోసం నదులనూ, సముద్రాలనూ, అడవులనూ, సమస్త ప్రకృతినీ రిలయన్స్ వంటి కంపెనీల చేతిలో పెట్టడం తప్పనిసరి అని భావించేటట్టయితే, ఆ ప్రకృతి పైన ఆధారపడి బతుకుతున్న ప్రజల జీవనాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వం మీద లేదా? 60 సంవత్సరాల స్వతంత్ర భారతంలో అభివృద్ధి నిమిత్తం భూములూ వనరులూ జీవన అవకాశాలూ కోల్పోయిన ప్రజలకొక పునరావాస హక్కంటూ ఇంతవరకు కల్పించలేదు. లక్షలాది ప్రజానీకాన్ని భిక్షగాళ్ళను చేస్తూ 'దేశాన్ని' అభివృద్ధి చేస్తున్నారు. అడవి ప్రాంతాలలో ఆదివాసులు, తీరప్రాంతాలలో మత్స్యకారులు భారీగా దీనికి మూల్యం చెల్లించారు. ఇది అన్యాయమని ఆందోళన చేయగా చేయగా ప్రాజెక్టు బాధితుల పునరావాసానికొక విధానం రూపొందిస్తున్నామని కొంతకాలంగా అంటూ వస్తున్నారు. అదెప్పటికీ 'జరగబోతూ' ఉంటుంది గానీ ఈ లోపల అభివృద్ధి పేరిట ప్రజల విస్థాపన మాత్రం 'జరిగిపోతూ' ఉంటుంది. ప్రజలు నోరులేని జీవాలలాగ తలవంచి ఊళ్ళు ఖాళీ చేస్తున్నంతకాలం ఈ వంచన సాగుతుంది. సాగనివ్వమని బాధితులే కాదు బాధితుల తరపున యావత్ సమాజం లేచి నిలబడిన రోజున మాత్రమే అభివృద్ధిని గురించి మానవీయంగా ఆలోచించడం పాలకులు నేర్చుకుంటారు.

తూర్పుగోదావరి జిల్లాశాఖ, 20-2-2008





## ప్రత్యేక ఆర్థిక మండలుల (సెజ్) చట్టాన్ని రద్దు చేయాలి

# అభివృద్ధి పేరిట ప్రకృతి వనరుల దోపిడీని ఆపాలి

**ప్రజలారా!**

ప్రత్యేక ఆర్థిక మండలులు (సెజ్‌లు) ఈ మధ్య కాలంలో తరచుగా వార్తలలో ఉంటున్నాయి. సెజ్‌కు భూములు అప్పగించం అని ఎదురు తిరిగిన ప్రజలను ప్రభుత్వాలు కాల్పులు, లాఠీ దెబ్బలు, అరెస్టులతో అణగదొక్కడం చూస్తున్నాం. నందిగ్రాం కాల్పులు దేశమంతటి దృష్టినీ ఆకర్షించగా మన రాష్ట్రంలో కాకినాడ సమీపంలో జరిగిన అరెస్టులు రేపు ఇంకేం జరగబోతుందో అన్న ఆందోళన కలిగించాయి.

ఎగుమతులను ప్రోత్సహించడం కోసం కంపెనీలకు సకల సదుపాయాలూ, అనేక రాయితీలూ కల్పించే ఆలోచన సెజ్‌లకు మూలం. దీనికోసం పార్లమెంటు 2005లో సెజ్ చట్టం చేసింది. ఆ తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టానికి అనుబంధంగా నియమాలు ప్రకటించాయి. అయితే ఈ విధంగా చెప్పుకుంటే సెజ్ వ్యవస్థలోని దుర్మార్గం అర్థంకాదు. ఎంత ఆర్థిక క్రమశిక్షణ పాటించినా దేశానికి విదేశీ మారకద్రవ్యం అవసరమే కాబట్టి, ఎగుమతులు చేయగల సంస్థలకు రాయితీలిస్తే తప్పేముంది అనగలరు. అందుకే సెజ్ వ్యవస్థ గురించి కొంచెం వివరంగా తెలుసుకోవాలి.

ఎగుమతులు బాగా చేయగల సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడం సెజ్ వ్యవస్థ ప్రకటించుకున్న లక్ష్యమైనప్పటికీ, మొదట రంగంలోకి దిగేది అటువంటి సంస్థలు కాదు. కొన్ని వేల ఎకరాలు (12,500 ఎకరాల దాకా ఉండవచ్చు) చేతబట్టుకుని, ఎగుమతులు చేయగల సంస్థలను పిలుచుకొచ్చి సెజ్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చే డెవెలపర్ మొదట రంగంలోకి దిగుతాడు. ఇతను వ్యక్తి కావచ్చు, కంపెనీ కావచ్చు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ కావచ్చు, రాష్ట్ర ప్రభుత్వమే కావచ్చు. లేక రాష్ట్ర ప్రభుత్వమో, రాష్ట్రప్రభుత్వ సంస్థో తొలుత చట్టం కళ్ళు కప్పడానికి డెవెలపర్‌గా ముందుకొచ్చి ఆ తరువాత అస్మదీయుడైన వ్యాపారవేత్తను కో-డెవెలపర్‌గా సరసన చేర్చుకోవచ్చు.

సీలింగ్ చట్టాలు వచ్చిన తరువాత అంత భూమి ఎవరి దగ్గరా ఉండదు కదా! మరి డెవెలపర్ దగ్గర అంత భూమి ఎక్కడినుండి వస్తుంది? ఇదొక మాయ. సెజ్ చట్టం ఈ ప్రశ్న వేసుకోదు, జవాబు చెప్పదు. సెజ్‌ల కోసం భూములెక్కడి నుండి వస్తాయన్న ప్రస్తావన ఆ చట్టంలో ఎక్కడా లేదు. తెరతీసేసరికీ వేల ఎకరాలు చంకకింద పెట్టుకున్న డెవెలపర్ స్టేజి మీద ఉంటాడు.

ఈ మాయ గురించి మరికొన్ని మాయమాటలు మీడియాలో వింటున్నాం. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీగారు, జైరాం రమేశ్ వంటి కాంగ్రెస్ ప్రముఖులూ సెజ్‌ల కోసం ప్రభుత్వాలు భూసేకరణ చేయకూడదని, కంపెనీలు లేదా డెవెలపర్ స్వయంగా రైతుల నుండి కొనుక్కోవాలని అనడం వింటున్నాం. రైతులేమైనా పిచ్చివాళ్ళా అడిగిన వాడికి భూములమ్మేయడానికి? ఆ సలహాయే పాటిస్తే దేశంలో ఇప్పటికే అనుమతి పొందిన వందలాది సెజ్‌లు సాధ్యమయ్యేవా?

చెప్పేదొకటి, చేసేదొకటి. డెవెలపర్‌గారే రైతుల దగ్గర కొనుక్కోవడం అంటే ఎట్లాగుంటుందో తెలుసుకోవాలంటే కాకినాడకు పోవాలి. కాకినాడ పోర్ట్ ఆధారిత సెజ్ పేరిట ఏర్పడుతున్న 10 వేల ఎకరాల మండలిని చూడాలి. మొదట కొంతమంది దగ్గర కొన్ని ఎకరాలు డెవెలపర్ కె.వి.రావు స్వచ్ఛందంగానే కొన్నాడు. భూములమ్ముకొని బయటపడదామని ఎదురుచూసే వారు ఏ ఊరిలోనైనా కొంతమంది ఉంటారు. పట్టణాలలో వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకుంటూ ఉండి వ్యవసాయ భూమిని కౌలుకిచ్చి కౌలుదార్లతో వేగలేక ఎప్పుడు అమ్ముకొని పోదామా అని ఎదురుచూసే వారుంటారు. వారి నుండి కె.వి.రావు ఎకరానికి 3 లక్షలిచ్చి మొదట కొంత భూమి కొన్నాడు. ఆ తరువాత పక్క భూమి యజమానిని కె.వి.రావు మనుషులు, రెవిన్యూ సిబ్బంది బెదిరించడం మొదలుపెట్టారు. కె.వి.రావుకే అమ్మేస్తే ఈ 3 లక్షలొస్తాయి – లేకపోతే ప్రభుత్వం లక్ష చిల్లరకు బలవంతంగా స్వాధీనం చేసుకొని కోర్టుల చుట్టూ తిప్పుతుంది అన్నారు. అబద్ధాలూ చెప్పారు. 'అరే! నీ పొలం చుట్టూ ఉన్న భూమి అంతా అమ్మేశారే. నువ్వొక్కడివే ఉండిపోయావు. నీ పొలం చుట్టూ సెజ్ వచ్చాక నువ్వేం వ్యవసాయం చేస్తావు?' అని బుకాయించారు. అది అబద్ధం అని ఆ రైతు గ్రహించే లోపల అమ్మకం జరిగిపోయి ఉంటుంది.

అయితే అన్ని చోట్లా డెవెలపరే కొనుక్కోవాలి అన్న నియమాన్ని పాటించడం లేదు. డెవెలపర్ కోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తే అది చట్టం కళ్ళలో చెల్లుబాటు కాకపోవచ్చు కాబట్టి మధ్యేమార్గంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వసతుల కార్పొరేషన్ (ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ – ఎ.పి.ఐ.ఐ.సి)ని రంగంలోకి దింపుతున్నారు. ఈ సంస్థ పరిశ్రమలను అభివృద్ధి చేయడంకోసం ఏర్పడింది కాబట్టి దాని చేతిలో భూమి పెట్టడానికి బలవంతపు భూసేకరణ చేపడితే అది చట్టం కళ్ళలో చెల్లుబాటవుతుందని ప్రభుత్వం భావన. విశాఖపట్నం దగ్గర రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో చేపట్టిన సెజ్ విషయంలో ఈ మార్గమే అనుసరించింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ విధంగా చేజిక్కించుకున్న భూమిలో ఎ.పి.ఐ.ఐ.సి. తానే డెవెలపర్ అవతారం ఎత్తవచ్చు లేదా మరొక వ్యక్తినో కంపెనీనో కో–డెవెలపర్‌గా పక్కన తెచ్చుకొని కూర్చోబెట్టుకోవచ్చు.

ఈ విధంగా మోసం చేసో, భయపెట్టో, భ్రమలు పెట్టో వేల ఎకరాల భూమి చేజిక్కించుకున్న డెవెలపర్ సెజ్ నాటకం తెరతీసేసరికి రంగం మీద ఉంటాడని చెప్పాము కదా. ఇతనిది నిష్కామకర్మ కాదు. అంటే చేజిక్కించుకున్న వేల ఎకరాలన్నీ ఎగుమతులు చేసే కంపెనీలకు అప్పగించి ఖర్చుమీద అయిదు శాతమో, పది శాతమో వారినుండి తీసుకొని ఇల్లు చేరుకునే పాత్రకాదు (ప్రస్తుత రాజకీయార్థిక



వాతావరణంలో దీనిని నిష్కామకర్మ అనవచ్చు. ఆంగ్లంలో ఫెసిలిటేటర్ అన్నమాట వాడుతున్నారు). సెజ్ భూభాగంలో 25 నుండి 35 శాతం మాత్రమే వస్తువులు లేక సేవలు ఉత్పత్తిచేసే ఆర్థిక సంస్థలుంటాయి. తక్కిన 65 నుండి 75 శాతం భూభాగంలో దానికి అనుబంధ వసతుల అభివృద్ధిని డెవెలపర్ చేపడతాడు. వసతులు అంటే రోడ్లు, కరెంటు తీగలు, నీళ్ళ పైప్‌లైన్లు మాత్రమే అనుకునేరు. అదేంకాదు. సకల 'పారిశ్రామిక, వ్యాపార, సామాజిక వసతుల' అభివృద్ధీ దానిలో భాగమేనని సెజ్ చట్టం సెక్షన్ 2(ఎస్)లో అంటుంది. వైద్య సదుపాయాలు, విద్యాసంస్థలు, కాలక్షేప వ్యవస్థ, నివాసాలు, వ్యాపార కేంద్రాలు అన్నీ అందులో భాగమేనంటుంది. అంటే డెవెలపర్ చేసేది ప్రధానంగా ఎగుమతి సంస్థలకు దారి సుగమం చేయడం కాదు. అది అతనికి సంబంధించినంతవరకు అనుబంధ కార్యక్రమం మాత్రమే. అతను ప్రధానంగా చేసేది వసతుల అభివృద్ధి పేరు మీద రియల్ ఎస్టేట్ వ్యాపారం. అదికూడా అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఉండాలి. అంటే ఒక్కొక్క సెజ్ ఒక చిన్నపాటి అమెరికా పట్టణంలాగ ఉంటుంది. చుట్టూ (ఇంకా మిగిలి) ఉన్న పల్లెలకు రోజుకు ఆరు గంటలు కూడా కరెంటు దక్కకపోవచ్చు. ఇక్కడ మాత్రం ఇరవై నాలుగు గంటలూ ఉంటుంది. ఇక్కడ నల్లాలో నాలుగుసార్లు కాచి చల్లార్చిన నీళ్ళు నిరంతరాయంగా ప్రవహిస్తాయి. చుట్టూ (ఇంకా మిగిలి) ఉన్న పల్లెలలో కాలిబాటలూ, బండ్లబాటలూ మాత్రమే ఉండవచ్చు. ఇక్కడ టాటా వారి చిన్నకారు పల్టీలు కొట్టేంతటి నున్నటి రోడ్లుంటాయి.

ఇదంతా ఎగుమతులను ప్రోత్సహించే పేరుమీద జరుగుతుంది. దేశంలో ఇప్పటికే వందల సంఖ్యలో సెజ్‌లు ఆమోదం పొందాయంటే కారణం ఎగుమతి సంస్థల ఉత్సాహమా లేక డెవెలపర్‌ల రియల్ ఎస్టేట్ దాహమా? ఈ రియల్ ఎస్టేట్ అభివృద్ధి సెజ్‌లో 25 లేక 35 శాతం భూభాగంలో ఉండే ఉత్పత్తి లేక సేవారంగ సంస్థకు అనుబంధంగా జరుగుతుందని పైన అన్నాము. కానీ అన్ని విషయాలూ స్పష్టంగా వివరించే సెజ్ చట్టం ఈ రియల్ ఎస్టేట్ వ్యవహారం (లేక వ్యాపార, సామాజిక వసతుల అభివృద్ధి) ఆ ఆర్థిక సంస్థ సిబ్బంది, అధికారుల అవసరాలకు మాత్రమే పరిమితం కావాలని చెప్పలేదు. అది దానంతటదే ఒక లాంకోహిల్స్, ఒక సింగపూర్ సిటీలాంటి విలాసవంతమైన టౌన్‌షిప్ కాగలదు. డెవెలపర్ అక్కడి భూములను ఎవరికీ అమ్ముకోవడానికి వీలులేదుగానీ లీజుకిచ్చుకోవచ్చు. నిర్మాణాలు చేపట్టి కిరాయికిచ్చుకోవచ్చు. ఎంత మందినైనా కో–డెవెలపర్లుగా చేర్చుకొని వ్యాపారంలో భాగం చేసుకోవచ్చు.

ఈ కార్యక్రమానికి అవసరమైన అన్ని సదుపాయాలూ అందిస్తామని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలి. ముఖ్యంగా విద్యుత్ సరఫరాకు, నీటి సరఫరాకు హామీ ఇవ్వాలి. భూసేకరణకు సహకరించాలి. అప్పుడే సెజ్‌కు ఆమోదం లభిస్తుంది. రంగం మీదికొచ్చిన డెవెలపర్ ఒక చేతిలో వేల ఎకరాల యాజమాన్య పత్రాలు, మరొక చేత రాష్ట్ర ప్రభుత్వ సమ్మతి పత్రం పట్టుకొని ఉంటాడు. అప్పుడే కేంద్ర ప్రభుత్వం అతని ప్రతిపాదనను ఓకే చేస్తుంది.

కోట్ల ధనం పెట్టుబడులు పెట్టి మరిన్ని కోట్లు సంపాదించుకోవడానికి ధనవంతులకు మహదవకాశమైన ఈ ప్రక్రియ కోసం జనం ఊళ్ళకు ఊళ్ళు ఖాళీ చేసి ఎందుకు

వెళ్ళిపోవాలి? ఈ సందర్భంగా మరికొన్ని మాయమాటలు కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల నుండి వింటున్నాం. సెజ్‌ల కోసం సారవంతమైన భూములు సేకరించడం జరగదనీ సారహీనమైన భూములు, బంజరు భూములు మాత్రమే సేకరించడం జరుగుతుందని చెప్పగా వింటున్నాం. భూమి సారవంతమైనదైనా సారహీనమైనదైనా దానిమీద ఆధారపడిన వారికి అదే జీవనం. యజమానికైనా అదే, ఆ భూమిలో కూలి చేసుకుని బతికే వారికైనా అదే. సారవంతమైన భూమి సేకరిస్తే కనీసం నష్టపరిహారం ఎక్కువ రాగలదు. సారహీనమైన భూమికి అదికూడా రాదు. బంజరు భూమి అంటే వ్యవసాయానికి పనికి రాదేమోగానీ దేనికీ పనికిరాదని  కాదు. పశువుల కాపర్లకు, కల్లుగీత కార్మికులకు, వాగులలో కుంటలలో చేపలు పట్టుకునే మత్స్యకారులకు, రాళ్ళుకొట్టి అమ్ముకునే వడ్డెరలకు బంజర్లే జీవనాధారం. పేదలకు పొయ్యిలో కట్టెకు, గుడిసె వాసాలకు, స్తంభాలకు బంజర్లే ఆధారం.

కాగా, ఏరి ఏరి సారహీనమైన భూమిని మాత్రమే సెజ్‌లకు ఇవ్వడం సాధ్యంకాదు. సెజ్‌కోసం డెవలపర్ ప్రతిపాదించే భూమి అవిచ్ఛిన్నమైనదిగా ఉండాలని ఆ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నియమాలలోని నియమం 5(2)(ఎ) అంటుంది. అంతేగాక ఒక్కొక్క సంస్థ ఒక్కొక్క చోట ఉండి ఒక్కొక్క దానికోసం విడివిడిగా వసతులు అభివృద్ధి చేయడం కంటే అన్నీ గుంపుగా ఒకేచోట ఉండి అన్నిటికోసం ఉమ్మడిగా ఎగుమతులు అభివృద్ధి చేయడం పొదుపరితనం అన్న వాదన సెజ్‌లకు మద్దతుగా చేస్తున్న ప్రధానమైన వాదనలలో ఒకటి. కాబట్టి సారవంతమైన భూములను సెజ్‌ల నుండి మినహాయించాలన్నది ప్రజలను మభ్యపెట్టడానికి కాంగ్రెస్ పెద్దలు చేస్తున్న ఓదార్పు ప్రవచనమే తప్ప సెజ్‌ల భావనకు అతికే అభిప్రాయం కాదు. ఆచరణీయం అసలేకాదు. కాబట్టి సెజ్‌లకోసం ఊర్లకు ఊర్లు ఖాళీ కావలసిందే.

మరైతే ప్రజలకు ఆగ్రహం కలగడం సహజం కాదా? సెజ్‌ల ఉద్దేశం మంచిదే అని కొంచెం సేపు అనుకున్నా, దానికోసం తమకు జీవనం ఇస్తున్న భూములు అప్పగించి వెళ్ళిపోయి వాళ్ళు ఎక్కడ బతకాలి? ఏం చేసుకొని బతకాలి? స్వంత భూములకు, ఇళ్ళకు 1894 నాటి భూసేకరణ చట్టం కింద కొంత నష్టపరిహారం ఇస్తారు. అది వలసకాలంనాటి చట్టం అని గుర్తించి దానినే ఇంకా వినియోగించడాన్ని ఇప్పుడందరూ విమర్శిస్తున్నారు. అయితే ఆ వలసకాలం నాటి చట్టం సెజ్‌ల కోసం, అంతర్జాతీయ విమానాశ్రయాల కోసం, పోలవరం వంటి భారీ ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేయడానికి ఉద్దేశించినది కాదు. అప్పట్లో వలస పాలకులకు భారీ ప్రాజెక్టు కట్టే ప్రణాళిక లేదు. ఊరుమ్మడి అవసరాలకోసం ఒక రోడ్డు వేయడానికి, ఒక స్కూలో, ఆస్పత్రో కట్టడానికి, ఏదైనా ప్రభుత్వ కార్యాలయం నిర్మించడానికి భూమి అవసరమైనప్పుడు ఆ ఊరిలో అనువైనచోట ప్రభుత్వ భూమి లేనట్టయితే, రైతులెవ్వరూ స్వచ్ఛందంగా ఇవ్వడానికి ఇష్టపడకపోతే, కొంత నష్టపరిహారం ఇచ్చి బలవంతంగా భూమి సేకరించడం కోసం 1894 నాటి భూసేకరణ చట్టం ఉద్దేశించబడింది. స్వాతంత్ర్యం వచ్చాకే దానిని భారీ ప్రాజెక్టులు, పరిశ్రమల కోసం చేసే భూసేకరణకోసం వినియోగించడం మొదలయింది. ప్రజావసరాల కోసమే కాక కంపెనీల కోసం కూడా భూసేకరణ ఆ చట్టం కింద చేయవచ్చునని 1984లో పార్లమెంటు సవరణ తీసుకొచ్చింది.

ఇప్పుడు మొత్తంగానే భూసేకరణ ప్రక్రియను తిరగరాసి మానవీయమైన పద్ధతిని ప్రవేశ పెట్టబోతున్నారని వింటున్నాం. ఒక కొత్త బిల్లు పార్లమెంటు ముందు ఉంది. దానిని పార్లమెంటు చర్చించి అనుమతిస్తుందో లేక రాజకీయ వివాదాల నడుమ సమయం లేక చర్చించకుండానే అనుమతిస్తుందో



తెలీదు. పార్లమెంటు చర్చించినా చర్చించకున్నా సమాజానికి ఆ బిల్లు చట్టం కాకముందే దానిలో ఏముందో తెలియాలి. దానిని చర్చించే అవకాశం ఉండాలి. కాగా, ఇప్పటిదాకా నష్టపరిహారం స్థిరాస్తుల మీద యాజమాన్య హక్కు ఉన్న వారికే పరిమితం అయింది. యాజమాన్య హక్కు లేకుండా ప్రకృతి వనరుల పైన ఆధారపడి బతికేవారికి అటువంటిదేం లేదు. వివిధ రాష్ట్రాలు అడపా దడపా ఈ వర్గాలకు కూడా కొంత నష్టపరిహారం, ఒక పునరావాస కాలనీ కట్టిచ్చే విధానాలను రూపొందిస్తున్నాయి. మన రాష్ట్ర ప్రభుత్వం 2005లో జి.వో. నెం. 68 రూపంలో అటువంటి విధాన ప్రకటన చేసింది. అయితే నిర్వాసితులకు పునరావాస హక్కు కల్పించే చట్టమొకటి కేంద్ర ప్రభుత్వమే తీసుకొస్తున్నదని చాలాకాలంగా వింటున్నాం. ఇది కూడా ఇప్పుడు బిల్లు రూపంలో పార్లమెంటు ముందు ఉంది. దీనిని కూడా సమగ్రంగా చర్చించే అవకాశం, సవరణలు సూచించే అవకాశం సమాజానికి ఉండాలి.

నష్టపరిహారం, పునరావాసాల విషయంలో చట్టాలు అసమగ్రంగా అసంతృప్తికరంగా ఉన్న విషయం గుర్తించామని చెప్తున్న వారు కొత్త విధానాలూ, చట్టాలూ ఇంకా రూపొందే దశలో ఉండగానే లక్షలాది ఎకరాలను సెజ్‌ల పేరిట, ఇతర 'అభివృద్ధి' కార్యకలాపాల పేరిట కోటీశ్వరులకు ధారాదత్తం చేసి ప్రజలను ఆ భూముల నుండి బలవంతంగా నెట్టివేయడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

ఇది చాలక ఉద్యోగావకాశాల గురించి ఆడుతున్న అబద్ధాలొకటి. మన ముఖ్యమంత్రి గారైతే లక్షల సంఖ్యకు తగ్గడు. తాను చేపడుతున్న 'అభివృద్ధి' కార్యకలాపాలవల్ల 25 లక్షల ఉద్యోగాలొస్తాయని పదే పదే ప్రకటిస్తున్నాడు. ఏ సెజ్‌లోకి ఏ కంపెనీ రాబోయేదీ, ఏం తయారుచేయబోయేదీ, ఎన్ని పనులు కల్పించబోయేదీ తెలియనప్పుడు ఎంతమందికి ఉద్యోగాలొస్తాయో ఎట్లా చెప్పగలడు? ఉద్యోగాలు అనేదాంట్లో అన్ని రకాల ఉపాధి అవకాశాలనూ – సెజ్ గేటు బయట పాన్‌డబ్బా పెట్టుకునే అవకాశంతో సహా – లెక్కిస్తున్నాడనే ఉదారంగా భావిద్దాం. అయినప్పటికీ ఎంతమందికి పని దొరికేదీ ఆయనకెట్లా తెలుసు? అయినా ఎగుమతులకోసం ప్రధానంగా ఉద్దేశించిన సెజ్‌లలో ఆటోమేటిక్ ప్రక్రియలననుసరించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులకే తప్ప వందల మందికి పనులు కల్పించే పాతకాలపు ఉత్పత్తి విధానాలకు చోటులేదు. నెల్లూరు జిల్లా మాంబట్టులో మామూలు పరిశ్రమగా మొదలై సెజ్‌గా రూపాంతరం చెందిన అపాచీ పాదరక్షల కంపెనీ 35 వేల ఉద్యోగాలు కల్పిస్తుందన్న హామీతో మొదలై ఇప్పుడు 5,000 మందికి మాత్రమే కల్పిస్తున్నది. అందులో నిర్వాసితులు 200 మంది కూడా లేరు.

ఒకవేళ పనులంటూ దొరికినా సెజ్‌లలోని పని పరిస్థితులేమిటి? సెజ్‌లోని కంపెనీలను ఏ చట్టం నుండైనా పూర్తిగాగానీ, పాక్షికంగాగానీ ఒక నోటిఫికేషన్ (ఆదేశం) ద్వారా ప్రభుత్వం మినహాయించవచ్చునని సెజ్ చట్టంలోని సెక్షన్ 49(1) అంటుంది. దాని తరువాత వచ్చే 49(2) విచిత్రమైనది. కార్మిక చట్టాల నుండి సెక్షన్ 49 (1) కింద ఏదైనా సెజ్‌లోని సంస్థలకు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఆదేశం జారీ చేసినట్టయితే దానిని మరొక ఆదేశం ద్వారా వెనక్కి తీసుకోవడానికి వీలులేదని సెక్షన్ 49(2) అంటుంది. దానిని వెనక్కి తీసుకోవాలంటే చట్ట సవరణ అవసరం అవుతుందని దీని భావం.

వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సెజ్‌ల కోసం ఇప్పటికే కార్మిక చట్టాల నుండి మినహాయింపులు, సవరణలు జారీ చేశాయి. మన రాష్ట్ర ప్రభుత్వం సెజ్‌లలో పని గంటలపైన పరిమితిని తొలగించింది. ఓవర్‌టైం వేతనం చెల్లించేటట్టయితే ఎన్ని గంటలైనా పని చేయించుకోవచ్చు. (చికాగో అమరవీరులు తమ సమాధుల నుండి లేచి వస్తున్నట్టు అనిపిస్తున్నదా?) కనీస వేతనాలు చెల్లించవలసిందే గానీ వేతనం ఎంత చెల్లిస్తున్నదీ, సంస్థలో ఎంతమంది పని చేస్తున్నదీ తెలియజేసే వేతనం రిజిస్టర్లు, రికార్డులు, యాజమాన్యం నిర్వహించనక్కర లేదు. (అంటే కనీస వేతనం ఇస్తున్నదీ లేనిదీ నిరూపించే ఆధారమేమీ ఉండదు). పని గంటలు, కూలిరేటు ప్రకటించనక్కరలేదు. అంటే కార్మికులు కోర్టుకు పోయి న్యాయం పొందడానికి ఏ లిఖిత ఆధారమూ ఉండదు.

కార్మికుల ఆరోగ్యానికీ భద్రతకూ తదనుగుణ్యమైన సదుపాయాలకూ సంబంధించిన శాసనం ఫ్యాక్టరీ చట్టం. దానినుండి ఏ ఫ్యాక్టరీకీ మినహాయింపు లేదు. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సెజ్‌లలో నెలకొల్పే ఫ్యాక్టరీలను భద్రత, ఆరోగ్య నియమాల నుండి మినహాయించే అధికారం ఒక నోటిఫికేషన్ ద్వారా తనకు తాను ఇచ్చుకునింది. ఇప్పటిదాకా కాంట్రాక్ట్ కార్మిక చట్టం నుండి అత్యవసర సందర్భాలలో మాత్రమే మినహాయింపు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది. కానీ సెజ్‌లలో ఎప్పుడైనా ఏ సంస్థకైనా ఏ మినహాయింపు అయినా ఇచ్చే అధికారం మన రాష్ట్ర ప్రభుత్వం తనకు తాను కల్పించుకునింది.

కార్మిక సంఘాలు సమర్థంగా పనిచేయాలంటే అనుభవజ్ఞులైన బయటివాళ్ళ పాత్ర అవసరం అని గుర్తించిన కార్మిక సంఘాల చట్టం, కార్మిక సంఘం బాధ్యులలో సగానికి మించకుండా బయటివాళ్ళు ఉండవచ్చుననింది. మన రాష్ట్ర ప్రభుత్వం సెజ్‌లలోని సంస్థల కార్మిక సంఘాలలో బయటివాళ్ళు ఒక్కరూ ఉండడానికి వీలులేదని ఆదేశం జారీ చేసింది. పైగా సంస్థలోని కార్మికులలో 30 శాతం సభ్యులుగా ఉన్న సంఘానికే 'గుర్తింపు' ఉంటుందని ఆదేశం జారీ చేసింది. అసలు కార్మిక సంఘానికి 'గుర్తింపు' అనేది చట్టంలో ఉన్న భావన కాదు. మొండి యాజమాన్యాలు చట్టబాహ్యంగా తెచ్చిపెట్టిన భావన. గతంలో ఏడుగురు సభ్యులుంటే కార్మిక సంఘం రిజిస్టర్ చేసుకోవచ్చు. 2001 తరువాత సంస్థలోని కార్మికులలో 10 శాతం సభ్యులుంటే కార్మిక సంఘం రిజిస్టర్ చేసుకోవచ్చునని మార్చారు. రిజిస్టర్ అయిన కార్మిక సంఘాలన్నిటినీ యాజమాన్యం గుర్తించవలసిందే, అన్నిటితోనూ వ్యవహరించవలసిందే. ఇప్పుడు సెజ్‌లలోని సంస్థలలో 30 శాతం కార్మికులు సభ్యులుగా ఉన్న సంఘానికి మాత్రమే కార్మిక సంఘంగా వ్యవహరించే హక్కు ఉంటుంది. ఇతర సంఘాలతో యాజమాన్యం మాట్లాడనక్కరలేదు. ఇది కార్మిక సంఘాల ఉనికినే దాదాపు అసాధ్యం చేస్తుంది.

అసలు కార్మికశాఖ స్వతంత్రతనే సెజ్ చట్టం దెబ్బతీసింది. కార్మిక శాఖలో అవినీతి ఆద్యంతం ఉందిగానీ సూత్రప్రాయంగా అది కార్మిక సంక్షేమం తప్ప వేరే లక్ష్యమేదీ లేని ప్రభుత్వశాఖ. సెజ్ చట్టం సెజ్‌లలోని పారిశ్రామిక సంస్థలకు సంబంధించినంత వరకు దీనిని తొలగించేసింది. ఎగుమతుల వృద్ధిని లక్ష్యంగా గల సెజ్ ఆ లక్ష్యాన్ని అందుకునేటట్టు చూసే బాధ్యత గల డెవెలప్‌మెంట్ కమిషనర్ అనే కేంద్ర ప్రభుత్వ అధికారి ప్రతీ సెజ్‌కూ ఒకరు నియమితులై ఉంటారు. సెజ్‌లు ఫలవంతంగా ఉత్పత్తి చేసేటట్టు చూడడం అతని కర్తవ్యం. సెజ్ చట్టం అతనికే కార్మికశాఖ అధికార బాధ్యతలు అప్పగించింది. సెజ్‌ల ఎగుమతి వ్యాపారదక్షత బలహీనపడకుండా ఉన్న మేరకే కార్మికులకు హక్కులుంటాయని దీని భావం. మన రాష్ట్ర ప్రభుత్వం ఇంకొంచెం ముందుకు పోయి కార్మికుల ఉద్యోగ భద్రత విషయంలో తనపైన ఉన్న





ఒక ముఖ్యమైన బాధ్యతను కూడా అదే అధికారికి అప్పగించింది. ఇది కార్మికులను తొలగించడానికీ, లేఆఫ్ చేయడానికీ పారిశ్రామిక సంస్థలకు పారిశ్రామిక వివాదాల చట్టంలోని 5-బి అధ్యాయం కింద అనుమతి ఇచ్చే అధికారం. అంటే కార్మికులకు ఉండే ఇతర హక్కులే కాదు, ఉద్యోగ భద్రత కూడా సెజ్‌ల ఎగుమతి సామర్థ్యం దెబ్బతినకుండా ఉన్న మేరకే లభ్యం అవుతాయి.

సెజ్‌లు వస్తే ఉద్యోగాలు వస్తాయి, వస్తాయి అంటున్నారు. వాళ్ళు చెప్పే దానిలో 5 శాతం కూడా రావన్న సంగతి అటుంచి, వచ్చిన ఉద్యోగాలు ఇంత భద్రంగా ఉంటాయి! సౌదీ అరేబియా వంటి దేశాలలో పనికోసం పోయిన మన వారి కథలు పత్రికలలో చదువుతున్నారు కదా? ఇంక మీదట ఆ కథల కోసం అంత దూరం పోనక్కరలేదు. మీ దగ్గరున్న సెజ్‌లో చూడవచ్చు.

ప్రజలకిచ్చేది ఇదైతే సెజ్‌లో సంస్థలు నెలకొల్పే వారికి అరచేతిలో సకల వసతులతో బాటు అనేక రకాల పన్ను రాయితీలూ లభిస్తాయి. ఎగుమతి-దిగుమతి సుంకాలు, ఎగుమతి-దిగుమతి నియమాల విషయంలో సెజ్ విదేశీ భూభాగం వంటిదని సెజ్ చట్టంలోని సెక్షన్ 53 అంటుంది. అయితే ఎగుమతి దిగుమతి సుంకాలే కాదు, వారికి అన్ని రకాల పన్నుల నుండి ఎంతోకొంత మినహాయింపు లభిస్తుంది. చివరికి సెజ్‌లోని కంపెనీల డైరెక్టర్లకు వ్యక్తిగత ఆదాయపన్ను రాయితీలు కూడా లభిస్తాయి. నిజానికి వారికి లభించే రాయితీల జాబితా రాసుకుంటూ పోతే మళ్ళీ ఇంత కరపత్రం అవుతుంది.

ధనవంతులు తమ వ్యాపారాలతో దేశానికి సేవచేస్తారని చెప్పుకుంటారు గానీ వారు ఇచ్చేదేమైనా ఉంటే అది పన్నుల రూపంలోనే. దానికి మినహాయింపు ఇచ్చేసి సకల వనరులనూ అభివృద్ధిచేసి వారికి అప్పగించే వ్యవస్థ సెజ్ వ్యవస్థ. ఈ దాస్యాన్ని దేశమెందుకు సహించాలి? ఆర్థిక అభివృద్ధి వేరే ఏ రకంగానూ రాదా? ప్రజల చేతిలో ఉన్న వనరులను వారి వద్దనే ఉంచి వాటినీ వారినీ అభివృద్ధి చేసే ఆర్థిక వ్యూహం రచించలేమా?

రాష్ట్ర కమిటీ, 28-2-2008

# ఓపెన్‌కాస్ట్ నిర్వాసితులకు
# అండగా నిలుద్దాం రండి

**భూ**పాలపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టువల్ల జీవనం కోల్పోతున్న రైతులు, కూలీలు, గీత కార్మికులు, అంతా కలిసికట్టుగా నిలబడి జీవనాన్ని కాపాడుకోవడానికి ముందుకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇంకా బొగ్గుతీసే అవకాశం ఉన్న 3 ఇంక్లైన్‌ను సింగరేణి యాజమాన్యం మూసేసి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు చేపడుతున్నది. నిన్నగాక మొన్న ప్రారంభించిన 3 ఎ ఇంక్లైన్ తెరిచినట్టే తెరిచి వెంటనే మూసేసి దాని స్థానంలో కూడా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు చేపట్టబోతారని వింటున్నాము. ఇంకా మిగిలి ఉన్న ఆరు బావులు త్వరలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులుగా మారబోతాయని కూడా వింటున్నాం.

భూపాలపల్లిలో బొగ్గు బావులు వస్తున్నాయని కొన్ని ఏళ్ళ క్రింద విన్నప్పుడు ఈ ఊరు కూడా ఒక గోదావరిఖని అవుతుంది, ఒక మంచిర్యాల అవుతుంది; ఈ ప్రాంతములోనూ గ్రామీణ, పేద, రైతాంగ యువకులకు పనులు దొరుకుతాయని అనుకున్నాం. బొగ్గు బావులు వచ్చాయిగాని ఇక్కడి వాళ్ళకు పనులివ్వకుండా కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని బావులలో పనిచేసే కార్మికులను తగ్గించి ఇక్కడికి పంపారు. అయినప్పటికీ తమకు మంచి రోజులు రాకపోతాయా అని ఇక్కడి ప్రజలు ఎదురుచూశారు. మంచి రోజులు రాకముందే బొగ్గు బావులు మూతపడి వాటి స్థానంలో స్థానిక ప్రజలకు విధ్వంసమే తప్ప ఏ ప్రయోజనాలు ఇవ్వని ఓపెన్‌కాస్ట్ గనులు వస్తున్నాయి. ఓపెన్‌కాస్ట్ వల్ల కంపెనీకి ఉత్పత్తి పెరుగుతుంది, లాభాలు పెరుగుతాయి. ఖరీదైన పరికరాలు కొనుగోలులో అధికారులకు కమీషన్‌లు ముడుతాయి. ప్రజలకు పనులేమీ దొరకకపోగా ఉన్న భూములు పోతాయి. ధూళి కాలుష్యం పెరుగుతుంది. బావులు, బోర్లు ఇంకిపోతాయి. పోనీ ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో శరవేగంగా తవ్వి తీసిన బొగ్గును ఇంధనంగా వాడే పరిశ్రమలు ఇక్కడేమైనా పెడుతున్నారా అంటే అదీ లేదు. అదంతా బయటికి పోతుంది. వేరే ఎవరికో అభివృద్ధినిస్తుంది. ఇక్కడ ప్రజలకు మిగిలేది బొందలు, మట్టిగుట్టలు మాత్రమే.

కనీసం తీసేసుకున్న భూములకు నష్టపరిహారం, చట్టప్రకారం పునరావాసమైనా ఇస్తున్నారా అంటే అదీ లేదు. జంగేడు, గడ్డిగానిపల్లి గ్రామస్తులకు చెందిన 528 ఎకరాల పట్టా భూమిని, 300 ఎకరాల సీలింగ్ భూమిని తీసుకుంటున్నారు. పట్టా భూమికి ఇప్పటివరకు నష్టపరిహారం ఇవ్వలేదు. పట్టాభూమికి రిజిస్ట్రేషన్ ధర చెల్లించి కోర్టుల చుట్టూ తిప్పే బదులు రైతుల సమ్మతితో మంచి ధర నిర్ణయించి చెల్లిస్తామని అధికారులు అన్నారు కాని రైతులతో మాట్లాడకుండా దళారులతో మాట్లాడుతున్నారు. దళారులు బహిరంగంగానే 12 శాతం కమిషన్ తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జంగేడు సర్పంచ్ 6 శాతం కమిషన్ మాత్రమే తీసుకొనే వేరొక దళారిని రంగంలోకి తెచ్చారు. ఆ మేరకైనా తన గ్రామ ప్రజలకు తాను న్యాయం చేస్తున్నానని ఆయన అనుకుంటుండవచ్చును. కాని రైతుల సమ్మతికి దళారులతో ఏం పని, అధికారులు దళారులను ఎందుకు ప్రోత్సహిస్తున్నారు? జిల్లా కలెక్టర్ గాని ఆయన అనుమతితో వేరొక అధికారిగాని గ్రామసభ నిర్వహించి రైతులతో నేరుగా మాట్లాడాలి. ఇచ్చే ప్రతిపైసా రైతుకే ముట్టాలి.

సీలింగ్ భూమి చేసుకొంటున్న వారిది మరీ అన్యాయమైన పరిస్థితి. వారంతా దళితులు. వేరే ఏ ఆధారం లేనివారు. 15-20 సంవత్సరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నవారు. సీలింగ్ చట్టం కింద మిగులు భూమిని గుర్తించి స్వాధీనం చేసుకున్న తర్వాత అర్హులైన పేదలకు దాన్ని పంచవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. కాని ప్రభుత్వం ఆ పని చేయలేదు. భూమిలేని పేద, దళితులే ఆ భూమిలోకి దిగి సాగు చేసుకోసాగారు. అపుడైనా ప్రభుత్వం మేల్కొని వారికి పట్టాలు ఇచ్చి ఉండవచ్చునుగాని అదీ జరగలేదు. ప్రజలే ఆ భూములను బాగు చేసుకొని, సాగు చేసుకొని జీవనం పొందుతున్నారు. వారికి పట్టాలిచ్చి ఉంటే ఇప్పుడు నష్టపరిహారమైనా దక్కి ఉండేది. మన రాష్ట్ర హైకోర్టు 2004లో మేకల పాండు కేసులో ఇచ్చిన తీర్పును అనుసరించి స్వంత భూములున్న రైతులకు ఎంత వస్తుందో అంత మొత్తమూ వచ్చేది. ఇప్పుడు పట్టా ఇవ్వలేదు కాబట్టి మీకు నష్టపరిహారం అసలే రాదని దబాయిస్తున్నారు. వారందరికీ పట్టాలిచ్చి పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలని మేము డిమాండ్ చేస్తున్నాము.

అయితే ప్రజలకు కలిగే నష్టం భూసేకరణకే పరిమితం కాదు. ఇంకా మిగిలి ఉన్న భూములలో వ్యవసాయం సాధ్యం కాదు. భూగర్భ జలాలు వేగంగా ఇంకిపోతాయి. ధూళి, కాలుష్యం పొలాలను, ఆవాసాలను తీవ్రంగా కలుషితం చేస్తాయి. ఇప్పటికే 1, 1ఎ ఇంక్లైన్‌ల పుణ్యాన నాలుగేళ్ళుగా తమ బావులు, బోర్లు ఇంకిపోతున్నట్టు గడ్డిగానిపల్లె ప్రజలు అంటున్నారు. ఓపెన్ కాస్ట్ గనులు ఇంకా లోతుగా తవ్వుతారు కాబట్టి భూగర్భ జలాల వినాశనం ఇంకా ఎక్కువగా ఉండబోతుంది. అంతేకాక ఓపెన్‌కాస్ట్ తవ్వకం కోసం పై మట్టిని తీసి గుట్టలు పోస్తారు. బొగ్గు వెలికితీత సాగే కొద్దీ మట్టి గుట్టలు పెరుగుతాయి. వీటి మీద ఎప్పటికప్పుడు నీళ్ళు చల్లుతామని, మొక్కలు పెంచుతామని అంటారు కాని అవన్నీ అప్పుడప్పుడు, అక్కడికక్కడ కంటితుడుపుగా జరిగేవి తప్ప ఒక పద్ధతి ప్రకారం జరగవని కరీంనగర్ జిల్లా రామగుండం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అనుభవం మనకు తెలియజేస్తుంది. కాబట్టి ఊర్లమీద, పొలాలమీద దుమ్ము పుష్కలంగా పడుతుంది. పంట దిగుబడి, ప్రజారోగ్యం దెబ్బతింటాయి. భూమి కోల్పోయే రైతులేగాక ఉపాధి కోల్పోయే గీత కార్మికులు చాలామంది ఉన్నారు. వ్యవసాయ కూలీ కుటుంబాలు 1000, గీత కార్మికుల కుటుంబాలు 300 ఈ భూసేకరణ వల్ల తమ జీవనాన్ని పూర్తిగా కోల్పోతారని అంచనా. భూసేకరణ వల్ల ఉపాధి కోల్పోయే వ్యవసాయ కూలీలకు 650 రోజుల దినవేతనం నష్టపరిహారంగా కట్టి ఇవ్వాలని 2005లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 68 అంటుంది. గీత కార్మికులకు కూడా అది

వర్తిస్తుంది. కాని అటువంటి జీవో ఒకటి ఉందనిగాని, దానికింద ప్రజలకు హక్కులు ఉన్నాయనిగాని ఎరగనట్టే అధికారులు నడుచుకుంటున్నారు.

**మా డిమాండ్లు:**

1. వ్యవసాయ భూములకిచ్చే నష్టపరిహార విషయంలో ప్రభుత్వం ఏ దళారుల ప్రమేయం లేకుండా గ్రామసభలు పెట్టి నేరుగా రైతులతో మాట్లాడాలి.
2. సీలింగ్ భూములు సాగు చేస్తున్న భూమిలేని పేదలందరికీ వెంటనే పట్టాలివ్వాలి. మన రాష్ట్ర హైకోర్టు మేకల పాండు కేసులో ఇచ్చిన తీర్పును అనుసరించి వారికి కూడా పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలి.
3. జీవో నెం. 68 ప్రకారం వ్యవసాయ కూలీలకు, గీత కార్మికులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి.
4. ఓపెన్‌కాస్ట్ గనుల సమీపంలో భూగర్భ జలాల క్షీణతవల్ల, దుమ్ము, కాలుష్యాలవల్ల నివాసం, సేద్యం సాధ్యం కావు కాబట్టి ఆ భూములకు కూడా పూర్తిస్థాయి నష్టపరిహారం ఇచ్చి గ్రామానికి గ్రామంగా ప్రజలు ఎంచుకున్న చోట పునరావాసం కల్పించాలి.
5. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని బొగ్గు, ఖనిజాన్నంతా ఓపెన్‌కాస్ట్ తవ్వకాల ద్వారా 20 లేక 30 ఏళ్ళలో తవ్వితీసి ఇతర ప్రాంతాలకు తరలించి ఇక్కడ బీడు భూములు, మట్టి గుట్టలు, బొందలు మిగిలించే విధ్వంసకర విధానాన్ని సింగరేణి యాజమాన్యం వదులుకోవాలి.

వరంగల్ జిల్లాశాఖ, 21-5-2008





వెయ్యి ఎకరాల సాగుభూమిని ముంచకుండా

# ప్రొద్దుటూరుకు తాగు నీరు ఇవ్వలేమా?

ప్రొద్దుటూరు పట్టణానికి తాగు నీరు అందించడానికి చిన్నశెట్టిపల్లె, పర్లపాడు తదితర గ్రామాలకు చెందిన వెయ్యి ఎకరాల సారవంతమైన సాగుభూమిని ముంచనక్కరలేదని, భూసేకరణ అవసరంలేని ప్రత్యామ్నాయాలు ఉన్నాయని ఎంత చెప్పినా వినకుండ మొండిగా ముందుకెళ్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండించవలసినదిగా ప్రజలను కోరుతున్నాం.

'ఎవరెన్ని అన్నా కాలవ తవ్వేదే' అని తిరస్కారంగా మాట్లాడుతున్న ఎంఎల్ఏ వైఖరిని కూడా ఖండించవలసినదిగా ప్రజలను కోరుతున్నాం. ప్రజా ప్రతినిధులుండేది ప్రజల అవసరాలకు, అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించడానికి. ప్రజల నెత్తినెక్కి సవారి చేయడానికి కాదు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలవల్ల నష్టపోయే ప్రజలు సహేతుకమైన అభ్యంతరం తెలిపితే ఆ అభ్యంతరానికి సహేతుకంగానే జవాబు చెప్పాలి. అంతేతప్ప "ఎవరేమన్నా చేసేది చేసేదే" అనడం అహంకారం అనిపించుకుంటుంది, ప్రజాస్వామ్య వైఖరి అనిపించుకోదు.

ప్రొద్దుటూరుకు తాగునీరు అవసరమే, దాంట్లో సందేహం లేదు. కానీ గ్రామీణ ప్రజల వ్యవసాయాన్ని కాపాడడమూ అవసరమే. దాంట్లోనూ సందేహంగానీ విభేదంగానీ ఉండరాదు. పల్లెప్రజలకు నష్టం కలిగించకుండ ప్రొద్దుటూరుకు తాగునీరియ్యడం సాధ్యమే కాకపోతే అప్పుడేం చేయాలన్నది వేరే విషయం. ప్రత్యామ్నాయం ఉన్నప్పుడు వాటిని లెక్కలోకే తీసుకోమనడం ఏం న్యాయం?

నగరాలకూ పట్టణాలకూ తాగునీళ్లెప్పుడూ పైప్‌లైన్ల ద్వారా తీసుకొస్తారు. హైదరాబాద్‌కు తాగునీరు సింగూరు, అక్కంపల్లి రిజర్వాయర్ల నుండి పైప్‌లైన్ల ద్వారా వస్తుంది. విశాఖపట్నంకు తాగునీరు మేఘాద్రి గెడ్డ నుండి, తాటిపూడి రిజర్వాయర్ నుండి పైప్‌లైన్ ద్వారానే వస్తుంది. బెంగుళూరుకు తిప్పగొంబీన హళ్లి చెరువు నుండి, కృష్ణరాజసాగర్ రిజర్వాయర్ నుండి తాగునీరు పైప్‌లైన్ ద్వారానే వస్తుంది. ఈ సంగతులు ప్రొద్దుటూరు

పట్టణంలోగానీ పరిసర గ్రామాలలో గానీ నివసించే రైతులకు, కూలీలకు తెలియకపోవచ్చు. నాయకులకు ఆ నగరాలలో ఆస్తులున్నాయి, వ్యాపారాలున్నాయి. త్రాగునీరు ఎట్లా ఇస్తున్నారో తెలుసుకోలేకపోయారా? ప్రొద్దుటూరు ఎంత మహానగరమని హైదరాబాదుకు, బెంగుళూరుకు పనికొచ్చిన పైప్‌లైన్ సరఫరా ప్రొద్దుటూరుకు పనికి రాకుండ పోయింది?

పట్టణాలకు తాగునీరు పైప్‌లైన్ ద్వారా అందియ్యడానికి కారణం ఉంది. తాగునీటికి సరఫరా చేసే నీరు శుభ్రంగా ఉండడం అవసరం. మార్గమధ్యంలో నీటిచౌర్యాన్ని అదుపు చేయడం అవసరం. తాగునీటికి కేటాయించే నీటి పరిమాణం భారీగా ఉండదు. కాబట్టి (ప్రొద్దుటూరుకు ఇచ్చేది 1 టిఎంసి మాత్రమే) పైప్‌లైన్ల వాడకంలో అసౌకర్యమేమీ ఉండదు. సాగునీటి కాలవలు మార్గమధ్యంలో డిస్ట్రిబ్యూటరీల ద్వారా పొలాలకు నీళ్ళిచ్చుకుంటూ పోతాయి. అందువల్ల సాగునీటి సరఫరా కాలవల రూపంలో ఉండక తప్పదు. పట్టణానికి తాగు నీరు ఇచ్చే వ్యవస్థ నేరుగా పట్టణాలకే వస్తుంది. నీటిలో అశుభ్రం చేరకుండ చూసుకోవడమూ అవసరం. కాబట్టి ఏ రకంగా చూసినా కాలవ కంటే పైప్‌లైనే ఉచితమైనది. పైగా కాలవ అలైన్‌మెంట్ ఒక రకంగా ఉంచారా అంటే అదీ లేదు. మొదట ఇంజనీర్లు వేసిన నమూనా కూడ వ్యవసాయ భూములను ముంచేదే అయినా నివాసాల పక్కనుండి పోదు, ప్రొద్దుటూరు పట్టణంలో ఎవరినీ నిర్వాసితులను చేయదు. కానీ కాంట్రాక్టర్ చేపట్టిన రెండవ అలైన్‌మెంట్‌లో ప్రొద్దుటూరులో దాదాపు భాగం అయిపోయిన పెద్దశెట్టిపల్లెలోని శ్రీగురు కాలనీ, ఎస్‌పినగర్ కాలనీలలో 750 ఇళ్ల ప్లాట్లకు పైగా మునుగుతాయి. ఎన్నడో ప్లాట్లు కొనుక్కున్న ప్రజలు ఇప్పుడు ఇళ్లు కట్టుకోవడానికి సిద్దమవుతున్నారు. ఆ అవకాశాన్ని వాళ్ళు కోల్పోతారు. రెండు స్మశానాలు ఒక కబరస్తాన్ (ముస్లింల శ్మశానం) కూడ మునుగుతాయి.

మునిగే వ్యవసాయ భూములకైనా ఇళ్ల ప్లాట్లకైనా నష్టపరిహారం ఇస్తాము కదా అంటారేమో. ప్రత్యామ్నాయాలు ఆలోచించకుండా బలవంతంగా భూములు స్వాధీనం చేసుకోవడం ఎందుకు, నష్టపరిహారం ఇవ్వడం ఎందుకు? అయినా ఇచ్చిన ఆ నష్టపరిహారాన్ని రైతులు ఏం చేసుకోవాలి? వాళ్లకు వ్యవసాయం తప్ప వేరే ఏ వ్యాపకమూ తెలీదు. వ్యవసాయానికి మళ్లీ భూమి కొనుక్కోవాలంటే ఉన్న ఊరిలోనైనా పక్క ఊరిలోనైనా ఎకరానికిచ్చిన నష్టపరిహారంతో ఎకరంలో నాలుగవ భాగం కూడ రాదు. దూరం పోయి కొనుక్కుంటే ఇల్లిక్కడ, సేద్యం అక్కడ అవుతుంది. ఇక ప్రొద్దుటూరు పరిసరాలలో ఇళ్ల స్థలాలు మునిగేవారు వేరే ఎక్కడ కొనుక్కోవాలి? ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో ఇప్పటి ధరలకు ప్రొద్దుటూరు శివారులో ఎక్కడా ఇళ్లస్థలాలు దొరకవు. అందుకే ఎంఎల్ఏ కుటుంబానికి చెందిన రాధానగర్, అమృతనగర్ కాలనీలలో మాకు ప్రత్యామ్నాయంగా ప్లాట్లిస్తారా అని అడుగుతున్నారు వాళ్లు. 'కాలవ తవ్వేదే' అంటున్న వరదరాజులు రెడ్డిగారు వారందరికీ ఉచితంగా ప్లాట్లిస్తారా?

వేరే రెండు ప్రత్యామ్నాయాలు కూడా సూచించడం జరిగింది. మైలవరం ప్రాజెక్టులోని లోటును భర్తీ చేయడం కోసమని ఎస్ఆర్‌బీసి వరద కాలవ ప్రతిపాదించబడింది. అది దాదాపు పూర్తయింది. దాని నుండి 1 టిఎంసి ప్రొద్దుటూరు తాగు నీటి అవసరాలకెందుకు కేటాయించకూడదు? ఇప్పుడు తవ్వుతున్న కుందుకాలవ కూడ వరదనీటి కాలవే. కాబట్టి అదయినా ఇదయినా వరదనీటి ప్రాజెక్టే. పైగా ఆ ప్రత్యామ్నాయం ఎంచుకున్నట్టయితే ఎవరికీ నష్టం ఉండదు.



చివరి ప్రత్యామ్నాయం గండికోటనుండి నీటి తరలింపు. గాలేరు నగరి ప్రాజెక్టును శరవేగంగా పూర్తిచేయడానికి పనులు జరిగిపోతున్నాయి. దానికి భరోసా ఇవ్వడం కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి ఇతర ప్రాంతాల వారి చేత తిట్లు తినడమూ జరిగింది. అది పూర్తయిన వెంటనే గండికోట రిజర్వాయర్ నుండి 1 టిఎంసి నీరు ప్రొద్దుటూరు అవసరాల కోసం పెన్నా నదిలోకి వదలడం కష్టమా?

అసలు ప్రొద్దుటూరుకు నీటి ఎద్దడి ఎందుకు వచ్చింది? పెన్నా నదిలో నీళ్లెందుకు లేకుండ పోయాయి? ప్రొద్దుటూరు ప్రజల మీద ప్రేమ ఒలకబోస్తున్న నాయకులు జవాబు చెప్తారా? పెన్నా నదిలోని ఇసుకను నిరంతరాయంగా తరలిస్తున్న వ్యాపారమే దానికి కారణం కాదా? ప్రొద్దుటూరు మీద ప్రేమే ఉంటే ఆ ఇసుక వ్యాపారం ఎన్నడో నిలిపి ఉండేవారు కాదా? నదిలోని ఇసుకంతా తీసేసి నీళ్ళు నిలవకుండ చేసి లక్షలాది రూపాయల లాభం ఆర్జించి ఇప్పుడు అయ్యో పాపం ప్రొద్దుటూరు ప్రజలకు త్రాగునీరు తక్కువయిందే అని వెయ్యి ఎకరాల సాగుభూమిని ముంచి కుందునది నీళ్ళు తీసుకొచ్చే ప్రాజెక్టు తయారు చేశారు.

కాగితం మీద ఎవరి పేర్లున్నా ప్రాజెక్టు కాంట్రాక్టు ప్రొద్దుటూరు ఎంఎల్ఏ కుమారునిదే అనేది జగమెరిగిన సత్యం. అధికార యంత్రాంగం వారి జేబులో ఉంది కాబట్టి అంత మొండిగా ఏ మార్పుకూ ఒప్పుకోం అని దబాయిస్తున్నారు. సమస్య సృష్టిలోనూ వారిదే లాభం, దాని పరిష్కారం లోనూ వారిదే లాభం. అన్నిరకాలుగా నష్టపోవలసింది ప్రజలే.

ఈ కుతర్కాన్ని తిరస్కరించమని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రొద్దుటూరు తాగునీటి కోసం ఏ ముంపూ ఉండని ప్రత్యామ్నాయాలను అనుసరించవలసినదిగా డిమాండ్ చేద్దాం రమ్మని ఆహ్వానం పలుకుతున్నాం. ప్రొద్దుటూరు పట్టణ ప్రజలే కాదు, గ్రామీణ ప్రజలు కూడ పోరులేనినీ వారు కూడ ఓటర్లేననీ గుర్తించి ప్రతిపక్షాలు కూడా ఈ ఆందోళనలో భాగం కావాలని పిలుపునిస్తున్నాం.

కడప జిల్లాశాఖ, 30-5-2008

# ప్రభుత్వం మీ భూమికోసం వస్తే...

ప్రభుత్వంవారు మీ భూమిని సేకరించదలచారా?

వేరే ఏ రకంగానూ దాన్ని ఆపలేకపోతే కనీసం చట్టాలలో ఏముందో తెలుసుకొని, తగిన జాగ్రత్తలు పాటిస్తే కొంతవరకైనా మీకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

భూసేకరణ జరుగుతున్నది 1894 నాటి భూసేకరణ చట్టం కింద. ఆ చట్టం 'ప్రజా ప్రయోజనం' పేరుతో ప్రజల భూములనూ, ఇతర స్థిరాస్తులనూ సేకరించే అధికారం ప్రభుత్వానికిస్తుంది. అయితే ఏ అవసరం కోసమైతే భూమి సేకరిస్తున్నారో అది 'ప్రజా ప్రయోజనం' కిందికి వస్తుందా, ఒకవేళ వచ్చినా మీ భూమికాక వేరే ప్రత్యామ్నాయాలు ఉన్నాయా అనే విషయంలో అభ్యంతరం చెప్పే, ప్రత్యామ్నాయాలనూ సూచించే అవకాశం మీకు ఉంది. వాటి గురించి ఆలోచించమనీ, అభ్యంతరాలకు జవాబు చెప్పమనీ ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టగల అవకాశమూ మీకు ఉంది. అతి తక్కువ భూమిని సేకరించి, అతి తక్కువ మందిని నిర్వాసితుల్ని చేసే ప్రత్యామ్నాయాల గురించి ప్రభుత్వం ఆలోచించాలని మన రాష్ట్ర ప్రభుత్వం 2005లో జారీ చేసిన సహాయ పునరావాస విధానంలోనే అంది. ఒకవేళ భూసేకరణ తప్పనిసరైతే దాని ధర నిర్ణయించే ముందు మీ అభిప్రాయం తీసుకోవాలని, ఆ తర్వాత కూడా ఆ ధర (నష్టపరిహారం) తక్కువనిపిస్తే అభ్యంతరం తెలిపే హక్కు మీకు ఉందని, మీరు అభ్యంతరం తెలిపితే కనక తాను నిర్ణయించిన ధర మీకు చెల్లిస్తూ కూడా అది న్యాయమా కాదా అన్న వ్యాజ్యాన్ని ప్రభుత్వం తానే కోర్టుకు నివేదించాలని ఈ విధానం అంటుంది.

ఇప్పుడు ఒక్కొక్క అడుగూ ఈ వ్యవస్థ వివరాలు చూద్దాం. దానిని అధికారులు ఏరకంగా వక్రీకరిస్తారో, మీరు దానిని ఏ రకంగా ఎదుర్కోవచ్చో కూడా చూద్దాం.

## 1. నోటీసు ఇవ్వనిదే మీ భూమి జోలికి రాకూడదు

మొదట జిల్లా కలెక్టర్ గానీ ఇందు నిమిత్తం ప్రభుత్వం నియమించిన సబ్‌కలెక్టర్ గానీ ఏ అవసరం కోసం ఏయే ఊర్లలో ఎంతెంత భూమి సేకరించదలచుకున్నదీ, సర్వే నంబర్ల వారీగా రెవిన్యూ రికార్డుల ప్రకారం దాని యజమానులెవరు అనే విషయాన్ని ప్రకటించాలి. దీనిని 4(1) నోటీసు అంటారు. అంటే భూసేకరణ చట్టంలోని సెక్షన్4(1) కింద ఇచ్చిన నోటీసు అని అర్థం. ప్రభుత్వ గెజెట్‌లోనేకాక రెండు



స్థానిక దినపత్రికలలోనూ ఈ నోటీసును ప్రకటించాలి. వాటిలో ఒకటి తెలుగు దినపత్రిక అయి ఉండాలి. ఆ తరువాత 40 దినాల లోపల ఆ భూమిని సేకరిస్తున్న ప్రాంతంలో బహిరంగ స్థలంలో ఆ నోటీసును అతికించాలి. ఇవన్నీ జరిగినప్పుడే ప్రజలకు నోటీసు ఇచ్చినట్టవుతుంది. ఆ తరువాతే అధికారులు ఆ భూమిలోకి దిగడంగానీ, కొలతలు తీసుకోవడంగానీ, మట్టిని పరీక్షించడానికి శాంపిల్స్ తీసుకోవడంగానీ చేయవచ్చు.

## 2. అప్పుడు మీరు అభ్యంతరాలు చెప్పవచ్చు

ఆ నోటీసు ప్రచురించిన తరువాత మీరు అభ్యంతరాలు తెలుపవచ్చు. ఈ హక్కు మీకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 5ఎ ఇస్తుంది. మీరు అన్ని రకాల అభ్యంతరాలూ తెలుపవచ్చు. ఆ అవసరం ప్రజావసరమే కాదనవచ్చు. దానికి ఈ భూమి తగినది కాదనవచ్చు. మీకు ఉన్నది ఈ భూమే అయితే అది మొత్తం తీసేసుకునే బదులు ఎక్కువ భూమి ఉన్నవాళ్ళ ఆస్తిలో ఒక భాగం తీసుకోవడం న్యాయం అనవచ్చు. లేదా ఎవరూ ఉపయోగించని ప్రభుత్వ భూమి ఊరిలో ఉంది కాబట్టి అది తీసుకొమ్మని సూచించవచ్చు. ఈ అభ్యంతరాలు తెలపడానికి మీకు 30 దినాల గడువు ఉంటుంది. అయితే అభ్యంతరాలు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా తెలపాలి. ఆపైన కలెక్టర్ ముందు హాజరై మీరుగానీ, మీ తరఫున వేరే ఎవరైనాగానీ మీ అభ్యంతరాలు సమంజసమైనవని వాదించవచ్చును. కలెక్టర్ మీ వాదనలు విని, అవసరమైతే ఈ విషయంలో మరింత విచారణ జరిపి, తన అభిప్రాయాలూ, సూచనలూ ప్రభుత్వానికి నివేదించాలి. దానిపైన ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది.



## 3. ప్రభుత్వం అడ్డదారి తొక్కితే...

అయితే ఆ భూసేకరణ అత్యవసరమైన లక్ష్యం కోసమైతే అభ్యంతరాలు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా నేరుగా తదుపరి చర్యలు చేపట్టవచ్చునని సెక్షన్ 17(4) అంటుంది. ఈ అధికారాన్ని అరుదుగా మాత్రమే ఉపయోగించాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ మన రాష్ట్రంలో దాదాపు ప్రతి భూసేకరణలోనూ సెక్షన్ 17(4)ను పేర్కొని అభ్యంతరాలు చెప్పుకునే అవకాశం లేకుండా చేయడం పరిపాటి అయింది. ఈ విషయాన్ని 4(1) నోటీసులోనే రాసేస్తున్నారు. అయితే నిజంగా అర్జెన్సీ లేని సందర్భాలలో అట్లా చేస్తే మీరు ఊరుకోనక్కర లేదు. భూమిని కోల్పోయే వారంతా ఒకటై మీ అభ్యంతరాలను వినితీరాలని కలెక్టర్‌పైన ఒత్తిడి పెట్టొచ్చు. అప్పటికీ వినకపోతే హైకోర్టులో కేసు వేయొచ్చు. నూటికి తొంభై కేసులలో హైకోర్టు సెక్షన్ 5ఎ కింద విచారణ జరిపి తీరాలని ఆదేశం ఇస్తున్నది.

## 4. అభ్యంతరాలు విన్న తరువాత...

మీ అభ్యంతరాలు విని, వాటిపైన ప్రభుత్వం తన నిర్ణయం తెలియజేసిన తరువాత కలెక్టర్ మరొకసారి ప్రభుత్వం సేకరించబోయే భూమి వివరాలను సర్వే నంబర్ల వారీగా యజమానుల పేర్లు వగైరా తెలియజేస్తూ సెక్షన్ 6 కింద మళ్ళీ నోటీసు జారీచేస్తాడు. అదికూడా రెండు స్థానిక దినపత్రికలలో ప్రకటిస్తాడు. వాటిలో ఒకటి తెలుగు దినపత్రిక అయి ఉండాలి. ఇదివరకటిలాగే ఆ ప్రకటన భూమి సేకరిస్తున్నచోట బహిరంగ స్థలంలో అంటించాలి. ఆ తరువాత భూమిని కొలిచి, దాని సరిహద్దుల్లో గుర్తులు పెట్టుకోవచ్చు.

అయినా అప్పటికింకా భూమి మీదే. అది ప్రభుత్వం స్వాధీనం కావడానికి ఇంకొన్ని దశలున్నాయి. మొదట కలెక్టరు సెక్షన 9 కింద మరొక నోటీసు జారీచేయాలి. ఇది గెజెట్‌లోనూ, పత్రికలలోనూ ప్రచురించే నోటీసు కాదు. ఆ భూమి అనుభవదారునికి, ఆ భూమిపైన ఏదైనా హక్కు ఉన్నదని ప్రభుత్వం దృష్టికి వచ్చిన వారికి, లేదా వారు ఇందు నిమిత్తం నియమించిన ప్రతినిధులకు చేతికి అందిచ్చే నోటీసు. మీరు ఆ జిల్లాలో లేనట్టయితే మీకు రిజిస్టర్డ్ పోస్టుద్వారా పంపించాలి. అంతేకాక, సేకరిస్తున్న భూమి పరిసరాలలో బహిరంగ ప్రదేశంలో ఈ నోటీసును అంటించాలి కూడా. ఇందులో ఏముంటుందంటే ఫలాన సర్వే నంబర్‌లోని ఫలాన విస్తీర్ణంగల భూమిని సేకరించడం జరుగుతున్నదనీ, ఫలాన తేదీనాడు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి మీ హక్కు ఏమిటో (అంటే యజమాని, కౌలుదారు, కొనుగోలు చేసిన వ్యక్తి, వగైరా) చెప్పి ఆ భూమికి ఎంత నష్టపరిహారం కోరుకుంటారో తెలపమని ఉంటుంది. నోటీసు చేతికి అందించిన రోజుకూ, కలెక్టర్ ముందు హాజరు కావలసిన రోజుకూ నడుమ కనీసం 15 దినాల గడువు ఉండాలి. మీరు సెక్షన్ 9 నోటీసుకు స్పందించి కలెక్టర్ ఎదుట హాజరైనప్పుడు ఆ భూమిలో ఇంకా ఎవరెవరికి ఏమేమి హక్కులున్నాయో మీకు తెలిసిన మేరకు చెప్పమని మిమ్మల్ని ఆదేశించే అధికారం కలెక్టర్‌కు ఉంది. మీరు తప్పనిసరిగా చెప్పాలి.

## 5. నష్టపరిహారం ఎంత, ఎవరెవరికి

మీరు చెప్పిన విషయాలు విని, మీరు సమర్పించిన పత్రాలు పరిశీలించిన తరువాత కలెక్టర్ సెక్షన్ 11 కింద తన 'అవార్డు' ప్రకటిస్తాడు. సేకరిస్తున్న భూమి పరిమాణం ఎంత, దానికి ఇవ్వదగ్గ నష్టపరిహారం ఎంత, దానిలో ఎవరెవరికి ఎంత వాటా ఇవ్వాలి అనే విషయాలు అవార్డులో ప్రకటిస్తాడు. సెక్షన్ 6 కింద ఏ భూములు సేకరించబోయేదీ తెలిపే నోటీసు ప్రకటించిన రెండు సంవత్సరాల లోపల ఈ అవార్డు ప్రకటించాలి. రెండు సంవత్సరాలు దాటిపోయినట్టయితే ఈ భూసేకరణ ప్రక్రియ చెల్లదు. కలెక్టర్ మీ సమక్షంలో అవార్డు ప్రకటించినట్టయితే దాని ప్రతిని మీ చేతికి ఇస్తారు. అప్పుడే నష్టపరిహారమూ ఇస్తారు. మీరు అక్కడ లేనిపక్షంలో దానిని రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీకు పంపిస్తారు. అవార్డు ప్రకారం మీకు ఇవ్వాల్సిన మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేస్తారు. ఆ నష్టపరిహారం పట్ల మీకు మూడు రకాల అభ్యంతరాలు ఉండవచ్చు. భూమి విలువ తక్కువగా లెక్కించారన్న అభ్యంతరం ఉండవచ్చు. దాని పరిమాణాన్ని తక్కువగా లెక్కించారన్న అభ్యంతరం ఉండవచ్చు. ఆ ఆస్తిలో హక్కులేనివారికి కూడా నష్టపరిహారంలో వాటా ఇచ్చారన్న అభ్యంతరం ఉండవచ్చు. ఏ అభ్యంతరం ఉన్నా ఆ విషయాన్ని కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా తెలిపి మీ అభ్యంతరాన్ని కోర్టుకు నివేదించమని కలెక్టర్‌ను మీరు కోరవచ్చు. కోరినట్టయితే కలెక్టర్ మీ అభ్యంతరాన్ని సంబంధిత సివిల్ కోర్టు ముందు ఉంచుతారు. ఇది సెక్షన్ 18 కింద మీకు ఉండే హక్కు. కలెక్టర్ సెక్షన్ 11 కింద అవార్డు మీ సమక్షంలో ప్రకటించి ఉంటే ఆనాటి నుండి 6 వారాలలోపల మీ లిఖిత పూర్వక అభ్యంతరాలను కలెక్టర్‌కు తెలియజేయాలి. రిజిస్టర్డ్ పోస్టులో పంపినట్టయితే మీకది అందిన రెండు నెలల లోపల తెలియజేయాలి.

కలెక్టర్ ఇచ్చిన నష్టపరిహారం తీసుకొని కూడా అభ్యంతరం తెలిపి కోర్టుకు నివేదించమని కోరవచ్చును. అయితే నష్టపరిహారం తీసుకునేటప్పుడే మీ వద్ద వారు తీసుకునే రశీదుపైన మీ నిరసనను లేక అభ్యంతరాన్ని సూచిస్తూ రాసి సంతకం చేయాలి. నిరసన తెలపకుండా తీసేసుకుంటే ఆ తరువాత సెక్షన్ 18 కింద అభ్యంతరం తెలిపే అవకాశం ఉండదు. మామూలుగా ఇంగ్లీష్‌లో 'అండర్ ప్రొటెస్ట్' అని



రాస్తారు. అయితే ఇంగ్లీష్‌లోనే రాయనక్కర లేదు. మీ నిరసనను సూచించే వాక్యమేదైనా తెలుగులో అయినా రాయవచ్చును.

నష్టపరిహారం తీసుకోవడానికి మీరు నిరాకరించినా దానివల్ల మీరేమీ నష్టపోరు. కలెక్టర్ దానిని సివిల్ కోర్టులో డిపాజిట్ చేస్తాడు. నిర్దేశించిన గడువు లోపల మీరు మీ అభ్యంతరాలను కలెక్టర్‌కు తెలియజేసి కోర్టుకు నివేదించమని కోరితే నివేదిస్తాడు. ఒకవేళ మీ అభ్యంతరాలన్నిటినీ కోర్టు తిరస్కరించినా, కలెక్టర్ డిపాజిట్ చేసిన మీ నష్టపరిహారం మీకే వస్తుంది.

## 6. 'ఒప్పుకోలు' అవార్డు

కలెక్టర్ సెక్షన్ 11 కింద మీ భూమి మార్కెట్ విలువను బట్టి మీకు నష్టపరిహారంగా ఇస్తాడు. (గడచిన మూడు సంవత్సరాలలో ఆ ప్రాంతంలో జరిగిన భూముల అమ్మకాల సగటు రిజిస్ట్రేషన్ ధరకు 30 శాతం పరిహారం చేర్చి, నోటిఫికేషన్ తేదీనుండి అవార్డు తేదీకి 12 శాతం వడ్డీ చేర్చి ఇస్తారు). అయితే ఇక్కడ మార్కెట్ విలువ అంటే అర్థం సెక్షన్ 4(1) నోటీసు జారీచేసే నాటికి మీ ప్రాంతంలో ఆ రకమైన భూమిని కొనుక్కున్న వాళ్ళు రిజిస్ట్రేషన్ నిమిత్తం చూపించిన సగటు విలువ అని. అది నిజమైన విలువ కంటే చాలా తక్కువ ఉంటుంది కాబట్టి అనివార్యంగా రైతులు సెక్షన్ 18 కింద అభ్యంతరాలు తెలపడం, సివిల్ కోర్టులో, హైకోర్టులో (ఒక్కొక్కసారి సుప్రీంకోర్టులో కూడా) ఏళ్ళతరబడి కేసులు నలగడం, వకీళ్ళ ఫీజులకు మధ్యవర్తుల కమిషన్లకు వచ్చిన నష్టపరిహారంలో ఎక్కువ భాగం సమర్పించుకోవడం సాధారణ అనుభవం.

అందుకని దాని స్థానంలో ప్రభుత్వం మిమ్మల్ని సంప్రదించి ఇద్దరికీ ఆమోదనీయమైన నష్టపరిహారాన్ని నిర్ణయించినట్టయితే, మీరు లిఖిత పూర్వకంగా ఆ మొత్తం మీకు ఆమోదనీయమని రాసి కలెక్టర్‌కు ఇస్తే కలెక్టర్ దానినే అవార్డుగా ప్రకటించవచ్చు. 11(2) దీనికి అవకాశం ఇస్తుంది.

ఈ మధ్య ప్రభుత్వం ఎక్కువగా ఈ 'ఒప్పుకోలు' మార్గాన్నే అనుసరిస్తున్నది. అయితే దీనికొక సవ్యమైన మార్గం ఉంది. అపసవ్యమైన మార్గమూ ఉంది. సవ్యమైన మార్గంతోపాటు ప్రభుత్వం ఎక్కువగా అనుసరిస్తున్న అపసవ్యమైన మార్గం గురించి కూడా వివరిస్తాము.

సవ్యమైన మార్గం ఆంధ్రప్రదేశ్ భూసేకరణ (సంప్రదింపుల కమిటీ) నియమాలు అనే 1992 నాటి రూల్స్‌లో ఉంది. దీని ప్రకారం ఒక జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ, ఒక రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ ఉంటాయి. జిల్లాస్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, ఒక రిటైర్డ్ జిల్లా జడ్జి, పదవిలో ఉన్న సీనియర్ సివిల్ జడ్జి, జాయింట్ కలెక్టర్ తదితరులు ఉంటారు. సెక్షన్ 11 కింద కలెక్టరు అవార్డు జారీచేసిన తరువాత, ఆసక్తి ఉన్నవారు సంప్రదింపుల కమిటీ ముందుకు రావలసిందని కోరుతూ ఆయన ఫారం-1 నోటీసును గ్రామంలో రెండు బహిరంగ ప్రదేశాలలో ప్రకటిస్తాడు. లేదా రైతులే తమ అర్జీలను సంప్రదింపుల కమిటీకి నివేదించమని కలెక్టర్‌ను కోరవచ్చు.

ఈ సంప్రదింపుల కమిటీకి ఒక మేరకు మాత్రమే నష్టపరిహారాన్ని పెంచే అధికారం ఉంది. అంతకంటే ఎక్కువ పెంచమన్న డిమాండ్ వచ్చినట్టయితే కేసును రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీకి నివేదించాలి. ఈ కమిటీలు రైతుల మీద ఎటువంటి ఒత్తిడి పెట్టకూడదు. ఒప్పుకోలు స్వచ్ఛందంగా ఇచ్చిన పిమ్మట ఇచ్చిన వారి వరకు సెక్షన్ 11(2) కింద ఒప్పుకోలు అవార్డు ప్రకటించబడుతుంది. ఒప్పుకోనివారు పైన వివరించిన పద్ధతి ప్రకారం కోర్టులో న్యాయంకోసం వ్యాజ్యం నడుపుకోవచ్చు.

## 7. అపసవ్యమైన 'ఒప్పుకోలు'

ఇది సవ్యమైన మార్గం కాగా, ప్రస్తుతం అన్ని ప్రాజెక్టుల విషయంలోనూ పూర్తిగా అపసవ్యమైన ఒప్పుకోలు మార్గాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఇందులో సంప్రదింపుల కమిటీకి స్థానం లేదు. మీ ప్రాంతపు ఆర్‌డివో లేక భూసేకరణ సబ్-కలెక్టర్ భూమి కోల్పోతున్న వారిలో కొందరిని ముందు చేరదీసి వారితో ఒక ధరకు ఒప్పుకోలు పత్రాలు రాయించుకుంటారు. వారు పాలక పార్టీకి చెందినవారై ఉండి, వేరే ఏదో ప్రయోజనాలను ఆశించి ఈ నాటకంలో భాగస్వాములు కావచ్చు లేదా వేరే వ్యాపారాలో, ఉద్యోగాలో ఉన్న కారణంగా భూములు చవకగా అమ్ముకొని పోవడానికి సిద్ధపడినవారు కావచ్చు. వారితో ఒక ధరకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంటుంది. ఆ ధర సెక్షన్ 11 కింద కలెక్టర్ ప్రకటించే అవార్డులోని నష్టపరిహారం కంటే ఎక్కువే ఉంటుంది. అయితే మీ ఊరి పరిసరాలలో మళ్ళీ అంత భూమి కొనుక్కొని వ్యవసాయం చేసుకోవడానికయ్యే ఖర్చుకంటే బాగా తక్కువ ఉంటుంది.

ఆ ఒప్పుకోలు పత్రాన్ని అధికారులు మీ ముఖానకొట్టి మీరు కూడా అదే ధరకు ఒప్పుకోవాలని ఒత్తిడి పెడతారు. 'ఫలానా సుబ్బయ్య ఈ ధరకు తన భూమి ఇచ్చేశాడు మీకేమయింది?' అని దబాయిస్తారు. 'రేపు మీరు కోర్టుకు పోయినా ఈ ఒప్పుకోలు పత్రం చూసిన తరువాత కోర్టు మీకు ఇంతకంటే ఎక్కువ రేటు ఇస్తుందనుకుంటున్నారా?' అని బెదిరిస్తారు. 'వచ్చే నెల 31వ తేదీ లోపల ఈ ధరకు ఇచ్చేదీ లేనిదీ తేల్చి చెప్పేయండి. లేదంటే సెక్షన్ 11 కింద కలెక్టర్ ఇచ్చిన అవార్డు ప్రకారం నష్టపరిహారం చేతిలో పెడతాం, తీసుకోకపోతే కోర్టులో డిపాజిట్ చేస్తాం. ఆపైన ఒక పదేళ్ళు కోర్టుల చుట్టూ తిరగండి' అని దబాయిస్తారు.

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ ఇదే జరుగుతున్నది. మీ ఊరిలోనూ జరగబోతుంది. ఈ మోసపూరితమైన 'ఒప్పుకోలు'కు లొంగకుండా ఉండాలంటే భూమిని కోల్పోయే రైతులంతా ఒకటిగా ఉండాలి. 1992లో ప్రకటించిన రూల్స్ ప్రకారం జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీలను నియమించి వాటి ద్వారా సంప్రదింపులు చేపట్టాలే తప్ప ఈ అడ్డదారి ఒప్పుకోలు ప్రయత్నాలకు లొంగం అని ఐక్యంగా నిలబడండి.

పైన చెప్పిన అన్ని విషయాలూ రైతుల స్వంత భూములకేకాక అసైన్‌మెంట్ లేక డిఫారం (డికెటి, లావొణి) పట్టా భూములకు కూడా వర్తిస్తాయని గుర్తుంచుకోండి. ఆ భూములకు భూసేకరణ నియమాలు వర్తించవనీ, అవి ప్రభుత్వ భూములే కాబట్టి ఎప్పుడైనా తీసేసుకోవచ్చనీ అధికారులు 'దబాయించినట్టయితే' మన రాష్ట్ర హైకోర్టు 2004లో భూసేకరణ అధికారి, చేవెళ్ళ మరియు మేకలపాండు కేసులో ఇటువంటి భూములకూ, స్వంత భూములకూ ఒకే రకమైన భూసేకరణ పద్ధతి వర్తిస్తుందనీ, ఒకే మోతాదులో నష్టపరిహారం ఇవ్వాలనీ తీర్పు ఇచ్చిన విషయం గుర్తు చేయండి. ఆ





## అసైన్‌మెంట్ భూములకు నష్టపరిహారం

భూమి హక్కులలో బలహీనమైనదిగా భావించబడేది అసైన్‌మెంట్ పట్టా పొందిన వారి హక్కు. భూమిలేని పేదలకు ప్రభుత్వ భూమిని సాగుకోసం గానీ ఇళ్ల స్థలాలకోసంగానీ ఇచ్చే వాడుక స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఉంది. బ్రిటిష్ పాలిత ప్రాంతాలలో ఈ హక్కు ఇచ్చే పత్రాన్ని డి-పట్టా (డి-ఫారంలో ఉంటుంది కాబట్టి) లేక దరఖాస్తు పట్టా, డికెటి పట్టా అని పిలుస్తారు. తెలంగాణలో లావొణి పట్టా అంటారు. హక్కుదారు ఈ భూమిని తప్పనిసరిగా వినియోగంలోకి తేవాలి. ఏ అవసరం కోసం ఇస్తారో దానికోసం మాత్రమే వినియోగించాలి. వంశపారంపర్యంగా అనుభవించవచ్చును గానీ వేరొకరికి అమ్ముకోవడంగానీ వేరే ఏ యితర రూపంలోనూ బదలాయించడానికి గానీ వీలులేదు. అయితే ప్రభుత్వానికి ఆ భూమి వేరొక ప్రజాప్రయోజనం కోసం అవసరమయినట్టయితే, ఎటువంటి నష్టపరిహారం లేకుండా వెనక్కి తీసేసుకోవచ్చు. ఈ షరతులన్నీ డి-పట్టామీద రాసి ఉంటాయి.

ప్రభుత్వం ఇచ్చిన భూమిని బాగు చేసుకొని ఏళ్లతరబడి సాగుచేసుకొని దాని చుట్టూ కుటుంబం భవిష్యత్తును ఊహించుకున్న ప్రజలు, అకస్మాత్తుగా వేరే ఏదో ఒక ప్రాజెక్టుకో దేనికో అది కావలసి వచ్చిందని ప్రభుత్వం పైసా ఇవ్వకుండ తీసేసుకుంటే ఒక్కసారిగా వీధిన పడతారు. ఇది అన్యాయం అని ఆందోళన చేయగా చేయగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అన్యాయమయిన పరిస్థితిని సవరించే ఆదేశాలు జారీ చేస్తూ వచ్చింది. వాటిలో చివరిది 1993 డిసెంబర్ 23న జారీ చేసిన జివో. నెం. 1307. దాని ప్రకారం, స్వంత భూమికిచ్చినట్టే అసైన్‌మెంట్ భూమికి కూడ ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్‌ధర, దానిపైన బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నందుకు 30 శాతం పరిహారం (సొలేషియం) ఇవ్వాలి. అయితే స్వంత భూమికి ఇచ్చినట్టు నోటిఫికేషన్‌కూ భూమి అప్పగింతకూ మధ్య కాలానికి వడ్డీ చెల్లించరు. అంతకంటే ముఖ్యంగా దీనిని సవాలు చేస్తూ కోర్టుకు పోయే అవకాశం పట్టాదారులకు ఉండదు.

ఈ షరతులనే మన రాష్ట్ర హైకోర్టు 2004లో ఇచ్చిన తీర్పులో రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి కొట్టేసింది. అసైన్‌మెంట్ పట్టాను పూర్తి స్థాయి యాజమాన్యంగా పరిగణించి స్వంత భూమి ఉన్న రైతుతో సమానంగా నష్టపరిహారం ఇవ్వాలనింది.

తీర్పుపైన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన అప్పీల్‌లో ఇప్పటికింకా ఏ తీర్పూ రాలేదని గుర్తుచేయండి. అందువల్ల హైకోర్టు తీర్పును పాటించాలని చెప్పండి. అది కాకపోతే కనీసం 1993 నాటి జివో. నెం. 1307ను అనుసరించి మార్కెట్ విలువకు 30 శాతం పరిహారం చేర్చి ఇవ్వాలి. (బాక్స్ చూడండి). ఏమీ ఇవ్వనక్కరలేదన్నట్టు, ఒకవేళ ఇస్తే అది ప్రభుత్వం దయ అయినట్టు వ్యవహరించే ప్రభుత్వ అధికారుల వైఖరి చట్ట విరుద్ధం అని గుర్తించండి.

## 8. ఏ పట్టా లేకపోతే?

అయితే డిఫారం పట్టాకూడా లేకుండా ప్రభుత్వభూములు సాగుచేసుకుంటున్న పేదలుంటారు. వాళ్ళకు నష్టపరిహారం ఇస్తారా, ఇవ్వరా? పేదలు అసైన్‌మెంట్ పట్టా ఇవ్వదగిన ప్రభుత్వ భూములను అనుభవిస్తున్నట్టయితే, వారి ఆక్రమణను నమోదు చేయాలి. వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల గురించి విచారణ జరపాలి. నిజంగా భూమిలేని పేదలైతే వారికి డిఫారం పట్టాలు ఇవ్వాలి. ఇది ప్రభుత్వం బాధ్యత అని బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ చెప్తాయి. ఆ తరువాత ఆ భూమిని ఏదైనా ప్రజా ప్రయోజనం కోసం ప్రభుత్వం సేకరిస్తే, పైన చెప్పిన హక్కులు వర్తిస్తాయి. కానీ ప్రభుత్వ అధికారులు ఆ పని చేయకపోతే? పేదలు ప్రభుత్వ భూములను ఏళ్ళతరబడి సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు ఇవ్వకపోతే? అటువంటి భూమిని ఆ తరువాత ప్రభుత్వం ఏదైనా ప్రజావసరం కోసం తీసుకుంటే వారికి నష్టపరిహారం దక్కుతుందా? దక్కాలి. కాని వారికి నష్టపరిహారం ఇవ్వాలని చెప్పే చట్టం ఏదీలేదు. వారికి డిఫారం పట్టాలు ఇయ్యవలసి ఉండీ అధికారులు ఇవ్వలేదు కాబట్టి ఇచ్చినట్లే భావించి నష్టపరిహారం ఇవ్వాలని చెప్పే కోర్టు తీర్పులూ లేవు. అయితే ఆందోళన చేయగా చేయగా షంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కోసం సేకరించిన భూమిలో ఈ కోవకు చెందిన పేదలకు మొట్టమొదటిసారిగా నష్టపరిహారం ఇచ్చారు. ఎకరానికి 65 వేలు ఇచ్చారు. కాబట్టి మీరు డిఫారం పట్టా సైతం లేకుండా ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న వారైతే, షంషాబాద్ సూత్రాన్ని మీకు కూడా వర్తింపజేయాలని ఆందోళన చేయండి. ఎకరానికి 65 వేలే అడగనక్కరలేదు. అది 2003 నాటి సంగతి. ఇప్పటి పరిస్థితికి తగినంత అడగండి.

## 9. ఏ భూములూ లేనివారి గతి ఏమిటి?

రైతుల భూములు పోతే ఆ భూములలో కూలిచేసుకొని బతికే భూమిలేని కూలీల జీవనం కూడా పోతుంది. సాగుభూములేకాక గ్రామం కూడా ఖాళీ చేయవలసి వస్తే గ్రామంలో చాకలి, మంగలి, కమ్మరి మొదలైన వృత్తులు చేసుకొని బతికే పేదల జీవనమూ పోతుంది. రైతుల భూములు, డిఫారం పట్టా భూములు, పట్టాలేకుండా ఎవరో ఒకరు సాగుచేసుకుంటున్న భూములే కాక సాగులో లేని ప్రభుత్వం బంజర్లను కూడా ప్రాజెక్టులకు, పరిశ్రమలకు అప్పగించడం జరుగుతుంటుంది. ఆ భూములలో తాడిచెట్ల, ఈతచెట్ల కల్లుతీసి బతికే గీత కార్మికుల జీవనం పోతుంది. రాళ్ళు కొట్టి అమ్ముకొని బతికే వడ్డెరల జీవనం పోతుంది. ఆ భూములలో వాగులు ఉంటే వాటిలో చేపల వేట చేసుకొని బతికే మత్స్యకారుల జీవనం పోతుంది.

చాలాకాలం ఈ ప్రజలకు ఏ నష్టపరిహారం దక్కేదికాదు. కానీ 2005 మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జివో. నెం. 68లో ఈ ప్రజలకు కూడా నగదు నష్టపరిహారం ఇవ్వాలని రాశారు. ఒక ప్రాజెక్టుకోసం భూసేకరణ చేపట్టేటప్పుడు భూములు కోల్పోయే వారేకాక జీవనం కోల్పోయేవారూ ఉంటారని ఈ జివో గుర్తించి, అటువంటి కుటుంబాలకు 625 రోజుల కనీస వ్యవసాయ కూలి వేతనం నష్టపరిహారంగా ఇవ్వాలని చెప్తుంది. ఉదాహరణకు కనీస వ్యవసాయ కూలీ వేతనం 80 రూపాయలైతే, ఒక్కొక్క కుటుంబానికి 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి. వ్యవసాయ కూలీలకేకాదు, జీవనం కోల్పోయే సకల వృత్తుల వారికీ 625 రోజుల కనీస వ్యవసాయ కూలివేతనం ఇవ్వాలి. ఎందుకంటే అన్ని



వృత్తులకూ కనీస వేతనాలుండవు కాబట్టి. అడవిప్రాంత ఆదివాసులైతే అటవీ ఉత్పత్తులు కోల్పోతారు కాబట్టి ఇంకొక 500 రోజుల కనీస వేతనం ఇవ్వాలి.

ఈ జివోను ఆందోళన చేస్తే తప్ప ఎక్కడా అమలు చేయడం లేదు కాబట్టి, డిమాండ్ చేసి అమలు చేయించుకోండి. గ్రామం ఖాళీ చేయకముందే సకల వృత్తులవారి సామాజిక ఆర్థిక సర్వే జరిపి రికార్డు తయారయ్యేటట్లు చూసుకోండి. ఖాళీ చేసిన తరువాత నేను ఫలాన ఊరిలో చాకలి పనిచేసే వాడిని అంటే దానికి రుజువు ఏం ఉంటుంది? కాబట్టి జివో 68 కింద ఇయ్యవలసిన నష్టపరిహారం ఇవ్వకుండా, లేదా కనీసం సర్వే జరిపి రికార్డు సమగ్రంగా తయారుచేయకుండా, ఊరు ఖాళీ చేయొద్దు.

ఈ జివోను అమలుచేయమని అడిగితే దీనిని జారీచేసింది రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదలశాఖ కాబట్టి ఇది నీటిపారుదల ప్రాజెక్టులకే తప్ప ఇతర ప్రాజెక్టులకు వర్తించదని అధికారులు దబాయిస్తారేమో. జివో ఏ శాఖ జారీచేసినా అది ప్రభుత్వ జివోయే తప్ప ఆ శాఖ జివో కాదు. జివోలో వాడిన పరిభాష ప్రకారం ఎవరెవరికి వర్తించాలో వారందరికీ వర్తిస్తుంది. జివో 68లో వాడిన పరిభాష అన్ని రకాల ప్రాజెక్టులకూ దానిని వర్తింపజేస్తుంది. నీటిపారుదల ప్రాజెక్టు కానటువంటి గంగవరం ఓడరేవు ప్రాజెక్టు నిర్వాసితులు దీనిని అమలు చేయించుకున్నారు కాబట్టి మీరు ఏ ప్రాజెక్టు నిర్వాసితులైనా మీరు కూడా అమలు చేయించుకోవచ్చు.



## 10. పునరావాసం సంగతేమిటి?

వ్యవసాయ భూములేకాక నివాస ప్రాంతాలలో కూడా ప్రభుత్వం భూముల్ని సేకరించినట్టయితే, ఇళ్ళకు కూడా భూసేకరణ చట్టం కింద మొదట్లో పేర్కొన్న నియమాలు యావత్తు వర్తిస్తాయి. అంటే ఇళ్లకు, ఇంటి స్థలానికి కూడా నష్టపరిహారం లభిస్తుంది.

ఆ తరువాత ఖాళీచేసి వెళ్ళిపోవలసిందేనా? అంటే మొన్నటిదాకా అంతే. అయితే జివో 68 జారీ అయిన తరువాత పరిస్థితి పూర్తిగా కాకున్నా కొంత మెరుగయింది. గ్రామస్తులందరూ గానీ, గ్రామంలో ఒక సామాజిక వర్గంగానీ ఒక చోట కలిసి ఉండదలిస్తే వారికి ఒకచోటే పునరావాసం కల్పించాలి. వారికి ప్రభుత్వం ఉచితంగా ఇంటిస్థలం ఇవ్వాలి. దరిద్రరేఖకు దిగువన ఉన్న వారికైతే 40,000 రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలి. ఆ పునరావాస స్థలాన్ని ఆదర్శగ్రామంగా సకల వసతులతో తీర్చిదిద్దాలి. రోడ్లు, కరెంటు, బడి, రక్షిత మంచినీటి వ్యవస్థ, ఆటస్థలం వగైరాలన్నీ ఉండాలి. ఖాళీచేసిన ఊరినుంచి అక్కడికి పోవడానికి ఒక్కొక్క కుటుంబానికి 5000 రూపాయలు ఖర్చులకోసం ఇవ్వాలి. పశువులున్న వారికి పశువుల కొట్టం కట్టుకోవడానికి 3000 రూపాయలు ఇవ్వాలి. చిన్న అంగళ్ళు లేక ఉత్పత్తి కేంద్రాలు పెట్టుకొని బతుకుతున్న వారికి కొత్తచోట అవి కట్టుకోవడానికి 25,000 రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలి. సాగుభూమికి నష్టపరిహారం వద్దు భూమికి భూమి కావాలని కోరినట్టయితే, సాగుయోగ్యమైన భూమికనక అందుబాట్లో ఉన్నట్టయితే రెండున్నర ఎకరాల తరి, 5 ఎకరాల మెట్ట మించకుండా ఇవ్వొచ్చు. నిర్వాసితులు ఆదివాసులైతే ఆదివాసీ ప్రాంతంలోనే వారు ఎంచుకున్న చోట పునరావాసం కల్పించాలి. ఒకవేళ అది సాధ్యం

కాకపోతే, పైన చెప్పిన అన్ని మొత్తాల మీద 25 శాతం వారికి అదనంగా ఇవ్వాలి. నష్టపరిహారం బదులు భూమికి భూమి ఇచ్చే విషయంలో ఆదివాసులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది.

ఈ హక్కుల అమలు సంక్లిష్టంగా ఉండగలదు కాబట్టి, ప్రతీ ప్రాజెక్టుకూ జివో 68లోని పునరావాస పథకం అమలు నిమిత్తం జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని 'అడ్మినిస్ట్రేటర్'గా ప్రభుత్వం నియమించాలి. ఆ అధికారి చేపట్టవలసిన మొట్టమొదటి పని, అతితక్కువ మందిని నిర్వాసితులు చేసే ప్రత్యామ్నాయాన్ని అన్వేషించడం. ఆ తరువాత నిర్వాసితులను సంప్రదించి, పైన పేర్కొన్న పునరావాస పథకానికి ఆచరణ రూపం ఇవ్వాలి. అయినప్పటికీ అవకతవకలూ అవినీతీ ఉండే ప్రమాదం ఉంది కాబట్టి ప్రతీ ప్రాజెక్టుకూ నిర్వాసితుల భాగస్వామ్యంతో ఒక పర్యవేక్షణ కమిటీ, ఒక ఫిర్యాదుల కమిటీ వేయాలి.

ఈ పునరావాస పథకం ఇప్పటికెక్కడా సక్రమంగా అమలుకాలేదు కాబట్టి దీని వివరాలు తెలుసుకొని అమలు చేయించుకుంటారని ఆశిస్తూ పై వివరాలు ఇచ్చాము.

ఒక్క విషయం జ్ఞాపకం పెట్టుకోండి. వర్తక వాణిజ్య రంగాల పెద్దల ప్రయోజనాలను కాపాడడం కోసం తయారుచేసిన చట్టాలు వాటంతటవి అమలవుతాయిగానీ మీబోటి సాధారణ ప్రజల అవసరాలకోసం చేసిన చట్టాలు, జివోలు అడుగడుగునా నిఘావేసి అమలు చేయించుకుంటే తప్ప అమలు కావు.

రాష్ట్ర కమిటీ, జూన్, 2008



## పోలవరం ప్రాజెక్టు భూసేకరణ నిలుపుదల చేయాలి

# ఆదివాసీ పెద్దలారా, అన్నలారా, అక్కలారా, మిత్రులారా!

పోలవరం ప్రాజెక్టుకోసం ఆదివాసీ ప్రాంతాలలో ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఎన్నో ఏండ్లుగా భూముల ఆధారంగానే జీవనోపాధి సాగిస్తున్న ఆదివాసులను సాగుభూముల నుంచి తొలగిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సెటిల్‌మెంట్ పట్టాలు గిరిజనేతర్ల పేరున ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. గిరిజనేతరుల పక్షం వహిస్తున్న అవినీతి స్వార్థపర అధికార్లు హడావిడిగా భూసేకరణ గావించి ఆదివాసులను నిరాశ్రయులను చేస్తున్నారు. సాగులోలేని గిరిజనేతర్లకే నష్టపరిహారం చెల్లిస్తున్నారు. షెడ్యూల్డు ప్రాంతాలలో పాటించవలసిన చట్టపర నియమాలు, ప్రభుత్వ ఉత్తర్వులను కూడా గాలికి వదిలేస్తున్నారు. అధికార్లు యధేచ్ఛగా హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలంలో పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలంలో ఉన్న ఆదివాసీ గ్రామాలలో సుమారు 6 వేల ఎకరాల పైబడి భూములు ఆదివాసుల సాగులో ఉన్నట్లుగా అంచనా. సుమారు 45 గ్రామాలలో కొన్ని వేల ఆదివాసీ కుటుంబాలు నిరాశ్రయులవుతారని అంచనా.

షెడ్యూల్డు ప్రాంతాలలో భూసేకరణ చేపట్టాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల షెడ్యూల్డు ప్రాంత పంచాయితీరాజ్ చట్ట నియమాలు పాటించాలి. ఏజెన్సీ ప్రాంత భూసేకరణ విషయంలో పాటించవలసిన నియమాలను కేంద్ర ప్రభుత్వం స్పష్టపరిచింది. భూసేకరణకు గ్రామసభ అనుమతి, మండల ప్రజాపరిషత్ సమ్మతి తప్పనిసరిగా భూసేకరణ అధికారులు పొందాలి.

తూర్పుగోదావరి జిల్లా సూరంపాలెం రిజర్వాయర్ కింద భూసేకరణ విషయంలో దాఖలైన ఒక కేసు (రిట్ పిటీషన్ నెం. 8476/2001) లో షెడ్యూల్డు ప్రాంత భూసేకరణ చేయాలంటే గ్రామసభల అనుమతి, ఆయా మండల ప్రజాపరిషత్ తీర్మానాలు అవసరమని రాష్ట్ర హైకోర్టు 2002లో స్పష్టమైన తీర్పు ఇచ్చింది. అయినా పోలవరం ప్రాజెక్టు భూసేకరణ అధికారులు రాష్ట్ర హైకోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ భూసేకరణ చేస్తున్నారు.

ఆదివాసీ భూహక్కుల పరిరక్షణ నియమాలు 1/70కి విరుద్ధంగా షెడ్యూల్డు ప్రాంతాలలో ఆదివాసులకు చెందిన కొన్ని లక్షల ఎకరాల భూమి పరాయికరణ జరిగింది. గిరిజనేతర్లు అక్రమంగా ఆదివాసుల భూమిపై పట్టాలు పొందారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాలలో నివాసంలేని, సాగులోలేని భూములపై కూడా గిరిజనేతరుల పేరున పట్టాలు ఉన్నాయి.

ప్రభుత్వ భూములపై కూడా నియమాలకు విరుద్ధంగా గిరిజనేతర్ల పేర 'డి' నమూనా పట్టాలు, సెటిల్‌మెంట్ పట్టాలు మంజూరు కాబడ్డాయి. అటువంటి పట్టాలు రద్దు చేయాలని 1/70 చట్ట నియమాలు అమలు పరచి గతంలో గిరిజనేతర్లు పొందిన కోర్టు ఉత్తర్వుల రద్దుకు కూడా చర్యలు తీసుకోవాలని ఇటీవల కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సుల జి.ఒ.నెం. 1049 స్పష్టం చేస్తుంది. జి.ఒ. అమలుకు ముందే ఆదివాసులను ఏజెన్సీ ప్రాంత భూములనుంచి తొలగించే ప్రక్రియ భూసేకరణ అధికారులు ప్రారంభించారు.

ఆదివాసుల అటవీ భూమిని గుర్తిస్తూ అటవీ హక్కుల చట్టం 2007లో ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. అటవీ హక్కుల గుర్తింపు పూర్తికావడానికి మరో మూడు మాసాలు పడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈలోగానే భూసేకరణ చేపట్టి పోలవరం ప్రాజెక్టుకింద ఆదివాసుల అటవీ భూమి హక్కులు కాలరాస్తున్నారు. ఆదివాసీ గ్రామాలలో భూసేకరణ తంతును హడావిడిగా ప్రభుత్వం ముగిస్తున్నది.

ప్రాజెక్టు నిర్వాసితులు, బాధిత కుటుంబాల ప్రయోజనాలకోసం ప్రభుత్వం పునరావాస విధానాన్ని జి.ఒ.నెం. 68లో స్పష్టం చేసింది. షెడ్యూల్డు ప్రాంతాలలో 1/70 చట్టాన్ని అమలు పరిచిన తర్వాతనే గిరిజనేతర భూమి హక్కులు నిర్ధారించాలని ఆ జీవో తెలుపుతుంది. పోలవరం ప్రాజెక్టు కింద చేపట్టే భూసేకరణ విషయంలో 1/70 చట్టం కింద సంబంధిత అధికారులు ముందుగా భూమి యాజమాన్యపు హక్కు కోరుతున్న గిరిజనేతరులకు నోటీసులు జారీచేసి, ఆదివాసుల వాదనలకు అవకాశం ఇచ్చి, విచారణ జరిపిన తర్వాతనే గిరిజనేతర హక్కులు నిర్ధారించాలి. కాని ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా భూసేకరణ అధికారులు అత్యుత్సాహం కనబరుస్తూ గిరిజనేతర్లకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారు.

గతంలో రంపచోడవరం ఆర్.డి.ఒ. 1/70 చట్టం నిబంధనలకు భిన్నంగా ప్రాజెక్టు అవసరాలకోసం సాగులో లేని గిరిజనేతర్లనుండి సుమారు 592 ఎకరాల భూమిని కొనుగోలు చేసారు. వాస్తవానికి ఎన్నో ఏండ్లుగా ఆ భూములు ఆదివాసుల స్వానుభవంలోనే ఉన్నవి. అక్రమ కొనుగోలును ప్రశ్నించిన ఆదివాసులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేసారు. ఆదివాసుల సాగులో ఉన్న అటువంటి భూములను పరిరక్షించాలి. ఆ భూములనుండి ఆదివాసులను తొలగించే చర్యలు ఆపాలి.

## ఆదివాసీ పెద్దలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులకు విజ్ఞప్తి:

ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసిత ముంపుప్రాంత భూమి సమస్యలపై ఉమ్మడిపోరు సాగించాల్సిన అవసరం ఏర్పడింది. ఆదివాసుల భూమి సమస్య పరిష్కారంకోసం ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడింది.

డిమాండ్లు:

1. సాగులో ఉన్న ఏజెన్సీ భూములనుంచి ఆదివాసులను తొలగించే ప్రక్రియను పోలవరం ప్రాజెక్టు భూసేకరణ అధికార్లు నిలుపుదల చేయాలి.
2. షెడ్యూల్డు ప్రాంతాలలో అమలులో ఉన్న పంచాయితీరాజ్ చట్టాన్ని, అనుబంధ హైకోర్టు ఉత్తర్వులను అమలుపరచాలి.





3. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సు నెం. 9.7 (జి.ఒ.నెం. 1049) అమలు చేసి సాగులోలేని, నివాసంలేని గిరిజనేతర్ల సెటిల్‌మెంటు పట్టాలు రద్దుపర్చాలి.
4. గతంలో 1/70 భూమి నిబంధనల కింద గిరిజనేతరులు పొందిన కోర్టు ఉత్తర్వులు రద్దు పరిచేందుకు జారీ కాబడిన ప్రభుత్వ ఉత్తర్వులు (తేదీ: 7-3-2008 నెం. 11456/ఎల్.టి.ఆర్/06) అమలు చేయాలి.
5. ఏజెన్సీ ప్రాంత భూమి హక్కు 1/70 చట్టం కింద నిర్ధారించి సంబంధిత ఆదివాసులకే పునరావాసం కల్పించాలన్న పునరావాస విధానం జి.ఒ.నెం. 68ను అమలు చేయాలి.
6. అటవీ హక్కు గుర్తింపు చట్టం కింద ఆదివాసుల అటవీ భూమి హక్కులు గుర్తించే ప్రక్రియ పూర్తిచేసేంతవరకు భూసేకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలి.
7. ప్రభుత్వ భూములపై గిరిజనేతర్లకు మంజూరు కాబడిన 'డి' నమూనా పట్టాల్ని ఆధారం చేసుకుని నియమాలకు విరుద్ధంగా రెవిన్యూ అధికారులు గిరిజనేతర్లకు చెల్లించిన నష్టపరిహారాన్ని ఆయా రెవిన్యూ అధికార్ల నుంచి వసూలు చేయాలి.
8. ప్రాజెక్టు కింద నష్టపరిహారం పొందేందుకు అక్రమ పద్ధతిలో పట్టాదారు పుస్తకాలు, భూమి హక్కు పత్రాలు మండల రెవిన్యూ కార్యాలయంనుంచి గిరిజనేతర్ల పేర మంజూరు కాబడ్డాయి. గత మూడు సంవత్సరాలనుండి మండల రెవిన్యూ కార్యాలయాలనుంచి గిరిజనేతర్ల పేర మంజూరు కాబడిన పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్స్‌పై సమగ్ర విచారణ జరపాలి.
9. ఆదివాసుల సాగులో ఉన్న భూములను గిరిజనేతర్ల నుండి కొనుగోలు చేసిన రంపచోడవరం ఆర్.డి.ఒ. ఉత్తర్వులను రద్దుపరచి ఆదివాసుల భూమి సాగును పరిరక్షించాలి. ఆదివాసుల సాగులో ఉన్న భూములను వేరొక ఆదివాసుల పేర పట్టాలు మంజూరు చేసే విధానానికి రెవిన్యూ అధికార్లు ముగింపు పలకాలి. ఆదివాసుల మధ్య సామాజిక ఘర్షణలను నివారించే విధంగా అటువంటి పట్టాలు రద్దు చేయాలి.
10. ప్రాజెక్టుల కింద గిరిజనులు కోల్పోతున్న సాగుభూమికి బదులు షెడ్యూల్డు ప్రాంతాలలోనే వేరే భూముల్ని నష్టపరిహారంగా ఇవ్వాలి.
11. గిరిజనేతర్లకు అడ్డాగా మారిన మైదాన ప్రాంతాలలో నెలకొల్పిన పోలవరం ప్రాజెక్టు భూసేకరణ కార్యాలయాలను తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఐ.టి.డి.ఎ. కేంద్రాలైన రంపచోడవరం, కె.ఆర్.పురంలకు మార్చాలి.
12. భూమి వివాదాలలో పోలీసుల జోక్యం ఉండరాదని సూత్రీకరించిన రాష్ట్ర హైకోర్టు తీర్పు (రిట్ పిటీషన్ నెం. 1871/2008)ను అమలు పరచాలి.

ఏజెన్సీ గిరిజన భూహక్కుల పరిరక్షణ కమిటీ, మరి నాలుగు సంఘాలతో కలిసి,
19-7-2008

## యెల్లంపల్లి, మిడ్ మానేరు

# నిర్వాసితుల హక్కుల కోసం ధర్నా

యెల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం, పునరావాసం కల్పించిన తరువాతే ప్రాజెక్టు పనులు కొనసాగించాలి అన్న డిమాండుతో ఆగస్టు 25వ తేదీ శనివారం ఉ॥ 9.00 గంటల నుంచి కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయవలసిందిగా ప్రజలను కోరుతున్నాం.

ఎప్పటినుండో హామీలుగా ఉన్న యెల్లంపల్లి, శ్రీరాంసాగర్ వరదకాలువ (అందులో భాగమైన మిడ్ మానేరు ప్రాజెక్టు) ఇన్నాళ్లకు కార్యరూపం తీసుకుంటున్నందుకు సంతోషించడం సహజం. అయితే ఒకరి సంతోషం మరొకరి విచారం కాకూడదు. విషాదం అసలే కాకూడదు. దేశ అభివృద్ధి అన్నా, రాష్ట్ర అభివృద్ధి అన్నా, తెలంగాణ ప్రాంత అభివృద్ధి అన్నా, అక్కడ బతికే వారందరి అభివృద్ధిగా అర్థం చేసుకున్నప్పుడే అది న్యాయమైన భావన అనిపించుకుంటుంది. ప్రాజెక్టులు కడితే జీవన పరిస్థితులు మెరుగవుతాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, ఆదాయాలు పెరుగుతాయి అని భావిస్తాం. అందుకే వాటిని ఆహ్వానిస్తాం. వాటివల్ల వచ్చే మార్పును అభివృద్ధి, ప్రగతి అంటాం. అయితే ప్రాజెక్టులకు భూములు కావాలి. పెద్ద ప్రాజెక్టులకు పెద్దమొత్తంలో భూములు కావాలి. వాటిని ప్రాజెక్టు కోసం అప్పగించినప్పుడు వాటిపైన ఆధారపడి బతుకుతున్న ప్రజలు తమ జీవనాధారాన్ని కోల్పోతారు. అందులో పట్టాభూములున్న రైతులుంటారు. ప్రభుత్వ భూమిలో అసైన్‌మెంట్ లేక లావోణి (డి–ఫారం) పట్టా పొందిన భూమిలేని పేదలు ఉంటారు. రైతుల భూములలో కూలిచేసుకొని బతికే రైతు కూలీలుంటారు. ప్రభుత్వం బంజర్లలో తాటిచెట్ల కల్లుగీసి అమ్ముకునే గీత కార్మికులు, పశువులను మేపుకొని బతికే పశువుల కాపర్లు, రాళ్ళు కొట్టి బతికే వడ్డెరలు, వాగులలో, కుంటలలో చేపలు పట్టుకొని బతికే మత్స్యకారులు, బట్టలుతుక్కొని బతికే రజకులు ఉంటారు. భూములు ప్రాజెక్టుకు అప్పగిస్తే ఈ ప్రజలంతా తమ జీవనాధారాన్ని కోల్పోతారు. ఈ ప్రజానీకం జీవితాలను, జీవన మార్గాలను కాపాడే పథకం రచనలో భాగం అయినప్పుడే దానిని నిజమైన అభివృద్ధి అనగలం. అదేమీ లేకుండా ప్రాజెక్టులు కట్టేసి కొన్ని వందల, లేక వేల కుటుంబాల జీవనాధారాన్ని తొలగించి దేశాన్ని అభివృద్ధి చేశామంటే అంగీకరించడానికి వీలులేదు.





జీవనాధారం కోల్పోయే వాళ్ళలో స్వంత ఆస్తి ఉన్న రైతులకు మాత్రమే భూసేకరణ చట్టం కింద కొంత నష్టపరిహారం దక్కుతుంది. అయితే ఆ నష్టపరిహారం మళ్ళీ అంత భూమి కాదు కదా, అందులో సగం భూమి కొనుక్కోవడానికి కూడా సరిపోదు. యెల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాలు రామగుండం ప్రాంతంలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ధర ప్రకారమయితే అక్కడ ఎకరం భూమి ధర 60,000 రూపాయలు మించి లేదు. ఆ మొత్తం తీసుకొని పెంపుదల కోసం కోర్టులో కేసు వేసి సంవత్సరాలు తరబడి కొట్లాడే ఓపిక లేనివారు ప్రభుత్వంతో ఒప్పందానికి వచ్చి కోర్టుకు పోమని హామీ ఇచ్చి 60,000 రూపాయల కంటే ఎక్కువ నష్టపరిహారం ఒకేసారి తీసేసుకోవచ్చు. దానికి ఒప్పుకోవడానికి ఇష్టపడినట్లయితే రెండు పంటలకు నీటి వసతి ఉన్న భూమికి ఎకరానికి 1,60,000 రూపాయలు, ఒక పంటకు శ్రీరాంసాగర్ కాలువ నీళ్ళొచ్చే భూమికి 1,50,000 రూపాయలు, మెట్టకు 90,000 రూపాయలు ఇవ్వడానికి ప్రభుత్వం ఒప్పుకుంది. ఇది చాలదనీ, అదే మండలంలో ఇతర గ్రామాలలో చెరువు కింద భూములు ఎకరం 2,50,000 రూపాయలకు అమ్ముడు పోతున్నాయని ముంపు గ్రామాల రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం లెక్క పెట్టలేదు. ఇచ్చింది తీసుకో, లేకపోతే 60,000 తీసుకొని ఒక దశాబ్ద కాలం కోర్టుల చుట్టూ తిరుగు అనేది ప్రభుత్వం సమాధానం.

నిజానికి ఆ 1,60,000 కూడా రైతు దగ్గర మిగలవు. మన గ్రామాలలో భారీగా అప్పుపడని రైతులెవరూ లేరు. అందులోనూ మన రాష్ట్రం ప్రత్యేకత ఏమిటంటే ప్రభుత్వ బ్యాంకులు లేక సహకార సంఘాల వద్ద కంటే ప్రైవేటు వ్యక్తుల వద్ద చేసే అప్పులే ఎక్కువ. రైతు ఊరిలో ఉంటే వ్యవసాయం చేస్తున్నంతకాలం అప్పులవాళ్ళు పెద్దగా ఒత్తిడి పెట్టకపోవచ్చును గానీ భూములు అప్పగించి ఊరు విడిచిపెట్టి అప్పుచేసి వెళ్ళిపోతాడని తెలిస్తే బాకీ మొత్తం తీర్చి పొమ్మంటారు. ఆ పని చూడా చేస్తే ఇక మిగిలేదానితో కోల్పోయిన భూమిలో నాల్గవ వంతు కూడా ఎక్కడా కొనుక్కోలేరు.

ఇలా లావోణి పట్టా (అసైన్‌మెంట్, లేక డి–ఫారం) ఉన్నవారి విషయంలో ఒక విధానమేదీ అమలులో లేదు. స్వంత భూమి ఉన్న రైతులకు ఏ లెక్కన నష్టపరిహారం ఇస్తారో అదే లెక్కన అసైన్‌మెంట్ భూమి ఉన్న వారికీ ఇవ్వాలని మన రాష్ట్ర హైకోర్టు ఏడుగురు జడ్జిల బెంచి తీర్పు ఇచ్చింది. దానిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసి స్టే తీసుకుంది. ఇప్పుడొక విధానమంటూ లేదు. ఎట్లాగయినా భూమి స్వాధీనం చేసుకోవాలనుకున్న చోట డి–ఫారం పట్టా ఉన్న వారికి కూడా పూర్తిస్థాయి నష్టపరిహారం ఇస్తామన్న హామీ ఎరగా చూపిస్తున్నారు. అయినా ఇచ్చింది మాత్రం ఎక్కడా లేదు. వేరే చోట్ల ఏమీ మాట్లాడటం లేదు. ఎల్లంపల్లి ముంపు గ్రామమైన మురుమూరులో 300 మంది దాకా అసైన్‌మెంట్ భూములున్నవారు ఉన్నారు. మిడ్‌మానేరు ముంపు గ్రామమైన కొదురుపాకలో అసైన్‌మెంట్ భూమి 1,000 ఎకరాల దాకా ఉంది. చీర్లవంచలోనూ 600 ఎకరాల దాకా ఉంది. ఈ ప్రజలంతా రేపు ఏమవుతారు? వారి భవిష్యత్తుకు ఏ హామీ లేకుండా ఖాళీచేసి పొమ్మంటే ఎక్కడికి పోవాలి? ఎందుకు పోవాలి?

ఎల్లంపల్లికి రెండు వైపులా ముంపు గ్రామాలున్నాయి. అటు ఆదిలాబాద్ జిల్లాలో, ఇటు కరీంనగర్ జిల్లాలో భూములన్నీ ఒకే రకమైనవి. వేసే పంటలూ ఒకే రకమైనవే. అయితే ఆదిలాబాద్ జిల్లాలోని ముంపు గ్రామాల వారు పట్టుదలగా ఉద్యమం చేయగా వారికి ప్రభుత్వం ఎకరానికి 1,80,000 ఇవ్వడానికి సిద్ధపడుతున్నది. కరీంనగర్ జిల్లా రైతులకు మాత్రం 1,60,000 రూపాయలేనట. ఈ వివక్షకు హేతుబద్ధమైన కారణం ఏమైనా ఉందా? ఒక లక్షా ఎనభై వేలయినా అరవై వేలయినా అంత భూమి మళ్ళీ కొనుక్కోలేరనేది నిజమే అయినా ఆ తక్కువలోనూ ఎక్కువ ఆందోళన చేసిన వారికి కొంచెం ఎక్కువ ఇవ్వడం ఏం చెబుతుంది? ఈ ప్రభుత్వం తనంతట తాను న్యాయం చేయదు. మీరు ఎంత ఒత్తిడి పెడితే అంత చేస్తుంది అనేనా? అట్లా అయితే ఆందోళనకారులను అణిచివేయడానికి చేయగల ప్రయత్నాలన్నీ ఒకపక్క చేస్తూ, వాళ్ళవల్లనే ఇతర రైతులకు నష్టం జరుగుతున్నదని ఇతరులను రెచ్చగొడుతూ, ఏ ఆందోళన చేయని వారికి మొండిచేయి చూపించే కుతంత్రాన్ని ఏమనాలి?

పాలన కుతంత్రాలమయం కాబట్టే 'భూమికి భూమి' అన్న నినాదం నిర్వాసితుల నుంచి ప్రపంచ వ్యాప్తంగా ముందుకొస్తున్నది. ఎంత భూమి తీసుకుంటారో, ఎటువంటి భూమి తీసుకుంటారో అంత భూమి, అటువంటి భూమి అందరికీ ఒకే చోట, సామాజిక బంధాలు తెగకుండా, కల్పించండి అన్న డిమాండ్ ఇవ్వాళ వస్తున్నది. అది ఆచరణ సాధ్యం కానిచోట వేరే ఏ రూపంలోనైనా నిర్వాసితుల జీవన ప్రమాణం పడిపోకుండా ఉండేటట్టు వారికి పునరావాసం కల్పించాలి. కానీ మన దేశంలో అటువంటి విధానమేదీ లేకుండానే ప్రాజెక్టులు కట్టేస్తున్నారు. 'అభివృద్ధి' సాధించేస్తున్నారు. మిడ్‌మానేరు ముంపు గ్రామాలలో రైతులు వ్యవసాయం చేసుకొని బతుకుతున్నారు. చేతిలో నాలుగు రాళ్ళుపెట్టి వారినక్కడి నుంచి తరిమేస్తే వేలాది ఆ ప్రజానీకం ఏమవుతారని ప్రభుత్వం అనుకుంటున్నది? ఎకరానికి 6 లక్షల రూపాయలిస్తే తప్ప అంత భూమి మళ్ళీ దొరకదని వాళ్ళు ప్రభుత్వాన్ని అడగగా, ఎకరానికి 2 లక్షల 10 వేలు ఇవ్వడానికి మాత్రమే ప్రభుత్వం ఒప్పుకుంది. ఇక భూమిలేని పేదలకు నష్టపరిహారం, ఊరందరికీ ఒకే చోట ఉమ్మడి పునరావాసం కల్పించే దిశగా 2005 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల శాఖ ద్వారా జీ.వో. నెం. 68ని జారీ చేసింది. దీనికి సహాయ పునరావాస విధానపత్రం అని పేరు పెట్టారు. దీని అమలుకోసం జరగవలసిన ఏ పనీ ఎల్లంపల్లి ముంపు గ్రామాలలో గానీ, మిడ్‌మానేరు ముంపు గ్రామాలలో గానీ జరగలేదు. దానికి ముందుగా వివిధ వృత్తులు చేసుకొని బతికేవారి జాబితా తయారుచేయాలి. దానిని గ్రామ పంచాయితీలో ప్రదర్శించి అభ్యంతరాలు ఆహ్వానించి వాటిని పరిశీలించి తుదిరూపం ఇవ్వాలి. వ్యవసాయ కూలీలకు 750 రోజుల కనీస వేతనాన్ని, ఇతర వృత్తుల వారికి 625 రోజుల కనీస వేతనాన్ని నగదు రూపంలో చెల్లించాలి. దీని మొట్టమొదటి మెట్టయిన జాబితా తయారీ కూడా ఇప్పటిదాకా ఏ ఊరిలోనూ జరగలేదు. అసలు ఈ పనులు చేయడానికి నియమించవలసిన జాయింట్ కలెక్టర్ హోదా గల అధికారి (అడ్మినిస్ట్రేటర్) నియామకమే జరిగిన దాఖలాలు లేవు.

ముంపు గ్రామాలవారు చెట్టుకొకరూ, పుట్టకొకరూ చెదిరిపోకుండా ఒకేచోట ఉండదలచుకున్నట్టయితే ఈ అడ్మినిస్ట్రేటర్ వారిని కూర్చోబెట్టి వారి అభిప్రాయం తీసుకొని అన్ని వసతులూ గల పునరావాస గ్రామాన్ని తయారు చేయడానికి తగు చర్యలు తీసుకోవాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని మినహాయించి మిగిలిన వాళ్ళు తమ ఇల్లు తామే కట్టుకోవాలి గానీ గ్రామానికి లేఅవుట్ వేసి, రోడ్లు, చెట్లు, నీళ్ళు, పంచాయితీ భవనం, స్కూలు వగైరా తయారుచేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదే.





యెల్లంపల్లి ముంపు గ్రామాలకు సంబంధించి ఈ ప్రయత్నమేదీ మొదలయిన దాఖలాలు లేవు. మిడ్‌మానేరు ముంపు గ్రామాల విషయంలో కొంత మొదలయింది గానీ నిర్వాసితుల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా అధికార్లు తమ నిర్ణయాలు వారిపైన రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. చీర్లవంచ గ్రామవాసులు ముంపుకు గురికాగా ఆ ఊరి భూమిలో ఇంకా మిగిలిన దానిలోనే పునరావాసం ఇస్తామని అంటున్నారు. ఎలాగూ గ్రామం ఖాళీ చేసిపోయేటట్లయితే సిరిసిల్ల–కరీంనగర్ రహదారిపైన, వీలయితే కరీంనగర్‌కు దగ్గరగా పునరావాస గ్రామం నిర్మించినట్టయితే పిల్లలను చదివించుకొని కరీంనగర్‌లో ఏదయినా వ్యాపకం చేసుకొని బతుకుదామని గ్రామస్తుల ఆలోచన. పునరావాసం సంగతి నిర్వాసితులను సంప్రదించి నిర్ణయించాలని జీవో 68లో చెప్పిన సూత్రాన్ని మరిచిపోయి అధికార్లు వారిని బలవంతపెడుతున్నారు. ఈ బాధ్యత అప్పగించబడ్డ అధికారి చీర్లవంచకే చెందిన భూస్వామ్య కుటుంబీకుడు. అతను అధికారిలాగా కాక ఊరి దొరలాగా వ్యవహరిస్తున్నాడని రైతుల అభియోగం. ఒక్క మాటలో చెప్పాలంటే 'అభివృద్ధి'కి బలవుతున్న ప్రజలను ప్రభుత్వం లెక్కలో రానివారిగా భావిస్తూ వారి సమస్యలనూ, భయాలనూ, ఆకాంక్షలనూ హేళన చేస్తూ ప్రాజెక్టులు కట్టుకుంటూ పోతున్నది ప్రజల జీవితాల మెరుగుదలకూ తెలంగాణ ప్రాంత అభివృద్ధికీ ఈ ప్రాజెక్టులు అవసరం అని ఎంతగా ఆరాటపడి సాధించుకున్నారో అంతే పట్టుదలగా నిర్వాసితుల హక్కులకు అండగా నిలబడాలని కరీంనగర్ జిల్లా ప్రజలందరికీ మా విజ్ఞప్తి.

1. యెల్లంపెల్లి, మిడ్ మానేరు ప్రాజెక్టులలో భూములు కోల్పోయే రైతులకు భూమికి భూమి లేదా దానికి సమానంగా నష్టపరిహారం ఇవ్వాలి.
2. లావోణి లేక అసైన్డ్ భూములున్న వారికి పట్టా భూములున్న రైతులకిచ్చినంత నష్టపరిహారం ఇవ్వాలి.
3. భూమిలేని కూలీలకూ ఇతర వృత్తుల వారికీ జీవో 68 నిర్దేశించిన నష్టపరిహారం ఒక్కపైసా తక్కువ కాకుండా ఇవ్వాలి. ప్రాజెక్టు పనులు ఆపి ఈ వర్గాల జనాభా సర్వే ముగించాలి.
4. పునరావాస గ్రామం ఎంపిక నిర్వాసితుల ఆకాంక్షలకు అనుగుణంగా చేపట్టాలి.
5. ప్రజలను పురుగులలాగా చూడడం మానేయాలి.

కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల శాఖలు, 25.8.2008

బలవంతపు విస్థాపనకు వ్యతిరేకంగా

# మానవ హక్కుల ప్రచార యాత్ర

**భూ**మిలేని వాళ్ళు భూముల కోసం పోరాడే రోజులు పోయి భూములు ఉన్నవాళ్ళు వాటిని కాపాడుకోవడం కోసం పోరాటం చేసే రోజులొచ్చాయి.

ఇది గడచిన 10 సంవత్సరాలలో వచ్చిన ఒక ముఖ్యమైన మార్పు. 'అభివృద్ధి' తీసుకొచ్చిన మార్పు. భూమిలేని వాళ్లు భూములొచ్చేసాయని పోరాటాలు మానేయలేదు. పోరాడి లాభం లేదని మానేసారు. అప్పుడెప్పుడో చట్టాన్ని ధిక్కరించి ఆక్రమించుకొని, పట్టాలకోసం ఎంఆర్వో కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలసి పోయిన భూములు కొన్నింటికి భూముల పంపిణీ పేరుమీద ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది గానీ ఇక కొత్తగా ఇచ్చేదేమీ ఉండదని స్పష్టం అయింది. ఇప్పుడు భూమంతా 'అభివృద్ధి'కి కావాలి. పేదలు భూమి పొంది రెండు పూటలు తినడం 'అభివృద్ధి' కాదు కాబట్టి వారికి ఇక భూములు రావు.

కానీ ఉన్నవి పోగలవు, పోతున్నాయి. ప్రజలు తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములను, ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టా ఇచ్చిన భూములను, పట్టా లేకున్నా చాలా కాలంగా కష్టించి బాగుచేసి సాగుచేసుకుంటున్న భూములను బలవంతంగా సేకరించి పరిశ్రమలకు ఇవ్వడం లేదా పరిశ్రమలకు ఎప్పటికైనా పనికొస్తాయని చెప్పి ముందస్తుగా ఎ.పి.ఐ.ఐ.సి.కి ఇచ్చి ఉంచటం, రోడ్లు అవీ వేసి కార్పొరేట్ కంపెనీలను ఆహ్వానించి సెజ్‌ను ఏర్పాటు చేస్తానని ముందుకొచ్చిన డెవలపర్ చేతిలో పెట్టడం పెద్దెత్తున మొదలయింది. చంద్రబాబు పాలనలో హైదరాబాద్ పరిసరాలలో సాఫ్ట్‌వేర్ కంపెనీలకూ, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికీ భూములివ్వడం దీనికి నాంది. రాజశేఖరరెడ్డి హయాంలో దేశంలో ఎక్కడా లేనంత భారీగా పరిశ్రమలకూ, గనులకూ, సెజ్‌లకూ, ఓడరేవులకూ, పారిశ్రామిక కారిడార్‌లకూ, విమానాశ్రయాలకూ భూముల సంతర్పణ చేయడం జరుగుతున్నది.

హైదరాబాద్ పరిసరాలలోని రంగారెడ్డి జిల్లా గ్రామాలలో ఔటర్ రింగ్ రోడ్డు కోసం 6750 ఎకరాలు, ఇతర అవసరాలకు 20 వేల పైచిలుకు ఎకరాలు, విశాఖపట్నం దగ్గర రెండు, కాకినాడ దగ్గర ఒకటి కలిపి మూడు పెద్ద సెజ్‌లకు 27 వేల ఎకరాలు, విశాఖపట్నం జిల్లాలోనే చిన్నా చితక సెజ్‌లకు ఇతర పరిశ్రమలకు 15 వేల ఎకరాలు, వాన్‌పిక్ అని పిలవబడే పారిశ్రామిక కారిడార్‌కు గుంటూరు - ప్రకాశం జిల్లాల్లో 28 వేల ఎకరాలు, చిత్తూరు జిల్లాలోని సత్యవేడు వరదయ్యపాలెం మండలాల సెజ్‌కు 12 వేల ఎకరాలు, కడపజిల్లా జమ్మలమడుగు సమీపంలో ఉక్కు కర్మాగారానికీ, విమానాశ్రయానికీ 16 వేల ఎకరాలు, నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో సెజ్‌లు, ఓడరేవులు, థర్మల్ కేంద్రాలకు కలిపి 29 వేల



ఎకరాలు... ఇప్పటికి పెద్దమొత్తంలో తీసేసుకున్న లేక తీసేసుకోబడుతున్న భూములు. వెయ్యి, రెండువేల ఎకరాల మొత్తంలో దాదాపు అన్ని జిల్లాల్లోనూ తీసుకున్న భూములన్నీ ఏకరువు పెడితే ఈ కరపత్రం చాలదు.

ఇవి కాక ఏ రోజయినా తుదిరూపం తీసుకోగలవన్న భారీ భూసేకరణ ప్రతిపాదనలూ ఉన్నాయి. సింగరేణి బొగ్గు గనుల యాజమాన్యం ప్రతిపాదించిన 72 ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో భూసేకరణ ఇప్పుడిప్పుడే మొదలుపెట్టింది. అంతా పూర్తిచేస్తే దాదాపు ఒక లక్ష ఎకరాలవుతుంది. సైనిక సిబ్బందికి కాల్పులలో శిక్షణ ఇవ్వడం కోసం నల్గొండ జిల్లాలో లంబాడా తండాలు ప్రధానంగా ఉండే రాచకొండ ప్రాంతంలో 18 వేల చిల్లర ఎకరాలలోనూ, పక్కనే రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో 9 వేల ఎకరాలలోనూ ఫీల్డ్‌ఫైరింగ్ రేంజి ఏర్పాటు చేసే ప్రతిపాదన చాలాకాలంగా ప్రజలను బెదిరిస్తున్నది. ప్రభుత్వం లేదు లేదు అంటుందిగానీ అడపాదడపా సర్వేలు జరుగుతూనే ఉంటాయి. ఇది చాలక అనంతపురం జిల్లాలోని కంబదూరు, కనగానపల్లి మండలాలలో 13 వేల ఎకరాలలో ఫీల్డ్‌ఫైరింగ్ రేంజి నెలకొల్పే ప్రతిపాదన ముందుకొచ్చింది. అవి కూడా ప్రధానంగా లంబాడా తండాలుండే ప్రాంతాలే.

ఇవన్నీ ఒకెత్తయితే 276 ఆదివాసీ గ్రామాలను ముంచే పోలవరం ప్రాజెక్టు మరొకెత్తు. ఇది ఎంత లేదన్నా లక్షన్నర జనాభాను నిర్వాసితులను చేస్తుంది. విస్థాపనలో దీనితో పోల్చదగ్గది కోస్టల్ కారిడార్ ప్రతిపాదన ఒక్కటే. సుదీర్ఘమైన తూర్పుతీరం వెంబడి విశాలమైన రోడ్లు, పెట్రోలియం ఆధారిత పరిశ్రమలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సెజ్‌లను ఏర్పరిచే ఈ ప్రతిపాదన వాస్తవ రూపం తీసుకున్నట్టయితే కేవలం భీమిలి-కాకినాడల మధ్యనే లక్షన్నర ఎకరాల భూమిని కబళిస్తుంది. 'కోస్టల్ కారిడార్ పేరుమీద మేము భూసేకరణ చేయడం లేదు, కేవలం రహదారి కోసం చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా రోడ్‌షోలో చేసిన ప్రకటన తెలిసీ చెప్పిన అబద్ధం. కోస్టల్ కారిడార్‌లో భాగమైన వాన్‌పిక్ భూసేకరణ ప్రకటనలలో 'పారిశ్రామిక కారిడార్ కోసం' అని స్పష్టంగా రాసారు. ఇవికాక అనంతపురం జిల్లాలో ఒకటిన్నర మండలాలను మింగే ఐటి, బయోటెక్నాలజీ కంపెనీలతో కూడిన 60 వేల ఎకరాల సెజ్ వస్తుందన్న వదంతి ఉంది. ఇప్పుడు దానికి బదులు వేరే ఏదో సెజ్ వస్తుందంటున్నారు. ఈ సెజ్ భూతం వస్తే గిస్తే దేశంలోనే అతిపెద్దది అవుతుంది.

ఈ సంతర్పణను సమర్థించుకోవడానికి ప్రభుత్వం చేసే వాదన ఏమిటి?

ఫ్యాక్టరీలకు భూములు కావాలి, ఓడరేవులకు భూములు కావాలి, రహదార్లకు భూములు కావాలి, విమానాశ్రయాలకు భూములు కావాలి, అభివృద్ధికి ఇవన్నీ కావాలి అన్నది ప్రభుత్వం వాదన. అవుననే కొంచెం సేపు అనుకుందాం. కానీ వ్యవసాయానికీ భూములు కావాలి, పశువులను మేపుకోవడానికీ భూములు కావాలి, సముద్రంలో చేపలవేట చేసుకోవడానికీ తీరంవెంబడి భూములు కావాలి, కట్టె పుల్లలకూ, వాసాలకూ, తాటాకులకూ, ఇంటిగోడల కోసం మట్టికీ వాళ్ళకు బంజర్లు కావాలి. కుంకుడు కాయల నుండి పనసకాయలుదాకా కోసుకొని అమ్ముకోవడానికీ, తిని బతకడానికీ అడవి భూములు కావాలి, వీటిమీద బతికే ప్రజలు బాగుండడం అభివృద్ధికి కావాలి. కాదా? ఈ రెండు అవసరాల మధ్య వైరుధ్యం లేదా?

వైరుధ్యమేమీ లేనట్టు, ప్రకృతి నుండి ప్రజలు పొందే జీవనానికి మారుగా నాలుగు రూపాయలిచ్చి ఒక కాలనీ కట్టిస్తే సరిపోతుందనీ, ఎంత భూమి కావాలంటే అంత పరిశ్రమలూ వగైరాలకు ఇచ్చుకోవచ్చుననీ భావించే పాలనా నీతిని ఏమనాలి?

'నాలుగు రూపాయలు' అనేది కేవలం వెక్కిరింత కాదు. ఇప్పుడున్న భూసేకరణ ప్రక్రియలో భూములకు దొరికే నష్టపరిహారం కోల్పోయిన దానిలో నాలుగవ వంతు కొనుక్కోవడానికి కూడా సరిపోదనేది అందరూ ఎరిగిన సత్యం. వేరొక చోట స్థిరపడి ఊరుమ్మడి బతుకు కొనసాగించడానికి అవసరమైన పునరావాసం గానీ, భూములు లేని వారికి ఇచ్చే నష్టపరిహారంగానీ ఈ నాటికీ ఒక హక్కు కాదు. దానికొక చట్టంలేదు. అమలు అయీ కాని పాలనా విధానాలే వాటికి ఈనాడున్న ఆధారం.

నిజానికి మన పాలకులు చేస్తున్న అభివృద్ధి వాదనకు సహితం ఇప్పుడు జరుగుతున్న భూసంతర్పణ అవసరమా అన్న అనుమానం భూమిని రియల్ ఎస్టేట్ దృష్టితో చూడడం అలవడని వారికి రాకమానదు. దేశఅభివృద్ధికి విమానాశ్రయాలు అవసరమనే అనుకుందాం. పెదనందిపాడు లోనూ, జమ్మలమడుగు లోనూ కూడా అవసరమా? ఓడరేవులు కూడా అవసరమనే అనుకుందాం, విశాఖపట్నానికీ కాకినాడకూ మధ్య అయిదు ఓడరేవులు అవసరమా? విశాలమైన రోడ్లు అవసరమనే అనుకుందాం. దేశంలో ఎక్కడాలేనిది 500 అడుగుల వెడల్పున్న 8 లేన్ల రోడ్డు హైదరాబాద్ చుట్టూ అవసరమా? బొగ్గు సమృద్ధిగా అవసరమే అనుకుందాం. ఆదిలాబాద్ నుండి ఖమ్మందాకా గోదావరి తీరం వెంబడి ఓపెన్‌కాస్టు తవ్వకాలు చేపట్టి ఊర్లు ఖాళీ చేయించి మట్టి గుట్టలూ, బొందలూ మిగల్చడం అవసరమా? సాగునీటి ప్రాజెక్టులు అవసరమనే అనుకొందాం. ఎక్కడికక్కడ నీటిని చిన్న ప్రాజెక్టుల ద్వారా తీసుకొని విశాల ప్రాంతానికి నీరిచ్చే ప్రత్యామ్నాయం ఉండగా పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు కట్టి ఫలమంతా దిగువకే ఇచ్చి ఎగువన ఆదివాసీ ప్రాంతంలో 276 గ్రామాలను ముంచడం అవసరమా? సైనికులకు కాల్పులు జరపడంలో శిక్షణ అవసరమనే అనుకుందాం. కంటోన్మెంట్లన్నింటిలోనూ ఫైరింగ్ రేంజ్‌లు కావలసినన్ని ఉండగా అదనంగా మూడు జిల్లాలలో లంబాడా గిరిజనులు కష్టంచేసి సాగులోకి తెచ్చిన 40 వేల ఎకరాల బంజరు భూమి ఇచ్చేయవలసిందేనా? విద్యుదుత్పత్తిని వేగంగా పెంచడానికి సూపర్ థర్మల్ ప్లాంట్లు అవసరమనే అనుకుందాం. దానికోసం పర్యావరణరీత్యా సున్నితమైన తీరప్రాంతాలలో నాలుగు భారీ థర్మల్ కేంద్రాలు – శ్రీకాకుళం జిల్లా తేలినీలాపురం పక్షుల అభయారణ్యం దగ్గరొకటి, సిఆర్‌జెడ్‌లో ఉన్న గుంటూరు జిల్లా డిండి దగ్గర ఒకటి, నెల్లూరు జిల్లా కృష్ణపట్నం దగ్గర ఒకటి, కృష్ణాజిల్లా పోలాటితిప్ప దగ్గర మడ అడవుల ప్రాంతంలో ఒకటి – నెలకొల్పడం సముచితమా?

ఉద్యోగాలొస్తాయనేది ప్రభుత్వం ప్రజలకు చూపిస్తున్న ఎర. భూములనుండి వెలివేయడంవల్ల జీవనం కోల్పోయే ప్రజలను లెక్కగట్టి ఒక్కొక్కరికీ అక్కడ వెలిసే ఫ్యాక్టరీలలో, ఓడ రేవులలో, గనులలో ఉద్యోగాలు, ఉపాధి కల్పించే విధానమేదయినా ప్రభుత్వానికి ఉందా అంటే లేదు. ఉన్నా అవన్నీ ప్రైవేట్ సంస్థలు కాబట్టి కోర్టుల దృష్టిలో అది చెల్లదు. పైగా ఇప్పుడొచ్చే టెక్నాలజీ ఎక్కువ పెట్టుబడిని, తక్కువ శ్రమనూ వినియోగించి ఉత్పత్తి సాగిస్తుంది కాబట్టి రాగల ఉద్యోగాలూ అతి తక్కువే. గడచిన పాతిక సంవత్సరాలలో భారత ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో ఉత్పత్తి ఎన్నోరెట్లు పెరిగింది గానీ కార్మికులు, ఉద్యోగుల సంఖ్య ఒక్కశాతం కూడా పెరగలేదని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. మొదటి దశలో రోడ్లు, బిల్డింగ్‌లు మొదలైన నిర్మాణాలు చేపట్టే పనిలో కొంత ఉపాధి దొరుకుతుంది కాబట్టి బలవంతంగా విస్థాపనకు గురయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి లభించినట్టే అనిపిస్తుంది. కానీ ఆ దశ దాటిపోయిన తరువాత ఏమీ ఉండదు.





అయితే నష్టపరిహారం, పునరావాసాల గురించే కాక అభివృద్ధి విధానాల గురించే పునరాలోచన చేయవలసిన అవసరం ఉంది. అమెరికా తరహా విధ్వంసకరమైన అభివృద్ధిని మనం అనుకరించవలసిన అవసరం ఉందా అన్న ప్రశ్న వేసుకోవలసిన అవసరం ఉంది. మన దేశంలో అత్యధిక భాగం ప్రజలు ప్రకృతిపైన ఆధారపడి జీవిస్తున్నారు. వారిని ఆ ప్రకృతి నుండి వెలివేసి దానిని రియల్ ఎస్టేట్‌గా మార్చే అభివృద్ధి విధానం మనకు ఉచితమా? పర్యావరణ సమతుల్యాన్ని గౌరవిస్తూ ఆ ప్రకృతి వనరులను ఆ ప్రజలకోసం అభివృద్ధి చేయలేమా? తద్వారా వారి జీవితాలను మెరుగుపరిచి ఆ మెరుగుదలను భూమిక చేసుకొని దేశాన్ని అభివృద్ధి చేసే విధానాలు రూపొందించలేమా? అటువంటి ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించడం, వాటికోసం ఆందోళన చేయడం అవసరం. ఈ లోపల విధ్వంసకరమైన అభివృద్ధివల్ల విస్థాపనకు గురి అవుతున్న ప్రజల హక్కులకు, వారి ఆందోళనలకు అండగా నిలబడటం అవసరం.

ప్రతిపక్ష పార్టీల నినాదాలలో ఈ ఆలోచనల ఛాయలకోసం వెతకటం వృధా ప్రయాసే. ప్రజల మనసెరిగి నినాదాలు ఇవ్వడం ప్రతిపక్ష పార్టీలు, ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పత్రికలూ నేర్చుకున్నాయి. కాబట్టి రాజశేఖర్‌రెడ్డి అనుసరిస్తున్న వికృతమైన అభివృద్ధి విధానాలను వారు విమర్శిస్తున్నట్లు అనిపిస్తుంది. కానీ జాగ్రత్తగా పరిశీలిస్తే వారు విమర్శిస్తున్నది అభివృద్ధి విధానాల అమలులోని అక్రమాలనే తప్ప అభివృద్ధి విధానాలే అక్రమం అని కాదని అర్థం అవుతుంది. ఒక్కొక్కసారి కేవలం రాజశేఖరరెడ్డి మనుషులే ప్రయోజనమంతా తీసుకుటున్నారనీ, తమవారికేమీ మిగల్చటంలేదనీ వెళ్లగక్కుతున్న అక్కసు తప్ప వారి విమర్శలో ఇంకేమీ కనిపించటం లేదు. ప్రజలకు జరుగుతున్న అన్యాయం ప్రస్తావన అతి స్వల్పం. అనంతపురం జిల్లా ఓబుళాపురం గనుల గురించి, వాటి లీజు గురించి పుంఖాను పుంఖాలుగా పత్రికలలో చదివాము, తెలుగుదేశంవారి నోట విన్నాము. అయితే గాలి జనార్ధనరెడ్డి గారి కంపెనీ దళితులకు ఉపాధికల్పిస్తామన్న అబద్ధపు హామీ ఇచ్చి 350 ఎకరాల అసైన్డ్ భూమిని అక్రమంగా ఆక్రమించుకొని వారి పొట్టకొట్టిందనీ, ఆ భూమిని దళితులకు వెనక్కి ఇప్పించవలసిన రెవెన్యూ అధికారులు దానిని ప్రభుత్వపరం చేసి వారికి హక్కే లేకుండా చేసారనీ, ఆ భూమిని జనార్ధనరెడ్డికే కట్టబెట్టడానికి మార్గం సుగమం చేసారనీ ఆ ప్రచారంలో మనం వినలేదు.

విధ్వంసక అభివృద్ధిలో మధ్యదళారులయిన వారి అంత:కలహాలుగా ప్రతిపక్ష ఆందోళనలను వర్ణిస్తే వారు నొచ్చుకుంటారేమోగాని అది తొంభైశాతం సత్యం. దానినుండి ప్రజలకు కావలసిన చర్చ పుట్టదు. పోలేపల్లి, కాకినాడ సెజ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల నుండి, ఆదివాసుల బాక్సైట్ వ్యతిరేక ఆందోళన నుండి, మత్స్యకారుల కోస్టల్ కారిడార్ వ్యతిరేక ఉద్యమాల నుండి మాత్రమే పుట్టగలదు. ఆ ఆందోళనలకు బాసటగా నిలిచి, ఆ చర్చ చేపట్టి, మానవీయమైన అభివృద్ధి విధానాన్ని ఆవిష్కరించుకుందాం రమ్మని ఆహ్వానం పలుకుతూ...

రాష్ట్ర కమిటీ, 1-11-2008

# సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులకు

# వ్యతిరేకంగా ప్రచారం

బొగ్గు గనుల తవ్వకాలకై సింగరేణి యాజమాన్యం ఉత్తర తెలంగాణ జిల్లాలలోని గోదావరినది తీర ప్రాంత గ్రామాలను, పట్టణాలను విధ్వంసం చేయడానికి ప్రణాళికలను రూపొందించి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల రూపంలో అమలు చేస్తున్నది. 'అధిక ఉత్పత్తి–అధిక లాభాలు' పేరుతో సింగరేణి యాజమాన్యం చేపడుతున్న ఈ విధ్వంసానికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నది. ఫలితంగా స్థానిక ప్రజలు పంట భూములను, నివాసాలను, బ్రతుకుదెరువును కోల్పోయి జీవించే హక్కును పోగొట్టుకుంటున్నారు.

గాలి, నీరు, నేల ప్రజల జన్మహక్కు అందుకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ప్రణాళికలకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రజలు ముందుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

సింగరేణి బొగ్గు గనులు ఈ ప్రాంతానికి ఒకనాడు నిజంగానే అభివృద్ధిని తీసుకువచ్చాయి. సాగునీటి వసతి కరువై వ్యవసాయంలో చావలేక బ్రతుకుతున్న తెలంగాణ జిల్లాల పేద రైతులకు సింగరేణి బొగ్గు గనులు ప్రత్యామ్నాయ జీవనమార్గాన్ని చూపాయి. వేలాదిమంది బడుగు వర్గాల రైతు బిడ్డలు బొగ్గు గని కార్మికులైనారు. ఇల్లందు, కొత్తగూడెం, మణుగూరు, గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి వంటి పట్టణాలు వెలిశాయి. ఈ పరిణామాలు పరోక్షంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధిని కూడా చూపించాయి. పల్లెల్లో దొరకని చదువు గని కార్మికుల పిల్లలకు ఇక్కడ దొరికింది. కొందరు తండ్రుల స్థానంలో పనులు పొంది సంతృప్తి చెందగా మరికొందరు ఉన్నత చదువులు చదివి బయటకు వెళ్లి మరింత బాగుపడ్డారు. మొత్తంమీద ఇది కొంత సమతుల్యంతో కూడిన అభివృద్ధిగా భావించవచ్చును. బొగ్గు గనుల తవ్వకాలు 'అండర్‌గ్రౌండ్' పద్ధతిలో సాగినందున చుట్టుప్రక్కల గ్రామాల వ్యవసాయంపై



పడిన దుష్ప్రభావం కూడా తక్కువగానే ఉండింది. ఒక్క రామగుండంలోనే గాక ఇతర ప్రాంతాలలో కూడా బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పబడివుంటే స్థానిక ప్రజలకు మరింత మేలు జరిగిఉండేది. ఖనిజ సంపద, నీరు, చదునైన నేలలతో ఎన్నో పరిశ్రమల స్థాపనకు భౌగోళికంగా ఎంతో అనువుగా ఉన్నప్పటికీ 'తెలంగాణ వివక్ష'లో భాగంగానే ఇక్కడ పారిశ్రామికీకరణ నిర్లక్ష్యం చేయబడింది. పాలకులకు మొదటినుండి ఇక్కడి బొగ్గును కొల్లగొట్టుకుపోవడమే ధ్యేయంగా మారినందున ఇక్కడ జరగాల్సినంత అభివృద్ధి కూడ జరగలేదు. ఉత్తర తెలంగాణ జిల్లాలలోని బొగ్గు గనుల నుండి ఉత్పత్తి అవుతున్న బొగ్గు 80% స్థానికేతరంగా ఉన్న పరిశ్రమలకే తరలివెళుతుంది. స్థానికంగా ఉన్న పవర్ ప్రాజెక్టులకు 20% బొగ్గు వినియోగమే అవుతున్నా ఉత్పత్తి అయిన విద్యుత్ మాత్రం ఇతర రాష్ట్రాలకే వెళుతున్నది. (ఉదాహరణ రామగుండం ఎన్టీపీసీ) ఈ ప్రక్రియ అంతటిలో నష్టపోతున్నది మాత్రం బొగ్గు ఖనిజాన్ని తమ భూముల్లో కలిగివున్న ఉత్తర తెలంగాణ రైతాంగం మాత్రమే.

1990 లో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ సామ్రాజ్యవాద అనుకూల నూతన పారిశ్రామిక విధానాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకు నమూనాగా మారిన తర్వాత సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల స్థితిగతులు దిగజారగా బొగ్గు ఖనిజం కలిగిన గ్రామాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. సమతుల్యంగా జరగాల్సిన అభివృద్ధిని ధ్వంసం చేస్తూ వేగంగా బొగ్గు ఖనిజాన్ని తవ్వి తీసే ఆలోచన సింగరేణి యాజమాన్యంలోను వారి వెనకున్న ప్రభుత్వాలలోను మొలకెత్తింది. దానికి తగిన విధాన రచన (అధిక పెట్టుబడులు– కాంట్రాక్టర్లు – తక్కువ మంది కార్మికులు – అధిక ఉత్పత్తి) చేసి నడిపించగలిగే ఐఎఎస్ అధికారులు సింగరేణి సంస్థకు ఛైర్మన్‌లుగా, డైరెక్టర్‌లుగా పదవులు చేపట్టారు. కార్మికుల హక్కులను అణిచివేసి కార్మికుల చట్టాలను ఒప్పందాలను బేఖాతరుచేసి అధిక లాభాలను చూపిస్తున్నారు. అదే సమయంలో బొగ్గు దొరికే ప్రాంతాలలో ఉండే గ్రామాలను నాశనం చేసే 'బొగ్గు గనుల విస్తరణ–ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు'ల తవ్వకాలను చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని డోర్లి నుండి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల గుండా పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి వరకు గోదావరి నది తీర గ్రామాలలో దాదాపుగా 70 ఓపెన్‌కాస్ట్ గనులను నెలకొల్పాలన్నదే బొగ్గు గనుల విస్తరణ ప్రణాళికావేత్తల సంకల్పం. అందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లాలోని కాశిపేట, శ్రావణపల్లి, ఇందారం, కరీంనగర్ జిల్లాలోని ఖమ్మంపల్లి, తాడిచర్ల, మహదేవపూర్, వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, పెద్దాపురం వంటి గ్రామాలలో భూసేకరణ నోటిఫికేషన్‌లు జారీ అయినాయి.

రామగుండంలో ఇప్పటికే ప్రారంభమైన నాలుగు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల వల్ల సమీప గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటడం, చెరువులు ఇంకిపోయి వ్యవసాయం కుంటుపడడం, భారీ బ్లాస్టింగ్‌ల వల్ల ఎగిసిపడే విషవాయువులు, దుమ్ము, ధూళి, గ్రామాల రహదారులు చెడిపోవడం, బ్లాస్టింగ్‌ల ప్రకంపనాలవల్ల ఇళ్లు కూలిపోవడం, భూనిర్వాసితులకు

ఉద్యోగాలు గాని నష్టపరిహారం గాని పూర్తి స్థాయిలో అందకపోవడంవంటి సమస్యలకు స్థానిక ప్రజలు గురవుతున్నారు. పర్యావరణానికి కూడా భారీ నష్టాన్ని కలుగజేస్తున్నాయి.

అయినాసరే మానవాళికి అన్ని రకాలుగా చేటుతెచ్చే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల తవ్వకాలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తూ ప్రజాభీష్టాన్ని కాలరాస్తున్నది. ఒక దగ్గర ప్రారంభమైతే అక్కడే ఉండే ప్రాజెక్టు కాదు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు, బొగ్గు పొరకు పైన ఉన్న మట్టిని అంతా తీసి ఆ మట్టిని వేరొకచోట కుప్పలుగా (గుట్టలుగా) పోయాలి. దానికి భూమి కావాలి, గని ముందుకు విస్తరించే క్రమంలో మళ్లీ భూమి కావాలి. ఈ విధంగా ఒక గ్రామంలో ప్రారంభమైన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు క్రమక్రమంగా ఉత్తర తెలంగాణలోని గోదావరి తీర గ్రామాలన్నింటిని మింగుతుంది. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు తవ్వకాలు ముగిసిన పిదప గనిలో ఇసుకను, మట్టిని నింపి పూడుస్తామని సింగరేణి అధికారులు చెబుతారు కాని భూమట్టానికి 300 మీటర్ల లోతువరకు జరిపే ఈ తవ్వకాల వల్ల ఏర్పడిన బొందను నింపడం సాధ్యంకాని పని. దేశంలో ఎక్కడా తిరిగి మట్టిని నింపిన దాఖలాలు లేవు. ఒకవేళ నింపినా 300 మీటర్ల లోతు నుండి మట్టి పొరలని కిందకు మీదకు అతలాకుతలం చేసిన తర్వాత ఆ భూమి దేనికి పనికొస్తుంది? అయినా ఆ భూమి తొలినాటి యజమానికైతే మళ్లీ దక్కదు. ఉత్తర తెలంగాణ జిల్లాలలోని గోదావరి నదీతీర ప్రాంత గ్రామాలు వ్యవసాయం, జనావాసాలతో నిండివున్నాయి. నిరుపయోగమైన స్థలం అంటూ ఏదీ లేనందున ఆ ప్రాంతంలో ఎక్కడ ఓపెన్‌కాస్ట్ తలపెట్టినా మానవ జీవన విధ్వంసం తప్పదు.

బొగ్గు గనుల తవ్వకాలు అండర్‌గ్రౌండ్ పద్ధతిలో సాగినపుడు వేల సంఖ్యలో స్థానికులకు ఉద్యోగాలు దొరికేవి. కాని ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో ఉండే ఉద్యోగాలు తక్కువ. దాదాపు 70% పనులను కాంట్రాక్టర్లే నిర్వహిస్తున్నందున వారికి సంబంధించిన కాంట్రాక్టు కార్మికులనే తెచ్చుకుంటారు. స్థానిక గ్రామాల ప్రజలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వరు. ఈ వైనాన్ని ప్రస్తుతం నడుస్తున్న ఓసిపిలలో చూస్తున్నాము. 300 మీటర్ల లోతులో బొగ్గు తవ్వకాలు జరపడం వల్ల గోదావరి నది ఇంకిపోయిన తీరం వెంబడి మట్టి గుట్టలు, బొందలు, బీడు పడిన భూములు మాత్రమే కనిపిస్తున్న ఓపెన్‌కాస్ట్‌ల వల్ల భూములు పోయి, ఊర్లు పోయి, బొగ్గు పోయి చివరకు మనకు తెలిసిన ఉత్తర తెలంగాణ కూడా మిగలదు.

ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి స్థానిక ప్రజల బాగోగులు పట్టవు. వారికి కావాల్సింది వార్షిక వృద్ధిరేటు. ఆదాయ వ్యయాల లెక్కల్లో అధిక ఉత్పత్తిని, అధిక లాభాల్ని చూపడం. గత సంవత్సరం దేశంలో అధిక ఆదాయ వృద్ధి రేటును సాధించిన వాటిలో రాజశేఖరరెడ్డిగారి ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. ఈ ఘనతను ప్రతి సంవత్సరం పొందాలన్నది తప్ప వేరే దృష్టి ఆయనకు లేదు, ఆయన స్థానంలో రాబోయే వారికి కూడా ఉండదు. అభివృద్ధికి నిర్వచనం గనులను, భూములను కట్టకట్టి మూకుమ్మడిగా పారిశ్రామిక వేత్తలకు అప్పగించడమనే "రాజనీతి"ని పాలకులు అవలంబిస్తున్నంతకాలం ప్రజల భూములకు, జీవనోపాధికి, జీవించే హక్కుకు రక్షణ లేదు.

బలమైన ప్రజా ప్రతిఘటన ఒక్కటే ఉత్తర తెలంగాణ ప్రజల గ్రామాలని, వ్యవసాయాన్ని, బ్రతుకులని కాపాడగలుగుతుంది. అందుకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఓపెన్‌కాస్ట్ గనులకు వ్యతిరేకంగా



తలపెట్టిన యాత్రకు తమవంతు మద్దతును తెలిపి ఉత్తర తెలంగాణ గ్రామాల ప్రజల బ్రతికే హక్కును బలపరచమని కోరుతున్నాము.

పారిశ్రామిక అవసరాలకు కావాల్సిన బొగ్గు ఉత్పత్తికి మేము వ్యతిరేకం కాదు. పర్యావరణానికి, వ్యవసాయానికి, నివాసాలకు ఆటంకం కాకుండా బొగ్గు ఉత్పత్తి చేసే భూగర్భ విధానం ఉన్నప్పుడు ఓపెన్‌కాస్ట్ విధానం ఎందుకని ప్రశ్నిస్తున్నాము. బొగ్గు ఉత్పత్తి మరియు పంపిణీలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం, నిర్ణయాధికారాన్ని కల్పించి స్థానికుల అభివృద్ధికి ప్రాధాన్యతను ఇవ్వాలి. బొగ్గు ఆధారిత పరిశ్రమలను స్థానికంగా స్థాపించి స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము.

ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల శాఖలు, 8-11-2008

## ఇచ్ఛాపురం నుంచి తడ వరకు బడాబాబులకు పందేరం

# ప్రజల జీవనోపాధిని హరించే అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులను వ్యతిరేకిద్దాం

**తూ**ర్పుతీరంలో ఆ చివర విశాఖపట్నం నుంచి ఈ చివర కృష్ణపట్నం దాకా ఇప్పుడు పోర్టుల సందడి కన్పిస్తున్నది. పొడవైన సముద్రతీరం ఉన్నప్పటికీ రాష్ట్రంలో నౌకాశ్రయాల నిర్మాణం, అభివృద్ధి ఇప్పటిదాకా అంతంత మాత్రంగానే ఉండేది. ప్రైవేటు రంగంలో పోర్టులు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిన తరువాత అనేక సంస్థలు పోర్టులు నిర్మించేందుకు సిద్ధం అయ్యాయి. సరుకు రవాణాలో ఇప్పటివరకు విశాఖపట్నం పోర్టు దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. సామర్థ్యపరంగా ఇప్పుడు దాన్ని అధిగమించే విధంగా ప్రైవేటు పోర్టుల నిర్మాణం సాగుతోంది. ఇందులో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభం అయిన ఘనత కృష్ణపట్నం పోర్టుది. ఓబుళవారిపాలెం నుంచి కృష్ణపట్నం వరకు రైల్వే లైను నిర్మాణం పూర్తికావస్తున్నది. కృష్ణపట్నం వరకు రైల్వే నిర్మాణం పూర్తయి, ఆ తరువాత పోర్టు ఆవరణలో స్టయిడింగ్‌ను ఏర్పాటు చేసే యోచన ఉంది. కృష్ణపట్నం పోర్టులో మొత్తం 41 బెర్తులను, 10,000 కోట్ల రూ. పెట్టుబడితో నిర్మించాలని ప్రతిపాదన. రెండోదశ నిర్మాణం పూర్తయితే దాదాపు 100 మిలియన్ల టన్నులు సరుకు రవాణా అవుతుందని అంచనా. ఆ తరువాత మరో నాలుగేళ్ళకు 200 మిలియన్ టన్నుల స్థాయికి చేరుకుంటుందని కూడా అంచనా. కొలంబో, చెన్నై వెళ్ళే నౌకలన్నీ కృష్ణపట్నంకు వచ్చే అవకాశం ఉంది.

విశాఖపట్నంలో రెండవదయిన గంగవరం పోర్టు మొదటి దశ నిర్మాణం పూర్తికావచ్చింది. 'పూర్తి యాంత్రీకరణ'తో (మనుషులతో పనిలేకుండా) అత్యంత అధునాతన సదుపాయాలతో భారీ నౌకల రాకపోకలకు అనుగుణంగా దీన్ని నిర్మిస్తున్నారు.

కాకినాడలో ఇప్పటికే ఒక నౌకాశ్రయం ఉండగా భీమవరం సమీపంలో, రాష్ట్రానికి చెందిన ఫార్మా యాజమాన్యం వీడియోకాన్ గ్రూప్‌తో కలిసి మరొక పోర్టు నిర్మించనుంది.

మచిలీపట్నంలో మైటాస్ ఇన్‌ఫ్రా నిజాంపట్నం / వాడరేవులలోని నౌకాశ్రయాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొంటున్నాయి. వచ్చే అయిదు నుంచి పదేళ్లలో ఇవి పాక్షికంగా నిర్మాణం పూర్తి చేసుకొని సరకు ఎగుమతులకు దిగుమతులకు సిద్ధమయ్యే అవకాశం ఉంది.

ఇంతకు ముందు ఇచ్చిన 2500 ఎకరాల భూమి కాకుండా 'పారిశ్రామిక పార్కు' పేరుతో మరలా





11 వేల ఎకరాల భూమిని కృష్ణపట్నం పోర్టు కంపెనీకి అప్పగించారు. పారిశ్రామిక పార్కు కోసం అని ఎ.పి.ఐ.సి.సి. నుంచి అందిన లేఖ మేరకు కోట మండలంలోని సిద్ధరం, కొత్తపట్నం, కర్లపూడి గ్రామాల్లో, చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో 5,265 ఎకరాల ప్రభుత్వ భూములను జిల్లా యంత్రాంగం ఇప్పటికే గుర్తించింది. ఇవి కాకుండా మరో 6000 ఎకరాల భూమిని గుర్తించి సేకరించాలని ఎ.పి.ఐ.సి.సి. జిల్లా అధికారులను కోరింది. కొత్తగా సేకరించిన భూముల్లో ప్రభుత్వ, అసైన్డ్ తదితర రకాలు వున్నాయి. తొలుత గుర్తించిన 5,625 ఎకరాల భూమిలో 2,683 ఎకరాలను సెప్టెంబరు నెలలోనే ఎ.పి.ఐ.సి.సి. తన ఆధీనంలోకి తీసుకొంది. పేరుకి ఇది ప్రభుత్వ భూమే అయినా అందులోని చాలా భాగంలో పేదలు - ముంతమామిడి, సరుగుడు చెట్లు పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా వారు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. తమ ప్రాంతంలో 6,200 ఎకరాల భూమిని సేకరిస్తున్నారని తెలిసినప్పటి నుండి కోట, చిల్లకూరు మండలాలలోని పలు గ్రామాల పేద రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ ఇష్టాఇష్టాలతో పనిలేకుండా, గ్రామ సభలు నిర్వహించి తమ అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోకుండా, ఎందుకోసం భూములు సర్వే జరుపుతున్నారన్నది తెలుపకుండా వారి వద్ద వున్న అసైన్డ్, డికెటి పట్టాలను, పాసు బుక్‌లను, రికార్డులను, హద్దులు పోల్చుకోవాలనే నెపంతో, స్వాధీనం చేసుకొన్నారు. దీంతో వారి భూములకు సంబంధించి ఎటువంటి ఆధారాలు వారి వద్ద లేకుండా అయ్యాయి. ఇప్పటివరకు చెట్టు, పుట్ట కొట్టుకొని, వ్యవసాయం చేసుకొని జీవిస్తున్న వారి వద్ద నుండి భూములను లాగేసుకొంటే ఏమి చేయాలో తోచని పరిస్థితులలో వారు వున్నారు. సవక, ముంతమామిడి, తాటి చెట్లు ఈ గ్రామాల ప్రజలకు జీవనాధారాన్ని కలిగించేవి. వాటిని వారికి లేకుండా చేసారు.

ముందు బకింగ్‌హామ్ కాలువకు తూర్పు ప్రాంతంలో మాత్రమే సర్వే జరిపి భూమిని సేకరిస్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత కోట మండలంలోని కర్లపూడి, కాకోరిపాళెం, వేళ్ళపాళెంలలో, చిల్లకూరు మండలంలో తూర్పు కనుపూరు పంచాయితీలోని ఈదలవారిపాళెం, కొమరావారిపాళెం, పోసినవారిపాళెం, రావలపాళెం, కనుపూరు గ్రామాలలో సెంటు భూమిని కూడా మిగల్చకుండా సర్వే జరిపినట్లు తెలిసింది. గ్రామాల చుట్టూ భూమిని తీసుకొంటే గ్రామాలను మాత్రం ఖాళీ చేయించకుండా వుంటారా? అన్న భయాన్ని ఆ గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

మామూలుగా ప్రతి పోర్టుకు ఇరువైపులా 30 కి.మీ.ల తీరాన్ని దాని పరిధిగా నిర్ణయిస్తారు. అలాగే కృష్ణపట్నం పోర్టుకు ఇరువైపులా 30 కి.మీ. తీర ప్రాంతాన్ని దాని పరిధిగా నిర్ణయించారు. ఆ తరువాత భవిష్యత్ అవసరాల కోసం పోర్టు పరిధిని విస్తరించాలని కె.పి.సి.యల్. ప్రభుత్వాన్ని కోరింది. కోరిందే తడవుగా ప్రభుత్వం ప్రకాశం జిల్లా వాడరేవుకు ఉత్తర భాగంలో 30 కి.మీ. పోను, క్రిష్ణపట్నం వరకు గల మొత్తం 85 కి.మీల. మేర తీరప్రాంతం మీద ప్రత్యేక హక్కులు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వాడరేవు నుంచి క్రిష్ణపట్నం వరకు తీరప్రాంతమంతా కె.పి.సి.యల్. ఆధీనంలోకి వచ్చింది. ఇక మత్స్యకారుల

బ్రతుకులు, సముద్రం మీద వేట ఇవన్నీ కలలే. భారీగా పెట్టుబడులు పెట్టిన కంపెనీలు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక హక్కులు కల్పించిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మరి నిజమే కదా! ఒక మత్స్యకారుడు, ఒక పేద రైతు, ఒక రైతు కూలీ, అనేక చేతివృత్తుల వాళ్ళు నష్టపోయినా, నాశనమయినా ఇబ్బంది లేదు. భారీగా పెట్టుబడులు పెట్టిన కంపెనీ పాపం నష్టపోతే ఎలా? ఎంత ఉదార ప్రభుత్వం ఇది. ఈ నిర్ణయంతో మత్స్యకారుల జీవనోపాధికి మరింత ప్రమాదం ఏర్పడింది. రేవుల పరిసరాల్లో చేపల వేట నిషేధం అమల్లో ఉంది కాని మొత్తం ఆ ప్రాంతమంతా చేపల వేటను నిషేధిస్తే తమ పరిస్థితి ఏంటని మత్స్యకారులు వాపోతున్నారు.

## థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు

దేశంలోనే అతి పెద్ద థర్మల్ విద్యుత్ ఉత్పాదక కేంద్రంగా కృష్ణపట్నం ఆవిర్భవించనుంది. తొలి దశగా ఎ.పి.జెన్‌కో నిర్మించ తలపెట్టినది దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం. ఈ థర్మల్ విద్యుత్ కేంద్రం తొలి దశలో 1600 మెగావాట్ల సామర్ధ్యం కలిగిన కేంద్రంగా పని ప్రారంభించనుంది. నేలటూరు కేంద్రంగా ఈ విద్యుత్ కేంద్రాన్ని 1350 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. తరువాతి దశలో మరో 2400 మెగావాట్లకు ఉత్పత్తి స్థాయిని పెంచనున్నారు.

రిలయన్స్ కంపెనీ అయితే ఏకంగా 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభించనున్నది. ఈ ప్రాజెక్టుకు 2625 ఎకరాల భూమిని కేటాయించారు. ఇవి కాక నవయుగ సంస్థ ఆధ్వర్యంలో 2000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఒకటి సింహపురి ఎనర్జీ సంస్థ వారి 540 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఒకటి, మీనాక్షి సంస్థ వారి 540 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఒకటి, కీనేటి సంస్థవారి 1080 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఒకటి ప్రారంభం కానున్నాయి.

ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి అయితే 12160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం మన రాష్ట్రం మొత్తం మీద ఉత్పత్తి అవుతున్న థర్మల్ (బొగ్గు ఆధారిత) విద్యుత్ 12381 మెగావాట్లు. అంటే ప్రస్తుతం మన రాష్ట్రం మొత్తం మీద ఉత్పత్తి అవుతున్న థర్మల్ విద్యుత్‌కి ఇంచుమించు సమానంగా, ఒక్క కృష్ణపట్నంలోనే ఉత్పత్తి అవుతుంది. వీటికోసం భూసేకరణ, మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయి. కానీ ఈ భూమి మీద ఆధారపడి జీవించే ప్రజల మాటేంటి?

పర్యావరణం విషయానికి వస్తే ఇప్పటికే కృష్ణపట్నం పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు జరుగుతున్న ఐరన్ ఓర్ రవాణా మరియు డంపింగ్‌ల వల్ల పర్యావరణం పూర్తిగా పాడవుతోంది. రవాణా జరిగే దారి పొడవునా ఐరన్ ఓర్ ధూళివలన పచ్చటి పొలాలు ఎర్రబారాయి. జల కాలుష్యం జరుగుతోంది. ఎడ తెరిపిలేని రవాణా కారణంగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతున్నది. దీన్ని గురించి అనేక ప్రజా సంఘాలు ఆందోళన చేస్తూనే ఉన్నాయి. అయినా ప్రభుత్వం పట్టనట్టు ఉంది. ఉప్పు పరిశ్రమ కూడా దెబ్బతింటుంది.

ఇన్ని థర్మల్ పవర్ ప్రాజెక్టులకు అవసరమైన బొగ్గును ఇతర దేశాల నుంచి పెద్దఎత్తున దిగుమతి చేసుకోనున్నారు. ఆ బొగ్గు నిల్వలతో కృష్ణపట్నం నిండిపోతుంది. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే బొగ్గు వలన కాలుష్యం, బూడిద పరిసర గ్రామాలని, పొలాలని, నీటి చెరువులను, సముద్ర జలాల్ని, భూగర్భ



జలాలను సైతం కలుషితం చేస్తాయి. వాయు కాలుష్యం, జలకాలుష్యం, పర్యావరణ కాలుష్యం అన్నీ కలిసి కృష్ణపట్నం పరిసరాలన్నీ కాలుష్యంతో నిండిపోతాయి. పేద ప్రజలు సరియైన గాలి, నీరు, ఆహారం అందక రోగాల బారిన పడి తమ జీవితాలు చాలించాల్సి వస్తుంది. పర్యావరణ సమతౌల్యం దెబ్బతిని అనేక విపరీత పరిణామాలు చవి చూడాల్సి వస్తుంది.

ఇదికాక చిల్లకూరు మండలంలోని చింతవరం కొత్తపాళెం గ్రామం వద్ద 714 ఎకరాల విస్తీర్ణంలో 600 కోట్లతో మాస్ హోల్డింగ్ వస్త్ర పరిశ్రమ, మండలంలోని అంకుల పాటూరు గ్రామంలో 151 ఎకరాల విస్తీర్ణంలో 550 కోట్ల పెట్టుబడితో యస్.బి.క్యు ఉక్కు పరిశ్రమ, మేనకూరులో 5000 ఎకరాల విస్తీర్ణంలో టెక్స్‌టైల్ పార్కు, మాంబట్టులో 999.15 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు అవుతున్నాయి.

హక్కుల సంఘాలవారు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు అనే భావన ఒకటి ఉంది. హక్కుల సంఘాలు అభివృద్ధికి ఆటంకం కానేకాదు. పరిశ్రమలు స్థాపించబోయే ప్రదేశాన్ని ఆశ్రయించి జీవించే బడుగు బలహీన సన్న చిన్నకారు రైతుల, మత్స్యకారుల జీవితాలకు, జీవనోపాధికి ప్రత్యామ్నాయ మార్గాలేమిటి అని, వారికి ఏవిధమైన పునరావాసం కల్పిస్తున్నారని, వారు కోల్పోయిన దానికంటే ఎక్కువకాకపోయినా సమానంగానైనా వారికి నివాస, జీవనానికి సంబంధించిన భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని జ్ఞాపకం చేస్తాయంతే. ప్రజల జీవించే హక్కుకు భంగం కలిగించవద్దని కోరతాయి.



పేదల భూములను రకరకాల పద్ధతులలో స్వాధీనం చేసుకొంటున్న ప్రభుత్వం తాజాగా "ప్రజా ప్రయోజనం" పేరిట వారి సాగుభూముల్ని లాక్కునే ఎత్తుగడ అమలు చేయదలచింది. ఇందుకోసం పాత ఉత్తర్వు నొకదానిని విస్తృత పరిచింది. అసైన్డ్ సవరణ చట్టం క్రింద ఆయా ప్రాంతాలను నోటిపై చేసి అక్కడ అన్యాక్రాంతమైన భూములను నేరుగా తీసుకోవడం మొదటి పద్ధతి. భూములపై కన్నేసిన సంస్థలు ఆయా లబ్ధిదారులతో సంతకాలు చేయించి లేఖలు తెస్తే, భూములను అటువంటి సంస్థలకు ఇచ్చివేయడం రెండవ పద్ధతి. "ప్రజా ప్రయోజనం" పేరుతో సాగు భూముల్ని తీసుకొనేటప్పుడు దానికి ప్రభుత్వ విలువ ఎంత ఉంటే ఆ మేరకు లెక్క కట్టి పేదలకు చెల్లించి భూములు స్వాధీనపరచు కోవడం మూడవ పద్ధతి. ప్రజా ప్రయోజనానికి అవసరమనుకుంటే భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది అని భూమిని పంపిణీ చేసేటప్పుడు లబ్దిదారులకిచ్చే 'డి' పట్టాలో నిబంధన ఉన్నా, దీనికి అనుగుణంగా భూమిని స్వాధీనపర్చుకున్న సందర్భాలు చాలా అరుదు. ఎందుకంటే ఆయా భూములలో పేదలు పంటలు పండించుకుంటూ ఉంటారు. కాని ప్రభుత్వం ఇప్పుడు ఆ సాగుభూములు తీసుకోవడానికి 'డి' పట్టాలోని ఈ నిబంధనను విస్తృతంగా ఉపయోగించదలచింది.

ఈ భూములను లబ్దిదారులు రాత్రింబవళ్ళు కష్టపడి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సాగుకు అనుకూలంగా మార్చుకొని ఉంటారు. కాబట్టి వారికి మౌలిక విలువ చెల్లించడం సమంజసం అంటూ దాదాపు అయిదేళ్ళ క్రితం 1307 నెంబరుతో ఓ ఉత్తర్వు వెలువడింది. దీనిని ఇప్పుడు వివిధ ప్రాంతాలలో ఉపయోగించనున్నారు. వాడరేవు, నిజాంపట్నం నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్‌కు భూముల కోసం ఈ 1307 ఉత్తర్వును అమలు చేయనున్నారు.

ఇప్పటివరకు సిరులు పండించిన పొలాలు ప్రత్యేక ఆర్థిక మండలుల రాకతో పచ్చదనం కోల్పోయాయి. పరిశ్రమల స్థాపన అనే సాకుతో వేల వేల ఎకరాలు బడా బాబుల పరమౌతున్నాయి. పరిశ్రమల స్థాపనకు నిజంగా వేల వేల ఎకరాలు భూములు అవసరమా?

ఒకవైపు ఈ విధంగా వేలకు వేల ఎకరాలు భూములు సేకరిస్తూనే కోస్తా కారిడార్ కోసం ప్రైవేటు భూమిని ఒక్క ఎకరం కూడా సేకరించలేదని, ఇచ్ఛాపురం నుండి తడ వరకు రోడ్డు మార్గం వేసి అభివృద్ధి మాత్రమే చేస్తున్నామని, ప్రజలు వద్దంటే కోస్టల్ కారిడార్‌ను నిలిపివేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మౌలిక సదుపాయాల శాఖామాత్యులు మోపిదేవి వెంకటరమణరావు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది.

కోస్తాకారిడార్‌పై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాకే జి.ఓ. నెం. 34ను ప్రభుత్వం రద్దు చేసింది. 8-11-2008న వై.యస్. రాజశేఖర్‌రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నారు. వెనుకబడిన తీరప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో తాము జి.ఓ. నెం. 34ను తీసుకొచ్చామని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తీరప్రాంత ప్రజలను కాపాడేందుకు మాత్రమే ఎక్స్‌ప్రెస్‌వే తరహాలో రోడ్ల నిర్మాణం చేపట్టడానికి జి.ఓ. నెం. 34ను జారీ చేసినట్లు మోపిదేవి ప్రకటించారు.

కోస్తాకారిడార్‌లో పరిశ్రమలకోసం పెద్దఎత్తున భూములు సేకరిస్తారని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, అందువలన ప్రజలు భయభ్రాంతులకులోనై నిరసనలకు, ఆందోళనలకు దిగిన కారణంగా జి.ఓ. నెం. 34 ను రద్దుచేయవలసి వచ్చిందని, ఈ కారిడార్ ఇంకా అధ్యయన దశలోనే వుందని, ప్రజలు అపోహల తొలగించేందుకే ఆ జీవోను రద్దుచేశామని మోపిదేవి వెంకట రమణారావుగారు ప్రకటించారు. ఇది నిజమేనా?

మరైతే పి.సి.పి.ఐ.ఆర్. కోసం ప్రత్యేక అభివృద్ధి సంస్థ (సి.యస్.డి.ఎ) ను ఏర్పాటు చేసిన జి.ఓ.నెం. 373 కూడా రద్దుచేయాలి కదా. 24.05.2008న జారీ చేసిన జి.ఓ.నెం. 913ను కూడా రద్దుచేసి రైతుల నుండి సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇస్తారా? కాకినాడ సెజ్ కోసం సేకరించిన 10,500 ఎకరాలు, ప్రకాశం గుంటూరు జిల్లాలో వాన్‌పిక్ కోసం సేకరించిన 28,000 ఎకరాలు నెల్లూరు జిల్లాలలో పారిశ్రామిక పార్కుకోసం కోట, చిల్లకూరు మండలాల్లో సేకరించిన 5,265 ఎకరాల భూమిని, వివిధ ప్రాజెక్టులకు, వివిధ కంపెనీలకు కేటాయించిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములను, లబ్దిదారులనుండి సేకరించిన అసైన్డ్ భూముల్ని తిరిగి ఆయా రైతులకు స్వాధీనం చేస్తారా?

ప్రభుత్వం అభివృద్ధి పేరున చేపట్టే పథకాలు సాధారణ ప్రజల జీవనోపాధికి, జీవించే హక్కుకు భంగం కలిగించకూడదు. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, పోర్టులు, పారిశ్రామిక వాడలు, టెక్స్‌టైల్ పార్కులు, పెట్రోకెమికల్ కారిడార్‌లు, థీమ్‌పార్కులు, కెమికల్ కాంప్లెక్స్‌లు, ఫార్మా పార్కులు, లెథర్‌పార్కులు, కోస్టల్ కారిడార్ మొదలైనవన్నీ కూడా పెత్తందారులకు, బడాబాబులకు ప్రయోజనం కల్గించేవే. పెద్దల ప్రయోజనం కొరకు, వారి అభివృద్ధి కొరకు తీరప్రాంత ప్రజల జీవనోపాధికి, నివాసానికి, జీవించే హక్కుకు విఘాతం కలిగించడం తగదు.

నెల్లూరు జిల్లాశాఖ, 14-11-2008



# వాన్‌పిక్‌ను వెంటనే ఆపాలి

ప్రజలను భిక్షగాళ్ళను చేసి రాష్ట్రాన్ని 'అభివృద్ధి' చేసే కోస్టల్ కారిడార్ ప్రణాళికలో భాగంగా గుంటూరు, ప్రకాశం జిల్లాలలో ప్రభుత్వం నెలకొల్పుతున్న 'వాన్‌పిక్' ప్రాజెక్టును వ్యతిరేకించవలసినదిగా అందరికీ పిలుపునిస్తున్నాం.

ఇది కేవలం ఒక ఫ్యాక్టరీ కోసమో ఒక ఓడరేవు కోసమో జరుగుతున్న భూసేకరణ కాదు. విదేశీ పెట్టుబడిదారీ కంపెనీలలో వారి సరసన వేగంగా చేరుతున్న టాటా, జిందాల్ రిలయన్స్, మిట్టల్ వంటి కంపెనీలు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి జరుగుతున్న భూసేకరణ. వారు పెట్టుబడులు పెట్టాలంటే మౌలిక సదుపాయాలు (నిరంతరాయమైన విద్యుత్తు, విశాలమైన రోడ్లు, దగ్గరిలో ఓడరేవులు, విమానాశ్రయాలు, నిరాటంకంగా నీటి సరఫరా) పుష్కలంగా ఉన్న విశాల భూభాగం రెడీగా ఉండాలంట. అందుకోసం సముద్ర తీరం వెంబడి అన్ని సదుపాయాలు గల ఒక 'కారిడార్'ను ఏర్పాటు చేస్తారంట.

వాన్‌పిక్ పేరిట ఏర్పడుతున్న 28 వేల ఎకరాల కారిడార్ దీనిలో భాగమే. ఈ కారిడార్ ఏర్పడుతున్నది చంద్రమండలం మీదనో, మనుష్యులు లేని ఎడారిలోనో కాదు. ఇక్కడ ఆద్యంతం గ్రామాలు ఉన్నాయి. వాళ్ళకు పని కల్పించి తిండి పెడుతున్న పొలాలున్నాయి. చేపల వేటకు అనువయిన తీరప్రాంతం ఉంది. సముద్రంలో కలిసే ఏర్లలోను చేపల వేటకు అవకాశం ఉంది. ఇది కూడ ఒక ఆర్థిక వ్యవస్థే. ఉపాధి, ఉత్పత్తి, సంపద అనేవి వాన్‌పిక్ ద్వారా ఇక్కడ కొత్తగా ప్రవేశించడం లేదు. ఎప్పటి నుండో ఉన్నాయి. ఈ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో లోపాలున్నమాట నిజమే. అందులో అభివృద్ధికి ఆస్కారం ఉన్నమాట నిజమే. ఇక్కడ పేదరికం చాలా ఉన్నమాట నిజమే. దానిని పోగొట్టవలసిన అవసరం ఉన్న మాటా నిజమే. కానీ ఈ జీవనాన్ని మొత్తంగా తుడిచిపెట్టేసి స్థానికులకు నాలుగు రోజులు మట్టి పని కల్పించడం తప్ప వేరే ఏ ప్రయోజనం ఇవ్వని పారిశ్రామిక కారిడార్‌ను నెలకొల్పడం ఎవరి మేలు కోసం?

ఇప్పటి దాకా ఈ గ్రామాల ఆర్థిక వ్యవస్థలో మార్పంటూ వస్తే అది ప్రజలు చేసుకున్నదే. చాలా సంవత్సరాలు వర్షాభావం వల్ల వ్యవసాయంలో ఎదుగుదల లేక నష్టపోయిన ప్రజలు గడిచిన నాలుగేళ్ళ కాలంలో మెరుగుపడిన వర్షాల నుండి ప్రయోజనం పొందడానికి బోర్లు వేసుకొని వరి, వేరుశనగ తదితర పంటలు సమృద్ధిగా పండించుకుంటున్నారు. రైతులకు పంట, కూలి వాళ్ళకు పని దొరుకుతున్నాయి. సరిగ్గా ఈ సమయంలో వాన్‌పిక్ వచ్చింది.

'కోస్టల్ కారిడార్' కోసం ప్రజల భూములు సేకరించడం లేదనీ కేవలం విశాలమైన రోడ్డు వేస్తున్నామనీ దానిని ప్రతిపక్ష పార్టీలు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నాయనీ స్వయాన ముఖ్యమంత్రి, ఆయన అనిందే తడవు ఓడరేవుల మంత్రి అన్నారు. ఇది అబద్ధం అని

భూసేకరణ ప్రకటన చెప్తుంది. ఈ సంవత్సరం జులై 13 నాడు పత్రికలలో అడవుల దీవిలో భూసేకరణ నిమిత్తం ఇచ్చిన ప్రకటన నిజాంపట్నం ఓడరేవు కోసం, పారిశ్రామిక కారిడార్ కోసం భూములు తీసుకుంటున్నామనే అంటుంది. దిండి గ్రామంలో వ్యవసాయ భూములే కాదు, 7 పల్లెల్ని మొత్తంగా తీసేసుకుంటున్నది. అక్కడ రాగల సూపర్ థర్మల్ కేంద్రం కోసం తీసుకుంటున్నట్లు అదే భూసేకరణ ప్రకటన అంటుంది. తెలిసీ పెద్దలు అబద్ధాలు చెప్తే ఏం చేయాలి?

ఎకరం 50 వేలకు కూడా అమ్ముడుపోని నిజాంపట్నం మండలంలోని భూములకు 'మాట్రిక్స్' కంపెనీ రు. 3 లక్షలు ఇవ్వడానికి సిద్ధపడుతున్నదనీ అమ్ముకుంటే లాభమేకదా అని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. భూములు అమ్ముకుందామని చూస్తున్న వారికి రు. 50 వేలు బదులు 3 లక్షలిస్తే గొప్ప విషయమే. కానీ బలవంతంగా భూములు సేకరిస్తూ రూ. 50 వేలు చేయని భూములకు 3 లక్షలిస్తున్నాం కాబట్టి మీరు అభ్యంతరం చెప్పడం తప్పు అంటే అర్థం ఏమిటి? అంతేకాక, ఇవాళ ఇక్కడ భూమి చవకే అయి ఉండవచ్చు. కానీ 28 వేల ఎకరాలు సేకరించిన తరువాత ఆ డబ్బు తీసుకున్న రైతులు పరిసర గ్రామాలలో భూములు కొనుక్కొందామని పోతే ధరలు పెరగవా? ఇప్పటికే వాన్‌పిక్ ప్రాజెక్టు రాబోతుందని తెలిసి చుట్టుప్రక్కల గ్రామాలలో ధరలు బాగా పెరిగిపోయాయి. ఎకరం పోయిన వారు 3 లక్షలు యిచ్చినా సరే అరెకరం కూడా కొనుక్కోలేరు. అంతేకాక ఎకరానికి 3 లక్షలిస్తామని ముందు కొస్తున్నది ప్రభుత్వం కాదు, మాట్రిక్స్ అనే కంపెనీ. ఆ భూమి తనకు కావాలని ప్రభుత్వం అంటుండగా వీరెవరు కొనుక్కుంటామని దళారులను పంపి రైతులతో బేరాలు పెట్టడానికి? ఒక వేళ మాట్రిక్స్ కంపెనీ కోసమే ప్రభుత్వం భూసేకరణ చేపడుతున్నట్టయితే దానికి వేరే పద్ధతి అనుసరించాలి. ఇప్పుడు అనుసరిస్తున్న పద్ధతి కాదు. చట్టమంటే ఖాతరు లేకుండా వ్యవహరించడం మన పాలకులకెంతగా అలవాటయిపోయిందనడానికి ఇదొక మచ్చుతునక.

మరొకటేమిటంటే మాట్రిక్స్ కంపెనీ వారు కేవలం రైతుల స్వంత భూములే కాక అసైన్‌మెంట్ పట్టాలు (డి-పట్టాలు) ఇచ్చిన భూములను కూడ కొంటున్నారు. రైతులకిచ్చేదానిలో సగం రేటుకు కొంటున్నారు. తెలియక కొందరు పేదలు అమ్ముతున్నారు కూడ. వారికి తెలియకపోయినా అసైన్‌మెంట్ భూముల అమ్మకం, కొనుగోలు చెల్లదని, అది నేరమని అధికారులకు తెలిసే ఉండాలి. తెలిసి వారెందుకు ఆపడం లేదు? చట్టవిరుద్ధమైన ఈ కొనుగోలులో పట్టాదారులకు ధర విషయంలోనూ అన్యాయం జరుగుతున్నది. భూసేకరణ విషయంలో స్వంత భూమి అయినా, అసైన్‌మెంట్ భూమి అయినా ఒకటేననీ, ఒకే ధర చెల్లించాలనీ మన హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయినా మాట్రిక్స్ కంపెనీ సగం రేటే ఇస్తున్నది.

రైతులు, డి-పట్టా ఉన్న పేదలేకాక, భూమిలేని కూలీలు వేల మంది ఈ గ్రామాలలో ఉన్నారు. పదిమందికైతే మళ్ళా ఎక్కడయినా పనులు దొరుకుతాయని అనుకోవచ్చు. వేలమంది ఒక్కసారిగా జీవనం కోల్పోతే అందరికీ పనులెక్కడ దొరుకుతాయి? 'కారిడార్' రోడ్డు వేసే పని, బిల్డింగులు కట్టేపని మొదట్లో కొంత కాలం ఉంటుంది. అందులో దినకూలీలుగా కొంతకాలం ఉపాధి దొరకగలదు. తరువాత ఈ ప్రజలంతా ఏమవుతారు? తుఫాను వచ్చినా మా ఊరికి ప్రమాదం లేదని అదవల గ్రామ ప్రజలు ఆ ఊరికి, పక్కనే ఉన్న సముద్రానికి మధ్యనున్న ఎత్తయిన ఇసుక దిబ్బలను చూపించి అంటారు. ఈ తుఫాను మాత్రం వారిని దిక్కులేని పక్షుల్ని చేస్తుంది.

జీవనానికి సంబంధించిన ఈ సమస్యలే కాక పర్యావరణానికి సంబంధించినవీ ఉన్నాయి. నిజాంపట్నం నుండి ఎగువకు కర్లపాలెం, బాపట్ల మండలాలలో వాన్‌పిక్ కోసం సేకరిస్తున్న భూమిలో



మడ అడవులున్నాయి. అవి క్షీణించి పోతున్నాయని చెప్పి వాటిని పునరుద్ధంచడం కోసం అటవీశాఖ రెండేళ్ళుగా లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నది కూడా. అటవీశాఖా ఈ ప్రభుత్వానికి చెందినదే. అయినా ప్రభుత్వమే ఆ ప్రయత్నాన్ని వమ్ము చేస్తూ ఇప్పుడు మడ అడవులను వాన్‌పిక్ పారిశ్రామిక ప్రాజెక్టుకు కేటాయిస్తున్నది. వాటిని దున్నేసి నేలను సాపు చేసేస్తారని వేరే చెప్పనవసరం లేదు. తీర ప్రాంతాన్ని తుఫానుల నుండి రక్షించడంలోనూ, జలజీవాల పునరుత్పత్తిలోనూ మడ అడవులకు ముఖ్యమైన పాత్ర ఉంది. అది పూర్తిగా ధ్వంసం అవుతుంది. ఇదేమిటని ఆ ప్రాంతంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఒక అటవీ శాఖాధికారిని అడిగితే, ఆయన తల పట్టుకొని 'ఏం చేయమంటారు చెప్పండి వాళ్ళు పార్లమెంటును దున్నేసి పరిశ్రమలకు అప్పగించినా అడగగల వారెవరు'? అంటారు.

దిండి దగ్గర రాబోయే సూపర్ థర్మల్ కేంద్రం విపరీతమైన బూడిద కాలుష్యానికీ విష పదార్థాలకూ కారణం కాగలదు. అది 4500 మెగావాట్ల కేంద్రమని ఒకరు, 6000 మెగావాట్ల కేంద్రమని ఒకరు అంటున్నారు. ప్రజలకు సరయిన సమాచారం సహితం ఇవ్వని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాం. ఏదయినా ఇది కృష్ణపట్నం థర్మల్ కేంద్రం కంటే పెద్దది. రాష్ట్రంలోనే అతి పెద్దది. దాని నుండి బూడిద, సల్ఫర్ (గంధకం) విషపదార్థమైన మెర్క్యురీ (పాదరసం) వెలికివస్తాయి. బూడిదను బురద చేసి నిల్వ చేసే బూడిద చెరువుల నుండి ఎండకు ఎండిన బూడిద గాలికి కొట్టుకొచ్చి ఊర్లపైన, పొలాలపైన, సముద్రంపైన నిత్యం పడుతుంటుంది. పొగ గొట్టాల నుండి పైకి వచ్చే బూడిద కూడా అంతే. పంటలు, సముద్రంలోని మత్స్య సంపద విపరీతంగా దెబ్బతింటాయి.

నిజాంపట్నం పోర్టు కూడ మత్స్య సంపదను, మత్స్యకారుల జీవనాన్నీ బాగా దెబ్బతీస్తుంది. పోర్టు కట్టడానికి అవసరమైన మట్టిని ఒడ్డుకు సమీపంలో సముద్రం క్రింది నుండి తవ్వి తీస్తారు. దాని ఫలితంగా సముద్ర జలం కల్లోలానికి గురయి జలజీవాల పునరుత్పత్తి దెబ్బతింటుంది. పోర్టు కట్టిన తరువాత నిత్యం వచ్చిపోయే ఓడలు తెచ్చే కాలుష్యం ఫలితం కూడా అదే ఉంటుంది. "మంత్రి మావాడు కాబట్టి మాకేం జరగదు" అన్న విశ్వాసంతో మౌనంగా ఉన్న నిజాంపట్నం మత్స్యకారులు పునరాలోచించుకునే రోజు రాగలదు. ఇప్పుడు ఏ మంత్రీ ప్రజలవాడు కాదు. అందరూ పెట్టుబడిదారీ కంపెనీలవాళ్ళే.

- వాన్‌పిక్ ప్రాజెక్టును వెంటనే ఆపాలి
- వ్యవసాయం, పశుపోషణ, చేపల వేట తదితర సకల గ్రామీణ వృత్తుల బాగోగులతో నిమిత్తంలేని మూర్ఖమైన పారిశ్రామికీకరణ స్థానంలో హేతుబద్ధమైన ఆర్థిక అభివృద్ధి విధానాలు రూపొందించుకోవాలి.
- ప్రత్యేక ఆర్థిక మండళ్ల (యస్.ఇ.జెడ్) చట్టాన్ని రద్దు చేయాలి.

గుంటూరు జిల్లా శాఖ, 15-11-2008

## పచ్చని శ్రీకాకుళం జిల్లాని

# కాలుష్యమయం చేయకండి

మానవహక్కుల వేదిక ఏర్పడి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా మేము నవంబర్ 2008 లో ప్రచార యాత్రలు చేపట్టాము. సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం కాబోతున్న కవిటి, కంచిలి, సోంపేట, సంతబొమ్మాళి మండలాల్లోనూ, రసాయనిక కాలుష్యంతో బాధపడుతున్న పైడి భీమవరం ప్రాంతంలోనూ, నాగార్జున అగ్రికెమ్ కాలుష్య ప్రభావిత గ్రామాలైన అరిణాం, అక్కివల్స, కేశవదాసుపురం, పట్టుసాలిపేటల్లోనూ పర్యటించాం. ఈ ప్రాంతాలలో విస్థాపనకు గురికాబోతున్న రైతులూ, కూలీలూ, చేతివృత్తిదారులూ, కాలుష్య బాధితులూ, మత్స్యకారులూ తమ సమస్యలను వివరించారు. భవిష్యత్తుపై ఆవేదన వ్యక్తపరిచారు.

మన జిల్లాలో నిర్మాణం కానున్న రెండు సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ల వల్ల ఎంతో అభివృద్ధి సాధిస్తామనీ, అందుచేత వాటిని ఆహ్వానించాలనీ కొందరు మేధావులు వాదిస్తున్నారు. ఎవరి 'అభివృద్ధికి' ఎవరు మూల్యం చెల్లిస్తున్నారో ఆలోచించమని వారిని మానవహక్కుల వేదిక కోరుతున్నది. అభివృద్ధి అనేది అందరికీ వర్తించాలి. వేలాది ఎకరాల భూమిని మింగి, పరిసరాలను విషపూరితం చేసి ప్రజల జీవన ప్రమాణాలను దిగజార్చే ప్రక్రియ అభివృద్ధి అనిపించుకుంటుందా? కేవలం కొందరు పారిశ్రామికవేత్తల జేబులు నింపి ప్రజలను బిచ్చగాళ్ళను చేసేది అభివృద్ధికాదు, విధ్వంసం మాత్రమే. మనకు కావలసింది నిజమైన అభివృద్ధి. వినాశనం కాదు. ప్రజల జీవితాలను తల్లి కోడిలా కాపాడాల్సిన కొందరు ప్రజాప్రతినిధులు వారికి జీవనోపాధినిస్తున్న భూములలో పవర్ ప్లాంట్లు నిర్మించాలని ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేయడం ప్రజల్ని మోసం చేయడమే.

'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అని ఉద్యమాల ద్వారా మనం వేలాది ఉద్యోగాలు సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ కాదు ఈ పవర్ ప్లాంట్లు. స్థానిక ప్రజల్ని తరిమేసి, ఆ ప్రాంతంలో కాలుష్య కారక పరిశ్రమలు నిర్మించి, పరిశ్రమదారులకు లాభాలు చేకూర్చి, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే ఏదీ ప్రజల అభివృద్ధి కాదు. అక్కడ వ్యవసాయంపై ఆధారపడిన ప్రజలకీ, తంపర భూమిలో చేపలు పట్టి బతుకుతున్నవారికీ వారి వృత్తులలో అధిక ఉత్పత్తిని సాధించే మెలకువలను నేర్పడంతో పాటు మంచి మార్కెటింగ్ సౌకర్యాలు వంటి చర్యలను చేపడితే ఆయా ప్రాంతాలు సమగ్రాభివృద్ధిని సాధిస్తాయి.

## సూపర్ థర్మల్ ప్లాంట్లు

సంతబొమ్మాళి మండలంలో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ 'భావనపాడు పవర్ ప్లాంట్'ను నెలకొల్పాలని చూస్తున్నది. అలాగే సోంపేట మండలంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్ మరొక థర్మల్ ప్లాంటును నిర్మించబోతున్నది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వేలాది ఎకరాల భూమిని తీరప్రాంతంలో అప్పచెప్పింది. ఇది చాలదన్నట్టు ఇంకా పెద్ద మొత్తంలో భూమిని సేకరించి కట్టబెట్టాలని చూస్తోంది. వీటి నిర్మాణం జరిగితే అక్కడ ప్రజలు జీవనాధారం కోల్పోతారు, యాచకులుగా మారిపోతారు. పచ్చని పొలాల నుంచి ఆ రైతాంగాన్ని దూరంగా నెట్టివేయడం చాలా అన్యాయం. అలాగే బీలా భూములపై ఆధారపడ్డ వేలాది మత్స్యకారులు ఆలంబన కోల్పోతారు. సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర, కాకరపల్లి, ఆకాశలక్కవరం, కోటపాడు, పోతినాయుడుపేట, ఆ సమీపంలోనే విదేశీ పక్షులకు నిలయమైన తేలినీలాపురాలు కాలుష్యపురాలుగా మారబోతున్నాయి. అట్లాగే కవిటి, సోంపేట మండలాలు ముఖ్యంగా కుత్తురు, రుషికుద్ద, రామయ్యపేట, గొల్లగండి, బారువపేట, బెంకిలి, మాణిక్యపురం ప్రాంతాలూ పూర్తిగా కాలుష్యానికి లోనుకానున్నాయి. మన పచ్చని ఉద్దానం అధ్వాన్నంగా మారిపోతుంది. పర్యావరణ, స్థల అనుమతులు లభించక ముందే పర్యావరణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ సంతబొమ్మాళిలోని బీలా భూముల్లో త్రవ్వకాలు చేపట్టి రోడ్డు పని మొదలుపెట్టారు. ఇది పూర్తిగా చట్ట వ్యతిరేకం. పర్యావరణ ప్రభావిత అంచనా నివేదిక కూడా తప్పుల తడకగా ఉంది. ఉదాహరణకు ప్రాజెక్టు సైటునుండి 10 కి.మీ. విస్తీర్ణంలో ఎక్కడా పక్షుల సంచారం లేదని పేర్కొన్నారు. అది పచ్చి అబద్ధం అని మనకి తెలుసు. వాస్తవానికి ప్రాజెక్టు స్థలానికి 3 కి.మీ దూరంలోనే తేలినీలాపురంలో పక్షుల అభయారణ్యం ఉన్నది. పైగా స్థానిక ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి పర్యావరణ అనుమతికోసం ప్రయత్నిస్తున్నారు. దీనికి స్థానిక రాజకీయ నాయకుల పూర్తి మద్దతు ఉండడం చాలా సిగ్గుచేటు.



థర్మల్ పవర్ ప్లాంట్ల నుండి వచ్చే ప్రధాన కాలుష్యం బూడిద. సంతబొమ్మాళి, సోంపేట మండలాలలో రానున్న ప్లాంట్ల నుంచి ఈ కాలుష్యం భారీ స్థాయిలో ఉంటుంది. కాల్చిన విదేశీ బొగ్గు నుండి విషపదార్థాలైన పాదరసం, గంధకం వెలువడతాయి. ఇవి భూమిలోకి ఇంకి భూగర్భజలాన్ని కలుషితం చేస్తాయి. ఫలితంగా జీవ పరిణామాన్నే ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇలాంటి ప్లాంట్లు నెలకొల్పే బదులు ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి పూనుకోవచ్చుకదా? సౌర, పవన, తరంగ విద్యుత్ లాంటి ప్రత్యామ్నాయాల గురించి సీరియస్‌గా ఆలోచన చేయవచ్చుగదా?

వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదని భూములకు మంచి ధర వస్తుంది కనుక అమ్మివేసి పట్టణాలకు పోదామనుకునే వారి మాట అటుంచుదాం కానీ, అదే ప్రాంతంలో అధిక సంఖ్యలో నివసిస్తున్న చిన్న రైతుల, కూలీల, ఇతర చేతి వృత్తుల వారి గతి ఏమిటి? పవర్‌ప్లాంటు వస్తే వ్యాపారాలు బాగుంటాయి, ఉద్యోగాలు వస్తాయనేది కేవలం భ్రమ. ఇటువంటి ప్రైవేట్ సంస్థల పరిశ్రమల్లో ఆధునిక యంత్రాలు ఎక్కువగా వాడి సిబ్బందిని తగ్గిస్తారు. కనుక అక్కడ వచ్చేవి పిడికెడు ఉద్యోగాలు మాత్రమే. అది కూడా పెద్ద చదువులు చదువుకున్నవారికి మాత్రమే. స్థానికులకు వచ్చేవి దాదాపు శూన్యమే.

మన జిల్లాలో వందకు పై చిలుకు పరిశ్రమలు మూతపడ్డాయి. వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నడిపిస్తే ఉపాధిని కాపాడుకోవచ్చు. సోంపేట నుండి నౌపడ వరకూ ఉప్పు

పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం పూనుకోవచ్చుకదా? అనేక మందికి ఉపాధినిచ్చిన ఆముదాలవలస పంచదార మిల్లును గత ప్రభుత్వం కారుచౌకగా అమ్మేసింది. ఈ ప్రభుత్వమేమో చోద్యం చూస్తోంది.

## మందుల కంపెనీల కాలుష్యం

పైడిభీమవరంలోని పారిశ్రామికవాడ ప్రాంతంలో కొన్ని పరిశ్రమలు మూత పడినప్పటికీ, ఆంధ్రా ఆర్గానిక్, రెడ్డీస్, సరాక, అరవింద్ లాబ్స్ లాంటి రసాయనిక పరిశ్రమలు ఒకే ప్రాంతంలో నిర్మించడం వలన కాలుష్యపు తీవ్రత విపరీతంగా వుంది. ఈ పరిశ్రమలనుండి వెలువడే కాలుష్య జలాలను శుద్ధి చేయకుండా పైపులైను ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పైప్ లైన్లు లీకై పొలాలను నాశనం చేస్తున్నాయి. ఈ వ్యర్థ పదార్థాలు సముద్రాన్ని కలుషితం చేయడం వలన మత్స్య సంపద దెబ్బతింటోంది. మత్స్యకారులు చేపలవేట సరిగ్గా జరగక గుజరాత్ లాంటి దూర ప్రాంతాలకు వలస పోతున్నారు. మత్స్యకారులకు సముద్రమే జీవనం. తీర ప్రాంతంపై వాళ్ళకున్న సహజ హక్కును ఇటువంటి పరిశ్రమలు కాలరాస్తుంటే చూస్తూ ఊరుకుందామా? సముద్రజలాలను కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదు.

## నాగార్జున అగ్రికెమ్ నేర చర్యలు

అరిణాం, అక్కివలసల్లోని నాగార్జున అగ్రికెమ్ రసాయనిక పరిశ్రమ గత 13 ఏళ్ళుగా నిత్యం పరిసర గ్రామాలపై కాలుష్యపు మబ్బులు గుమ్మరిస్తూనే ఉంది. ఆ గ్రామాల ప్రజలూ, ప్రజాప్రతినిధులూ దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తూనే వున్నారు. చివరికి పార్టీలకు అతీతంగా లావేరు మండల ప్రజా ప్రతినిధులు ప్రజల పట్ల బాధ్యతతో దాన్ని నిలుపుదల చేయించడం సంతోషించదగ్గ పరిణామం. వారి చర్యలను ఇతర ప్రాంతాల ప్రజాప్రతినిధులు అనుసరించాలి. ఇటువంటి విధ్వంసకర పరిశ్రమలను ప్రశ్నిస్తే “జిల్లాకు పరిశ్రమలు ఎలా వస్తాయని” కొందరు అంటున్నారు. కాని కాలుష్య నియంత్రణ మండలి కాలుష్య నివారణ యంత్రాలు కనీసస్థాయిలో కూడా లేకుండానే ఉత్పత్తికి అనుమతిస్తుంటే వారి అవినీతిని గానీ, పరిశ్రమల నేరపూరిత చర్యలను సమర్థిస్తున్న జిల్లా యంత్రాంగాన్నిగానీ గట్టిగా ప్రశ్నించవలసిన అవసరం లేదా?

ఇటువంటి విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకించడానికి ప్రజలే సరైన కార్యాచరణకు పూనుకోవాలి. కాకినాడ సెజ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేసిన అక్కడి ప్రజానీకం అందరికీ ఆదర్శం. గోవా సెజ్‌లను నిలువరించిన ప్రజలు అందరికీ మార్గదర్శకులు. బెంగాల్‌లో సింగూరు నుండి టాటాలను తరిమివేసిన రైతాంగం, నందిగ్రాంలో తిరగబడిన జనం అందరికీ ఆదర్శనీయులు. మన జిల్లాలో సోంపేట మండలం రామయ్యపట్నం వద్ద బీచ్‌సాండ్ మైనింగ్‌కు వ్యతిరేకంగా నిలబడ్డ ప్రజలకు మా అభినందనలు. మన జిల్లాలో తీవ్ర విధ్వంసం సృష్టించబోతున్న రెండు సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లనూ, ఇతర రసాయనిక పరిశ్రమలనూ వ్యతిరేకించమని ప్రజలకు పిలుపునిస్తున్నాము. మీ ఆందోళనకు మానవహక్కుల వేదిక సంపూర్ణ సహకారాన్ని అందిస్తుంది. ప్రజాస్వామిక అభివృద్ధిని ఆహ్వానిద్దాం. విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకిద్దాం.

శ్రీకాకుళం జిల్లాశాఖ, 19-1-2009





# స్థానిక గ్రామాల సాగునీటి అవసరాలు తీరిన తరువాతే ప్రాణహిత ప్రాజెక్టు చేపట్టాలి

తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలలో ఆదిలాబాద్ జిల్లాకు కూడా స్థానం ఉన్నది. ఆదిలాబాద్ జిల్లాను ఆనుకొని ప్రాణహిత నది పారుతున్నా స్థానిక ఆదివాసీ ప్రజానీకానికి సాగునీటిని అందించాలన్న ‘సోయి’ రాష్ట్రాన్ని ఇప్పటి వరకు ఏలిన ఏ ప్రభుత్వానికీ లేదు.

‘ప్రజాప్రస్థానం’ పేరుతో గ్రామగ్రామానికి కాలినడకన వచ్చి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూసి పరిష్కరిస్తానన్న వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ రైతులకు సాగు, తాగు నీరు అందించే విధంగా ఏ ప్రాజెక్టు చేపట్టలేదు సరికదా ఇక్కడి గ్రామాలను ముంచి, ఇక్కడి నీరు కొల్లగొట్టుకుపోయే విధ్వంస ప్రణాళికను మాత్రం సిద్ధం చేశాడు. ఆ ప్రణాళిక రూపమే ‘ప్రాణహిత-చేవెళ్ళ ఎత్తిపోతల ప్రాజెక్టు’. దానికి పునాది రాళ్ళు కూడా వేశాడు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భారీ ప్రాజెక్టులలో ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు ఒకటి. ఇది జలయజ్ఞానికే తలమానికమని ప్రభుత్వం చెప్పుకుంటున్నది. వార్ధా, పెన్ గంగా నదులు కలిసి కౌటాల మండలం తమ్మిడిహేటి గ్రామం వద్ద ప్రాణహితగా మారుతున్న చోట ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారు. ఇక్కడ లభిస్తున్న 305 టియంసిల నీటిలో 160 టియంసిల నీటిని వినియోగించుకొని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, వరంగల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు విస్తారంగా సాగునీటిని, తాగునీటిని ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఇందుకోసం 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని, నిర్వహణ కోసం 3375 మెగావాట్ల కరెంటును వినియోగిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. నీళ్ళు ఇవ్వాలన్న ప్రభుత్వం ఉద్దేశ్యంపట్ల మాకు అభ్యంతరం లేదు. కానీ ఇక్కడి నుండి పోతున్న నీటిలో స్థానికుల సాగునీటి అవసరాలను ఏ మాత్రం తీరుస్తున్నారు అన్నది మా ప్రశ్న.

దూర ప్రాంతాలకు నీళ్ళు తీసుకుపోయి సంతర్పణ చేస్తున్న ఈ ప్రాజెక్టు నది దాపున ఉన్న గ్రామాలకు మాత్రం చుక్క నీరు కూడా ఇవ్వడం లేదు. తమ్మిడిహేటి నుండి ప్రాజెక్టు కాలువ

కర్జెల్లి, బారెగూడ, సలుగుపల్లి, సులుగుపల్లి దాటి చెన్నూర్‌లో ప్రవేశించిన తరువాతే స్థానిక ప్రజలకు కొద్దిపాటి నీరు ఇస్తుంది. ఎల్లంపల్లి దాటిన తరువాతనే చెప్పుకోదగ్గ ఆయకట్టు మొదలవుతుంది. ఇదెక్కడి అన్యాయం అని స్థానిక ప్రజలు అడుగుతున్న ప్రశ్నకు ప్రభుత్వం నుండి ఏ జవాబు లేదు. డిసెంబర్ 16వ తేదీన ఇక్కడ శంకుస్థాపన చేయడానికి వచ్చిన ముఖ్యమంత్రిని నిలదీయడానికి స్థానిక ప్రజలు సమాయత్తం కాగా, వారి నాయకులను అరెస్టు చేసి శంకుస్థాపన కానిచ్చేశారు.

ఇది సస్యశ్యామలమైన ప్రాంతం అయివుంటే ప్రభుత్వ వైఖరిని అర్థం చేసుకొని ఉండవచ్చు. కానీ ప్రాణహిత నది దాపున ఉన్న కౌటాల, బెజ్జూరు, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల గ్రామాలు వర్షాధారంగా ఒక పంట పండించుకొని బతికే గ్రామాలు. ఆకాశ తరిగా సోయాబీన్స్, కందులు, పెసలు పండించుకొని ఆ తరువాత ఎక్కడయినా పని దొరికితే చేసుకొని, దొరకకపోతే పస్తులుండే ఊర్లు. చాలాకాలంగా ప్రజలు ప్రాణహిత మీద ఆశలు పెట్టుకున్నారు. నాయకులు హామీలిచ్చారు. ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు ప్రతిపాదన గురించి విన్న నాటి నుండి తమ సాగునీటి అవసరాలు తీరుతాయని అనుకున్నారు. తమ నాలుగు మండలాల సాగు భూములకు ఎంత నీరు కావాలి? 10 లేక 15 టిఎంసిలు కేటాయించకపోతారా అని భావించారు. ప్రభుత్వ అధికారులు, సిర్పూర్ ఎమ్మెల్యే కూడా అదే అభిప్రాయం కలిగించారు.

కానీ నవంబర్ 19 నాడు చేవెళ్ళలో ముఖ్యమంత్రి మొదటి శంకుస్థాపన చేసినప్పుడు పత్రికలలో ప్రచురించిన ప్రకటన ఆ ఆశలన్నీ అడియాసలేనని రుజువు చేసింది. ప్రాజెక్టు మొదలయిన చోటు నుండి 25 కిలోమీటర్ల వరకు ఈ కాలువ ఒక్క చుక్క నీళ్ళియ్యదని ఆ ప్రకటన జత చేసిన పటం తెలుపుతుంది. అప్పటినుండి స్థానిక ప్రజలలో ఆందోళన మొదలయింది. దానిని అరెస్టులతో చల్లార్చి తన పని కానిచ్చుకొని పోదామని ప్రభుత్వం చూస్తున్నది.

ప్రాజెక్టు ఫలితం స్థానికులకు దక్కదు గానీ నష్టమంతా వారికే. కాలువ కోసం 300 మీటర్ల వెడల్పు భూమిని, దాని ఒడ్డుకోసం మరింత భూమిని కాలువ మార్గం వెంబడి ప్రభుత్వం సేకరిస్తున్నది. స్థానిక ప్రజలకు ఉన్న వనరులు, ఉన్న జీవనాధారం లేకుండా చేసి దూరప్రాంతాలకు నీళ్లివ్వడం ఏరకమైన పాలనా నీతి?

నిజానికి అధికారులు ఈ గ్రామాల ప్రజలకు ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు గురించి గానీ దాని రూపురేఖల గురించి గానీ ఏరోజూ ఏమీ చెప్పలేదు. ఏ సమాచారం ఇవ్వలేదు. సర్వే సిబ్బంది వస్తారు. ఏమీ చెప్పకుండా సర్వే చేసుకుంటారు. ప్రజలు అభ్యంతరం తెలిపితే 'దౌర్జన్యం' చేసారంటారు. ప్రజలకు కనీసం సమాచారం ఇవ్వకుండా వారి జీవన వనరులను, వారికి అందుబాట్లో ఉన్న నీటి వనరులను వారికి కాకుండా చేయడం 'దౌర్జన్యం' అనిపించుకోదా? కాలువ కింద ఎంత భూమి పోతుంది? అందులో పట్టా భూమి ఎంత? లావణీ ఎంత, బంజరు ఎంత, అడవి ఎంత? భూమి కోల్పోయిన వారికి ప్రభుత్వం వేరే ఎక్కడయినా భూమినిస్తుందా? కూలి చేసుకొని బతికే పేదలకు వేరే ఎక్కడయినా ఉపాధి కల్పిస్తుందా? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పకుండా ప్రాజెక్టు పనులు చేసుకుంటూ పోవడం, ప్రజలను చీకట్లో ఉంచడం, ప్రజాస్వామ్య పాలన అనిపించుకుంటుందా?

ప్రాజెక్టు వల్ల కలిగే ఫలాలను స్థానికేతరులు అనుభవిస్తూ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన స్థానిక గిరిజన ప్రజలు మాత్రం నిర్వాసితులై సర్వం కోల్పోయి నిరాశ్రయులు కారాదు. బలమైన ప్రజా నిరసన



మాత్రమే నిర్వాసిత ప్రజలకు న్యాయం జరిగేటట్లు చేస్తుంది. కావున ప్రాణహిత పరీవాహక గ్రామాల సాగునీటి అవసరాలను తీర్చాలని డిమాండ్ చేస్తూ జరిగే ప్రజాచైతన్య యాత్రలో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పక్షాలు, ప్రజాస్వామికవాదులు పాల్గొని మద్దతునివ్వవలసిందిగా కోరుతున్నాము.

## మా డిమాండ్లు

ప్రాణహిత నది నీటిలో కనీసం 25 టి.ఎం.సి.లు కౌటాల, బెజ్జూరు, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్ మండలాల సాగునీటి, తాగునీటి అవసరాలకు కేటాయించాలి. దాని కోసం ఆచరణ యోగ్యమైన ప్రాజెక్టు ప్రణాళికను రూపొందించాలి.

ఆదిలాబాద్ జిల్లా కలెక్టరు, నీటిపారుదల శాఖ అధికారులు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయే అన్ని గ్రామాలలోను గ్రామ సభలకు హాజరయి ప్రాజెక్టు తీరుతెన్నుల గురించి, సేకరించబోయే భూముల గురించి, నష్టపరిహారం పునరావాసాల గురించి వివరంగా ప్రజలకు చెప్పి ప్రజల అభిప్రాయాలు వినాలి.

పై రెండూ జరిగేదాకా ప్రాణహిత-చేవెళ్ల పనులు చేపట్టకూడదు.

ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల శాఖలు, 24-1-2009